

మహనీయులైన గురువర్యులు
THE GREAT MASTERS


మహనీయులైన గురువర్యులు
THE GREAT MASTER

వ్యక్తిగత వినియోగం కొరకు మాత్రమే

కస్తూరీ బెహెన్ పుస్తకాల కొరకు

K. రామదాస్ - **9440652774**

K. సుదర్శన్ - **9247805058**

సంప్రదించగలరు.

# మహనీయులైన గురువర్యులు

# GREAT MASTERS

# మహనీయులైన గురువర్యులు

## బాబూజీ స్మృతిపథం నుంచి లాలాజీ జీవిత సంగ్రహంలోని కొన్ని విశేషాలు

"లాలాజీ అతిస్వల్ప వేతనంతో జీవితం గడిపారు. 'వారి' ఇంటికి తరచుగా చాలామంది బంధువులు వచ్చిపోతుండేవారు. వారందరికి 'శంకరపాల్య'తోగాని మరేదైనా పదార్థంతోగాని భుజింపజేసేవారు."

ooo

"ఆ రోజుల్లో టీ (తేనీరు) సేవించు అలవాటు పెద్దగా ఉండేది కాదు. లాలాజీ దానిని సేవించేవారు కాదు, దానికి అలవాటుపడినవారు ఎవరైనా వారి ఇంటికి వచ్చినప్పుడు వారికోసం టీ తయారుచేసేవారు. 'వారు' మాత్రం అప్పుడప్పుడు తులసి ఆకుల కషాయం త్రాగేవారు. లాలాజీ పొగాకుకు అలవాటుపడలేదు."

ooo

"ఒకరోజు రాత్రి సమయంలో 'వారి' ఇంటికి వెళ్ళాను. మేమిద్దరం ఒకే పళ్ళెంలో ఆహారం తినటం ప్రారంభించాము (ఇది ఉత్తర భారతదేశంలో సామాన్యమైన పద్ధతి). లాలాజీ నిల్వ ఉన్న చపాతీలు, కూర తమవైపు ఉంచుకుని నావైపు అప్పుడే తయారుచేసిన వాటిని ఉంచారు. దీనిని నేను గమనించాను. అప్పుడు నా మనస్సులో అనిపించిన దీన స్థితిని నేను వివరించలేను. అప్పుడు నేను లాలాజీ తనవైపుగా ఉంచుకున్న చపాతీలను తినటం ప్రారంభించాను. నేను చేస్తున్న పనిమీద 'వారు' పెద్దగా దృష్టి నిలపలేదు. అప్పుడు నేను 'ముందుగా చల్లారిన పదార్థాలను తిని తర్వాత వేడిగా ఉన్న వాటిని తినటం మంచిది కదా!' అని తినటం ప్రారంభించాను."

ooo

"మరొక సందర్భంలో ఒక అద్భుతం జరిగింది. తలవని తలంపుగా లాలాజీగారి ఇంటికి కొంతమంది బంధువులు వచ్చారు. ఆ సమయానికి కొద్దిగా ముందు, కొంత ధాన్యాన్ని పిండి పట్టించడానికి లాలాజీ పంపించారు. చాలా సమయం గడిచినప్పటికీ మిల్లుకు పంపించిన సదరు వ్యక్తి తిరిగి రాలేదు. ఇరుగుపొరుగు ఇళ్ళ నుంచి కూడా మేము ఆ పిండిని సేకరించలేకపోయాము. ఇంక అప్పుడు ఏం చేయాలి? అప్పటికే చాలా ఆలస్యమైనందున బంధువులు ఆకలితో బాధపడుతున్నారు. లాలాజీ ఆలోచనలో పడ్డారు. ఏదైనా షాపు నుంచి తినుబండారాలు తెప్పించవచ్చునేమో అని లాలాజీ నిర్ణయం తీసుకొన బోతుండగా, ఒక ధనవంతుడు రుచికరమైన విలువైన ఆహార పదార్థాలను షుమారు పది లేక ఇరవై మందికి సరిపడునంతగా తీసుకొనివచ్చి దానిని స్వీకరించాల్సిందిగా లాలాజీని సవినయంగా ప్రార్థించాడు. ఆ సన్నివేశం అందరికీ ఆశ్చర్యం కలిగించింది. అందరూ దానిని సంతోషంగా ఆస్వాదించారు."

ooo

"ఒకసారి నేను కొంతమంది స్నేహితులతో కలిసి శీతాకాలంలో ఫతేఘర్ వెళ్ళాను. మేము ఫతేఘర్ రైల్వేస్టేషన్‌లో రైలు దిగేటప్పటికి రాత్రి పది గంటల సమయమైంది. చలి చాలా తీవ్రంగా ఉంది. కొంతమంది ఆ రాత్రికి స్టేషన్‌లోనే ఉండిపోయి మరుసటిరోజు ఉదయమే 'మాస్టర్' (లాలాజీ) ఇంటికి వెళ్ళవచ్చునని సలహానిచ్చారు. అది బాగా రాత్రి అయినప్పటికీ, నా మనస్సు మాత్రం లాలాజీ ఇంటికి వెళ్ళాలని తపన చెందుతోంది. అదే సమయంలో ఆ రాత్రిపూట అక్కడకు వెళ్ళి కుటుంబ సభ్యులను మేల్కొల్పటానికి ఎందుకో నా మనసొప్పలేదు. ఆఖరికి మేమంతా అప్పుడు వెళ్ళడానికే నిర్ణయించుకుని నడుచుకుంటూ 'మాస్టర్' (లాలాజీ) గారి ఇంటికి వెళ్ళాము.

ఎవరో ఒకరు తలుపు తెరచారు. మేము అప్పుడు నిశ్శబ్దంగా ఎక్కడ స్థలం దొరికితే అక్కడ నిద్రించాము. నాకు పశువులశాల వద్ద కొంత స్థలం దొరికింది. అక్కడ నేనొక దుప్పటి పరుచుకుని దానిమీద పండుకుని మరొక దుప్పటిని మీద కప్పుకున్నాను. మరుసటి రోజు ఉదయం లాలాజీ కుమారుడు దానిని గమనించాడు. అప్పుడు అతడు లాలాజీతో– "నాన్నగారూ! ఈ పెద్దమనిషి రాత్రి పశువులశాల వద్ద నిద్రించారు" అని చెప్పాడు. అయితే 'వారు' దానినంతగా పట్టించు కోనట్లుగా మౌనంగా ఉండి పోయారు. 'వారి'కి అంతా తెలుసు. నాకు సంబంధించినంతవరకు ప్రతిక్షణం నా మాస్టర్ యొక్క ఉనికిని అనుభూతి చెందుతూ, చలిని లెక్కచేయకుండా సుఖంగా నిద్రించాను."

ooo

లాలాజీగారి ధర్మపత్ని ఒక విధంగా గడసరి. అందుకు విరుద్ధంగా లాలాజీ మాత్రం కొంచెం నిదాన స్వభావం కలిగినవారు. "ఒక ఫకీర్ (సంత్) భార్య కొంచెం గడసరిగానే ఉండాలి" అని లాలాజీ అప్పుడప్పుడు చెప్తూ ఉండేవారు. 'వారి' ఉద్దేశ్యం ఏమిటంటే, ఎవ్వరికైనా ఓర్పు (Patience), సహనం (Tolerance) అలవర్చుకోవటానికి అటువంటి వాతావరణం అనువుగా ఉంటుంది అని.

"ఒకసారి ఆ ప్రాంతానికి చెందిన కలక్టర్‌గారి కుమారునికి టైఫాయిడ్ జ్వరం వచ్చింది. అతనికి ఎటువంటి వైద్యమూ సరిపడలేదు. అప్పుడు ఎవ్వరో ఒకరు, లాలాజీ యొక్క ఆధ్యాత్మిక విలువలను గురించి కలక్టర్ గారికి విన్నవించారు. వెంటనే కలక్టర్ లాలాజీ ఇంటికి వెళ్ళి అతికష్టంమీద 'వారి'ని తన నివాసానికి రమ్మని కోరి, ఒప్పించి, తన ఇంటికి తీసుకువెళ్ళాడు. మరుసటి రోజు నుంచి ఆ జ్వరం మందగించి, కొన్ని రోజుల్లోనే ఆ బిడ్డ ఆ వ్యాధి నుంచి విముక్తుడయ్యాడు. కలక్టర్ అందుకు సంతోషించి అప్పటి నుంచి లాలాజీని గౌరవంగా చూడసాగాడు. ఇంతలో ఎవరో ఒకరు దుర్మార్గంగా కలక్టర్‌తో– 'లాలాజీకి కొన్ని దుష్టశక్తుల మీద ప్రాబల్యం ఉంది, దాని కారణంగా మీ కుమారునికి జ్వరం వచ్చింది' అని చెప్పారు. అప్పుడు కలక్టర్ లాలాజీని పిలిపించి ఆ విషయమై ప్రశ్నించాడు. లాలాజీ దానికి ఏమాత్రం వెనుకాడకుండా, 'మహాశయా! నాకు అటువంటివి ఏమీ తెలియదు. నేను ప్రజలను మోసగించే ఫకీర్‌ను కాదు. మీరు నా సెయింట్ తత్వాన్ని అనుమానించి ఉన్నట్లయితే, నావద్దకు ఎందుకు వచ్చారు? ఈ విధంగా ఇంకెప్పుడూ మాట్లాడకండి' అని అన్నారు. దానికి నిస్సహాయుడైన ఆ కలక్టర్ సిగ్గుతో తలదించుకుని, తర్వాత లాలాజీని యధాప్రకారం గౌరవించసాగాడు."

ooo

"లాలాజీ తన బాల్యాన్ని చాలా కష్టంగా గడిపారు. ఒక దాది పోషణలో 'వారు' పెరిగారు. ఆ దాది 'వారి' దైనందిన అవసరాలను సమకూరుస్తూ ఉండేది. చాలాసార్లు 'వారి'కి సాయంత్రపు భోజనం ఉండేది కాదు. నిద్రించబోయేముందు కొంచెం పాలు త్రాగి కాలం గడిపేవారు. 'వారు' తన తమ్ముని శ్రేయస్సు కొరకు చాలా త్యాగం చేశారు. తన బ్రతుకుదెరువుకు సరిపడినంతగా ఆదాయం వచ్చే ఉద్యోగంతో భగవంతుడు తనను అనుగ్రహించాడు అని 'వారు' చెప్పేవారు. అలా భావించి తన ఆస్తి వాటాను తన తమ్మునికే వదిలివేశారు."

ooo

"లాలాజీ చాలా క్లుప్తంగా మాట్లాడేవారు. తమ సత్సంగీయులతో గంటల తరబడి ఒక్క మాట-పలుకు కూడా లేకుండా గడిపేవారు. ఎప్పుడైతే సందర్శకులకు ఇది నచ్చలేదని గ్రహించారో అప్పటి నుంచి 'వారు' ధారాళంగా మాట్లాడ నారంభించేవారు. ఆ వాగ్ధాటితో ప్రేక్షకులు మంత్రముగ్ధులైపోయేవారు."

నా (బాబూజీ) స్వభావం కూడా అదే విధంగా ఉండేది.

లాలాజీతో అతితక్కువ సాంగత్యం ఉన్నవారికి కూడా 'వారు' ఒక గొప్ప సెయింట్ అని తలపించేది. 'వారు' చాలా సీదా సాదాగాను, నిష్కపటంగాను ఉండేవారు. 'వారు' మాట్లాడింది ఎంత అల్పమైనా కూడా జనం దానికి ప్రభావితులయ్యేవారు.

[కాని నేను (బాబూజీ) మాత్రం అలాకాదు. జనం నన్ను ఒక మూర్ఖునిగానే భావించేవారు. 'జనం నీ సాదాతనం చూసి మోస పోతున్నారు' అని లాలాజీ ఒకసారి వ్యాఖ్యానించారు. ఇది నన్ను గురించిన సరైన అంచనా.]

ooo

"షుమారు 50 లేక 60 మంది సన్యాసులు బ్రహ్మవిద్యను అభ్యసించటానికి లాలాజీ వద్దకు వస్తూ ఉండేవారు. అయితే వారిలో ఏ ఒక్కరిని కూడా ఇతరులకు శిక్షణ నివ్వడానికి అనుమతించేవారు కాదు. దీనిలోని అంతరార్థం మీకు తెలుసా? ఆ విధంగా 'వారు' అనుమతించినట్లయితే, ఆ అభ్యాసుల్లో అహం బాగా విజృంభించి ఉండేది."

ooo

"లాలాజీ (గతించి) మహాసమాధి పొంది చాలా సంవత్సరాలు గడిచాయి. 'వారు' నన్ను తమ ప్రతినిధిగా పనిచేయమని ఆజ్ఞాపించారు. నేను అభ్యాసులకు ప్రాణాహుతి నిచ్చే ప్రతిసందర్భంలోనూ, ఒక దట్టమైన కాంతి కిరణం నా హృదయం నుండి వెలువడుతున్నట్లుగా నేను గ్రహించాను. దాని తీక్షణత (తీవ్రత)ను చాలామంది అభ్యాసులు భరింపగలిగేవారు కాదు.

ఒకసారి బాగా వయస్సు ఉన్న అభ్యాసీ ఒకరు నావద్దకు వచ్చాడు. నేను అతనికి ట్రాన్స్‌మిషన్ ఇస్తూ ఉండగా ఒక్కపెట్టున అరిచాడు -'అయ్యా! తమరు ఏం చేస్తున్నారు? ఈ విధంగా ట్రాన్స్‌మిషన్ ఇచ్చినట్లయితే ఎవరు మాత్రం భరించగలరు? లాలాజీ అప్పగించిన పనిని తమరు ఎలా నిర్వహించగలరు?' అని. నేను అందుకు సమాధానంగా 'మిత్రమా! ఇది నా దినసరి కార్యక్రమం. నేను దానిని ఎలా నియంత్రించుకోవాలో

దయచేసి నీవు చెప్పగలవా?' అని అడిగాను. ఆ వృద్ధుడు అప్పుడు ఈ విషయంలో లాలాజీని ప్రార్థించండి అని సలహా నిచ్చాడు. నేను అలాగే చేశాను. దానికి లాలాజీ అత్యంత ఆనందభరితులయ్యారు. 'వారు' చెప్పారు: 'ఈ శక్తి నీ అంతట నీవు సంపాదించుకున్నది, అందుచేత నీ అంగీకారం లేకుండా నేను దానిని వారించకూడదు అని భావించాను. ఈ విషయంలో నీ ప్రార్థన కొరకు నిరీక్షిస్తున్నాను' అని. ఇంక అప్పటి నుండి నా ట్రాన్స్‌మిషన్‌లో కొంత మందగతి ఏర్పడింది."

ooo

"లాలాజీ శక్తులు, వాటి సమర్థతలు చాలా గాఢంగా ఉండేవి. అటువంటి ఉదాహరణలు నేను ఎప్పుడూ ఎరుగను. కేవలం ఏ ఒక్కరి మీదనైనా తమ దృష్టి నిలిపినంతమాత్రానే పురుషులలో మార్పు కలిగించగలిగేవారు. ఒకసారి 'వారు' బజారులో ఉన్న ఒక పురుషుణ్ని ఆధ్యాత్మిక శిక్షణ కొరకు ఎంపిక చేశారు. అతడు ఒక పక్కా వ్యభిచారి. ఇప్పుడు లాలాజీ సామర్థ్యం ఏమిటో చూడండి! ఆ విధంగా లాలాజీ వద్ద అతడు శిక్షణ పొందటం ఆరంభమయ్యాక, అతడు స్వయంగా, మళ్ళీ వ్యభిచారానికి ప్రయత్నించినపుడు, అసమర్థుడైనట్లుగా అనుభూతి చెందాడు. ఆ విధంగా ఆ అసమర్థతతో అతడు వందలసార్లు విఫలమయ్యాడు. చిట్టచివరకు అతడు ఆ దురలవాటును మాను కున్నాడు. అతడు ఇప్పటికీ జీవించే ఉన్నాడు. లాలాజీ పేరు విన్నంతనే అతడు కంట నీరు నింపుకుని తన కృతజ్ఞతను వ్యక్తం చేస్తాడు."

ooo

"సందర్శకులు తరచుగా లాలాజీకి రకరకాల తినుబండారాలు, పండ్లు నివేదించుకునేవారు. నేను ఫతేఘర్ వెళ్ళినప్పుడల్లా చాలా ద్రాక్ష పండ్లు తిన్నాను."

ooo

"ఒక మౌల్వి సాహెబ్ (ముస్లిం తత్త్వబోధకుడు) లాలాజీ ఇంటి సమీపంలో ఉండేవారు. వారు ఒకసారి లాలాజీ కడుపునొప్పిని నయం చేశారు. అప్పటి నుంచి లాలాజీ సాహెబ్‌కి ఆ మౌల్వీ సాహెబ్‌పట్ల మంచి అభిమానం ఉండేది. ఒకసారి వారిద్దరూ ఒక ముస్లిం సెయింట్‌వద్దకు వెళ్ళారు. అప్పుడు ఆ సెయింట్ తన గుమ్మం ముందు ఎక్కువసేపు నిరీక్షించేటట్లుగా చేసి చివరకు, తాను దైవంతో సంబంధం కలిగి ఉన్నవారికి మాత్రమే తనను కలిసే అవకాశం ఇస్తానని వారికి కబురు చేశాడు. తనను అనుసరించి వచ్చిన ఆ మౌల్వీ సాహెబ్‌పట్ల ఆ సెయింట్ యొక్క అనుచిత ప్రవర్తనను లాలాజీ సహించలేకపోయారు.

ఆ సందర్భంలో వెంటనే లాలాజీ ఒక అద్భుతాన్ని కల్పించారు. ఆ సెయింట్ తక్షణమే తన ప్రక్కమీద పండుకొని కడుపులో విపరీతమైన మంటతో బాధపడుతూ దొర్లుతున్నాడు. అప్పుడు అతడు తన సేవకుని ద్వారా వారిద్దరిని లోపలకు రమ్మని సవినయంగా పిలిపించాడు. అప్పుడు లాలాజీ ఆ సెయింట్‌తో –'కనీసం ఇప్పుడైనా నేను దైవంతో సంబంధం కలిగి ఉన్నవాడినని గుర్తించావా? ఈ పెద్దమనిషిని అగౌరవపరచినందుకు నీవు ఈ శిక్షను అనుభవించాల్సిందే. ఇప్పటికైనా గ్రహించావా?' అని ప్రశ్నించారు. ఆ సెయింట్ తన తప్పిదాన్ని గుర్తించి తనను క్షమించమని ప్రాధేయపడ్డాడు. అంతటితో అతని కడుపులో మంట సద్దుమణిగింది. లాలాజీ

ఆ సాధువుతో, సాధువుల్లో ఇటువంటి కల్మషం ఉండకూడదు అని హెచ్చరించి ఆ మౌల్వీ సాహెబ్‌తోసహా తమ ఇంటికి తిరిగి వెళ్ళారు."

ooo

"లాలాజీవద్ద, అద్భుతాలు (Miracles) ఎలా ప్రదర్శించవచ్చునో తెలిపే ఒక చిన్న పుస్తకం ఉంది. దానిని ఉపయోగించుకోవటానికి నాకు ఇవ్వమని 'వారి' కుమారుడ్ని కోరాను. అపుడు లాలాజీ 'దానిని చదవ వద్దు' అని నన్ను ఆజ్ఞాపించారు. నేను దానిని చదివితే, చెడిపోతానేమోనని బహుశా 'వారు' భావించి ఉండవచ్చు. వాస్తవం చెప్పాలంటే, అద్భుతం ప్రదర్శించటమనేది చాలా స్వల్ప విషయం. దానిలో కోరిక అనేది చోటుచేసుకుంటుంది. లాలాజీ తమ జీవితకాలంలో ఎన్నో మహిమలు (అద్భుతాలు) నిర్వహించారు. అయితే అవి ఎక్కడా పేర్కొనబడలేదు. ఆ (Miracles) మహిమలవైపు 'వారి' మానసం మొగ్గుచూపలేదు."

ooo

"భగవంతునికి ప్రసాదం నివేదన చేసినపుడు, ఆ ప్రసాదాన్ని ముందుగా పిల్లలకు పంచిపెట్టాలని లాలాజీ సాహెబ్ చెప్తూ ఉండేవారు. 'వారు' తమ పరిసరాలలోని పిల్లలందరినీ పిలిచి వారికి ప్రసాదం పంచేవారు. పిల్లలు ప్రసాదాన్ని ఆనందంగా తింటారు అని వారు చెప్పేవారు."

ooo

"లాలాజీ సాహెబ్ ఏమి చెప్పేవారు అంటే, **'ప్రతి ఒక్కరిలోను ఏదో ఒక లోపం ఉంటుంది. మనం ఇతరులలోని మంచి లక్షణాలను చూడాలేకాని వారి (లోపాలు) బలహీనతలు కాదు' అని. నాకు సంబంధించినంతవరకు, నేను లాలాజీలో ఎటువంటి బలహీనతను గమనించలేదు."**

ooo

"లాలాజీ తమ భోజనంలో చాలాకొద్ది ఆహారం మాత్రమే సేవించేవారు. 'వారి' ఆకలి చాలా స్వల్పంగా ఉండేది. కేవలం ఒకటి లేదా రెండు చపాతీలతోనే జీవించే వారు. 'వారి'ని అనుకరించవలసిన విషయాలు అనేకం ఉన్నప్పటికీ, నేను దీనిని మాత్రమే అనుకరించాను. 'వారి'లో ఏ ఒక్క చిన్న లోపం కూడా కనిపించలేదు. 'వారు' ఎన్నో సద్గుణాలకు గనిగా ఉన్నప్పటికీ, ఏ ఒక్క మంచిని కూడా నేను అనుకరించలేకపోయాను అని నా హృదయంలో బాధపడ్డాను. ఎప్పుడైతే నాలో ఈ ఆలోచన కలిగిందో అప్పుడు పైనుంచి, **'నీవు లయావస్థ యొక్క మేలును అనుకరించావు. అది ఇప్పటివరకు ఎవ్వరికి సాధ్యపడలేదు'** అని ఒక వాణి వినిపించింది."

ooo

"లాలాజీకి తమకు సంధించబడిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వడంలో ఒక అనుపమానమైన శైలి, ఒక విశిష్ట బహుమానంగా ఉండేది. 'వారు' పామరులకు (అవిద్యావంతులకు) పామరుల భాషలోను, మేధావులకు మేధస్సుపరంగాను సమాధానం ఇచ్చేవారు. 'వారు' సమస్యలను అతిసులభంగాను, ఆసక్తి దాయకంగాను పరిష్కరించేవారు."

ooo

లాలాజీ శిష్యులలో ఒకరికి తన గురువు లాలాజీపట్ల ఉన్న ప్రేమ చాలా ఉన్నతస్థాయికి చెందినదిగా ఉండేది. మాస్టర్ చెప్పారు: "చూడండి, ఇటువంటి ప్రేమను నేను చాలా అరుదుగా చూసాను. లాలాజీ అవసరాలకు అతను ఎంత సంసిద్ధంగా ఉండేవాడు అంటె, దానికి లాలాజీ కూడా ఆశ్చర్యపోయేవారు. ఒకసారి లాలాజీ కోర్టులో తమ పనిలో నిమగ్నమై ఉన్నారు. అది మధ్యాహ్నం. అప్పుడు లాలాజీకి ఒక కప్పు కాఫీ తాగాలను కోరిక కలిగింది. ఈ ప్రాంతాలలో కాఫీ తాగటమనేది ఇప్పటికి కూడా చాలా అరుదు అని మీరు గ్రహించాలి. ఆ రోజుల్లోనయితే ఇంకా అరుదైన విషయం. ఈ కోర్కె కలిగిన అతితక్కువ సమయంలోనే, ఆ శిష్యుడు లాలాజీని కలుసుకోవటానికి కోర్టుకు రావటం లాలాజీ గమనించారు. అతడు లాలాజీ కొరకు కొంచెం కాఫీ తీసుకువచ్చాడు. ఇంత వ్యక్తిగత శ్రద్ధను గమనించి లాలాజీ చాలా మెచ్చుకున్నారు. అంటె తన మాస్టర్ యొక్క అవసరాలకు అతను ఎంత శ్రద్ధతో సిద్ధంగా ఉండేవాడో మనం ఇక్కడ తెలుసుకోవాలి.

నేను ఇంకొక అద్భుతమైన విషయాన్ని వివరిస్తాను. లాలాజీ రాత్రిపూట లేచి బాత్‌రూమ్‌కు వెళ్తూ ఉండేవారు. చూడండి మరి, ఆ ప్రత్యేకమైన అభ్యాసీ లాలాజీ కోసం ఒక నీళ్ళ పాత్రతోను, టవల్‌తోను ఎప్పుడూ సిద్ధంగా ఉండేవాడు. దీని అర్థం ఏమిటో మీరు గ్రహించారా? ఆ అభ్యాసీ తన నిద్రలో కూడా తన మాస్టర్ అవసరాలను గ్రహించి సంసిద్ధంగా ఉండేవాడు. అందుచేతనే అతడు లాలాజీ మేల్కొనటానికి ముందే మేల్కొని 'వారి' సేవలకు సిద్ధంగా ఉండగలిగేవాడు. ఇది అత్యున్నత ప్రేమకు నిదర్శనం.

ఆ ప్రత్యేకమైన అభ్యాసీ లాలాజీ యొక్క ఆధ్యాత్మిక ప్రతినిధిగా గాని, ఆధ్యాత్మిక వారసుడుగా గాని కాలేకపోయాడు. **"ప్రతి రెక్కల కీటకం జ్వలిస్తున్న అగ్నిలో ఆహుతి అవుతుంది అను విషయం మీకు తెలిసిందే, అయితే ఒక చల్లని మంటలో బలి అయ్యే కీటకం మాత్రం అరుదుగా ఉంటుంది."**

ooo

బాబూజీ మహరాజ్ చెప్పారు: "నేనొక విషయం చెబుతాను. పరంపరాగతమైన వంశాచారాన్ని (Tradition) లాలాజీ అత్యున్నతంగా గౌరవించేవారు. 'వారు' ఎప్పుడూ దేనినిగాని, ఎవ్వరినిగాని విమర్శించేవారు కాదు. లక్ష్యం చేరటానికి తమకు తెలిసిన ఉత్తమ మార్గాన్నే 'వారు' ఇతరులకు బోధించేవారు. కాని ఇతర పూజ లేదా ఆరాధన విధానాలను ద్వేషించేవారు కాదు. ఈ సుగుణంవల్లనే 'వారు' ఒక ప్రముఖ వ్యక్తిగా గుర్తింపునంది, అన్ని కులాలు, జాతులవారు వారి సలహా కోసం వారిని సంప్రదిస్తూ ఉండేవారు. అన్ని విషయాలలోను 'వారు' సరైన సలహా మరియు మార్గ నిర్దేశనం చేస్తున్న కారణంగా వారిని ఆశ్రయించినవారంతా వారిపట్ల విశ్వాసంతో ఉండేవారు. అయితే ఒక్క విషయం ఏమిటంటే, 'వారు' శాస్త్రోక్త విధానాలు అనగా ఆచారాలను వ్యతిరేకించేవారు. 'వారి' తల్లిగారు మతాభిమానం మరియు పవిత్రత కలిగి ఉన్నవారు, కాని లాలాజీ చిన్నవయస్సులోనే ఆమె గతించారు. ఆమె జీవిత కాలంలో లాలాజీ ఆమె కొరకు పాటలు పాడేవారు. 'వారి' కంఠస్వరం వినటానికి అందరికీ మధురంగా అనిపించేది. 'వారు' భక్తిగీతాలను ఆలాపించేవారు. అందులో వారికి అభిమాన పాత్రమైన **పాట –దీనన దుఃఖహర నాథా సంతన హితకారీ –** (అనగా దీనుల దుఃఖాలను బాపువాడు, సంతనుల హితం కోరు నాథుడు అని అర్థం) దురదృష్టం ఏమిటంటే, ఆ రోజుల్లో 'వారి' గానాన్ని నిక్షిప్తం చేయటానికి టేపురికార్డులు వంటివి లేకపోవటమే. 'వారు' ఎప్పుడూ శాస్త్రోక్తమైన పూజలు (Ritual worship) నిర్వహించలేదు."

ooo

బాబూజీ మహరాజ్ చెప్పారు: "నేనొక విషయం చెబుతాను. ఒక అమావాస్య రోజున, 'వారు' తర్పణం చేయటం నేను గమనించాను. ఊర్ధ్వలోకంలో ఉన్న తమ పూర్వీకులకు ఆచార పద్ధతుల్లోలాగా జలాన్ని ధారపోస్తున్నారు. నన్ను నేను సంబాళించుకుని 'వారు' ఏమి చేస్తున్నారో గమనించసాగాను. ఆ సమయంలో ఆ జలంలోని సారాంశాన్ని (essence) ఆ తర్పణం ద్వారా 'వారు' (ట్రాన్స్‌మిషన్) ఆపాదించటం చూసి నేను ఆశ్చర్యపోయాను. ఇది ఏమిటో మీరు గ్రహించగలిగారా? 'భోగ్'ను నివేదించటానికి ఈ విధంగా చేయాల్సి ఉంటుంది. నేను ఇంకొక విషయం కూడా వివరిస్తాను. ఎవ్వరైనాగాని ఒక వస్తువు యొక్క సారాంశాన్ని (essence) ఆ విధంగా ఆపాదింప చేయగలిగి నట్లయితే, అది తర్పణంగాని మరేమైనా చేయటానికిగాని ఉపయోగపడుతుంది. అలా చేయకపోతే ఫలితం ఏం ఉంటుంది? అది అర్థం పర్థం లేని ఆచారం మాత్రమే అవుతుంది. ధ్యానంలో కూర్చుని ఆ విగతజీవులైన ఆత్మల (departed souls) గురించి జ్ఞాపకం చేసుకోవటమే మేలు. దానివలన వారికి (ఆ ఆత్మలకు) ప్రయోజనం కలుగుతుంది. ఆ విధంగా నిర్వహించువారు ఒక ప్రిసెప్టర్ అయి ఉంటే, ఆ ట్రాన్స్‌మిషన్ ఆ ఆత్మ ఎక్కడ ఉన్నా సరే, వారిని చేరుతుందనే భావనతో ట్రాన్స్‌మిషన్ చేయాలి. మేలుచేసే విధానాలు ఎలా ఉన్నాయో గమనించండి. కేవలం అమాయకంగా, భీతితో ఆచారాలను స్థూలంగా పాటించటానికి కట్టుబడినవారికి మనం ఏం చేయగలం?"

ooo

ఒకసారి లాలాజీ బంధువు ఒకరు జబ్బుపడ్డారు. ఆ జబ్బు తీవ్రమయ్యాక, లాలాజీకి అక్కడి నుండి టెలిగ్రాం వచ్చింది. అది అర్ధరాత్రి. 'వారు' ఏదో విధంగా అక్కడకు చేరాలి. ఆ ప్రదేశం ఫతేఘర్‌కు షుమారు 7,8 మైళ్ళ దూరంలో ఉండటమేగాక, వెళ్ళటానికి ప్రయాణ సాధనం కూడా ఏమీలేకపోయింది. దానికి తోడుగా లాలాజీ ఆరోగ్యం కూడా అంతగా బాగుండలేదు. వీటన్నింటినీ పట్టించుకోకుండా లాలాజీ తన తమ్మునితో కలిసి బయలుదేరారు. ఆశ్చర్యకరంగా, 'వారు' ఆ ప్రదేశాన్ని 40 – 45 నిమిషాల లోపుగానే చేరుకున్నారు. ఈ సందర్భాన్నిబట్టి లాలాజీ ఏం చెప్పారు అంటే, **"మనం ఒక ఆలోచన కల్పించుకుని దానికి శక్తిని దోహదం చేసినట్లయితే, మన కాళ్ళ క్రింద ఉన్న భూమి మన వెనకవైపుకు జరిగిపోతుంది. దానితో దూరాన్ని వేగంగా అధిగమించవచ్చు"** అని అన్నారు.

ooo

ఒక సాధకుడు, ఇతరుల ఆంతర్యాన్ని (Interior) ఎలా గ్రహించవచ్చు అని ప్రశ్నించాడు. దానికి సమాధానంగా బాబూజీ ఇలా చెప్పారు: లాలాజీ ఇతరుల ఆంతరిక స్థితిని తక్షణమే గుర్తించేవారు. ఒకసారి ఉత్సవ సందర్భంగా ఎవరో ఒకరు (ఒకప్పుడు అభ్యాసీ అయినవారు) ఎక్కడ నుండో వచ్చాడు. లాలాజీ ఆ అభ్యాసీని అతడు కూర్చున్నచోటు నుంచే సంబోధిస్తూ ఆ అగంతకుడ్ని (వచ్చిన అతడిని) లోనికి రానీయకుండా అతడు నిలబడి ఉన్న స్థానం నుండి పంపించివేయమన్నారు. అప్పుడు తోటి అభ్యాసి లాలాజీతో, ఆ పెద్దమనిషి అప్పుడే వచ్చాడని, ఆహారం ఏమీ తీసుకోలేదని చెప్పాడు. అప్పుడు లాలాజీ అతనికి ఆహారపొట్లం అందజేసి అతడు లోనికి ప్రవేశించకుండా అరికట్టారు. లాలాజీ ఈ విధంగా ఎందుకు ప్రవర్తించారో ఎవ్వరికీ అర్థం

కాలేదు. ఉత్సవం ముగిసిన చాలా రోజుల తర్వాత, ఆ వ్యక్తి చాలా దుర్మార్గుడు అని, అతడు దుర్బుద్ధులతో కూడినవాడు అని, ఎవరో ఒకరికి రెండుసార్లు విషప్రయోగం చేసాడని అభ్యాసులు తెలుసుకున్నారు.

ooo

బాబూజీ ఇలా చెప్పారు: "లాలాజీ తను వ్రాసుకుంటూనే ఉన్నాగాని, లేదా మరేదైనా పనిలో నిమగ్నమై ఉన్నప్పుడుగాని ట్రాన్స్‌మిషన్ ఇస్తూనే ఉండేవారు. 'వారు' ట్రాన్స్‌మిషన్ ఆరంభించిన వెంటనే, దానిని నా హృదయం వెంటనే పసిగట్టగా నేను వెంటనే ధ్యానంలో కూర్చుండేవాడిని. ఈ విషయాన్ని గ్రహించగలిగినట్టి వారెవరూ లేకపోయారు అని లాలాజీ చాలా కలతచెంది నాకు చెప్పేవారు."

ooo

లాలాజీ, బాబూజీ డైరీని బాగా అభినందించారు. 'వారు' ఇతరులతో "బాబూజీని చూడండి, రామచంద్ర ఎంత కఠినమైన విషయాలను కూడా ఎంత అందంగా, సులభంగా విశదీకరించారో గదా!" అని ప్రశంశించేవారు.

ooo

లాలాజీని గురించి బాబూజీ ఇలా చెప్పారు: "ఒక మౌల్వీ సాహెబ్ లాలాజీ వద్దకు వస్తూ ఉండేవారు. ఆయన లాలాజీకి అధ్యాపకుడు కూడా. ఆయన చాలా మంచివారు, కాని అతిబీదరిక స్థితికి దిగజారిపోయారు. ఒక్కొక్కసారి వరుసగా రెండు మూడు రోజులు కూడా తినడానికి ఆహారం లేకపోయేది. ఆయన ముస్లింల ఇంట ఎప్పుడూ భుజించేవారు కాదు. ఆయన లాలాజీ ఇంటికి ఎప్పుడు వచ్చినా కూడ, లోపలికి వెళ్ళి, "సోదరీ! ఏదైనా రొట్టె మిగిలినది ఉన్నదా!" అని అడిగేవారు. ఏదైనా మిగిలినది ఉంటే తినేవారు. ఒకవేళ ఏమీ లేకపోయినట్లయితే, లాలాజీ భార్య ఏదైనా వండిపెడతానని చెప్పినా కూడా అందుకు అంగీకరించేవారు కాదు. ఆ మౌల్వీ సాహెబ్ ఇలా చెబుతూ ఉండేవారు: "ముస్లింలు ఆధ్యాత్మిక జ్ఞానాన్ని (Spiritual Science) హిందువుల నుంచి పొందారు. ఇప్పుడు ఏ ఒక్క ముస్లిం కూడా ఈ జ్ఞానాన్ని పొందటానికి అర్హుడు కాదు. దయచేసి వారికి ఈ ఆధ్యాత్మిక శిక్షణ నేర్పకండి. ఏ హిందువుల నుంచి నయితే మనం దానిని పొందామో దానిని వారికి తిరిగి ఇవ్వటం మన విద్యుక్త ధర్మం."

ooo

బాబూజీ, మిషన్ సభ్యులు నిష్కల్మషమైన ప్రవర్తన కలిగినవారుగా ఉండాలని నొక్కి చెప్పేవారు. "మిషన్ సభ్యులైనవారు దానికి కళంకం ఆపాదించరాదు. లాలాజీ ఎంతో బాధతో ఈ విషయంలో 'నాకు సింహాలు కావాలి. కాని నేనేమి చేయాలి? నేను సత్సంగ్‌లో తోడేళ్ళకు అవకాశం కల్పించాను' అని చెప్పేవారు. కనుక ప్రిసెప్టర్లు, లాలాజీ చెప్పిన ఈ కథనం మన మిషన్ సభ్యులకు వర్తించకుండా చూడాలి."

ooo

ఒకసారి ఒక ముస్లిం ఫకీర్ లాలాజీ ఇంటికి వచ్చాడు. అతని ఆలోచన ఎటువంటిది అంటె, ఎవరైనా ఆధ్యాత్మికతను సంతరించు కున్నవారై ఉంటే అటువంటివారిని మర్యాద పూర్వకంగా కౌగిలించుకున్న నెపంతో వారి ఆధ్యాత్మికతను గుంజుకోవచ్చు అని. ఆ దురుద్దేశ్యంతోనే అతడు లాలాజీని కౌగలించుకున్నాడు. అయితే

లాలాజీ అతని కుతంత్రాన్ని గ్రహించి, ఆ ఫకీర్ శక్తి నంతటినీ గుంజివేసారు. ఆ ఫకీర్ లాలాజీ చర్యకు కోపోద్రిక్తుడై, దానికి నిరసించాడుకాని ఏమీ చేయలేకపోయాడు. ఈ విషయాన్ని తన గురువుకు ఫిర్యాదు చేశాడు. అయితే ఆ గురువు అతనికి చివాట్లుపెట్టి, "నీవు ఎవరిపట్ల ఈ తప్పు చేశావో గ్రహించావా? లాలాజీ శక్తి సామర్థ్యాలు నీకు తెలుసా? నేను ఈ విషయంలో జోక్యం కల్పించుకోను. నీవు వెళ్ళి ఎక్కడ తప్పు చేశావో అక్కడ క్షమాపణ పొందు" అని అన్నాడు. అప్పుడు ఆ ఫకీర్ లాలాజీ ఇంటికి తిరిగి వచ్చి తనను క్షమించమని, తన శక్తులను తనకు తిరిగి ఇవ్వమనీ ప్రాధేయపడ్డాడు. అప్పుడు లాలాజీ, తనదైన దయార్ద్రశైలితో, అతనితో, "ఎవ్వరిపట్లా మళ్ళీ ఇటువంటి పని చేయకు. కనీసం మా సత్సంగీయులపట్లనైనా జాగ్రత్తగా వ్యవహరించు. అలా చేయకుంటే నీవు దురదృష్టాన్ని ఎదుర్కొనవలసి ఉంటుంది" అని హెచ్చరించటంతో పాటుగా అతనిచేత వాగ్దానం చేయించుకుని, అతడి నుంచి ఏ శక్తుల నయితే ఉపసంహరించారో వాటిని తిరిగి ఇచ్చివేశారు.

ooo

బాబూజీ ఈ విధంగా చెప్పారు: "లాలాజీకి నాపట్ల ఉన్న కృప అపారమైనది. ఒకసారి నాతో 'వారు' ఈ విధంగా చెప్పారు: **'ప్రాపంచిక విషయాలను గురించి నీవు ఏదైనా చెప్పవచ్చును, కాని ఆధ్యాత్మిక విషయాలలో మాత్రం నీ మాటలు నా మాటలే.'** ఆ రోజు నుండి, అది తరచుగా నా అనుభవానికి వచ్చింది. నేను ఎవ్వరికైనా ఏదైనా వాగ్దానం చేసినట్లయితే, దానిని నేను పూర్తి చేయాలి. లాలాజీ నన్ను ఆ విధంగా నిర్వహింపజేసారు."

ooo

బాబూజీ చెప్పారు: "లాలాజీ చాలా సాధారణ జీవితం గడిపారు. 'వారి' ఇంట బల్లలుగాని, కుర్చీలుగాని లేవు. 'వారు' కూర్చొనటానికి ఒక గట్టిచాప మరియు దిండు మాత్రం ఏర్పాటు చేసుకున్నారు. ఒకసారి కొంతమంది అభ్యాసులు 'వారి'కి ఒక పడక కుర్చీని, ఒక పెద్ద తివాచీని, ఒక మందపాటి చాపను పంపించారు. లాలాజీ ఆ పడక కుర్చీని మాత్రం ఉపయోగించుకున్నారు. ఆ తివాచీని మరియు చాపను అక్కడకు వెళ్ళిన అభ్యాసులు ఎక్కువగా వినియోగించుకున్నారు."

ooo

బాబూజీ చెప్పారు: "లాలాజీ ఉదయం గం. 9.00 లకు ఆహారం తీసుకుని ఆఫీసుకు వెళ్ళేవారు. 'వారి' జీతం 40 రూపాయలుగా ఉండేది. ఆఫీసు నుంచి తిరిగి వచ్చాక కొంచెంసేపు నడక సాగించి తర్వాత సత్సంగ్ నిర్వహించేవారు. ఆ తర్వాత వ్రాయటానికి పూను కునేవారు. రాత్రి గం. 9.00 లకు 'వారు' నిద్రకు ఉపక్రమించటానికి గదిలోకి వెళ్ళాక 'వారి'ని పలకరించటానికి ఎవ్వరూ సాహసించేవారు కాదు. ఎవ్వరితోనూ మాట్లాడకపోవటం 'వారి' ఉద్దేశ్యం కాకపోయినప్పటికీ, మేము మాత్రం భయపడేవారం. 'వారు' తమ ఉద్యోగ విరమణ చేశాక ఉదయం తొమ్మిది గంటలకు బదులు పది గంటలకు భోజనం చేసేవారు. మార్పు ఇది మాత్రమే."

ooo

“లాలాజీ చాలా మృదువుగా వినసొంపుగా మాట్లాడేవారు. జనానికి అది బాగా నచ్చేది. స్వంత అస్తిత్వం లేకపోవటానికి చిహ్నం ఏమిటో తెలుసా? ఎవ్వరైతే తమ ఉనికిని విస్మరిస్తారో వారు సంఘంలో అవసరాలకు అనుగుణంగా తమ రూపం దాల్చుతారు. వారు తమ అనుచరగణానికి తగ్గట్లుగా మాట్లాడేవారు. అంతేగాని వారి స్వంత రూపం (వ్యక్తిత్వం) ఉండేది కాదు.”

ooo

బాబూజీ చెప్పారు: “లాలాజీ పదవీ విరమణ చేశాక, తమ పెన్షన్‌లో కొంత భాగాన్ని వెచ్చించి, క్రింది భాగంలో మూడు లేదా నాలుగు గదులు; దాని పైభాగంలో ఒక గది ఉండే విధంగా ఇంటి నిర్మాణం చేశారు. ‘వారు’ ఎటువంటి ఆడంబరాలు లేకుండా, అతిసామాన్యమైన జీవన విధానాన్నే అవలంబించారు.”

ooo

లాలాజీ సూచనల గురించిన ఒక సంఘటనను బాబూజీ వివరించారు. అవి చాలా ప్రభావితం చేసేవిగా ఉండి, అభ్యాసులలో అతితక్కువ సమయంలోనే అవసరమైన మార్పులను తీసుకొచ్చాయి. “ఒకసారి ఒక సాధకుడు (అభ్యాసీ) లాలాజీ వద్దకు వచ్చి, తాను కోపిష్టినని చెప్పుకుంటూ దానిని తగ్గించమని వారిని వేడుకున్నాడు. అప్పుడు లాలాజీ మృదువుగా: ‘అలానా!’ అంటూ చిరునవ్వు నవ్వారు. ఆరోజు నుంచి ఆ అభ్యాసీలో కోపం పూర్తిగా మాటుమాయైపోయింది.”

ooo

బాబూజీ చెప్పారు: “లాలాజీ ముఖం మీద ఒక ప్రత్యేకమైన కాంతి శోభ కనిపిస్తూ ఉండేది. దాని నుంచి సరళత్వం (సాదాతనం) ఉట్టిపడుతూ ఉండేది. కొన్ని నిమిషాలపాటు ఎవ్వరైనా ‘వారి’కి సమీపంలో కూర్చొనటం తటస్థపడినట్లయితే వారికి, ‘వారు’ ఒక దివ్యాత్ములుగా తలపించేది. నా విషయంలోనయితే అది వేరొక రకంగా ఉంటుంది. జనం నన్నొక అజ్ఞానిగా భావిస్తారు.”

ooo

లాలాజీ పేరు ఉచ్చరించబడినపుడు, ఎప్పుడైనా సరే బాబూజీ ముఖంలో ఒక ప్రత్యేకమైన తేజస్సు కనిపించేది. బాబూజీ చెప్పారు: “లాలాజీ మధుర స్వరం కలిగి ఉండేవారు. అది ఒక ముద్దులొలికే బిడ్డలాగా మురిపెంగా ఉండేది. ఆ రోజుల్లో టేప్ రికార్డర్ (స్వర నిక్షిప్త సాధనం) ఏమీ ఉండేది కాదు. అదే కనుక ఉండి ఉన్నట్లయితే ‘వారి’ మధుర వాణి ఇప్పుడు కూడా వినటానికి అవకాశం ఉండేది.” బాబూజీ దీనిని కొంత విచారగ్రస్తంగానే చెప్పారు.

ooo

ఒకసారి లాలాజీ సాయంత్రపువేళ నడకకు వెళ్ళారు. తిరిగి వస్తూ ఉండగా ఒక క్రూర శునకం ‘వారి’ మీదకు దూసుకు వచ్చింది. అయితే ఆ సందర్భంలో దైవానుగ్రహం ఎలా కళ్ళకు కట్టిందంటే, మరొక శునకం వెంటనే దాని మీదకు వెనుక నుంచి దుమికి వచ్చి, దాని మెడ పట్టుకుని గుంజుకుంటూ వెళ్ళింది. లాలాజీ

భయంతో కంపించిపోయి ఇల్లు చేరారు. 'వారి'ని రక్షించిన ఆ శునకం కూడా 'వారి' ననుసరించి 'వారి' ఇంటికి వచ్చి 'వారి' పాదల మీద వాలిపోయింది. ఆ రోజు నుంచి ఆ శునకం లాలాజీ ఇంటివద్దనే ఉంటూ అక్కడే తుది శ్వాస విడిచింది.

ooo

బాబూజీ చెప్పారు: "లాలాజీ అద్భుతమైన ఆధ్యాత్మిక శక్తిని కలిగి ఉండే వారు. క్రొత్తగా వచ్చిన వారిలో అతితక్కువ కాలంలోనే వారి ఇంద్రియ వాంఛను తగ్గించి వేసేవారు. బ్రహ్మాండ మండల స్థాయి నుంచి ఆ కోర్కెను నిష్క్రమింపజేసేవారు. ఇటువంటి అద్భుతాలు 'వారు' ఎన్నో చేసినప్పటికీ, అవి ఎక్కడా ప్రస్తావించబడలేదు. ఇవి అన్నీ స్వానుభవంతో తెలుసుకోవలసినదే. అవి మనకు ఒక గుణపాఠం వంటివి అని మీకు తెలుసా?"

ooo

బాబూజీ చెప్పారు: "లాలాజీ ఒక వక్త (Orator) కాదు. అయినప్పటికీ అలహాబాద్ విశ్వవిద్యాలయంలో 'వారు' ఒకసారి ప్రసగించారు.

సాక్షాత్కారాన్ని ధ్యేయంగా నిలుపుకొని నేను తత్త్వశాస్త్ర (Philosophy) అధ్యయనాన్ని విడిచిపెట్టాను. ఆ సాక్షాత్కారాన్ని పొందటానికి నేను సాధన ఆరంభించాను. దానిని సాధించటం ద్వారా, ప్రతిదీ సాధ్యపడింది. తత్త్వశాస్త్రంపట్ల నాకు ఉన్న జిజ్ఞాసను లాలాజీ తగ్గించివేశారు."

ooo

స్వీయ ప్రాణాహుతి (Self-Transmission) విధానాన్ని ప్రవేశపెట్టాలను తలంపు నాలో కలిగింది. అప్పుడు లాలాజీ మందహాసంచేస్తూ నన్ను అడిగారు: "నా అవసరం కూడా లేకుండా చేసుకోవాలని నీవు భావిస్తున్నావా?" అని. అప్పుడు నేను కలవరపడి మౌనం దాల్చాను.

ooo

బాబూజీ చెప్పారు: "ఒకసారి ఒక ఆఫ్ఘన్ దేశీయుడు లాలాజీ వద్దకు వచ్చాడు. లాలాజీ అతనికి ఒక సిట్టింగ్ ఇచ్చి, ఇంక అతని జీవితకాలంలో ఎప్పుడు కూడా అతనికి ట్రాన్స్‌మిషన్ యొక్క అవసరం లేదని చెప్పారు. లాలాజీ ట్రాన్స్‌మిషన్ అంత శక్తివంతంగా ఉండేదన్న మాట."

ooo

బాబూజీ చెప్పారు: "ఒకసారి పండిట్ రామేశ్వర్ ప్రసాద్ లాలాజీ కాళ్ళు వత్తుతున్నారు. ఆ తర్వాత లాలాజీ రామేశ్వర్ ప్రసాద్‌గారితో, 'నేను ఇప్పుడు నీ కాళ్ళు వత్తుతాను' అని అన్నారు. ఏమాత్రం జంకులేకుండా రామేశ్వర్ ప్రసాద్‌గారు తన కాళ్ళను చాపారు. **ఆజ్ఞాపాలన లేదా విధేయత (Obedience), వినయం (Humility) కంటె మిన్నయైనది.**"

ooo

బాబూజీ చెప్పారు: "కబీరు యొక్క (Enigmatic Verses) మార్మికమైన (గూఢార్థం కలిగిన) పదాలను లాలాజీ చాలా సులభంగా సుబోధకం చేసేవారు. 'వారి' జ్ఞానం అగాధమైనది."

ooo

బాబూజీ చెప్పారు: "మనం అజ్ఞానంతో సంబంధం కల్పించుకోవాలని లాలాజీ ఎప్పుడూ చెప్తూ ఉండేవారు. దేనినైతే మనం లక్ష్యపెట్టమో అది అజ్ఞానం. దైవానికి దేనిపట్లనూ కోరిక / వ్యామోహం ఉండదు; కనుక దేనితోనూ సంబంధం కల్పించుకోదు. దీని తాత్పర్యం ఏమిటంటే, మనం కూడా అలానే ఉండాలి."

ooo

బాబూజీ చెప్పారు: "శారీరకమైన బాధలను అనుభవించటంలోని కళ / నేర్పు నాకు నా మాస్టర్ని తలపించాయి. వారి చివరి రోజుల్లో, వారు కాలేయ సంబంధ వ్యాధితో చాలా తీవ్రమైన నొప్పిని అనుభవించారు. ఆ సందర్భంలో కూడా వారు 'భజన'లు (భగవంతుని కీర్తిస్తూ పాడేవి), ఆ సమయాన్ని విలాపంతో వృథా చేయకుండా పాడుతూ ఉండేవారు. 'వారు' చాలా మంచి గాయకులు. 'చక్రము'ల సాయంతో పాడటంలో వారికి నైపుణ్యం ఉంది. దీనిని 'వారు' స్వంతంగా స్వరకల్పన చేసి సాధించుకున్నారు. ఈ విషయంలో నేను కూడా కొంతమంది ప్రసిద్ధ గాయకులను సంప్రదించగా, వారు, ఎవరో కొంతమంది ఉన్నత శ్రేణికి చెందిన ఋషులు మాత్రమే గానం చేయగలుగుతారు అని చెప్పారు. కొన్నిసార్లు 'వారు' బ్రహ్మాండి స్వరంలో పాడేవారు, దాని ఫలితంగా మేమందరం మైకంలోకి జారుకునే వాళ్ళం."

ooo

లాలాజీ మద్యపానానికి బద్ధవ్యతిరేకి. ఒకసారి దీపావళి పండుగ సందర్భంగా, లాలాజీ బంధువు ఒకరు లాలాజీని తమ ఇంటికి ఆహ్వానించారు. 'వారు' అక్కడికి చేరేసరికి, తమ బంధువులతో చేరి కొంతమంది సత్సంగీయులు మద్యపానంలో భాగస్వాములుగా ఉన్నట్లు చూసారు. మరసటి రోజు ఉదయం లాలాజీ తమ ముఖం కప్పుకుని పండుకొని ఉన్నారు. మాతాజీ (లాలాజీగారి ధర్మపత్ని) గారు దానికి కారణం వివరిస్తూ, గత రాత్రి జరిగిన సంఘటన గురించి మరియు వారి రాకను గమనించి కూడా ఆ సత్సంగీయుడు మద్యపానం నిలపకపోవటం గురించి బాధపడినట్లుగా చెప్పారు. ఆ సంఘటనకు సంబంధించిన సత్సంగీయుడు, లాలాజీ బాధపడినట్లు తెలుసుకుని, తర్వాత మద్యపానమే పూర్తిగా మానివేశాడు.

ooo

లాలాజీ వితంతు వివాహాలపట్ల చాలా అభిమానం కలిగి ఉండేవారు. ఒకసారి, సత్సంగీయుడుకాని వారు ఒకరు వచ్చి, తాను వితంతు వివాహం చేసుకొనగోరుతున్నట్లుగాను, ఒకవేళ అది జరిగితే తన బంధువులు ఎవ్వరూ దానికి హాజరుకారేమోననీ భయపడుతున్నట్లుగాను చెప్పాడు. అప్పుడు లాలాజీ దానికి స్పందించి తామే స్వయంగా తమ ఇంటిలో ఆ వివాహం జరిపించారు. ఆ విధంగా ఏకస్థులైన జంట చాలాకాలం సుఖంగా జీవించారు.

ooo

ఒకసారి మున్నా అను బాలుడు తీవ్రమైన జబ్బుకు గురయ్యాడు. అతడికి వైద్యం చేయటానికి నలుగురు డాక్టర్లు ఫరూకాబాద్‌లో అతని ఇంటికి వచ్చారు. అతిఅల్ప ఆదాయం కలిగిన ఆ పిల్లవాని తండ్రి, తన కుమారుని వైద్యం కోసం ఎలా ఖర్చుపెట్టగలుగుతున్నాడు అని అందరికీ ఆశ్చర్యం కలిగింది. అతని వైద్యం నిమిత్తం కొంతమంది ధన సహాయం చేయబూనినప్పుడు, ఆ బాలుడి తండ్రి అందుకు నిరాకరిస్తూ, లాలాజీ సాహెబ్ అందుకోసం తనకు ఏభై రూపాయలు ఆ క్రితం రోజునే సమకూర్చినట్లుగా చెప్పాడు. లాలాజీ అతికష్టంమీద తనకు ఉన్న అవకాశాల నుంచి దానిని సమకూర్చారు.

ooo

లాలాజీ కంఠస్వరం చాలా మధురంగా ఉండేది. 'వారు' తమ గానం అంత మధురంగా ఉండటానికి కారణం అది ఆధ్యాత్మికతకు చెంది ఉండటమే అని తరచుగా చెప్పేవారు. వారు గాయకునిగా ఎంతగా ప్రసిద్ధి చెందారు అంటె, ఒక పేరుమోసిన నాటక సమాజం తమ సంస్థలోకి ఆహ్వానిస్తూ నెలకు రెండు వందల రూపాయలు జీతం ఇవ్వజూపింది. అయితే లాలాజీ అందుకు నిరాకరించారు. అయితే లాలాజీ, ఔత్సాహిక గాయకునిగా ఆధ్యాత్మికతా వ్యాప్తికోసం పాడటానికి సిద్ధంగా ఉండేవారు.

ooo

లాలాజీ ఒక డిప్యూటీ కలక్టర్‌వద్ద పనిచేసేవారు. వారి పాటలు వినడానికి లాలాజీని తమ ఇంటికి ఆహ్వానిస్తూ ఉండేవారు. ఆ డిప్యూటీ కలక్టర్ కూడా ఆధ్యాత్మికతవైపు మొగ్గుజూపుతున్నందువలన లాలాజీ వారి ఇంటికి వెళ్ళారు. ఆ డిప్యూటీ కలక్టర్ రెండవసారి ఆహ్వానించినపుడు ఒక ఉద్దేశ్యపూర్వకంగా లాలాజీ అక్కడికి వెళ్ళారు. మూడవసారి ఆహ్వానించటానికి ఆ డిప్యూటీ కలక్టర్ బంట్రోతు వచ్చినప్పుడు లాలాజీ దానిని తప్పించుకోవటానికని, ఆ బంట్రోతుతో తాను వృత్తిరీత్యా సంగీతకారుడిని కాదని చెప్పి పంపారు. ఆ డిప్యూటీ కలక్టర్ ఆధ్యాత్మికతపట్ల ఆసక్తిపరునిగా తోచినందుకు లాలాజీ అంతకుపూర్వం రెండుసార్లు వారి ఇంటికి వెళ్ళారు.

ooo

లాలాజీ అనారోగ్యంపాలైన తర్వాత, తన శిష్యులందరినీ కలుసుకోవటానికి ప్రయత్నించి, మొదటి ట్రిప్పులో సికిందరాబాద్ నుంచి ప్రారంభించి, బులంద్ సహార్ మరియు ఎటాహ వరకు వెళ్ళారు. రెండవ ప్రయాణంలో కాన్పూర్ కూడా వెళ్ళారు. లాలాజీ బులంద్ సహార్‌ను విడిచివెళ్ళేటప్పుడు ప్రతి ఒక్కరినీ కౌగలించుకున్నారు. మామూలుగా ఆ ఆనవాయితీ 'వారి'కి లేదు. ఆ తర్వాత లాలాజీ నవాడియాలోనే జీవించటానికి నిర్ణయించుకున్నారు. ఆ నవాడియానే బహుశా వారు తమ జీవితంలో విశ్రాంతికి ఆఖరి మజిలీగా నిర్ణయించుకుని ఉంటారు. ఇప్పుడు లాలాజీ సమాధి ఉన్న నవాడియానే ఆ నవాడియా గ్రామం.

ooo

ఒకసారి హుజూర్ మహరాజ్ మరియు లాలాజీ కలిసి కెయిమ్‌గంజ్ నుంచి రాయపూర్ వెళ్తున్నారు. మార్గమధ్యంలో ఒక గ్రామంవద్ద కొంతమంది నిలబడి ఉన్నారు. హుజూర్ మహరాజ్ వారిని తప్పించుకుని వెళ్ళాలనుకున్నారు కాని, వారికి బాగా తెలిసినవారిలో కొందరు వారిని సహాయపడవలసిందిగా వేడుకున్నారు. ఒక పిన్నవయస్కురాలైన స్త్రీ నగ్నంగా, అక్కడ నిలబడి –"నేను ఒక దయ్యాన్ని. నేను ఈమెను ప్రేమిస్తున్నాను

కనుక నాతో తీసుకుపోతాను" అని చెబుతోంది. కొంతమంది అయితే ఆమెకు మందులు ఇవ్వాలని, మరికొందరు మంత్ర తంత్రాల ద్వారా పరిష్కారం కనుగొనాలని ప్రయత్నించారు కాని ఫలితం లేకపోయింది. వారు హుజూర్ మహరాజ్‌ను చూడగానే, అందరూ ప్రక్కకు తొలగి, ఆ యువతిని ఆ సమస్య నుండి విముక్తురాలయ్యేటట్లుగా చేయమని హుజూర్ మహరాజ్‌ను దీనంగా వేడుకున్నారు. ఆ యువతి కూడా అందుకు అవకాశం ఉంటుందేమో చూడమని ప్రార్థించింది. హుజూర్ మహరాజ్ సామాన్యంగా ఇటువంటి విషయాల్లో జోక్యం కల్పించుకునే స్వభావం లేనందువలన తన నిరసన తెలిపారు కాని, జన సమూహం కోరికమేరకు, ఒక చీటి మీద ఏదో వ్రాసి దానిని నిప్పుమీద వేశారు. ఆ పేపరు మండటం మొదలుకాగానే, ఆ యువతి బిగ్గరగా అరుస్తూ –"నన్ను కాల్చవద్దు. నేను ఇకమీదట ఇక్కడ కనిపించను" అని అర్థించింది. ఆ భూతం తనపై దయజూపమని మరీ మరీ వేడుకుంటూ, తానింక నిలువనని వాగ్దానాలు చేసింది. హుజూర్ మహరాజ్ అప్పుడు ఆ కాగితాన్ని ఆర్పివేశారు. అప్పటితో ఆ యువతికి సమస్య తొలగి నయమైపోయింది. అటువంటి స్థితి మళ్ళీ దాపురించలేదు.

ooo

ఒక తహసీల్దారు ట్రాన్స్‌ఫర్‌మీద కెయిమ్‌గంజ్ జిల్లాకు వచ్చారని, అతడు తనమీద ఎందుకో ద్వేషభావం కల్పించుకున్నాడని లాలాజీ సాహెబ్ చెప్పారు. లాలాజీ సాహెబ్ విషయం వివరించటానికి ప్రయత్నించారు కాని అది ఫలించలేదు. అప్పుడు లాలాజీ సాహెబ్ ఈ విషయాన్ని హుజూర్ మహరాజ్‌తో సంప్రదించగా, వారు లాలాజీని ఓదార్చి ఈ విధంగా చేయమని చెప్పారు: "నీకు ఎప్పుడైతే ఆ ఆఫీసర్ ఎదుట కూర్చునే అవకాశం కలుగుతుందో, అప్పుడు నీ శ్వాసను కూడా వారి శ్వాసకు అనుగుణంగా మార్చి, అతడు శ్వాసించే గాలి నీ ప్రేమతో నిండి ఉందని, అతడు విడిచే గాలి / శ్వాసలో నీపట్లగల నిరసన వెడలిపోతున్నట్లుగాను భావించుకో. ఒకవేళ అతని ఎదుట నీవు కూర్చుండే అవకాశం చిక్కకపోయినట్లయితే, అతడు నీ ఎదుటనే కూర్చుని ఉన్నట్లుగా ఊహించుకుని ఈ విధానాన్ని ఆచరించు. దైవేచ్ఛతో నీకు ఫలితం దక్కుతుంది" అన్నారు. లాలాజీ ఈ విధానాన్ని కొన్ని రోజులు ఆచరించారు. కొంతకాలం తర్వాత లాలాజీపట్ల ఆ తహసీల్దారు యొక్క ద్వేషం, నిరసన కూడా అభినందన మరియు అభిమానంగా మారిపోయాయి.

ooo

లాలాజీ సాహెబ్ క్రమం తప్పకుండా హుజూర్ మహరాజ్‌ను కలుస్తూ ఉండేవారు. ఈ సమావేశంకోసం వారు కెయిమ్‌గంజ్ నుండి రాయ్‌పూర్‌కు, షుమారు నాలుగు మైళ్ళ దూరం నడిచేవారు. ఆ విధంగా వెళ్ళి రాత్రి 10 గంటలకు తిరిగి వచ్చేవారు. ఇది వారి నిత్య ప్రణాళిక. ఒకరోజు సాయంత్రం మబ్బులు క్రమ్మి అంధకారం ఆవరించి వర్షం పడటానికి సిద్ధంగా ఉంది. లాలాజీ సాహెబ్ తన చిన్న సోదరుడు మహాత్మా శ్రీ రఘువర్ దయాళ్‌గారితో కలిసి నడుస్తూ ఉండగా దారిలో కుండపోత వర్షం కురవ నారంభమైంది. ముందుకు నడవటానికి కూడా అసాధ్యమైపోయింది. తప్పనిసరి స్థితిలో వారు ఒక చెట్టును ఆశ్రయించాల్సి వచ్చింది. ఆ నీటి ధార నుంచి వారిని కాపాడటానికి దానికి కనీసం ఆకులు కూడా లేవు. అప్పుడు లాలాజీ సాహెబ్ తమ సోదరునితో – "నన్హె (వారు తమ్ముడిని ఇలాగే పిలిచేవారు), కళ్ళు మూసుకొని ధ్యానం చెయ్యి, ఆ సమయంలో వర్షం కురవటంలేదు అని భావించుకో" అని అన్నారు. ఇద్దరూ కూడా అదే భావంతో ఆ చెట్టు క్రింద కూర్చుని

కొంతసేపటికే లోతుగా ధ్యానంలోకి వెళ్ళిపోయారు. కొంతసేపటి తర్వాత వారిద్దరూ కళ్ళు తెరిచేసరికి, వారు కూర్చున్న చోటుకు చుట్టూరా నీరు నిండి ఉంది కాని, వారిద్దరూ కూర్చున్న చోటు మాత్రం, అక్కడ అసలు వర్షం ఏమీ కురవలేదా అన్నట్లుగా పూర్తిగా పొడిగా ఉంది. వారు రాయపూర్ చేరుకాగానే, హుజూర్ మహరాజ్ వేసిన మొదటి ప్రశ్న ఏమిటంటే– "మీరు తడిసిపోలేదు కదా?" అని. లాలాజీ మహరాజ్ హుజూర్ మహరాజ్‌కు జరిగినది అంతా వివరించగా వారు, **"ఆ దైవానుగ్రహం పొందే అదృష్టం ఎవరికి ఉంటుందో, ప్రకృతి యొక్క శక్తులన్నీ కూడా అతనికి అనుకూలిస్తాయి"** అని అన్నారు. ఇంకా వారు ఏమన్నారు అంటే, **"ఈ ఉరుములతో కూడిన వర్షం కూడా మీరు నన్ను కలుసుకోకుండా ఆపలేకపోయింది. మీ విశ్వాసం, ప్రేమ చాలా గాఢమైనవి.** మీతో నాకు చాలా సంతోషం కలిగింది. ఆ పరమేశ్వరుడు సదా మీపట్ల దయాదాక్షిణ్యాలు నిలుపుగాక!" అని అన్నారు.

ooo

అదే విధంగా, ఒకసారి లాలాజీ సాహెబ్ రాయపూర్ వెళ్ళుతూ ఉండగా, నిశ్చలంగా మేస్తూ ఉన్న గోవుల గుంపు ఒకటి, వారిని క్షణమాత్రంలో చుట్టూరా ముట్టడించాయి. వారిని రక్షించటానికి అక్కడ ఎవ్వరూ లేకపోయారు. వారి చేతిలో ఒక గొడుగు మాత్రం ఉంది. మృత్యువు తప్పదనిపించింది. తన మృత్యువు దగ్గరపడుతోందని అనుకుని, లాలాజీ సాహెబ్ కళ్ళు మూసుకొని హుజూర్ మహరాజ్‌ను స్మరించుకో నారంభించారు. వారి చేతిలో ఉన్న గొడుగు ఒక్కసారిగా తెరుచుకుంది. ఆయన కళ్ళు తెరచి చూసేసరికి, గొడుగు మాత్రం ఆయన చేతిలో ఉండగా ఆవులన్నీ పారిపోతున్నాయి. 'వారు' అప్పుడు దైవానికి ధన్యవాదాలర్పించుకుని రాయపూర్ చేరుకున్నాక జరిగిన సంఘటన గురించి హుజూర్ మహరాజ్‌కు చెప్పారు. అది ఆ సర్వేశ్వరుని కృపయే కనుక వానికే ధన్యవాదాలర్పించాలి అని హుజూర్ మహరాజ్ చెప్పారు.

ooo

లాలాజీతో ఉండే అభ్యాసీ ఒకరు ఈ విధంగా జ్ఞాపకం చేసుకున్నారు: ఆశ్చర్యకరమైన విషయాలు ప్రతిరోజూ జరుగుతూనే ఉంటాయి. కాని ప్రతి ఒక్కరూ అవి అనివార్యం అనుకుంటారు. ఒకసారి లాలాజీ కుమార్తెలలో ఒకరి వివాహం జరగవలసి ఉండగా మేమందరం వేర్వేరు ఏర్పాట్లలో తలమునకలై ఉన్నాం. మాకు అప్పుడు తయారు చేయబడిన ఆహార పదార్థాలు సరిపోవు అని అనిపించింది. అది గ్రహించిన లాలాజీ ఒక్కసారిగా, మమ్మల్ని ఆ ఆహారాన్ని గుడ్డతో కప్పి ఉంచాలని ఆదేశించి, భగవంతుని స్మరించి ఆహ్వానితులకు, పెండ్లివారికి వడ్డించవలసిందిగా చెప్పారు. దాని ఫలితంగా, పెండ్లివారు మరియు ఆహ్వానితులు అందరు కూడా సంతృప్తిగా భుజించగా ఇంకా ఆహార పదార్థాలు సరిపడా మిగిలి ఉన్నాయి.

ooo

ఒకసారి లాలాజీ సాహెబ్, హుజూర్ మహరాజ్‌ను అర్థించారు– "నేను మీ వాడిని. మీరు నన్ను అనుమతిస్తే, నేను ఇస్లామ్‌ను స్వీకరిస్తాను" అని. హుజూర్ మహరాజ్, లాలాజీ యొక్క ఈ తలంపును నిర్మొహమాటంగా త్రోసిపుచ్చుతూ, "నీవు ఇటువంటి అసంబద్ధమైన ఆలోచనలు ఎప్పుడూ కల్పించుకోవద్దు. ఆధ్యాత్మికతకు ప్రత్యేకించి ఏ ఒక్క మతాన్ని అవలంబించవలసిన అవసరం లేదు. ఆచార వ్యవహారాలన్నీ మతం

యొక్క బాహ్యాచరణలే, అవి ఒక్కొక్క ప్రదేశానికి, సామాజిక పరిస్థితులనుబట్టి ఉంటాయి. ఆధ్యాత్మికత అనేది సత్యాన్వేషణ మరియు ఆత్మ సాక్షాత్కారం కొరకు ఆత్మకు చెందిన విషయంగా ఉంటుంది. ఇది మతాలకు అతీతంగా అందరికీ ఒకే రకంగా ఉంటుంది. కనుక తను జన్మించిన దేశం మరియు మతానికి చెందిన ఆచార వ్యవహారాలను ప్రతి ఒక్కరూ పాటించటం విధిగా ఉంటుంది. నీవు హిందువుడుగా జన్మించావు కనుక నీవు హిందూ ధర్మాన్ని అనుసరించు; నేను ముస్లిమ్‌ను కనుక ఇస్లామ్‌ను అనుసరిస్తాను. కనుక ఇటువంటి అధమమైన ఆలోచనల నుంచి నీవు ఉన్నతంగా ఎదగాలి" అని సలహా నిచ్చారు.

"ఆధ్మాత్మికత అనేది విశాల హృదయం కలిగి ఉండటాన్ని బోధిస్తుందేకాని సంకుచిత హృదయాన్ని కాదు. **నీవు ముస్లింగా మారినట్లయితే, నీవు ఆధ్యాత్మికతను కోల్పోయినట్లుగా భావించుకోవాలి"** అని చెప్పారు. హుజూర్ మహరాజ్ యొక్క నిష్పక్షపాతకతకు ఇదొక ఉదాహరణ. ఒకసారి లాలాజీ సాహెబ్ ఈ పద్యాన్ని ఆలాపించారు:

**"నదేఖ్ ఇస్ ఖిర్కా-పోషిమే, ఇరాదత్ హెూ తొ ధుంద్ ఉన్‌కొ,**

**యాదే-బైజాన్ లియే బైఠేహై చుప్‌కె అస్తీనోం మె"**

(దీని అర్థం: ఎవ్వరు కూడా ఆ సర్వేశ్వరుని ఎవ్వరి యొక్క బాహ్య స్వరూపంలోను అన్వేషించకూడదు. కావాలనుకుంటే వేరుగా అన్వేషించు. ఎవ్వరైతే గ్రుడ్డు ఆకారంలోని అగ్ని రూపాన్ని తమ గుప్పిట్లో ఉంచుకొని ప్రశాంతంగా ఉంటారో, తన స్మరణలోనే మునిగి ఉన్న అటువంటి ఋషీవలులలోనే 'అతడు' దర్శనమవుతాడు.)

ooo

**భక్తుడు తన స్వంత సంకల్పాన్ని విడనాడి, మాస్టర్‌లో పూర్తిగా అనుసంధానమైపోనంతవరకు (ఏకాభిప్రాయం కలిగి ఉండనంత వరకు) అతనికి దివ్య జ్ఞానం కలిగే అవకాశం ఉండదు,** అని ఒకసారి లాలాజీ సాహెబ్ చెప్పారు. ఈ సందర్భానికి తగ్గట్టుగా, వారు, జనక మహారాజు మరియు మహర్షి అష్టావక్రుల గాథను వివరించారు:

జనక మహారాజు తన కాలంలో, భౌతిక వాంఛలు త్యజించి ఉన్నతికి ఎదిగిన జ్ఞానిగా పేరుగాంచారు. అయినప్పటికి ఇంకా తనలో ఏవో కోర్కెలు మిగిలి ఉన్నట్లుగానే భావిస్తూ, అందుకు తగిన మహనీయుని సాంగత్యంలో వాటిని తొలగించుకోవచ్చునని భావించేవారు. అటువంటి గురుతుల్యుణ్ని అన్వేషించే ఆలోచనలో ఒక ప్రకటన చేశారు. ఆ ప్రకటన ఎటువంటిదంటే, తాను గుర్రం ఎక్కేంత వ్యవధిలో ఎవ్వరైతే తనను సాక్షాత్కార స్థితికి చేర్చుతారో వారు తనకు (మాస్టర్) గురువు అనీ, ఒకవేళ అతడు ఆ పనిలో విఫలమైతే మరణమే అతనికి బహుమానమని, అందుకు కాలవ్యవధి సూర్యాస్తమయంలోపుగా జరగాలని, అందుకు ప్రతి జ్ఞాని ప్రయత్నించాల్సి ఉంటుందని ప్రకటించారు. అందుకుగాను ఒకరోజు నిర్ధారణచేసి, జనక మహారాజు బాగా అలంకరించబడిన అశ్వంతో దానిని అధిరోహించటానికి సిద్ధంగా ఉన్నారు. ఈ దృశ్యాన్ని చూడటానికి చుట్టుప్రక్కల నుంచి చాలామంది జ్ఞానులు సమావేశమై ఉన్నారు. అందుకు ఎవ్వరూ సాహించలేకపోయారు. జనక మహారాజు నిర్ణయించిన సమయం దాటిపోవటానికి దగ్గరపడుతోంది. జనక మహారాజు చేసిన ప్రతిజ్ఞను సాధించటం దుర్లభం కనుక, అక్కడ ఉన్న జ్ఞానులు తమకు మరణం తప్పదని భయపడ్తూ, ఏం జరగనున్నదోనని అందరూ ఉత్కంఠతో ఉన్నారు. ఎవ్వరూ ఆ పనికి ముందుకు రాకపోయేసరికి, సంధ్యా సమయానికి కొద్దిగా ముందు, అష్టావక్ర

మహర్షి తల్లి, తన తనయుడ్ని జనక మహారాజు వద్దకు వెళ్ళి, అతని కోర్కెను సఫలంచేసి, అక్కడ ఉన్న వారందరినీ, ఆ విపత్కర స్థితి నుంచి కాపాడవలసిందిగా ఆదేశించింది. అష్టావక్ర మహర్షికి అప్పటికి తొమ్మిది లేక పదేళ్ళ వయస్సు. అతని శరీరం ఎనిమిది వంపులు తీరి ఉంది కనుక అతనికి ఆ పేరు వచ్చింది. ఆధ్యాత్మికంగా అర్థం చేసుకున్నట్లయితే, అతడు జన్మతః శక్తి యొక్క ఎనిమిది మహత్తర కేంద్రాలపై ఆధిపత్యం కలిగి ఉన్నాడు కనుక పుట్టుకతోనే అతడు ఒక మహర్షిగా నిరూపించుకున్నాడు.

తన తల్లి అభీష్టంమేరకు అష్టావక్ర మహర్షి సిద్ధమై జనక మహారాజు ఆస్థానానికి వెళ్ళాడు. అతని వర్చస్సు జనక మహారాజుతో సహా అందరినీ ముగ్ధపరిచింది. అతడు జనక మహారాజును తన అశ్వం అధిరోహించమని చెప్పాడు. జనక మహారాజుకు అతనిపట్ల మంచి అభిప్రాయం ఉన్నప్పటికీ, తన ప్రతిజ్ఞ ఏమిటో అతనికి సవినయంగా వివరిస్తూనే, ఒక చిన్న బిడ్డనుగానీ, స్త్రీనిగాని, ముదుసలినిగాని, ఒక వికలాంగుడినిగాని బలిచేయటం తనకు ఇష్టంలేని పని అని చెప్పసాగాడు. అష్టావక్ర మహర్షి దాని నాలకించి, జనక మహారాజును ఈ విధంగా హెచ్చరించాడు: "ఓ జనకా, నీవు నీ స్థితి నుండి ఖచ్చితంగా పతనమవుతున్నావు. నీవు నీ ప్రతిజ్ఞను నెరవేర్చుకునే ప్రయత్నం చేయకుండా, నీ పిరికితనంతోను, నీ అశక్తతతోను అందరి సమయాన్ని వృధా చేస్తున్నావు. జనక మహారాజు పెద్ద జ్ఞాని అని నేను విన్నాను కాని, ఈ రోజు చాలామంది విజ్ఞులు కొలువుతీరి ఉన్న ఈ సభలో నీవు నీ ప్రతిజ్ఞ నుంచి విరమించుకుంటున్నావు" – అని, "ఈలోగా ప్రొద్దుకుంకినట్లయితే నీవు నీ ప్రతిజ్ఞను నేరవేర్చుకునే అవకాశం ఉండదు" అని సవాలు చేసాడు. జనక మహారాజు ఆ బాలుడు, అష్టావక్ర మహర్షి మాటలు విని ఆశ్చర్యం చెంది నిర్ఘాంత పోయాడు. అతడు తన అశ్వాన్ని అధిరోహించటానికి ఉద్యుక్తుడై, జీనుకు ఏర్పాటుచేసిన పాదం మోపుచేసే రింగుమీద పాదం మోపబోయే ముందు అష్టావక్ర మహర్షి మరొక్కసారి ఇలా హెచ్చరించాడు: "ఓ జనక మహారాజా! నీవు చాలామంది ఋషుల ప్రాణాలు హరించేటటు వంటి భీషణ ప్రతిజ్ఞ చేశావు కాని, గురుదక్షిణ గురించిన (ప్రతిఫలం) ప్రస్తావన చేయలేదు. కనుక ముందుగా నీవు నీ ప్రతిజ్ఞకు సరితూగు నటువంటిది, ఋషులు (మాస్టర్స్) ఆశించదగినటువంటిది అయిన గురుదక్షిణ (ప్రతిఫలం)ను వెల్లడి చేయి" అన్నాడు.

జనక మహారాజు అందుకు ఆశ్చర్యచకితుడై– "గురుదక్షిణగా నీవు ఏమి ఆశిస్తున్నావో దయచేసి నాకు చెప్పు. దానిని నెరవేర్చటానికి నేను ఇక్కడ సిద్ధంగా ఉన్నాను" అని అన్నాడు. దానికి సమాధానంగా అష్టావక్రుడు–"దేనినైతే నీవు కావాలనుకున్నావో అది నీ స్వంతమే. దానిని నీవు గురుదక్షిణగా వాగ్దానం చేయాలి. అంతకుమించి నేనేమీ కోరను" అన్నాడు.

జనక మహారాజు అందుకు అంగీకరించి, తక్షణమే తన సామ్రాజ్యాన్ని, సంపదను ఆఖరికి తన కుటుంబ సభ్యులను కూడా అష్టావక్ర మహర్షికి పాదాక్రాంతం చేశాడు. అప్పుడు ఆ మహర్షి ఆ పనికి నవ్వుతూ చెప్పాడు: "ఓ జనక మహారాజా! నీవు బహుశా నాతో పరిహాసమాడతున్నావని అనుకుంటాను. నీవు చెప్పినవన్నీ నిజంగా నీవేనంటావా? సామ్రాజ్యం, సంపత్తి, ఏవైతే నీవి అనుకుంటున్నావో అవి నీకు పూర్వం ఇంకెవ్వరికో చెందినవి; నీ తర్వాత మరొకరికి సంప్రాప్తమవుతాయని భావించలేవా! నీ కుటుంబ సభ్యులు, ఎవరైతే నీకు సంబంధించినవారుగా భావిస్తున్నావో, వారు ఇతరులకు చెందినవారు కాదా! ఇతరుల హక్కులను కాలరాసి

నీ అహంకారానికి వారిని బలిచేయటం న్యాయమా? ఈ విధంగా నీ గురువును నీవు వంచించాలని అనుకుంటున్నావా?" అని.

అష్టావక్రుని ఆ మాటలతో జనక మహారాజు నివ్వెరపోయాడు. అతడు అష్టావక్ర మహర్షి పాదాల వంక చూస్తూ, దేని గురించో దీర్ఘంగా ఆలోచిస్తూ ఉన్నాడు. మహారాజు జనకుడి పరిస్థితిని గమనిస్తూ ఉన్న అష్టావక్ర మహర్షి అతనిపట్ల జాలిపడి, "ఈ అల్పవిషయానికి నీవింత అసహాయునిగా ఎందుకు బాధపడుతున్నావు? దిగులు చెంద వద్దు. ఇవి అన్నీ నీకు చెందినవే అని నీవు ఎలా, ఎందుకు భావిస్తున్నావో నాకు చెప్పు" అన్నాడు. మాస్టర్ దయతో, జనకుడు తన అంతరంగంలో ఏదో జ్వలిస్తున్నట్లుగా అనుభూతి చెందాడు. అప్పుడు అతడు– "నీ విధేయుడైన ఈ సేవకుని మనస్సు, అంతా తనదే అనుకుంటున్నట్లుగా ఉంది. ఆచార్యా, ఈ మనస్సే కనుక నీ విధేయుడైన సేవకునిది అయి ఉన్నట్లయితే, అది నీ పవిత్ర పాదాలమీద అర్పించబడుతోంది" అన్నాడు. మహర్షి అష్టావక్రుడు ఈ విధంగా చెప్పాడు: "ఈ మనస్సు కూడా పూర్తిగా నీది కాకపోయినప్పటికీ, నేను దానిని అంగీకరిస్తున్నాను. ఇప్పుడు నాదిగా అయిన ఈ మనస్సుతో నీవు ఏమీ చేయటంగాని, నా ఆజ్ఞ లేకుండా దానికి విరుద్ధంగా పనిచేయటంకాని జరగకూడదని నా ఆజ్ఞ" అన్నాడు. మహారాజు జనకుడు చాలా గొప్పవాడుగానే ప్రసిద్ధుడై ఉన్నప్పటికీ, ఆధ్యాత్మికతలో ఎంతో ఎదిగి ఉన్నప్పటికీ, అతని మనస్సు సంకల్ప వికల్పాలతో ఇంకా పూర్తిగా విముక్తం కాలేదు. అతని మనస్సును శూన్యం గావించటానికి కొంత సమయం పట్టింది. ఈ సమయంలోనే అష్టావక్రుడు అతని మనస్సును గమనిస్తూ ఉండి, జనకుడితో అతని వాగ్దాన భంగమైనట్లేనా అని హెచ్చరించాడు. జనక మహారాజు పరిపూర్ణతను పొందగానే, అతడు తనకుతాను, తన ప్రతిజ్ఞ అన్నింటినీ మరచిపోయినవాడై ఆశ్వారూఢుడు కావటానికి సంసిద్ధుడయ్యాడు. జనక మహారాజు పడిపోతూ ఉండగా అష్టావక్రుడు ఆదుకున్నాడు. ఒక్క క్షణంలో జనకుని హృదయం దివ్యకాంతితో నిండిపోయింది. అతడి ప్రతిజ్ఞ నెరవేరింది. అప్పుడు ఆ మహర్షి ఆ జనకునికి ఏమి తెలుసుకొనగోరుతున్నాడో అడగమని చెప్పాడు. అప్పుడు జనక మహారాజు తన శిరస్సును ఆ మహర్షి పాదపద్మాలవద్ద వాల్చి, "ఓ నా దైవమా! నేను ఈ అసాధ్యమైన ప్రతిజ్ఞను ఈ జ్ఞానోదయం పొందటానికే శిరసావహించాను. ఇప్పుడింక తెలుసుకొనవలసింది ఏమీ లేదు" అన్నాడు. అష్టావక్ర మహర్షి అప్పుడు జనక మహారాజుతో, **దైవానికి భక్తుడు పూర్తిగా తన మనస్సును శరణాగతిగా అర్పించినప్పుడే, అంతేగాక తన స్వంత సంకల్పాలను త్యజించినప్పుడే అతనికి దివ్యజ్ఞానం పొందటానికి సాధ్యపడుతుంది** అని చెప్పాడు.

ooo

ఇది 1929వ సంవత్సరంలో జరిగిన సంఘటన. ఫతేఘర్ జిల్లా కలక్టర్ ఆఫీస్‌లో లాలాజీ సాహెబ్ రికార్డు కీపర్‌గా పనిచేస్తున్న రోజులవి. ఒక ముఖ్యమైన ఫైల్ కోసం ఎంతగానో వెదికినప్పటికీ అది కనిపించకుండా పోయింది. రికార్డు కీపర్‌గా ఉన్నందున, దానిని వెదకవలసిన బాధ్యత లాలాజీ సాహెబ్‌దే. ఇంటికి వెళ్ళాక సాయంత్రం దానిని గురించి ఆలోచిస్తూ ఉండగా ఒక భయభ్రాంతుడైన గుమాస్తా ముఖం వారికి కనిపించింది. లాలాజీ సాహెబ్ ఆ విషయం గ్రహించి అతని ఇంటికి వెళ్ళి ఫైల్ ఇమ్మని అడిగారు. వాస్తవానికి ఆ గుమాస్తా ఏదో పనిమీద ఆ ఫైల్ ఇంటికి తీసుకువెళ్ళాడుగాని దానిని తిరిగి యథాస్థానంలో ఉంచటం మరచిపోయాడు. ఇప్పుడు అతడు కలక్టర్ తనను క్షమించబోడని భయపడుతున్నాడు. లాలాజీ సాహెబ్ అతని పేరు ఇతరులెవ్వరికీ

చెప్పనని వాగ్దానం చేశారు. అప్పుడు ఆ గుమాస్తా లాలాజీ సాహెబ్‌కు ఆ ఫైలును తిరిగి ఇవ్వగా వారు దానిని కలక్టర్‌కు సమర్పించారు కాని, కలక్టర్ ఎంతగా నిలదీసి అడిగినప్పటికీ లాలాజీ అతని పేరు చెప్పలేదు.

ooo

ఆ రోజుల్లో కొంతమంది సత్సంగీయులు లాలాజీని సందర్శిస్తూ ఉండేవారు. లాలాజీ ఆ ధ్యాసలో ఉండిపోయి కలక్టరేట్‌కు వెళ్ళటం మరచిపోయారు. అదేరోజు కమీషనర్ కలక్టర్ కార్యాలయాన్ని పరిశీలించాల్సి ఉంది. ఆ మధ్యాహ్నం లాలాజీకి ఆ విషయం జ్ఞాపకం రాగానే, దాదాపుగా పరుగులు తీస్తూ ఆఫీస్‌కు చేరుకున్నారు. అప్పుడు తోటి ఉద్యోగుల్లో ఒకరిని ఇన్స్‌పెక్షన్ అయిపోయిందా అని అడిగారు. అతడు ఆశ్చర్యంగా, “నాతో పరిహాసమాడుతున్నావా? నీ అంతట నీవే అడిగిన వెంటనే అన్ని ఫైల్సునూ చూపించావు కదా!” అన్నాడు. దైవం తన స్థానంలో ఉండి తన కర్తవ్యం నిర్వర్తించాడన్న పరిస్థితి లాలాజీకి అర్థమైపోయింది. అప్పుడు లాలాజీకి కన్నీటి పర్యంతమైంది. వెంటనే ‘వారు’ తన రాజీనామా పత్రాన్ని కలక్టర్‌కు సమర్పించి, ఉద్యోగం వదలి తన దైవం యొక్క మిషన్‌కు సేవ చేయటానికి అంకితమైపోయారు.

ooo

బాబూజీ మహరాజ్ చెప్పారు : ఒకసారి లాలాజీ కుటుంబ సభ్యుల్లో ఒకరు జబ్బుపడ్డారు. లాలాజీ తనకు ఉన్న ఆధ్యాత్మిక శక్తితో దానిని వెంటనే నయం చేయగలరు కాని, అది వారికి ఇష్టం లేదు. డాక్టర్‌కోసం బయలుదేరారు. వారిని చేరుకోవాలంటే కనీసం పది లేక పదిహేను కిలో మీటర్ల దూరం ఉంది. అప్పట్లో వారికి ఒక ఎడ్లబండి మాత్రమే ఉంది. కొన్ని సెకండ్ల కాలంలోనే వారు డాక్టర్ యొక్క ఇంటి తలుపుతట్టారు. ఆ డాక్టర్‌కు లాలాజీగారు పరిచయస్తులే కనుక వెంటనే తన సరంజామా తీసుకుని, ఎలా వెళ్ళాలి అని ప్రశ్నించాడు. అప్పుడు లాలాజీ ఆ డాక్టర్‌గారితో కళ్ళు మూసుకొని తన చేయిపట్టుకొమ్మని చెప్పారు. డాక్టర్ అందుకు అంగీకరించాడు. మరుక్షణంలోనే లాలాజీ ఆ డాక్టర్‌ను కళ్ళు తెరవమని చెప్పగానే వారు లాలాజీ ఇంటిలో రోగి ఎదుట నిలబడి ఉన్నారు. అది చలిరోజుల్లో నడిజాము అయినప్పటికీ డాక్టర్‌కు ముచ్చెమటలు పోసాయి; వెంటనే రోగిని పరీక్షించి మందులు వ్రాసి ఇచ్చారు. మళ్ళీ వెంటనే లాలాజీ ఆ డాక్టర్‌తో తన చేయి పట్టుకొని కళ్ళు మూసుకోమని చెప్పారు. ఒక సెకన్ తర్వాత లాలాజీ ఆయనకు తన కళ్ళు తెరుచుకొమ్మని చెప్పటం వినిపించింది. ఆ విధంగా కళ్ళు తెరిచేసరికి ఆయన తన ఇంటిలో నిలబడి ఉన్నారు కాని లాలాజీ అక్కడ లేరు. బాబూజీ ఈ సంఘటన వివరించాక ఒక అభ్యాసీ, ఇది ఎలా సాధ్యం? అని ప్రశ్నించాడు. బాబూజీ ఇలా జవాబిచ్చారు: “ఇది చాలా సులభం. ఆ సమయంలో నీవు నీ భౌతిక స్పృహను కోల్పోయినట్లుగా భావించు. అప్పుడు ఇంక మిగిలేవి సూక్ష్మ శరీరం (Astral body) మరియు కారణ శరీరం (Causal body) మాత్రమే. అప్పుడు ఆ శరీరం సెకన్ యొక్క భాగంలోనే ఎక్కడికైనా చేరిపోగలదు.”

ooo

“ఒక గొప్ప రహస్యం వెలువడినట్లయ్యింది. నేను ఆంతరిక మహదానందంలో మునిగి ఉండి జీవన్మరణాలకు అతీతంగా అయిపోయాను. ఒక శ్రావ్యమైన దివ్య నాదం ఆ ప్రాంతమంతటా ప్రతిధ్వనిస్తోంది. నా దివ్య వాంఛ ఫలప్రాప్తి నందినది. ఆ సర్వేశ్వరుడు నాకు తమ దివ్య దర్శనాన్ని, స్పర్శను నిండుగా కల్పించారు. నా హృదయమైతే

గానం చేస్తోంది కాని నేనైతే నిర్జీవంగా అయిపోయాను. నా అణువణువూ ఆ మధువు ధారలో స్నానమాడుతోంది. ఆ దివ్యసుధా ధారలో ప్రతి ఒక్కరూ నృత్యం చేస్తున్నట్లుగాను, దివ్యానంద ధారా ప్రవాహంతో ఉన్మత్తులై ఉన్నట్లుగాను తలపిస్తోంది. దానిని వర్ణించటానికి మాటలు చాలవు" అని లాలాజీ తమ అనుభవాన్ని వివరించారు.

oOo

## బాబూజీ జీవన స్మృతుల నుంచి కొన్ని ఉపాఖ్యానాలు

ఒకసారి బాగా అనైతికమైన వ్యక్తిని మన సత్సంగ్‌కు అనుమతించటం జరిగింది. కొంతమంది అభ్యాసులు అటువంటి వ్యక్తికి ధ్యానం చేయటానికి ఎందుకు ప్రవేశం కల్పించబడింది అని ఆశ్చర్యపడసాగారు. కొంత చర్చ జరిగాక బాబూజీతో సూటిగా ఈ విషయం ప్రస్తావించాలని నిర్ణయించుకున్నారు. అప్పుడు వారు, **"నేను ఇటువంటి అల్పవిషయాలను గురించి ఆలోచించను. నా దృష్టి అటువైపు సారించబడదు"** అని చెప్పారు. 'వారు' ఇటువంటి విషయాలను లక్ష్యపెట్టరు. మనమైతే ఒక సామాన్య మానవుడి స్థాయిలో ఇటువంటి వాటిని గమనించటమే కాకుండా ఇంకా నీచమైన వాటిని కూడా చూస్తాము. ఇక్కడ ఉన్న భేదం ఇదే.

ooo

ఒకసారి బాబూజీ ఒక నగరంలోని అభ్యాసీని చూసేందుకు వెళ్ళారు. బాబూజీకి ఒక అభ్యాసీ ఇంటిలో వసతి ఏర్పాటు చేయబడింది. పగలంతా బాగానే ఉంది కాని, రాత్రి అయ్యేసరికి బాబూజీకి పూర్తిగా విశ్రాంతి లేకపోగా, అపస్మారకంగాను, త్రుళ్ళిపడటంతోనే నిద్రించారు. మరుసటి రోజు ఉదయానికి, బాబూజీ విశ్రాంతిలేక సొమ్మసిల్లి పోయారు.

రెండవ రోజు రాత్రి బాబూజీ అక్కడకి సమీపంలో ఉన్న ఒక హోటల్‌కు తమ బసను మార్చారు. దాని ఫలితంగా రాత్రంతా గాఢంగా నిద్రపోయారు. నిద్ర నుంచి లేచాక, బాబూజీ– "ఇక్కడ చూడండి. వేలాదిమంది వచ్చిపోయేటటువంటి ఈ హోటల్‌లో ఉన్నాము మనం. అయినా కూడా ఇక్కడి వాతావరణం ఆ ఇంటిలో కంటె పవిత్రంగాను, మంచిదిగాను ఉంది. ఒక హోటల్ గదియే పరిశుద్ధంగా ఉన్నప్పుడు, ఒక ఇంటిలోని వాతావరణం స్థూలంగాను, అపరిశుభ్రంగాను ఉండటం సిగ్గుచేటు కదా! ఆ ఇంటిలో నివసిస్తున్న వారిని గురించి ఏమని చెప్పాలి. జనం తమ జీవితాలను, పూర్తిగా కలుషితం, భ్రష్టమైన వాతావరణంలో గడపటానికి, సిద్ధపడటం చాలా సిగ్గుచేటుగా అనిపిస్తుంది. **వాస్తవం చెప్పాలంటే, ఈ ప్రపంచాన్ని మనం వచ్చినప్పుడు ఎలా ఉందో కనీసం ఆ స్థితిలో నిర్వహించాలిగాని దానిని చెడగొట్టి, శిథిలం చేయకుండా ఉండటం మన కనీస బాధ్యత లేదా ధర్మంగా భావించుకోవాలి. నిజానికి ఈ ప్రపంచాన్ని మనం చూసిన దాని కంటె శ్రేష్టంగా నిలపటానికి ప్రయత్నించాల్సి ఉంటుంది. సక్రమమైన జీవనం చాలా ముఖ్యమైనదిగా ఉంటుంది. మన పరిధిలోకి వచ్చే ప్రతిదానిని కూడా అభివృద్ధిపరచే విధంగా మన జీవితాన్ని సరిదిద్దుకోవాలి. మనం స్పర్శించే ప్రతిదీ దివ్యత్వాన్ని ఆపాదించు కునేటట్లుగా ఉండాలి"** అని అన్నారు.

ooo

ఒక సందర్శకునితో బాబూజీ ఒకసారి ఇలా చెప్పారు: "నీవు ఏమై ఉన్నావో దానికి ప్రాముఖ్యత లేదు. నీ తాతగారు ఒక మహారాజు అయి ఉండి, ఇప్పుడు నీవు భిక్షకునిగా ఉంటే ప్రయోజనం ఏముంటుంది? అలా కాకుండా నీ తాతగారు ఒక భిక్షకుడై ఉండి, నీవు ఇప్పుడు మహారాజుగా అయి ఉంటే బాగుండేది. కనుక నీ అంతట నీవు ఎదగటానికి నీవు ఏం చేయగలవో ప్రయత్నించి చూడు. అందుకు నీవు ఇప్పటినుంచే ప్రయత్నించాలి. నేను నీకు సహాయపడటానికి సిద్ధంగా ఉన్నాను."

ooo

ఒకసారి షాజహాన్‌పూర్‌లో మధ్యాహ్న భోజనం సందర్భంగా అభ్యాసులలో ఒకరు, ఆహార లక్షణాలను విమర్శిస్తూ, ముఖ్యంగా ఒకే మాదిరి ఆహారం రోజుల తరబడి అందిస్తున్నట్లుగా పెద్దగా అరవటం ప్రారంభించాడు. భోజన పదార్థాలు వివిధ రకాలైనవి ప్రతిరోజు భోజనంలో ఉంటాయని తాను ఆశించినట్లుగాను, పదార్థాలు ఇంకా రుచికరంగాను, జీర్ణకరమైనవిగాను ఎందుకు తయారు చేయటంలేదో తనకు ఆశ్చర్యంగా ఉందని అన్నాడు. భోజనాంతరం మేమందరం గది నుంచి బయటకు వచ్చి వరండాలోకి ప్రవేశించేసరికి బాబూజీ తన పడక కుర్చీలో మామూలుగానే కూర్చుని ఉన్నారు. ఆ అభ్యాసీ సంధించిన విమర్శలను బహుశా బాబూజీ విని ఉండకపోవచ్చని అనుకున్నాం. ఇంక మేము బాబూజీను సమీపించేసరికి, 'వారు' తమ కుర్చీలో నుంచి లేచి, మమ్మల్ని సమీపించటానికి కొన్ని అడుగులు వేసి, ఆ అసంతృప్తుడైన అభ్యాసీతో – "ఇటు చూడు. **నేను శరీరానికి మామూలు ఆహారం సమకూర్చుతాను కాని ఆత్మకు మాత్రం దివ్య ఆహారాన్ని సమకూరుస్తాను**" అని అన్నారు. అంతటితో 'వారు' వెనక్కు మరలి తమ పడక కుర్చీలో కూర్చుని హుక్కా పీల్చుకుంటున్నారు.

మళ్ళీ కొన్ని నిమిషాల తర్వాత బాబూజీ ఇలా అన్నారు: "ప్రజలు నా నుంచి ఏమి ఆశిస్తున్నారో చూడండి. నేను వారి ఆత్మకు సంపూర్ణ బాధ్యత వహిస్తాను అని చెప్పాను కాని వారి శరీరం గురించి వారే శ్రద్ధ తీసుకోవాలి. నేను మంచి ఆహారం ఇవ్వడానికి ప్రయత్నిస్తాను. **మనల్ని జీవింపజేయటానికి శరీరానికి అవసరమైనంత ఆహారాన్నే మనం భుజించాలి. ఆహారం అనేది రుచికి కాదు, అది జీవపోషణ కొరకే.** ఇందుకుగాను తగినంత మంచి ఆహారాన్ని నేను ఇస్తున్నట్లుగా భావిస్తున్నాను. జనం యొక్క ఆధ్యాత్మిక అవసరాలను తీర్చేందుకు, నేను సేవ చేయటానికి ఇక్కడ ఉన్నాను, కాని నేను వారికి రుచికరమైన విందు భోజనాలను కూడా సమకూర్చటానికి నేను ఇక్కడ ఉన్నాను అనుకుంటే దానికి నేనేమి చేయగలను?"

ooo

దక్షిణ భారతదేశంలోని సెంటర్లు ఒక దానిలో బాబూజీ స్వయంగా ఒక సత్సంగ్ నిర్వహించారు. దాదాపు 40, 50 మంది అభ్యాసులు హాజరుకాగా షుమారు 25 నిమిషాలకు సిట్టింగ్ ముగిసింది. 'వారు' సిట్టింగ్‌లో ట్రాన్స్‌మిషన్ ప్రారంభించిన వెంటనే ఆ సమూహంలో ఒక కోతి ఉన్నట్లుగా అభిప్రాయం కలిగింది. 'వారు' కళ్ళు తెరచి చూసినప్పుడు ఆ స్థానంలో, దీర్ఘకాలంగా అభ్యాసీగా ఉన్న ఒక్కరు అక్కడ కూర్చున్నట్లు గమనించారు. 'వారు' కళ్ళు మూసుకున్న కొన్ని నిమిషాలకే అదే దృశ్యం పునరావృతమైంది అనగా అక్కడ మళ్ళీ కోతి కనిపించింది. కళ్ళు తెరచిచూస్తే మళ్ళీ అభ్యాసీయే ఆ స్థానంలో ఉన్నాడు. అప్పుడు బాబూజీ చెప్పారు: "చూడండి. నేనింక నా నవ్వును అతికష్టం మీద ఆపుకున్నాను. కళ్ళు తెరిస్తే అభ్యాసీ, కళ్ళు మూస్తే కోతి అక్కడ

ఉండటం తటస్థించింది. దానికి కారణం ఏమిటో గ్రహించారా? నేనే చెబుతాను. ఆ సంఘటనను నేను పరిశీలించినప్పుడు, ఆ అభ్యాసీ చాలాకాలం హనుమంతుడిని ఆరాధించినట్లుగా కనిపించింది. అది గత జీవితకాలంలో ఎప్పుడైనా అయి ఉండవచ్చు. ఆ సంస్కారాలు మాత్రం అక్కడ చాలా బలీయంగాను, లోతుగాను ఏర్పడి ఉన్నాయి. నిర్మలీకరణ సమయంలో ఆ సంస్కారాలు మానసం యొక్క ఉపరితలానికి వచ్చి ఉండవచ్చు. అందుచేత అక్కడ కోతి కూర్చున్నట్లుగా నాకు అనుభూతి కలిగింది."

ooo

ఒకసారి బాబూజీ బనారస్ వెళ్ళారు. అప్పుడు తలవని తలంపుగా దారితప్పి ఒక అసభ్యకరమైన వాతావరణం ఉన్న వీధిలోకి ప్రవేశించారు. తమ అంతఃప్రవృత్తి లేదా స్వతస్సిద్ధంగా తాము వెళ్ళరాని ప్రదేశానికి చేరినట్లుగా గుర్తించారు. ఆ సమయంలో లాలాజీ వాణి ఈ విధంగా వినిపించింది: "ఈ ప్రదేశంలో నీవు ఏం చేస్తున్నావు?" అని. బాబూజీ దానికి చింతించకుండానే– "సాహెబ్! నేను పొరపాటున ఇక్కడకు వచ్చాను. నేను ఎక్కడ (ఎటువంటి పరిసరాల్లో) ఉన్నానో నాకు తెలియదు" అని సమాధానమిచ్చారు. వెంటనే లాలాజీ చెప్పారు: "ఎలాగో నీవు ఇక్కడ ఉన్నావు గనుక, నీ రాకవలన ఈ ప్రాంత ప్రజలకు ఎంతోకొంత మేలు చేకూర్చుకునేటట్లుగా చేయి. అక్కడి వాతావరణాన్ని ప్రక్షాళనం గావించు" అని. బాబూజీ నవ్వుతూ, "నేను లాలాజీ ఆజ్ఞను శిరసావహించాను. ఇప్పుడు 'వారి' ఔన్నత్యం ఏమిటో చూడండి. నేను అక్కడకి వెళ్ళినందుకు 'వారు' నన్ను మందలించలేదు. 'వారి' ఆజ్ఞలో నాకు, మానవాళిపట్ల వారికి ఉన్న ప్రేమయే నాకు కనిపించింది. **మనం ఎక్కడికి వెళ్ళినా కూడా ఎప్పుడూ ఆ సత్యత్వం యొక్క ప్రకాశాన్ని అక్కడ వెలుగొందునట్లు చేయాలి. లాలాజీ సాహెబ్ నిత్యమూ, ఇరవై నాలుగు గంటలూ ప్రాణాహుతిని ప్రసారం చేస్తూ ఉండేవారు. ఆఖరికి ప్రయాణించే సమయంలో కూడా 'వారు' ఆ ట్రాన్స్‌మిషన్ చేస్తూనే ఉండేవారు. అటువంటి మాస్టర్ మనకు ఎక్కడ దొరుకుతారు? వాస్తవం చెప్పాలంటే, ప్రకృతికి లాలాజీ ఒక అద్భుతమైన మహామనీషి."**

ooo

లాలాజీకి బాబూజీపట్ల ఉన్న పవిత్ర ప్రేమను గురించిన ఒక సంఘటనను బాబూజీ ఇలా వివరించారు: "చూడు, నేనొక విషయం చెబుతాను. ఒకసారి నా కాళ్ళలో తీవ్రమైన బాధ కలిగింది. నేను పడక మంచం మీద పండుకొని ఉన్నాను. వెంటనే లాలాజీ సాహెబ్ నన్ను పడక మంచం మీద ఎందుకు పండుకొని ఉన్నావు అని అడిగారు. ఆ సమయంలో లాలాజీ సాహెబ్ అప్పటికే తేజోమండలం (బ్రైటర్ వరల్డ్)లో ఉన్నారు. నేను నా కాళ్ళు నొప్పిగా ఉన్నాయని సమాధాన మిచ్చాను. వాటిని మసాజ్ చేయమని సలహా నిచ్చారు కాని నేను అందుకు ప్రతికూలించాను. అప్పుడు లాలాజీ సాహెబ్ మౌనంగా ఉండిపోయారు. అయితే కొన్ని సెకన్ల తర్వాత నేను నా కాళ్ళలో అద్భుతమైన ప్రకంపనాన్ని అనుభూతి చెందాను. ఇప్పుడు చూడండి, నా మాస్టర్ నాకు ఏమి చేస్తున్నారో గదా! 'వారు' స్వయంగా నా కాళ్ళను వత్తుతున్నారు. ఇటువంటి మాస్టర్‌ను మీరు ఎక్కడ పొంద గలరు? నా బాధ వెంటనే తొలగిపోయింది."

ooo

ఈ ఆధ్యాత్మిక జీవితానికి సంబంధించిన ఒక చిన్న సంఘటన గురించి బాబూజీ చెప్పారు. బాబూజీ స్నానానికి సిద్ధపడి, నీటికోసం బావి వద్దకు వెళ్తున్నారు. అలా వెళ్తూ ఉండగా ఒక విపరీతమైన కోరిక, తన మాస్టర్, లాలాజీ సాహెబ్‌లాగా ఉండాలన్నది 'వారి' హృదయంలో కలిగింది. అప్పుడు లాలాజీ సాహెబ్ వాణి ఇలా పలికింది: "ఎప్పుడైతే ఈ ఆలోచన నీలో కలిగిందో, నీవు నాలాగానే అయిపోయావు ఇంక కావలసింది ఏమీ లేదు" –అని.

ooo

అభ్యాసులు సమావేశమై ఉండగా, (Real) స్వచ్ఛమైన గురువు యొక్క లక్షణాలు గురించి చర్చ జరుపుతున్నారు. ఎన్నో సూచనలు ప్రతిపాదించటం జరిగింది, కాని అటువంటి వ్యక్తికోసం దీర్ఘమైన అన్వేషణ చేయాలని నిర్ణయించుకున్నారు.

బాబూజీ దానికి ఒక చిన్న పరీక్షను సూచించారు. గురువుతో సంబంధం కలిగిన మరుక్షణం నుంచే దానిని అన్వయించుకుంటూ పోవాలి. "యోగసాధన యొక్క పర్యవసానం మానసిక వృత్తుల్ని నిరోధించటమే అవుతుంది. ఒక సెయింట్‌ను సమీపించినప్పుడు, సాధకునిలో సత్యత్వం తర్వాత అతని చిత్తవృత్తులు సద్దుమణిగి పోయినట్లయితే, అపుడు అతనికి గురువు లభించినట్లవుతుంది" అని అన్నారు.

ooo

ఒక ఉన్నతస్థాయికి చెందిన అభ్యాసీ, అప్పటికే ఆధ్యాత్మిక పురోగమనంలో ఉన్నత స్థితులను పొందినటువంటివాడు, ఏదైనాగాని తనకు ధ్యానంలో ఆలోచనల మూలంగా అంతరాయం కలుగుతున్నట్లు అనుభవమవుతున్నదని ఫిర్యాదు చేశాడు. అప్పుడు బాబూజీ నవ్వుతూ, "నీవు కొన్ని సంవత్సరాల క్రితమే నాతో, నేనే నీకు సర్వస్వం అని చెప్పియున్నావు" అన్నారు. "నేను ఇప్పటికీ అలాగే ఉన్నాను" అని ఆ నమ్మకమైన అభ్యాసీ చెప్పాడు. "అయినా కూడ, నీలో ఆలోచనలు ఇంకా తలెత్తుతూ నిన్ను బాధిస్తున్నాయా?" అని, అతని వంక సూటిగా చూస్తూ చిరునవ్వుతో అన్నారు బాబూజీ. అప్పుడు ఆ అభ్యాసీ సమాధానం ఇవ్వకుండా ఆలోచనలో పడ్డాడు. అప్పుడు బాబూజీ ఇంకా ఇలా చెప్పారు: **"చాలా తరచుగా, పొందిన ఆనందంతో పురోగతి కొంత తికమకగా (వ్యాకులంగా) ఉంటుంది. అయితే, ఇంకా ఆనందం కలిగించే మరొక దానిని పొందగల సామర్థ్యం కూడా క్రమంగా పురోగమించడానికి సంబంధించినదే."**

ooo

మన కావ్యాలు, పురాణాలు వంటి వాటి నుండి, మహాత్ములు విసిరివేసిన వాటిని సేకరించటం ద్వారా ఏదో ఫలితం పొందినట్లుగా మనం తెలుసుకున్నాం. ఒకసారి ఒక అభ్యాసీ శ్రీ బాబూజీ మహరాజ్ ఉమ్మివేసిన దానిని సేకరించాడు. ఆ తర్వాత అతడు సమావేశ మందిరంలోకి ప్రవేశించిన తర్వాత బాబూజీ అతడ్ని ఉద్దేశించి ఇలా అన్నారు: "నాకు అవుసరం లేనిదానిని నేను ఊసివేశాను. దానిని నీవు సేకరించటం వలన ఉపయోగం ఏమిటి? నీవే కనుక ఏదైనా లాభం చేకూరాలని అనుకున్నట్లయితే నన్ను అనుసరించి ఆధ్యాత్మిక లాభాలను పొందవచ్చు. అలాగే నా పాదధూళిని సేకరించటం వలన కూడ ఉపయోగం ఉండదు." శ్రీ బాబూజీ

మహరాజ్ అభ్యాసులను ఈ విధంగా సరిదిద్ది, గౌరవప్రదమైన జీవన విధానానికి ఉన్నతమైన సిద్ధాంతాలను అనుసరింపజేసేవారు.

ooo

బాబూజీ ఇలా చెప్పారు: "నేను మీకు ఒక ఆనందకరమైన కథ వినిపిస్తాను. ఢిల్లీలో ప్రభుత్వ ఉద్యోగియైన ఒక ఆఫీసర్ ఒకసారి నావద్దకు వచ్చాడు. అతడు నా సహచరులైనవారు ఒకరితో కలిసి వచ్చాడు. అతడు మన సహజమార్గ విధానాన్ని గురించి తెలుసుకోవాలని కోరగా నేను దానిని వివరించాను. అతనితో ఒక అర్థగంట ధ్యానం చేయవలసి ఉంటుందని చెప్పినప్పుడు, అది అతనికి అసాధ్యమని, అంత సమయం వెచ్చించటం కుదరదని చెప్పాడు. అపుడు నేను ఆ సమయాన్ని కొంత కుదింపు చేసుకోవచ్చును కదా అని చెప్పాను. మళ్ళీ అతడు తనకు తీరిక దొరకదన్నాడు. అప్పుడు అతనికి రోజులో ఒక్క నిమిషమైనా అందుకు వినియోగించమన్నాను. ఇప్పుడు చూడండి, అతనికి ఎంత కోపం వచ్చిందో! అప్పుడు అతడు ఇలా చెప్పాడు: 'ఏమిటి ఈ తమాషా! నేను కనీసం ఐదు నిమిషాలు కూడా వినియోగించలేను, మీరేమో ఈ విధంగా చేయమని చెప్పుతున్నారు' అన్నాడు. అప్పుడు లాలాజీ నాకు ఒక ఆలోచన కలిగించారు. 'వారు' మనకు ఎలా సహాయం చేస్తారో చూడండి! అప్పుడు నేను ఆ ఆఫీసర్‌తో– 'నీకంటె పనిలో ఇంకా ఎక్కువగా తలమునకలై ఉండేవారు ఎవరైనా ఉన్నారేమో చెప్పగలవా?' అన్నాను. మళ్ళీ అతడు కోపగించుకుంటూ 'ఏమిటి ఈ తెలివితక్కువ ప్రశ్న? నా కంటె తీరిక దొరకనివారు ఉండవచ్చునుగాక. ప్రధానమంత్రి నాకంటె ఇంకా ఎక్కువ తీరికలేకుండా ఉంటారు' అని అన్నాడు. నేను అతనితో, మరీ అంత పెద్ద ఉదాహరణ కాకుండా, నీ కంటె కొంచెం ఎక్కువగా పనిలో మునిగి తేలుతున్నవారిని గురించి చెప్పమన్నాను. అప్పుడు అతడు తన పొరుగున ఉన్న పెద్ద ఆఫీసర్ తనకంటె ఎక్కువగా పనిలో నిమగ్నమై ఉంటాడు అని చెప్పాడు. అప్పుడు అతనికి నేనేమి జవాబు చెప్పానో చూడండి! (విరగబడి నవ్వుతూనే) నేను అతడిని ఇలా ప్రశ్నించాను: 'అయ్యా! తమ తీరికలేక పోవటానికి, అతని తీరిక లేకపోవటానికి మధ్య ఉన్న భేదం ఏమిటి? ఈ మధ్య ఉన్న భేదం అనగా అంతరం నీకు ధ్యానానికి సమయం కల్పిస్తుంది' అని చెప్పాను. పాపం, అతడు తనను ఆటపట్టిస్తున్నానని అనుకొని కోపంగా వెళ్ళిపోయాడు."

ooo

పని వత్తిడితో ధ్యానానికి సమయం దొరకటం లేదని చెప్పిన మరొక సంఘటనను బాబూజీ ఇలా వివరించారు: "నేను అతనికి ఏమి చెప్పానో తెలుసా? రోజులో 24 గంటలకు మించి ఎక్కువ గంటలు సృష్టించలేకపోయినందుకు భగవంతుడ్ని నిందించాలి. అది దైవం చేసిన తప్పు. 'అతడు' కనుక రోజుకు 26 గంటలు కల్పించి  ఉన్నట్లయితే అటువంటి తీరికదొరకని వారికి ధ్యానానికి సమయం చిక్కేది." బాబూజీ మళ్ళీ ఇలా చెప్పారు: "నేను మీకు చెప్పాను, 'అతడు' (దైవం) 'తను' ఎంపిక చేసుకొన్న వారిని పొందుతాడు, అందుకు నేనేమి చేయగలను? ఏమైనాగాని మన పని మనం చేస్తూ మిగిలిన దానిని దైవానికి వదిలేద్దాం."

ooo

ఒకసారి బాబూజీ మన విదేశీ ప్రిసెప్టర్‌తో సంభాషిస్తూ, "ఇది గమనించండి, నేను ఎవ్వరినీ  మోసగించ లేదు; వారంతట వారే మోసపోతున్నప్పుడు దానికి నేనేమి చేయగలను? నా నిరాడంబరతయే చాలామందిని

మోసపుచ్చుతుంది. కొంతమంది మాత్రమే అలా మోసపోకుండా ఉంటారు. నా నిరాడంబరత్వం ఎంతగా నంటె, నా జీవితమంతా జనం నన్ను నిరాడంబరునిగానే భావించారు.” ఇది చెబుతూ బాబూజీ నవ్వారు, మళ్ళీ వెంటనే, “ఇప్పుడు చూడండి, నన్ను చూడ్డానికి చాలామంది వస్తారు కాని నన్ను నిజంగా చూడగలిగేది ఎందరు? చాలామంది బాహ్యరూపాన్ని మాత్రమే దర్శించుకుంటారు. విచారించదగిన విషయం ఏమిటంటే, ఏదో కొంతమంది మాత్రమే దానిని అతిక్రమించి నాలోని ఆంతరిక సత్యత్వాన్ని చూడ్డానికి చొరబడతారు. చాలామంది నన్ను చూడ్డానికి వచ్చారు కాని నన్ను కొంతమంది మాత్రమే వాస్తవికంగా చూసారు. మిగిలినవారు ఎలా వచ్చారో అలాగే తిరిగి వెళ్ళారు, కనుక నా నిరాడంబరత వాస్తవంగా ఒక మాయ, దానిని ఈ రోజు మీకు బహిర్గతం చేస్తున్నాను.”

ooo

అభ్యాసులపట్ల బాబూజీ యొక్క అవ్యక్తిగత ప్రేమ లేదా సార్వత్రికప్రేమ ఏవో మహిమల ద్వారా ప్రదర్శించబడలేదు, కాని రోజువారీ దినచర్యలోనే ప్రతి చిన్న పనిలోను, ప్రాముఖ్యతలేని వాటిలోను తరచుగా దృష్టికి రానటువంటి వాటిలో ‘వారి’ ప్రేమ దాగి ఉండేది. అనేక సంఘటనలు ద్వారా ఇది నిరూపితమైంది.

**1.** షాజహాన్‌పూర్‌లో ఒక వేసని సాయంకాల సమయంలో, బాబూజీ ఒక కాన్వాస్ పడక కుర్చీలో కూర్చుని ఉండగా, సభ్యులు చుట్టూరా మూగి ఉన్నారు. ప్రొద్దుపోయాక, అందరూ మంచాలమీద నిద్రపోతున్నారు. బాబూజీ అభ్యాసుల ప్రశ్నలకు సమాధానాలు చెప్తూనే అనేక నిగూఢమైన విషయాలను వెల్లడిచేస్తూ ఉండగానే, తటాలున కుర్చీలోంచి లేచి తమ గదిలోకి వెళ్ళి తమ చేతిలో ఒక దుప్పటి తీసుకువచ్చారు. దూరంగా మంచంమీద పందుకొని ఉన్న ఒక అభ్యాసీని సమీపించి, ఆ దుప్పటి కప్పి దాని అంచులను కాళ్ళక్రింద మడిచిపెట్టి, నిశ్శబ్దంగా తన పడక కుర్చీలో కూర్చుని, అర్థంతరంగా ఆగిపోయిన సంభాషణను కొనసాగించారు. అతడు దక్షిణ భారతదేశం నుంచి వచ్చిన ఒక అభ్యాసీ యువకుడు. మరసటి రోజు ఉదయం అతడు నిద్ర నుంచి లేచేసరికి తనపై దుప్పటి కప్పి ఉండటాన్ని గమనించి అతడు ఆశ్చర్యపోయాడు. ఇతరులు దానిని గ్రహించలేకపోయారు.

**2.** ఒక సందర్భంలో బాబూజీ మామూలుగా శీతాకాలంలో తమ ప్రాంగణంలో ఒక మూల ఎండ తగిలే ప్రదేశంలో కూర్చుని ఉన్నారు. ఆ సంవత్సరంలో చలి తీవ్రంగా ఉన్నందువలన, ఎండ పడుతున్నప్పటికీ ఇంకా చలిగానే ఉంది. బాబూజీ తన మామూలు వస్త్ర ధారణలోనే అనగా పంచె, చొక్కా ధరించి దానిపైన చేతులులేని ఉన్ని స్వెట్టర్ వేసుకుని ఉన్నారు. అదే సమయంలో దక్షిణ భారతదేశం నుంచి వచ్చిన ఒక అభ్యాసీ తన చేతి సంచి మరియు హోల్డాల్ (అన్ని సామానులు ఇముడ్చుకొనేది)తో ఆ ప్రదేశానికి వచ్చాడు. అతడు కేవలం కాటన్ ప్యాంటు, టెరిలీన్ షర్ట్ మాత్రమే ధరించి ఉండి, చలికి వణుకుతూ ఉన్నాడు. అతడు బాబూజీ వద్దకు వచ్చి సాంప్రదాయ పద్ధతిలో అభివాదం చేసి కూర్చున్నాడు. బాబూజీ మౌనంగా ఉన్నారు. అప్పుడు ‘వారు’ తమ స్వెట్టర్ తీసి ఇచ్చి అభ్యాసీని ధరించమని చెప్పారు. ఆ అభ్యాసీ దానిని కృతజ్ఞతా పూర్వకంగా స్వీకరించాడు. ఇతరుల అవసరాలను త్వరగా గుర్తించి అందుకు తగిన విధంగా స్పందించటంలో బాబూజీ ప్రదర్శించునటువంటి శ్రద్ధ అసాధారణమైనదిగా ఉండి ‘వారి’ ప్రేమ అనేక రకాలుగా వ్యక్తమవుతూ ఉంటుంది.

**3.** అది వేసవికాలం, షాజహాన్‌పూర్‌లో ఒక సాయంసంధ్యా సమయం. దక్షిణ భారతదేశం నుండి ఒక సీనియర్ ప్రిసెప్టర్ బాబూజీని సందర్శించ టానికి వచ్చాడు. బాబూజీ అతడ్ని భోజనం చేయమని చెప్పగా, అతడు తను రోజుకు ఒక్కపూట మాత్రమే భోజనం చేసే అలవాటు ఉన్నట్లుగా చెప్పి, అందుకు అంగీకరించలేదు. బాబూజీ దానికి బదులుగా ఒక గ్లాసు పాలు త్రాగమని కోరారు. బాబూజీ ఒక యువకుడైన అభ్యాసీని పిలిచి రెండు గ్లాసుల్లో పాలు తీసుకువచ్చి ఒకటి ఈ ప్రిసెప్టర్‌కు మరొకటి అక్కడ ఉన్న పెద్దాయనకు ఇవ్వమని ఆదేశించారు. కొన్ని నిమిషాలలో పాలు అక్కడ సిద్ధమయ్యాక వారిద్దరు వాటిని తీసుకొని, తమలో తాము దీర్ఘంగా చర్చించుకుంటూ అక్కడి నుండి లేచి వెళ్ళారు.

ooo

**ప్రస్తుతం ముక్తికి అవకాశం ఉన్న కాలం ఇది. దాని కొరకు ప్రయత్నించకపోతే అది కొంత కాలం మాత్రమే కాదు బహుశా నిరవధికమైన అనేక జన్మల పర్యంతం ఆలస్యం కావచ్చు.**

బాబూజీ చెప్పారు: “ఇప్పుడు చూడండి. నా వద్దకు వచ్చే వ్యక్తులు సాధారణంగా తొలి స్థానంలోనే ఉన్నవారై ఉంటారు. అనగా వారి యాత్ర ఇంకా ప్రారంభం కాలేదు. ఇది సర్వసాధారణమైన విషయం. ఒకసారి ఒక వ్యక్తి నావద్దకు వచ్చాడు, కాని ఏమని చెప్పను, అతడు అప్పటికే నాల్గవ స్థానంవద్ద ఉన్నాడు. అది అత్యున్నతమైన ప్రాప్తం. అది అతని గతజన్మలోని సాధనా ఫలితం. అతడు గతంలో నావద్దకు ఒకసారి వచ్చి ఉన్నాడు, కాని మళ్ళీ తిరిగిరాలేదు. అతడి సంస్కారాలు అందుకు అడ్డుపడి ఉంటాయి. అతడే కనుక నావద్దకు మళ్ళీ వచ్చి ఉంటే అతనికి తప్పకుండా పురోగతి చేకూరి ఉండేది. కాద్దిపాటి నిర్మలీకరణ అతనికి త్వరితమైన పురోగమనాన్ని కల్పించి ఉండేది. అతడు ఆ విధంగా మళ్ళీ రాకపోవటం జాలిపడాల్సిన విషయం. ఇప్పుడు అతడు మళ్ళీ దారినపడటానికి ఎన్ని జన్మలు అవసరమవుతాయో ఎవ్వరికి తెలుసు? ఆ విధంగా ఉన్నతంగా ఎదిగిన స్థితితో నావద్దకు వచ్చినవారిలో అతడు ఒక్కడు మాత్రమే.

**ఇది ఈ జీవితకాలంలోనే మన లక్ష్యాన్ని మనం చేరవలసిన అవసరాన్ని గుర్తింపజేస్తుంది. మన బాబూజీ మన చెంత ఉన్నారు, అది ఎంత కాలమైనప్పటికీ అది మాత్రం తథ్యం. ‘వారి’ సహాయంతో, మనం మన లక్ష్యం చేరుటకొరకైన ఈ యాత్రను, ఈ జీవితకాలంలోనే పూర్తి చేసుకొనవలసిన కర్తవ్యం మన మీద ఉంది. ఈ కర్తవ్య నిష్ఠయే మనకు అత్యంత ప్రధానం.**

ooo

భగవంతుడ్ని భిక్ష నర్థించటం గురించి బాబూజీ వివరించిన కథాంశం ఇది: “మీకు ఉల్లాసం కలిగించే ఒక కథను నేను వివరిస్తాను. ఒక సన్యాసి, ఒక మొగలాయి ఆస్థానానికి చక్రవర్తి నుంచి ఏవో బహుమతులు ఆశించి వెళ్ళాడు. అతనికి ఆస్థానంలో ప్రవేశించటానికి అనుమతి కల్పించబడింది కాని, చక్రవర్తి ప్రార్థనలో ఉన్నందువలన కొంతసేపు వేచి ఉండాల్సిందిగా చెప్పటం జరిగింది. అందుకు ఆ సన్యాసి, తను కూడా ఒక పవిత్రుడే అయినందువలన, అందుకు చక్రవర్తి అనుమతిస్తే తాను కూడా వారి ప్రక్కనే కూర్చోవాలని కోరిక కలిగి ఉన్నట్లుగా చెప్పాడు. అతడిని లోపలికి ప్రవేశపెట్టి, ప్రార్థనా మందిరం బయట కూర్చొనవలసిందిగా కోరారు. “దైవమా! నాకు నా శత్రురాజులమీద విజయం సాధించిపెట్టు, నాకు అనేక సామ్రాజ్యాలు నా పాలనకు

వశీకరణ చేయి, అప్పుడు ఈ పృథ్వీమీద నీ ఘనత చాటబడుతుంది" అంటూ అనేక రకాలుగా ఆ చక్రవర్తి బిగ్గరగా ప్రార్థించటాన్ని ఆ సన్యాసి విన్నాడు. వెంటనే లేచి బయటకు పోసాగాడు. అది గమనించిన చక్రవర్తి, తన ప్రార్థన ముగింపుకు రాబోతోందని కనుక మరికొంత సమయం వేచి ఉండవలసిందిగా ఆ సన్యాసిని అభ్యర్థించాడు. దానిని పట్టించుకోకుండా ఆ సన్యాసి తన తిరోగమనాన్ని కొనసాగించాడు. ఆ చక్రవర్తి మాత్రం అతడిని మరికొంతసేపు వేచి ఉండమని కోరుతూనే అతను వెళ్ళిపోవటానికి కారణం ఏమిటని ప్రశ్నించాడు. దానికి సమాధానంగా ఆ సన్యాసి, "నేను నీ నుండి ఏదో ధర్మం (భిక్ష) ఆశించి వచ్చాను కాని, నీవే స్వయంగా భిక్ష నర్థించటం చూసాను. కనుక మరొక భిక్షార్థినుంచి నేను భిక్ష నాశించటం వలన ప్రయోజనం ఏమిటి? నీవు ఎవరి నుండి నయితే భిక్ష నర్థిస్తున్నావో నేను 'అతడి'నే భిక్ష అడుగుతాను" అని సమాధానం చెప్పి అతడు నిష్క్రమించాడు. ఈ కథ ముగిస్తూనే బాబూజీ చాలా బిగ్గరగా నవ్వారు. వెంటనే 'వారు' మళ్ళీ విషయానికి వచ్చి, "నేను హాస్యంగా ఏదైనా చెబుతున్నా కూడా దానిలో ఒక అర్థం ఉంటుంది. ఒక చక్రవర్తి కూడా భిక్షార్థి కావటంలోని తమాషా ఎలా ఉందో తెలుసుకోండి."

ooo

బాబూజీ, అభ్యాసుల్లో ఒకరైన వ్యక్తి యొక్క ప్రేమ, భక్తికి చాలా ముగ్ధులయ్యారు. ఆ అభ్యాసీ, మిషన్‌లో అప్పట్లో ఒక సీనియర్ ప్రిసెప్టర్ కూడా. ఈ అభ్యాసీ యొక్క ప్రేమ బాబూజీని గాఢంగా ఆకర్షించటం మూలంగా, అతనికి ఏదైనా చేకూర్చాలి అని బాబూజీ తీవ్రంగా ఆలోచించేవారు. ఆ సందర్భంలో బాబూజీ ఈ విధంగా చెప్పారు: "ఈ వ్యక్తికి నాపట్ల అపారమైన ప్రేమ ఉంది. అతడు గొప్పగా ప్రేమ, భక్తి ఉన్నటువంటి మనిషి. అతనికి ఏదైనా ఇవ్వాలని నా హృదయం ఉబలాటపడుతోంది. నేను విజయవాడలో ఉన్నప్పుడు నన్ను చూడటానికి వచ్చాడు. నేను అతడిని ధ్యానంలో కూర్చుండమని చెప్పాను. నేను అతడిని ఏడు పాయింట్లు పైకితీసుకు వెళ్ళదలచాను. చూడండి, ఒక్కసారిగా ఏడు పాయింట్లు! అదేమిటో మీరు అర్థం చేసుకున్నారా! అటువంటి పురోగతి సాధించటానికి కొన్ని జన్మలు అవసరమవుతాయి. అతని ప్రేమాధిక్యత మూలంగా నేను అలా ఇవ్వటానికి నిశ్చయించుకున్నాను. అప్పుడు నేను అతడిని ఒక పాయింట్‌కు, తర్వాత రెండవ పాయింట్‌కు చేర్చాను. నేను మూడవ పాయింట్‌కు చేర్చటానికి సంసిద్ధంకాగా, లాలాజీ వాణి నాకు వినిపించింది. లాలాజీ నాపట్ల కోపం కల్పించుకున్నారు. "నీవు ఏమి చేస్తున్నావు?" అని ప్రశ్నించారు. "నీవు అతడిని నాశనం చేయ దలచావా? ఈ దురాగతాన్ని నిలిపివేయి!" అని నన్ను హెచ్చరించారు.

బాబూజీ నవ్వుతూ మళ్ళీ ఇలా చెప్పారు: "ఏమైనాగాని నేను గురువు మాట పాటించవలసిందే. అది స్పష్టమైన ఆజ్ఞ. ఈ పనిలో లాలాజీ ఎంత జాగ్రత్త వహించారో మీరు గమనించండి. మన ట్రాన్స్‌మిషన్ చాలా శక్తివంతమైనది, అందుచేత దానిని జాగ్రత్తగా ఉపయోగించాలి. దానికి కొన్ని రకాల అదుపులు ఉన్నాయి. వాటివలన ఎటువంటి ప్రమాదం వాటిల్లదు. ఆ తర్వాత, ఆ అభ్యాసీ నాకు వ్రాసిన ఉత్తరంలో ఒక నెల రోజుల పర్యంతం భరింపశక్యంకాని తలనొప్పి ఉన్నట్లుగా తెలిపాడు. అతడు ఇంకా ఏమి వ్రాశాడో మీకు తెలుసా? తలనొప్పి భరించశక్యంకానిదే అయినప్పటికీ, దానిలో కూడా ఏదో ఆనందం ఉన్నందున ఆ స్థితి నుంచి తొలగించవద్దని అతడు కోరాడు. ఇప్పుడు చూడండి, నేను అతి ఉత్సాహంతో ఎంత అతిగా తలపెట్టానో గదా!

నేను ఉబలాటంతో అభ్యాసులను తయారుచేయటానికి తరచుగా ఇటువంటి పనే చేస్తూ ఉంటాను. అయినా కూడా అందుకు కొన్ని కట్టడి మార్గాలు ఉన్నాయి. వాటి ద్వారా ఎటువంటి హాని జరగకుండా నిరోధించబడుతుంది."

ooo

బాబూజీ చెప్పారు: "గురువు అనువారు ఇతరులకు సేవ చేయటానికే. అయితే ఇటీవల మానవాళికి సేవ చేయదలచినవారిని కనిపెట్టటం కష్టంగా ఉంది. దానికిబదులు వారు తమకు తామే సేవ చేసుకొనాలనుకుంటున్నారు. ఇప్పుడు మీకు ఒక సంతోషకరమైన కథ వినిపిస్తాను. ఒక వ్యక్తి ఒక గురువు వద్దకు వెళ్ళి, తనను వారి శిష్యునిగా స్వీకరించమని ప్రార్థించాడు. ఆ గురువు ఎన్నో షరతులు విధించాడు. అందులో ఒకటి– అట్టి శిష్యుడు వేకువజామునే నిద్రలేచి గురువు కొరకు అల్పాహారం తయారుచేయాలి. ఆ తర్వాత, గురువు యొక్క దుస్తులు ఉతకాలి, మధ్యాహ్న భోజనానికి అన్ని ఏర్పాట్లు చేసి భోజనం సిద్ధంగా ఉంచాలి. మధ్యాహ్నం గురువు విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు అతడి పాదాలు వత్తాలి. ఈ విధంగా అనేక నియమాలు ఏకరువు పెట్టాడు. ఆ వ్యక్తి సహనం వహించి అన్నీ విన్నాడు. గురువు తన బోధనను నిలిపివేశాక, ఈ వ్యక్తి ప్రశాంతంగా, "దయచేసి నీవు నన్ను నీ గురువుగా స్వీకరించు!" అన్నాడు. ఇది వినోదం కల్పించే కథ కాదంటారా? **శిష్యుడు తన గురువుకు వ్యక్తిగత సేవను అర్పించటంలో ఏమీ హానిలేదు కాని, గురువు వాటిని విధిగా కోరటం తగదు. అదే విధంగా శిష్యునికి వ్యక్తిగత సేవ అవసరమైనప్పుడు, గురువు అతనికి సేవ చేయటానికి తన సంసిద్ధతను వ్యక్తం చేయాలి."**

ooo

ఒక తుఫాను రోజున బాబూజీ, రాత్రి సమయంలో విజయవాడకు వచ్చారు. డాక్టర్ పార్థసారథిగారి ఇంటికి చేరుకుని తలుపుతట్టారు. ఆ విధంగా తలుపు తట్టుతూనే "నేను రామచంద్రను" అని తెలియజేశారు. ఆ విధంగా తలుపుతట్టుతూ తమ పేరు ఎందుకు చెప్పారు అని ప్రశ్నించి నప్పుడు, తాము అలాచెప్పి ఉండకపోయినట్లయితే ఇంట్లో ఉన్నవారు ఆ రాత్రి సమయంలో తలుపుతట్టుతున్నది ఎవరా అని భయభ్రాంతులకు గురికావచ్చు. ఆ విధంగా 'వారు' అభ్యాసుల యోగక్షేమాల గురించి ఆలోచిస్తూ ఉండేవారు. అనేక సందర్భాలలో మనం ఎలా వ్యవహరించాలి అని తెలియజేయటానికి ఇదొక ప్రత్యక్ష నిదర్శనం.

ooo

బాబూజీ మహరాజ్ దర్శనార్థం షాజహాన్‌పూర్ వెళ్ళాలను కున్నప్పటికి కొంతమంది అభ్యాసులు వెళ్ళలేకపోతారు. వారికి షాజహాన్‌పూర్ వెళ్ళాలను తపన ఆంతరికంగా చాలా తీవ్రంగా ఉంటుంది. అప్పుడు బాబూజీ మహరాజ్, షాజహాన్‌పూర్ చేరుకుని తమ ఎదుట ఉన్న అభ్యాసులతో, **"ప్రాణాహుతి నా ఎదుట ఉన్న అభ్యాసులకు మాత్రమే కాకుండా, ఇక్కడకు రావాలనే తపనతోను, ట్రాన్స్‌మిషన్ పొందాలి అను కాంక్షతోను ఉన్న అభ్యాసులకు కూడా చేరుతుంది"** అన్నారు.

ooo

ఒకసారి బాబూజీ మహరాజ్ షాజహాన్‌పూర్‌లో వరండాలో కూర్చుని ఉన్నారు. అప్పుడు సంభాషణ ఈ విధంగా జరిగింది: "అక్కడ దొంగలు పడుతుంటే నీవు ఇక్కడ ఏమి చేస్తున్నావు?" అని లాలాజీ అన్నారు.

మందహాసం చేస్తూ దానికి సమాధానంగా బాబూజీ ఏమన్నారు అంటే, "అక్కడ దొంగలుపడి దోచుకుంటున్నారు అని మీరు చెబుతున్నారు కనుక మీరే వాళ్ళను తరిమివేయండి" అన్నారు. దానికి సమాధానంగా లాలాజీ "నేను నీ గురువునేకాని, నీ సేవకుడిని కాదు, కనుక నీవే చూసుకో" అన్నారు.

ooo

డాక్టర్ ఎ.డి. కులకర్ణి అనువారు బాబూజీతో, తాను డాక్టర్ ఆర్.డి. రెనడే అనువారి ద్వారా దీక్ష తీసుకుని, వారిని గురువుగా భావిస్తున్నందువలన, సహజమార్గ విధానాన్ని అనుసరించడం ఎలా అని చాలా అసహనంగా చెప్పారు. అది గురుద్రోహం అనిపించుకోదా? అని ప్రశ్నించారు. అప్పుడు బాబూజీ ఇలా చెప్పారు: మీరు రెనడేని గరువుగా స్వీకరించారు. మీరే కనుక ఆధ్యాత్మిక ఉన్నతిని కోరుతున్నవారైతే మీరు నన్ను ఒక సేవకునిగానో లేదా మిత్రునిగానో అంగీకరించి నా సేవలు పొందండి. బహుశా మీ గురువు అందుకు అభ్యంతరం చెబుతారు అని నేను తలంచను." అప్పుడు బాబూజీ యొక్క దయార్ద్ర వాక్కును విని డాక్టర్ ఎ.డి. కులకర్ణి విలపించసాగాడు.

ooo

సోదరుడు శ్రీ రాఘవేంద్రరావు, అతని బావమరిది శ్రీ రామకృష్ణారావు మరియు సారనాద్‌జీ ఒకసారి షాజహాన్‌పూర్ వచ్చారు. బాబూజీ మహరాజ్ వారందరినీ తమ ఇంటికి ఆహ్వానించి స్నానంచేసి భోజనానికి రమ్మని చెప్పారు. తర్వాత వారికి భోజనం వడ్డించబడింది. కూరలలో ఒక దానిలో వెల్లుల్లి ఉంది. సారనాద్‌జీ వెల్లుల్లి వాడనందున అది కలిసి ఉన్న వంటకాన్ని వదిలివేశారు. బాబూజీ దీనిని గమనించి ఆ విషయమై సోదరుడు రాఘవేంద్రరావుగారితో సంప్రదించారు. అప్పుడు సోదరుడు రాఘవేంద్రరావుగారు అన్ని విషయాలు బాబూజీకి వివరించారు. ఆ తర్వాత రాత్రి భోజనంలో దేనిలోను వెల్లుల్లి లేకుండా చేశారు. సారనాద్‌జీ, రాఘవేంద్రరావుగారి ద్వారా, బాబూజీ దానిని మొదటిరోజున గమనించిన కారణం తెలుసుకుని వారి కుటుంబ సభ్యులను వారు ఉన్నంతవరకు వెల్లుల్లి వాడవద్దని హెచ్చరించినట్లుగా తెలుసుకున్నారు. బాబూజీ ఆతిధ్యం ఆ విధంగా ఉంటుందని మనం గ్రహించాలి.

ooo

బాబూజీ వ్యక్తిత్వం యొక్క గొప్పతనం సాటిలేనిది. బాబూజీ అపనిందలు, వినమ్రతతో అవస్థలుపడ్డారు మరియు అనేక దుర్భర పరిస్థితులను ఎదుర్కొన్నారు. బాబూజీ అటువంటి పరిస్థితులు అన్నింటినీ సహనంతో భరించారు. ఎవ్వరైతే ఆ పరిస్థితులకు కారకులయ్యారో వారిపట్లగాని, బాధకు గురిచేసిన వారిపట్లగాని ఎటువంటి అసహనంగాని, అయిష్టతగాని కల్పించుకోలేదు. సమస్త మానవాళి వారి యొక్క విశాల హృదయంలో శరణార్ధులుగానే చేర్చుకోబడ్డారు "మీరా మజ్జిగ చిలికి వెన్న దీస్తుంది, ఆ మజ్జిగను ఎవ్వరైనా త్రాగవచ్చు" అన్నట్లుగా వారి ప్రవర్తన వెల్లడవుతుంది.

ooo

కొంతమంది అభ్యాసులు గుమికూడి ఉన్నారు. అప్పుడు బాబూజీ అన్నారు: "చాలామంది నన్ను వివాహ శుభకార్యాల్లో పాల్గొనటానికి ఆహ్వానిస్తారు. కాని వారిలో చాలామంది నాపట్ల వాస్తవిక ప్రేమ కలిగి ఉండరు.

వారి దృష్టి అంతా ప్రాపంచిక ప్రయోజనాలమీదనే సారించబడి ఉంటుంది. నా ఆరోగ్యం బాగుండకపోయినప్పటికీ నన్ను వారు బలవంతపెట్టారు. ఇంకొక రకంగానైతే, విదేశీయుల దృక్పథం చాలా గర్వించదగినదిగా ఉంటుంది. లండన్‌లో ఒకామె నన్ను, "బాబూజీ, మీ బలహీనమైన ఆరోగ్య స్థితితో దూర ప్రయాణాలు ఎందుకు చేస్తారు? మీ దగ్గరకే మేము వెళ్ళటం మా కర్తవ్యం కాదా?" అన్ని ప్రశ్నించింది. వారి ప్రేమ ఎంత వాస్తవంగా ఉందో చూడండి."

ooo

బాబూజీ చెప్పారు: "నా గురించి ప్రజల అభిప్రాయం ఎటువంటిదో చూశారా? రామచంద్ర పిసినారి అని వారు అనుకుంటారు. అది చాలావరకు వాస్తవమే, ఎందుకంటే ఐదు పైసలు ఖర్చు చేయాల్సిన సందర్భంలో నేను ఎప్పుడూ ఆరు పైసలు వెచ్చించలేదు. అది నా స్వవిషయంలో మాత్రమే. అదే ఇతరుల కొరకైతే ఎంతైనా ఖర్చు పెడతాను.

అలాగే మరి కొంత మంది నేను కొన్ని అతీంద్రియ శక్తులు కలిగి ఉండి, ఇతరులెవ్వరికీ ఇవ్వజూపనని అనుకుంటారు. దీనికి నా సమాధానం ఏమిటంటే, నావరకు నేను ఆ శక్తులను ఇవ్వటానికి సిద్ధమే, కాని మీరు మాత్రం దానిని స్వీకరించటానికి సిద్ధంగా లేరు."

ooo

"విదేశాలలో జనం నన్ను అడ్డదిడ్డ ప్రశ్నలు అడుగుతారేమోనని భయపడి నేను లాలాజీని అంతర్వాణితో సంప్రదించాను. అప్పుడు లాలాజీ నాకు అత్యంత మనోధైర్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని కల్పించారు. అంతేకాదు, 'వారు' నావీపు తట్టినట్లుగా అనుభూతి చెందాను. దాని ఫలితంగా నా విదేశీ ప్రయాణంలో నాకు సంధించిన ప్రశ్నలకు నేను తక్షణ సమాధానం ఇచ్చేవాడను. ఆ సమాధానాలు సరైనవో లేక తప్పులున్నాయో నేను చెప్పలేనుకాని, ప్రశ్నించిన వారు మాత్రం సంతృప్తి చెందేవారు. లాలాజీ కృపవలన, నేను అజ్ఞానిని కాదు అని మీరు గ్రహించండి." ఈ చివరి వాక్యం చెబుతూనే వారి ముఖంలో సమ్మోహనపరిచే మందహాసం చిందులేసింది.

ooo

**"లాలాజీ లేకుండా నేను ఒక్క క్షణమైనా ఉండను, అలాగే నేను లేకుండా 'వారు' ఏమీ బహిర్గతం చేయరు"** అని బాబూజీ అన్నారు.

ooo

బాబూజీ చెప్పారు: "మేధావులైన నా స్నేహితులు, మిషన్ యొక్క ప్రశిక్షకులు కూడా అయినటువంటివారు ఒకరు, నా పుస్తకాలను విమర్శించారు. "రామచంద్రుని పుస్తకాలు చాలా తక్కువ పేజీలతో ఉంటాయి. దానిలోని భాష చాలా తప్పుల తడికగా ఉంటుంది" అనేది అతడి విమర్శ. నేను మేధావినికాను కనుక అది వాస్తవం కూడా. లాలాజీ నాకు ఏమి బోధించారో దానిని నేను వ్రాస్తాను. అయితే కొన్ని సంవత్సరాల తర్వాత ఆ మేధావి అయిన సోదరుడు తన అభిప్రాయాన్ని ఎలా మార్చుకున్నాడో చూడండి! "రామచంద్రుని పుస్తకాలలోని ఏ ఒక్క మాటను మార్చశక్యం కాదు. 'వారు' వాడిన భాష చాలా స్వచ్ఛమైనది, స్పష్టమైనదిగా ఉంది" అని చెప్పసాగాడు.

బహుశా అతడు నా శబ్ద ప్రయోగాన్ని బాగా మధనంచేసి ఈ నిర్ణయానికి వచ్చి ఉంటాడు. కొన్ని సందర్భాలలో మాటలు, వాక్యాలు నా మనస్సులో వాటంతట అవే మెరుపులా తట్టుతాయి. నాకు ఎక్కువ మాటలతో అనుబంధం కూడా లేదు. నేను వాటిని ముందుగా ప్రయోగించి, తర్వాత వాటి అర్థం కోసం (Dictionary) పదకోశంలో వెదుకుతాను. నేను ఉద్దేశ్యపూర్వకంగానే కొన్ని తప్పుడు మాటలను ప్రయోగిస్తాను. ఇది నాకు అలవాటైపోయింది."

ooo

బాబూజీ చెప్పారు: "ఒక అభ్యాసీ సోదరి (అమెరికా నుంచి) నాకు ఒక ఉత్తరం వ్రాసింది. ఆమె తనకు తోచిన విధానంలో సాధనచేస్తూ ఉన్నట్లుగాను, మరెవ్వరినీ 'గురువు'గా స్వీకరించే ఆలోచనలేదని తెలిపింది. కొన్ని రోజుల తర్వాత ఆమెను కలిసినప్పుడు, నేను ఆమెను "నీ ఉత్తరానికి సమాధానంగా నేను వ్రాసిన ఉత్తరంలో నిన్ను 'సోదరి' అని సంభోదించాను కనుక, దాని మూలంగా నీవు నన్ను గురువుగా స్వీకరించినట్లు ఎలా అవుతుంది?" అని అడిగాను. దానికి ఆమె మౌనంగా ఉండిపోయింది. నన్ను నేనే గురువుగా భావించుకున్నట్లుగా జనం అపోహపడుతుంటారు."

ooo

బాబూజీ ఉద్యోగం చేస్తూ ఉండగా 1952వ సంవత్సరంలో జరిగిన ఒక సంఘటన గురించి వివరించారు. అవి ఎన్నికలు జరుగుతున్న రోజులు. దేశంలో అదే మొదటి సార్వత్రిక ఎన్నికలు కావటం మూలాన, దానికి అత్యంత ప్రాధాన్యం కల్పించబడింది. బాబూజీ కూడా పోలింగ్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. 'వారి' మేనల్లుడు యొక్క వివాహం కూడా అదే రోజు నిశ్చయించబడింది. ఒకరోజు సామాన్య శెలవుకోసం బాబూజీ సివిల్ జడ్జికి దరఖాస్తు చేశారు. ఆ రోజుల్లో బాబూజీ కోర్టులో పని చేస్తున్నారు. అప్పుడు ఆ జడ్జిగారు బాబూజీ దరఖాస్తును త్రోసిపుచ్చటమేకాక, ఆ విధంగా శెలవుకు దరఖాస్తు చేసినవవారిపై కఠినచర్య తీసుకొనబడుతుంది అని, ఒక ప్రకటన కూడా జారీచేశారు. బాబూజీ ఇంక చేసేదేమిలేక మౌనంగా ఉండిపోయి, ఆ వివాహానికి హాజరు కావటాన్ని విరమించుకున్నారు.

ooo

ఒకసారి ఢిల్లీ నుంచి భారత్ సేవక్ సమాజ్‌లో పనిచేస్తున్న ఒకాయన వచ్చి 10-15 నిమిషాలు కూర్చుండిపోయి, బాబూజీకి శుభం కోరుతూ లేచివెళ్ళిపోయాడు. అక్కడు ఉన్నవారు ఎవ్వరికీ అతని గురించిన పరిచయం లేదు. అప్పుడు తన చుట్టూరా కూర్చున్నవారిని సంబోధించి అతడు ఎవ్వరు? అని బాబూజీ అడిగారు. ఎవ్వరికీ ఎరుకలేక ఏమీ చెప్పలేకపోయారు. అప్పుడు బాబూజీ– "ఇదేం మర్యాద? అతడు తనను పరిచయం చేసుకోకుండా, అతను ఎవరో తెలియజెప్పకుండా, ఎందుకు వచ్చాడో చెప్పకుండా వెళ్ళిపోతున్నాడు" అన్నారు. ఇంతలో, అతడు ముఖద్వారం సమీపిస్తూ ఉండగా, అక్కడున్న వారిలో ఒకరు అతడిని పిలిచారు. అతడు తిరిగి వచ్చాక, బాబూజీ అతడి పరిచయాన్ని, ఎందుకు వచ్చినదీ తెలపమని అడిగారు. అందుకు అతడు తన పేరు, వృత్తి ఏమిటో చెప్పి, "రామచంద్ర మిషన్" గురించి చాలా బాగా విన్నట్లుగాను, అందుచేత బాబూజీ దర్శనార్థం వచ్చినట్లుగా చెప్పాడు. అప్పుడు బాబూజీ ఈ సాధనా విధానం గురించి క్లుప్తంగా వివరించారు. అతనితో ఇంకా ఇలా చెప్పారు: "నేను ఒక జ్ఞానిని కాను. **మన దేశంలో ఎంతోమంది ఋషులు, సెయింట్స్ జన్మించారు.**

**వారందరూ మానవునిలో అసలు ఉండవలసింది, ముఖ్యంగా మానసిక వికాసమే అన్నారు. మనస్సు, మంచి చెడులు రెండింటిని ఆలోచిస్తుంది. చెడ్డ విషయాల గురించి ఆలోచించకుండా నిరోధించి, మంచి విషయాల గురించి మాత్రమే ఆలోచించేటట్లుగా మనం దానికి శిక్షణ ఇవ్వాలి. మానవుడు మొట్టమొదట తను ఈ భూమి మీదకు వచ్చినప్పటి (జన్మ తీసుకున్నప్పటి) అసలైన పవిత్ర స్థితిని పొందితీరాలి. కనుక వ్యక్తిగత మనస్సు ఆ విశ్వమనస్సుతో మమేకమైనప్పుడే ఇది సంభవమవుతుంది. దీనికి చేసే కృషియే అభ్యాసం అవుతుంది, దానిని ఏ పేరుతోనైనా పిలవవచ్చు. ఎవ్వరి సహాయమైతే మనకు ప్రతి అంచెలోను / దశలోను అవుసరమవుతుందో, మనకు అభ్యాసంలో ఎవ్వరైతే సహాయపడతారో వారే గురువు. కనుక ఆ విధంగా మనం అతని సామర్థ్యాన్ని పరిశీలించి అప్పుడు గురువుగా స్వీకరించాలి."**

అప్పుడు ఆ వ్యక్తి బాబూజీ చెప్పిన దానికి సంతృప్తి చెంది, తనకు ఉన్న పరిజ్ఞానంతో ఏదో కొంత చెప్పి, బాబూజీ దర్శనానికి మళ్ళీ వస్తానని చెప్పి వెళ్ళిపోయాడు.

ooo

"అప్పుడప్పుడు నాకు జనం యొక్క గతజన్మల సంబంధం స్ఫురణకు వస్తుంది. నేను అమెరికాలో ఉన్నప్పుడు ఒకసారి ఒక దంపతులు 1,500 మైళ్ళ దూరం నుంచి కారులో ప్రయాణించి నన్ను చూడటానికి వచ్చారు. నాకు ఎందుకోగాని ఆ వ్యక్తి భార్య తన గతజన్మలో ఒక పరిశుభ్రత నిర్వహించే పనికత్తెగా నాకు అనిపించింది. దానిని ధృవపరచుకోవటం కోసం నేను ఆమెతో –'సోదరీ, నీవు సువాసన మరియు దుర్గంధం మధ్య తేడాను గమనించగలవా?' అని అడిగాను. దానికి ఆమె గుర్తించలేనని చెప్పింది. ఏమైనప్పటికి, నేను ఆమెను చూసిన తక్షణమే, ఒక బుట్టలో చీపురు వేసుకుని తన చేతికి తగిలించుకుని ఉన్నట్లుగా నాకు కనిపించింది" అని బాబూజీ చెప్పారు.

ooo

ఒకసారి బాబూజీ చిరునవ్వు నవ్వుతూ, "బాధల నుండి తప్పుకోవటానికి ఏదైనా మార్గం ఉందా? నాకైతే ప్రతి చిన్న విషయం బాధించేదిగానే ఉంటుంది" అన్నారు. దీని ద్వారా, ఎవ్వరైనా గాని ఈ ప్రపంచంలో ఉన్నంతవరకు బాధలకు గురికాకుండా ఉండలేరు అని సూటిగా బోధించినట్లవుతుంది.

ooo

ఒకసారి బాబూజీ చెప్పారు: "నాకు చాలామంది బంధువులు (తల్లిదండ్రు లిద్దరివైపు నుంచి) ఉన్నారు, కాని నా కష్టాలలో ఎవ్వరూ సహాయపడలేదు. అందుకు విరుద్ధంగా వారు మాత్రం అవసరం వచ్చినప్పుడల్లా నా నుంచి తగినంత సహాయం తీసుకున్నారు. అయితే మాత్రం నేను నా స్నేహితుల ద్వారా సహాయం బాగా పొందాను. ఆంతరికంగా నా బంధువులపట్ల సానుకూలత లేకపోయినా బాహ్యంగా మాత్రం అది కనిపించకుండా వారితో బంధుత్వం కొనసాగించాను.

నా ఇరుగుపొరుగువారు నన్ను బాగా అపహాస్యం చేసేవారు. వారు ఏదో విధంగా నాలో తప్పుపట్టటానికి ప్రయత్నించి దానిని ఇతరులకు చేరవేసేవారు. దాని నంతటినీ సహించి, వారికి నేను మంచినే కోరాను."

ooo

సోదరుడు కాశీరామ్‌జీ, ఒక పోలీస్ ఇన్‌స్పెక్టర్ గురించి చెప్పాడు. ఆ ఇన్‌స్పెక్టర్, తనకు 'మిషన్' అనే మాట నచ్చలేదని, దాని మూలంగా (శ్రీరామచంద్ర మిషన్) ఈ సంస్థను ఒక క్రిష్టియన్ సంస్థగా అపార్థం చేసుకున్నాను అని అతడు చెప్పినట్లుగా తెలియజేశాడు. ఆఖరికి విద్యావంతులైనవారిలో కూడా పేరును గురించిన ఆలోచన ఎటువంటి విపరీత ధోరణికి దారి తీస్తుందోనని చెప్పటానికి ఇదొక ఉదాహరణ. ఆ సబ్ ఇన్స్‌పెక్టర్ యొక్క అభ్యంతరం ఇది: మన సంస్థకు 'మిషన్' అని ఎందుకు నామకరణం చేసారు? అనేది. అప్పుడు బాబూజీ సమాధానంగా, "నీవు 'పోలీస్' అని ఎందుకు పిలవబడుతున్నావు? నిన్ను 'ఫూలిష్' అని ఎందుకు సంబోధించటం లేదు? దీనికి నీ సమాధానం ఏమిటి?" అన్నారు. అప్పుడు అభ్యాసులందరూ మాస్టర్ చుట్టూ మూగి కడుపుబ్బ నవ్వుకున్నారు.

ooo

ఎవరో ఒకరు, సత్సంగ్‌లో అనవసర చర్చలు నిరోధించటం ఎలా అని ఆరాతీశారు. బాబూజీ దానికి వెంటనే స్పందించి, "దానిదేముంది, అది చాలా తేలిక. అప్పుడు అక్కడ నుంచి లేచి టాయ్‌లెట్‌కు వెళ్ళటమే. నీవు తిరిగి వచ్చేసరికి ఆ విషయ ప్రస్తావన మారిపోతుంది. ఒకవేళ మారనట్లయితే ఆ విషయాన్ని నీవే మార్పు చేయి" అన్నారు.

ooo

బాబూజీ తాను ఎలా సాధన చేశారో మాకు చెప్పారు. "ఒకసారి, నేను ఫతేఘర్‌కు వెళ్ళినప్పుడు, నేను అక్కడ కొంతకాలం ఉన్నాను. లాలాజీ నన్ను ధ్యానం చేయటానికి పిలిచినప్పుడల్లా, కడుపు నొప్పి అనో, తలనొప్పి అనో వంకపెట్టి తప్పించుకునేవాడిని. నాకు ధ్యానం చేయటానికి మనసొప్పటంలేదని లాలాజీ గ్రహించారు. ఇంక అప్పటినుండి నన్ను, 'వారు' ధ్యానానికి పిలవడం మానివేశారు. దానిలో అర్థం ఏమిటి? నా ఆంతరికం అంతా లాలాజీ సాహెబ్‌తోనే నిండి  ఉంది."

ooo

ఎవరో ఒకరు– "బాబూజీ, ఇప్పుడు తమ మిషన్‌లోకి విశిష్టమైన పురుషులు వస్తున్నారు" అనగానే బాబూజీ, –"కాదు, అలాకాదు. వారు ఈ మిషన్‌లో ప్రవేశిస్తున్నారు కనుక వారు విశిష్టతను పొందుతారు. నావద్దకు వచ్చిన ప్రతి ఒక్కరినీ, వారి స్థాయినిబట్టి గౌరవిస్తాను. ఇది ప్రాపంచిక వ్యవహార రీత్యా అయి ఉండగా, ఆధ్యాత్మిక శిక్షణలో మాత్రం అందరూ నాకు సమానమే. అంతేకాదు, వారిలో నాకు కాంతి కనిపించినట్లయితే వారి ముందు తలదించుకోవాలనుకుంటాను (అనగా నమస్కరించాలను కుంటాను)" అన్నారు.

ooo

విష్ణుస్వామి అను ఒక సన్యాసి (బైరాగి) ఆధ్యాత్మిక సాధన కొరకు బాబూజీవద్దకు వచ్చి నెలలతరబడి 'వారి' ఇంటిలోనే ఉండేవాడు. అతనికి ధ్యానం మీద ధ్యాసలేదు. అతడు చాలా సోమరి మరియు తిండిపోతు కూడా. అతడు ధ్యాన సమయంలో బయటకు వెళ్ళి భోజన సమయానికి మాత్రం తప్పనిసరిగా తిరిగి వచ్చేవాడు. అతడు మంచి కవితలు వ్రాయటమే కాకుండా సంస్కృతంలో కూడా మంచి పట్టు ఉన్నవాడు. బాబూజీ అతడిని బాగా మందలించటమేగాక కోపంతో అప్పుడప్పుడు పరుష పదజాలం కూడా ప్రయోగించేవారు. అయినా

కూడా ఆ స్వామీజీ అక్కడే భుజిస్తూ నెలల తరబడి ఉండేవాడు. అతడి గురించి బాబూజీ వ్యాఖ్యానిస్తూ, **"మనిషి యొక్క పతనానికి కారణం సోమరితనం. ఆ సోమరితనం మూలంగా మనిషిలోని దివ్యత్వవాంఛ క్రమంగా క్షీణించిపోతూ, చివరకు ట్రాన్స్‌మిషన్ ద్వారా కలిగే ప్రకంపనాలను కూడా గ్రహించలేనివాడుగా తయారవుతాడు. అప్పుడు విచక్షణాశక్తి శూన్యమైపోయి దురదృష్టం ఆవహిస్తుంది"** అని చెప్పారు.

ooo

ఒకసారి ఒక ప్రముఖ వ్యక్తి మద్రాసులో బాబూజీ వద్దకు వచ్చాడు. అతడు బాబూజీని ఏమైనా చెప్పమని కోరాడు. బాబూజీ – "నేను ఏం చెప్పాలో నాకు తెలియడం లేదు" అని మరల ఇలా చెప్పారు: **"మానవుడు, మానవుడుగా జన్మించి ఒక జంతువులాగా మరణిస్తాడు"–** అని అన్నాను. దీనితో అతడు చాలా సంతృప్తి చెంది, తన సందేహాలన్నీ తొలగిపోయాయి అని వెళ్ళిపోయాడు. ఈ వాక్యంలో ఏముందో నాకైతే తెలియదు."

ooo

"కొంతమంది ధనవంతులు, తెలివైనవాళ్ళు అసంతృప్తి చెంది నన్ను విడిచిపెట్టి వెళ్ళిపోయారు. కాని నేను మాత్రం అంతకుపూర్వం ఉన్నట్లుగానే వారిపట్ల ప్రేమ మరియు అభిలాష కలిగి ఉన్నాను. ఒక వ్యక్తిపట్ల అసంతృప్తులై ముడుచుకుపోవటమనే ప్రపంచ పోకడ ఈ విధంగా ఉంటుంది. దానికి నేను ఎందుకు చింతించాలి?" అన్నారు బాబూజీ.

ooo

బాబూజీ చెప్పారు: "ఒక యోగి, దివ్యశక్తిని రాబట్టి దానిని నిర్వీర్యం (పనిచేయకుండా) చేయగల శక్తిగలవాడై ఉంటాడు. ప్రకృతి నాకు పని పురమాయించినపుడు, విషయాలు నాకు స్పష్టంగా కనిపిస్తాయి. అయితే ఈ సమయంలో నీ ఇంట్లో నీ భార్య ఏమి చేస్తూ ఉందని నీవు ప్రశ్నిస్తే నేను చెప్పలేను. దానిలో దివ్య ప్రయోజనం ఉండి ఉండాలి. నాకు అయిష్టమే అయినప్పటికీ నేను ప్రకృతి యొక్క ఆజ్ఞలను శిరసావహించాలి. ఎవరి మొండితనమూ అక్కడ పని చేయదు. స్వార్థంతోను, దుర్బుద్ధితోను తలపెట్టిన ఏ పని అయినప్పటికి కాలానుగతంగా అది చెడగొట్టబడుతుంది. అందుచేతనే **నేను తరచుగా నా ప్రిసెప్టర్ సోదరులకు తమ పనిని నిస్వార్థంగాను, దురుద్దేశ రహితంగాను చేయమని చెప్తూ ఉంటాను."**

ooo

సంభాషణ కొనసాగుతూ ఉండగా, భాషను గురించిన ఒక ప్రస్తావన వచ్చింది. అప్పుడు బాబూజీ చెప్పారు: "ఒకసారి శ్రీ రాఘవేంద్రరావు గారు నా ఉర్దూ భాష బాగుంటుందని వ్యక్తం చేశారు. నాకయితే ఉర్దూ భాషలో ఎక్కువ పరిజ్ఞానం లేదు. నేను నా డైరీలో అంత అందంగా ఎలా వ్రాయగలిగానో నాకు తెలియదు. ఇంగ్లీషులో కూడా నా పరిజ్ఞానం అంతంత మాత్రమే. నేను ఎక్కువగా చదవలేదు కాని, నన్ను ఏదైనా వ్రాయమని ఆదేశించినపుడు మాత్రం, ఆలోచనలు వాటంతట అవే వస్తాయి. ఇది లాలాజీ కృప."

ooo

“లాలాజీ, బ్రాహ్మణులైనవారిని ఎప్పుడూ తమ ఇంటిలో భోజనం చేయమని బలవంతపెట్టేవారు కాదు. సోదరులు రామేశ్వర్ ప్రసాద్ మరియు గంగా సేవక్ ‘వారి’ ఇంటికి వెళ్ళినప్పుడు, ‘వారు’ స్వయంగా వంట చేసుకోవటానికి అవసరమైన ద్రవ్యాలన్నీ సమకూర్చేవారు. రామేశ్వర్ ప్రసాద్‌గారు, తను ఒకప్పుడు ఒక విప్లవకారుడై నందున, జాతి కుల మత భేదాలను లక్ష్యపెట్టకుండా ఎక్కడైనా సరే భుజించేవాడినని, లాలాజీ ఇంటి భోజనం పరమ పవిత్రమైనది కనుక, లాలాజీ ఇంటిలో మాత్రమే భోజనం చేస్తానని అనేవారు. అపుడు **లాలాజీ ఈ విధంగా చెప్పేవారు: “కుల విధానం బాహ్యమైనది. దానిని మన అవసరాన్నిబట్టి మనమే సృష్టించాం కాని దానికి ఆధ్యాత్మికతో ఎలాంటి సంబంధమూ ఉండదు”** అని బాబూజీ ఇంకా ఇలా చెప్పారు: “నా అభిప్రాయం కూడా అదే. ఇప్పటికి కూడా కుల వివక్షత పాటించేవారు ఎవరైనా నా ఇంటికి వస్తే, నేను వారు వంట చేసుకోవటానికి ప్రత్యేక స్థలంతోపాటు అన్ని సరుకులూ సమకూర్చుతాను. వారి విశ్వాసాన్ని నేను ఎందుకు కాదనాలి?” ఆ గురువు లిద్దరూ అందరిపట్ల గౌరవ మర్యాదలు కలిగి ఉండి, వాళ్ళ విశ్వాసాలను మన్నించేవారు.

ooo

బాబూజీ ఈ సంఘటన వివరించారు: “ఒకసారి, ఒక సన్యాసి నావద్దకు వచ్చాడు. అప్పుడు నేను ఏదో చదువుతూ ఉన్నాను. అతడు నా ముఖం వంక అటూ ఇటూ పరిశీలించాడు. నేను పుస్తకాన్ని ప్రక్కన బెట్టి, అతడు ఎవరో, ఎందుకు వచ్చాడో చెప్పమని అడిగాను. దానికి అతడు నన్ను ఎదురు ప్రశ్న వేస్తూ –నీ వయస్సు ఎంత? –అని అడిగాడు. నేను అందుకు సమాధానం చెప్పగా అతడు నాతో ఈ విధంగా మాట్లాడాడు: “నీవు ఇన్ని సంవత్సరాలుగా నీ వయస్సును వృథా చేశావు. నీవు ఒక్కసారైనా ‘రామ’ నామాన్ని స్మరించలేదు” అని. నాకు నవ్వు రావటమేకాక కొంచెం కోపం కూడా వచ్చింది. అప్పుడు అతనితో చెప్పాను: “అవును. నా జీవితాన్ని ఇప్పటివరకూ వృథా చేసాను. నీకు సమర్థత ఉంటే నేను ఏం చేయాలో నాకు బోధించు” అని. మారుమాట లేకుండా, అతడు వెళ్ళిపోయాడు.”

ooo

బాబూజీ చెప్పారు: “ఒకానొక సందర్భంలో, మరొక పెద్దమనిషి వచ్చాడు, నాతోపాటు కూర్చుని భరింపశక్యం కానంతగా వాదించటం ప్రారంభించాడు– “ఈ సిద్ధాంతం తప్పు, ఆ ప్రకటన తప్పు” అంటూ ఏవేవో మాట్లాడాడు. అప్పుడు అక్కడ కూర్చుని ఉన్న ఒక సత్సంగ్ సోదరుడు అతనిమీద విరుచుకుపడ్డాడు– “నీవు ఎవ్వరితో మాట్లాడు తున్నావో తెలుసా? ఒక ఆధ్యాత్మిక సంస్థ యొక్క అధ్యక్షుని ఎదుట ఇంత నీచంగా మాట్లాడటానికి సాహసిస్తున్నావా? ‘వారి’ శిష్యులలో నీకంటె ఎక్కువ సామర్థ్యం ఉన్నవారు చాలామంది ఉన్నారు. నీ నాలుకను అదుపులో పెట్టుకో” అని. అప్పుడు ఆ పెద్దమనిషి అవాక్కై వెళ్ళిపోయాడు. మన సూత్రాలను, వాటి ఉద్దేశ్యాలను నిస్సంకోచంగా ప్రజలు విమర్శించనీయండి. అంతేకాని ఎదురు చెప్పటం, అనుచితంగా మాట్లాడటం మంచి పద్ధతి కాదు.”

ooo

ఒక సందర్భంగా మాట్లాడుతూ బాబూజీ చెప్పారు: “యజ్ఞోప వీతం (జందెం) (భారతదేశంలో మూడు కులాలు వారు– (బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు ధరించేది) రెండు జన్మలకు ఒక సంకేతం వంటిది. నేను ఇప్పుడు దానిని తొలగించివేశాను. ఒకసారి పండిట్ రామేశ్వర్ ప్రసాద్ ఈ విషయమై నన్ను ప్రశ్నించారు.

దానికి సమాధానంగా– 'నేను అన్ని బంధనాలను త్రెంచివేయగా, దీనిని మాత్రం ఎందుకు ఉంచుకోవాలి?' అని చెప్పి మౌనంగా ఉండి పోయాను."

ooo

తమకు తామే యోగులుగా తయారై పూర్తిగా పరిణతి చెందకపోయినా కూడా ఆధ్యాత్మికత పేరుతో పశ్చిమ దేశాలలో పర్యటిస్తున్న మన దేశానికి చెందినవారి గురించి ప్రస్తావన వచ్చినపుడు, బాబూజీ ఈ విధంగా చెప్పారు: "మన దేశీయులు తమ విశ్వాసాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. యోగ పేరుతో, తమ బుద్ధికి తోచిన దానిని ప్రవచిస్తూ వారిని మోసగిస్తున్నారు. అమెరికాలో, ఒక గౌరవనీయుడు నావద్దకు వచ్చి, తన గురువు ఇచ్చిన దీక్షా విధానాన్ని కొనియాడుతూ, అది చాలా సులభమైనది, సుందరమైనది అని చెప్పాడు. అది ఎలాగో చెప్పమని నేను అతడిని ప్రశ్నించాను. అప్పుడు అతడు దానిని ఈ విధంగా వివరించాడు: 'అతడు తొమ్మిది గులాబీలను నీటితో నింపిన పాత్రలో ఉంచాడు. అతడు నన్ను తన ఎదుట కూర్చుని ఉండమని చెప్పి ప్రతి పుష్పంతోను, ఏదో మంత్రాన్ని చదువుతూ నామీద నీరు జల్లుతూ ఉన్నాడు. నాకు ఇది బాగా నచ్చింది' అన్నాడు. నాకు నవ్వు వచ్చింది. ఇది సిగ్గుచేటు కాదా? చెప్పండి. మరొకరు – తన గురువు ఒక నీటితో నింపిన మట్టి కూజాను తలమీద పెట్టుకుని ధ్యానం చేయమని చెప్పినట్లుగా వివరించాడు. ఈ యోగ ఏ రకానికి చెందినదో భగవంతునికే తెలియాలి!" అక్కడ సమావేశమై ఉన్న వారందరూ పకపకా నవ్వారు.

ooo

బాబూజీ ఒకసారి ఇలా చెప్పారు: "నాకు అతిస్వల్పంగా సహాయ పడినవారు ఎవ్వరికైనా సరే నేను ఋణపడి ఉన్నట్లుగా భావిస్తాను. ఇది నా స్వభావం. కాని కొంతమంది ధనవంతులు నావద్దకు వచ్చేవారు దీనిని అపార్థం చేసుకున్నారు. నేను వారిని మోసగించి వారి నుంచి డబ్బు గుంజాలనుకుంటున్నట్లుగా వారు భావిస్తారు. అటువంటిది ధనికులకు మాత్రమే ఉంటుందని అనిపిస్తుంది. ఇది కాదంటారా?"

ooo

అన్నిరకాల జనం సలహాకోసం బాబూజీవద్దకు వస్తారు. అవి కుటుంబ అభిప్రాయ భేదాలు, కలహాలు, వివాహ సంబంధాలు, ఆఫీసు పనికి సంబంధించినవి. ఈ విధంగా అన్ని రకాల సమస్యలతో వాటి పరిష్కారం కోసం; అలాగే కేవలం ఆధ్యాత్మిక శిక్షణ గురించి అనేకమంది వచ్చేవారు. బాబూజీ వాటినన్నింటినీ సహనంతో విని, అందుకు తగిన సలహా ఇచ్చి సమస్యలకు పరిష్కారం చూపేవారు. వీటన్నింటికి అపారమైన ప్రేమ అనేది వారివద్ద ఉన్న వజ్రాయుధం. ఎంత దుర్మార్గపు స్వభావం ఉన్నవారైనాసరే, 'వారి' ప్రేమ ముందు సాగిలపడేవారు. కనీసం 'వారి' ప్రేమ కోసమైనా మనం జీవించి ఉండాలను భావం మనలో తలవని తలంపుగానే కలుగుతుంది. వసంతం పులకరింపజేసినట్లుగా మహాపురుషులు ప్రపంచ సంక్షేమానికి పాటుపడుతూ ఉంటారు.

ooo

బాబూజీ చెప్పారు: "నా అవసరాలకోసం ఇతరులను అడగ టానికి నేను ఇరుకునపడతాను. వాళ్ళు నన్ను అపార్థం చేసుకుంటారేమో అను ఆలోచన నన్ను కలవరపెట్తుంది. కాని, ఏమి చేయను? కొన్ని సందర్భాలలో ఇతరుల సహాయం తీసుకోకతప్పదు.

ప్రపంచంలోకెల్లా నేను ఛాందసుడను (విపరీతాలోచనలు కలిగిన వాడను) అనుకుంటూ ఉంటాను. ప్రాపంచిక విషయాలకు సంబంధించి అనవసర సందేహాలు ఉత్పన్నమవుతూ ఉంటాయి. దాని మూలంగా నన్ను పరిహసించవచ్చు. దానికి నేనేమీ చేయలేను. అది నాకు ఒక అలవాటైపోయింది."

ooo

అమెరికాలో ఒక సత్సంగ్ సందర్భంగా బాబూజీ చెప్పారు: "నేను గ్రేస్ కింబిల్ అను అభ్యాసీ సోదరి ఇంట్లో ఉన్నాను. నాకు ఆ ఇంటి వాతావరణం నచ్చింది, ఆ విషయం ఇతరులకు కూడా చెప్పాను. వారు నన్ను అందుకుగల కారణం ఏమిటి? అని అడిగారు. నేను అప్పుడు ఏమి చెప్పానో మీకు తెలుసా? నేను సరదాగా –గ్రేస్ ఇక్కడ ఉంది కనుక నాకు ఈ ప్రదేశం నచ్చింది –అని." అందరూ ఆనందంగా నవ్వారు.

ooo

బాబూజీ తన బాల్యంలో స్కూలు విదార్థిగా ఉన్నప్పటి తన విషయం ఇలా చెప్పారు: "నాకు గణిత శాస్త్రం (Mathematics) అంటే యమభయంగా ఉండేది. అది నాకు శతృసమానంగా తోచేది. నాకు ఎప్పుడూ గణితంలో తక్కువ మార్కులు వచ్చేవి. ఇప్పటికీ అదే సంగతి. చిన్న భాగహారం (Division) కూడా నాకు తెలియదు."

ooo

బాబూజీ ఒకసారి చెప్పారు: "లాలాజీగారి మహాసమాధి అనంతరం, విముక్తాత్మలు నాతో అంతర్వాణి కొనసాగించాయి. ఈ స్థితి చాలా కాలం నిలిచి ఉంది. నా డైరీలో వ్రాసి ఉంచాను. ఆ తర్వాత ఇంకెవ్వరూ అలా చేయలేదు. లాలాజీతో (అంతర్వాణి) సంబంధం మాత్రం ఎప్పుడూ ఉంటూనే ఉంది."

ooo

బాబూజీ చెప్పారు: "ఆలస్యంగానైనా, జనం సహజమార్గంవైపు ఆకర్షితులవుతూ ఉన్నారు. ఇది దివ్య చర్యయేగాని, మానవ మాత్రులకు సాధ్యమయ్యేది కాదు. దీనిలో దైవ సహాయం ఉంది."

ooo

బాబూజీ ఒక సంఘటన గురించి ఈ విధంగా వివరించారు: "ఒకసారి ఒక అవధూత షాజహాన్‌పూర్ వచ్చి కొంతకాలం ఉన్నారు. అతడు ఒక గౌరవనీయుడైన వ్యక్తి ఇంటి ముందు చిన్న వేదిక మీద ఆసీనుడై ఉండేవాడు. అతడు తన ఎడమకాలు ఎత్తి ఆ దారినపోయే వారందరికీ చూపుతూ ఉండేవాడు. అది వారిని తన్నుతాడన్నట్లుగా అనిపించేది. ఒకసారి నేను కూడా నా ఆఫీసు నుంచి వెళ్తూ ఆ మార్గాన వెళ్ళటం జరిగింది. అతడు నాపట్ల కూడా అలాగే చేశాడు. నాకు కోపం వచ్చి, అతని వంక తీక్షణంగా చూసాను. అప్పుడు అతడు సిగ్గుతో తన దృష్టి తలదించుకున్నట్లుగా మౌనంగా కూర్చున్నాడు. ఇంక అప్పటి నుంచి అలా వ్యవహరించటం మానివేశాడు. కొద్దిరోజుల తర్వాత షాజహాన్‌పూర్ వదలి ఎక్కడికో వెళ్ళిపోయాడు."

ooo

ప్రజానీకం తమ గురించి ఎలా అపార్థం చేసుకున్నారో తెలిపేటటువంటి ఒక విచారకర సంఘటన గురించి బాబూజీ వివరించారు. "ఒకసారి, నేను కలకత్తా వెళ్ళినప్పుడు, అక్కడ పక్షవాతంతో బాధపడుతున్న ఒక వ్యక్తి నన్ను చూడాలనుకున్నాడు. కాని అతని భార్య మాత్రం నన్ను వారింటికి వెళ్ళటానికి అంగీకరించ లేదు. అప్పుడు అతడు ఒక చీటి (చిన్న ఉత్తరం) పంపించి దానిలో తన ఇంటికి సమీపంలో ఉన్న సత్రంలో వేచి ఉన్నట్లయితే తాను అక్కడకు వచ్చి కలుసుకుంటాను అని వ్రాసాడు. మరొక స్త్రీ అయితే, నన్ను తమ ఇంటికి ఆహ్వానించాలి అని అనుకుంటున్నప్పటికీ, తన అత్తగారిపట్ల భయంతో అలా చేయలేకపోతున్నానని, కనుక నేను తమ ఇంటి ముందు నుంచి వెళ్ళాలని కబురు పంపింది. ఇది ఎందుకో తెలుసా? ఆమె అత్తగారి దృష్టిలో, నేను వారి ఇంటికి వెళ్ళినట్లయితే తమ ఇలవేలుపు కోపగించి వారికి కీడు కలిగించవచ్చును అని, ఎటువంటి దురభిప్రాయమో కదా! ఆ తర్వాత నేను మరొకసారి కలకత్తా వెళ్ళినప్పుడు, ఆ స్త్రీ యొక్క అత్తగారు నన్ను చూడటానికి వచ్చింది. ఆ కుటుంబం ఈతి బాధల్లో ఉందని నాకు తెలియజేయబడింది. ఎవరో ఒక వ్యక్తి నాకు ఆమెను పరిచయం చేశారు. ఇప్పుడు చూడండి, నేనే గనుక ఆమె కోడలి కోరిక మేరకు వారి ఇంటికి వెళ్ళి ఉన్నట్లయితే, వారి బీదరికానికి నేనే కారణమని నాపై అపనింద వేసేవారు. ఈ ప్రపంచంలో ఎటువంటి జనం ఉన్నారో చూడండి!"

ооо

పశ్చిమ దేశాలలోని అభ్యాసుల భక్తి, విశ్వాసాల గురించి బాబూజీ చెప్తూ, "భక్తి, విశ్వాసం వారిలో కొంతమంది విషయంలో చాలా అద్భుతంగా ఉన్నాయి. డెన్మార్క్‌లోని ఒక బాలిక, తమకు ఉన్న రెండు గృహాల్లోను ఒక దానిని విక్రయించి ఆ సొమ్మును ఇక్కడి ఆశ్రమానికి దానం చేయమని తన తల్లికి సలహా ఇచ్చింది. ఆ బాలిక యొక్క సద్భావాన్ని, సునిశితత్వాన్ని (Sharpness) గుర్తించారా! ఆమె తల్లి కూడా అందుకు అంగీకరించింది, కాని నేను మాత్రం అంగీకరించలేదు. దానితో ఆ తల్లి, కుమార్తెలు ఇద్దరూ అసంతృప్తి చెందారు" అని వివరించారు.

ооо

బాబూజీ, తమ యాత్రలో లాలాజీ ఏవిధంగా తనను కాపాడారో తెలిపే ఒక సందర్భాన్ని వివరించారు. "నేను బొంబాయిలో రైలు దిగినప్పుడు ఎటుపోవాలో తెలియక తికమకపడ్డాను. నా సామానులు ప్లాట్‌ఫారమ్ మీదనే ఉంచి, సమీపంలో ఉన్న ఒక హోటల్‌కు విచారణ చేయటానికి వెళ్ళాను. నా భారమంతా లాలాజీ మీదనే మోపి అలా బయటకు వెళ్ళాను. సమీపంలో ఎక్కడా కూడా వసతి దొరకలేదు. నేను తిరిగి వచ్చేవరకు, నా సామాను భద్రంగానే ఉంది. ఆ విధంగా నా సామాను అక్కడే వదిలేసి ఆ రోజున రెండు మూడుసార్లు బయటకు పోవలసి వచ్చింది. కాని, ఎవ్వరూ వాటిని ముట్టుకోలేదు."

ооо

"యూరప్‌లో, ఒక ప్రదేశంలో ఒక బాలిక నన్ను (బాబూజీ) ఇలా ప్రశ్నించింది– 'బాబూజీ, మేము మీవద్దకు ప్రశాంతి మరియు సంతృప్తి కొరకు వస్తూ ఉంటాము. కాని మీరు మాకు విశ్రాంతి లేకుండా చేస్తున్నారు, ఎందుకని?' అని. దానికి నేను ఏమి సమాధానం చెప్పాను అంటే, 'ఒక నూతన వధువుకు తన భర్త గృహం

క్రొత్తచోట ఉన్నట్లుగా అనిపిస్తుంది. దానితో కొంత అశాంతిగా అనుభూతి చెందుతుంది. కాని ఎప్పుడైతే తమ పుట్టినింటి సమాచారం ఆమెకు తెలుస్తుందో, ఒక్కసారిగా ఆమె మనస్సు ఉరకలువేసి తన జన్మస్థానానికి వెళ్ళడానికి అశాంతితో ఉంటుంది.' అదే విధంగా ఒక సద్గురువు జనానికి తన జన్మ స్థానమైన భగవంతుని స్మరణ కలిగించినపుడు, వారు అశాంతికి గురికావటం సహజం."

ooo

ఒకసారి బాబూజీని సందర్శించటానికి వచ్చిన వారిలో ఒక సర్దార్‌జీ ఉన్నాడు. అతడు ఇలా ప్రశ్నించాడు: "బాబూజీ, కబీరు ఒకచోట– ఆఖరికి కలలోనైనాసరే ఎవ్వరైనాగాని రామ నామం స్మరించినట్లయితే సరిపోతుంది. అది అతనికి మాత్రమేగాక ఆ గ్రామాన్నంతటికీ పవిత్రత చేకూరుస్తుంది– అన్నాడు. కాని బాబూజీ, గత చాలా సంవత్సరాలుగా రామనామం ఉచ్చరిస్తున్న చాలామందిలో పవిత్రత కానరాదు, ఎందుకు?" అని. "ఎవ్వరైనాగాని రామ నామం ఉచ్చరిస్తున్నారు అంటే, అప్పుడు వారి దృష్టిలో రాముని గుణగణాలు మెలగాలి. అటువంటి స్థితిని అనుభూతి చెందాలి. చిలక పలుకుల్లాగా కేవలం రామనామం ఉచ్చరించటం వలన ఉపయోగం లేదు. దానికి రెండు పద్ధతులు ఉన్నాయి. అందులో ఒకటి 'ధ్యానం' అయితే రెండవది 'ఉచ్చరించటం' (అనగా జపం). అయితే మన మిషన్‌లో ధ్యానానికే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వబడిందిగాని, ఉచ్చారణకు కాదు. నేను శిక్షణ కొరకు లాలాజీ వద్దకు వెళ్ళినప్పుడు, నేను ఎక్కువగా ధ్యానం మీదనే దృష్టి నిలిపేవాడిని. అదే సమయంలో నేను 'అజప'ను సాధన చేశాను. అయితే అది ఎప్పుడంటే, నాలో దానంతట అదే ప్రారంభమైనదో అప్పుడు మాత్రమే. నేను సదా లాలాజీ యొక్క జ్ఞాపకంలోనే ఉన్నాను" అన్నారు బాబూజీ.

ooo

ఒకసారి విదేశాలలో ఎవ్వరో ఒకరు బాబూజీని అడిగారు– "నేను ఎవరిని, మీరు ఎవ్వరు?" అని. దానికి సమాధానంగా బాబూజీ– "నీవు ఎవ్వరివో అతనివే, నేను ఎవ్వరై ఉండాలో అతడిని" అన్నారు. దైవంవైపు దృష్టి మరల్చి పరిపూర్ణత చెందటం మానవుని కర్తవ్యం. కాని అంతులేని మానవులు అందుకు సంబంధించినది ఏమీ చేయకుండా, అనేక జనన మరణాలకు గురవుతూనే ఉంటారు. ఆ విధంగా వారు బంధనాలకు బానిసలు అవుతారు. బాబూజీ అంతఃకరణం జాగృతమై, లాలాజీకి శరణాగతుడు కావటం ద్వారా పరిపూర్ణతను పొందారు.

ooo

ఒకసారి ఒక పార్లమెంట్ సభ్యుడు ఒకరు బాబూజీ వద్దకు వచ్చారు. అతనికి భగవద్గీతను గురించి సద్భావనలేదు. అతడు, **"సర్వధర్మాన్ పరిత్యజ్య మమేకం శరణం వ్రజ"** (సర్వధర్మాలను విడనాడి, నన్నే ఆశ్రయింపుము అని అర్థం) అను శ్లోకాన్ని చెప్పి, అది తనకు చాలా అహంకారయుతంగా అనిపిస్తోంది అని చెప్పాడు. కనుక అతడు గీతాధ్యయనం నిలిపివేసినట్లుగా చెప్పాడు. బాబూజీ అతనితో– "నీవు అపరిచితులకు ఎలా పరిచయం చేసుకుంటావు? నేను ఫలానా; నేను ఫలానా ప్రాంతానికి చెందినవాడను; నా వ్యాపకం ఇది; నా విద్యార్హత ఇది అని వగైరాలు చెప్పుకుంటావు, అవునా, కాదా?" అందుకు అతడు ఒప్పుకున్నాడు. అప్పుడు బాబూజీ అతనికి ఎదురు ప్రశ్న వేశారు– "అప్పుడు, ఇది నీ యొక్క అహంకారమా? నీకు సంబంధించిన వాస్తవాలు నీవు తెలిపావు. అదే విధంగా, కృష్ణ భగవానుడు తాను ఎవరో తెలిపి, అర్జునుడికి ఏమి చేయాలో చెప్పారు. ఇందులో

అహం ఎక్కడ ఉంది?" అప్పుడు ఆ వ్యక్తి సవినయంగా, "క్షమించండి, స్వామీ, నాకు ఎవ్వరూ దీనిని ఈ విధంగా సుబోధకం చేయలేదు" అని చెప్పి తన కృతజ్ఞతను తెలియజెప్పాడు.

ooo

ఒకసారి ఒకాయన బాబూజీవద్దకు వచ్చారు. అతడు నడుంనొప్పితో బాధపడుతున్నాడు. అతనితో– **"నావద్దకు వచ్చిన ప్రతి ఒక్కరికీ నేను ఎంతో కొంత సేవ చేస్తాను" అన్నారు బాబూజీ.**

ooo

ఒకసారి జర్మనీ దేశంలో బాబూజీ హుక్కా పోయింది. సంబంధించిన అధికారులకు ఫిర్యాదు చేసిన కొన్ని నిమిషాలకే దానిని వెదికి బాబూజీ ఇచ్చిన చిరునామాకు అందజేశారు. అప్పుడు బాబూజీ అన్నారు– "మన దేశం యొక్క ప్రతిష్ట ఇతరత్రా దిగజారుతున్నప్పటికీ మన ప్రభుత్వ ఉద్యోగులు ఇంత సమర్థవంతంగా లేరు. అసమ్మతమైన విషయాలలో మనం సిగ్గువిడిచి నిమగ్నమవుతున్నాము."

ooo

ఒకసారి బాబూజీ డెన్మార్క్‌లో ఉండగా, హుక్కాలో వేసుకునే పొగాకు అయిపోయింది. అది ఆ దేశంలో దొరికే వస్తువు కాదు. అప్పుడు అభ్యాసీ సోదరి ఒకామె ఇటలీ దేశం నుంచి తెప్పించి బాబూజీకి సమర్పించింది. "ఇది నిజమైన ప్రేమ" అని వ్యాఖ్యానించారు బాబూజీ.

ooo

"నేను వృద్ధుడను కనుక నాకు పాతకథలు జ్ఞాపకం ఉన్నాయి. కొన్ని సంవత్సరాల క్రితం, నా ప్రాణాహుతితో అసంతృప్తి చెందిన ఒకాయన, 'ఛీ, ఇదేమి ట్రాన్స్‌మిషన్' అన్నాడు. ఇదే విధంగా రెండు రోజులు ట్రాన్స్‌మిషన్‌తో అతడు అసంతృప్తి చెందాడు. మూడవ రోజున నేను అతనితో కొంచెం దబాయింపుగానే 'నా ట్రాన్స్‌మిషన్ నీవు రుచి చూడదలుస్తున్నావా? అయితే, ఒక విల్లు పత్రం నీ కుమారుని పేరుతో తయారు చేయించుకుని రా!' అన్నాను. ఇక అంతే, అతను నోరు మూసుకున్నాడు" అన్నారు బాబూజీ.

ooo

ఒకసారి, బీదర్ నుంచి ఒక అభ్యాసీ, అతని కష్టాలు తీరేంతవరకు ఉపవాసం ఉండదలచినట్లు బాబూజీకి టెలిగ్రాం పంపాడు. బాబూజీ చలించిపోయారు. "ఇదేమి వైరాగ్యం, మొండిపట్టుదల?" అంటూ బాబూజీ ఆశ్చర్యపోయారు. అప్పుడు బాబూజీ ఆ సెంటర్ నిర్వహణలో బాధ్యులుగా ఉన్న ప్రిసెప్టర్‌కు ఆ సంగతి ఏమిటో చూడమని ఉత్తరం వ్రాసారు. కొంతకాలం తర్వాత ఆ బాధితుడు తన తప్పు తెలుసుకుని, సిగ్గు చెందాడు.

ooo

ఢిల్లీ నుంచి ఒక సత్సంగీకుడు తన ధ్యాన సాధన సక్రమంగా జరగటంలేదని వాపోయాడు. దానికి సమాధానంగా బాబూజీ అన్నారు: "ఏదో ఒక వంకతో మనం ధ్యాన సాధన నిలిపివేయరాదు. **ఇంటి పనులతో తీరిక దొరకడంలేదని చెప్పటం ఒక దొంగసాకు. మనం అనారోగ్యం పాలయితే అన్ని పనులూ తప్పకుండా**

**వదిలేసి మంచంమీదనే పడి ఉండాల్సి వస్తుంది. సాక్షాత్కారం గురించిన తపన ఎవ్వరికైనా ఉన్నట్లయితే, ఎలాంటి పరిస్థితుల్లోనూ ధ్యానాన్ని నిర్లక్ష్యం చేయకూడదు. ఏ విధమైన కారణంతోనూ మన కర్తవ్యాన్ని మరచిపోకూడదు."**

ooo

బాబూజీ ఇతరులతో పని చేయించటంలో మంచి నేర్పరులు. 'వారు' ఎవ్వరితోనూ కఠినంగా మాట్లాడేవారు కాదు. 'వారు' పని చేస్తున్నవారికి ప్రేరణ కల్పించేవారు, పొగడేవారు, చాలా మృదువుగా సంభాషించేవారు. 'వారి' చిరునవ్వు అందరినీ సమ్మోహనపరచి వశీకరణ చేస్తున్నట్లుగా ఉండేది.

ooo

ఒకసారి, "దక్షిణ భారతదేశంలో విగ్రహారాధన బాగా వ్రేళ్ళూనుకు పోయిందా?" అని అడుగుతూ బాబూజీ అన్నారు: "విగ్రహారాధన అనేది మన మానసానికి ఉపశమనం కల్పించటానికి ఒక నటన లేదా కల్పితం మాత్రమేగాని అంతకుమించి మరేమీ కాదు. సక్రమమైన విగ్రహారాధన యొక్క ప్రయోజనాన్ని బహుకొద్దిమంది మాత్రమే గ్రహించగలిగారు. అది మేలు కూర్చటానికి బదులు అపకారం చేయటమే అవుతుంది. కాని దానిని మనం అర్థం చేసుకోలేకపోతున్నాం. ఉత్తర భారతదేశంలో కూడ, విగ్రహారాధన నెలకొని ఉంది. ఇక్కడి జనం కూడా గట్టి మతతత్వం కలవారే.

ఇక్కడి వారు కూడా 'సత్యనారాయణ' వ్రతం ఆచరిస్తారు. ఒక విధంగా చెప్పాలంటే, అది సత్యం పలకటానికి, అది వర్థిల్లటానికి కాకుండా ఆ ప్రసాదం యొక్క రుచి కొరకే. కథా వస్తువు మరియు దాని సారాంశం కంటె ప్రసాదం రుచికరంగా ఉంటుంది."

ooo

బాబూజీ, షాజహాన్‌పూర్ సందర్శించే జనం యొక్క స్వభావం గురించి మాట్లాడుతూ, "ఇక్కడకు వచ్చేవారి ముఖ్య ఉద్దేశ్యం ఆధ్యాత్మిక జ్ఞానాన్ని తెలుసుకోవటానికి కాదు. ఇక్కడ ఉండటంలోగల సౌకర్యాల్ని అనుభవించటం మీదనే వారు ఎక్కువగా దృష్టిపెడతారు. నేను కూడా వారి అభిమతానికి అనుగుణంగానే ఇస్తాను. వారికి సౌకర్యాలే కావాలను కుంటె, నాకు అవకాశం ఉన్నంతవరకు వాటినే సమకూర్చుతాను. ఒకసారి ఒక పెద్దమనిషి నావద్దకు వచ్చాడు. అతడు, అందరికొరకు ఏర్పాటు చేయబడిన పదార్థాలను స్వీకరించేవాడు కాదు. అతను బ్రెడ్, బట్టర్ వంటివి కావాలని అడిగేవాడు. ఇవి షాజహాన్‌పూర్‌లో కాస్త ప్రియమైనవే అయినా, గత్యంతరంలేక వాటిని ఖరీదుచేసి అతనికి సమకూర్చేవాడను. మీ అంతట మీరు ఆలోచించండి. ఇది అభ్యాసీ అనువానికి తగునా?" అన్నారు.

ooo

"విదేశాలలో నేను వారి ప్రదేశాలను విడిచి వస్తున్నప్పుడు పురుషులు కంట తడిపెట్టేవారు. స్త్రీలయితే వెక్కి వెక్కి రోదించేవారు. అలా ఎందుకో తెలుసా? నేను వారిపట్ల చూపుతున్న ప్రేమ మరియు విశ్వాసాలకు అది తార్కాణం. **మనం ప్రేమ కలిగి ఉండాలి. అది మాత్రమే హృదయాన్ని జయించగలుగుతుంది.** ఇదంతా లాలాజీ సాహెబ్ కృప" అన్నారు బాబూజీ.

ooo

బాబూజీ చాలామంది మానసిక రోగులకు చికిత్సతో వ్యాధి కుదిర్చారు. ఒకసారి ఈ విషయమై లాలాజీ సాహెబ్ తమను మందలిస్తూ "నేను నిన్ను ఇందుకే తయారు చేశానా?" అన్నారట. అప్పుడు తాను మౌనంగా ఉండిపోయినట్లు బాబూజీ చెప్పారు. ఏదైనా వ్యాధికి మూలం ఏమిటో బాబూజీ క్షణాల్లో కనిపెట్టేవారు. వారు చెప్పారు: "హృదయం, దాని సంకేతం వెంటనే తెలియజేస్తుంది, అయితే దానిని వివేకంతో గ్రహించగలగాలి. మనస్సు మరియు హృదయాల పనితనం వేరుగా ఉంటాయి."

ooo

బాబూజీ చెప్పారు: "ప్రతి ఒక్కరిలోను ఏవో బలహీనతలు ఉంటాయి. ఎటువంటి బలహీనత లేకుండా ఉండి ఉంటే మానవుడు దైవమై ఉండేవాడు. ఒకసారి ఒక పెద్దమనిషి నావద్దకు వచ్చాడు. అతడు నా నిత్య కార్యక్రమం క్షుణ్ణంగా పరిశీలించి ఒకరోజున చెప్పాడు –మీలో హుక్కా పీల్చటం మినహా అన్నీ సద్గుణాలే ఉన్నాయి. మీలో ఉన్నది ఈ ఒక్క దురలవాటే అనుకుంటాను, అని. నేను ఆయనకు సమాధానంగా చెప్పాను– అవును, ఈ దురలవాటు నాలో లేకపోయి నట్లయితే, మీరు నన్ను దేవుని స్థాయికి చేర్చి ఉండేవారు, దానిని కోరుకోవటం లేదు. అందుకే హుక్కా పీల్చుతున్నాను."

ooo

ఒక రోజున కలకత్తా నుంచి బాబూజీ వద్దకు ఒక యువకుడు వచ్చాడు. అతడు సాధనా ప్రపంచానికి పూర్తిగా అపరిచితుడు. అతడు రైల్వేలో పని చేస్తున్నాడు. అతడి పెద్దసోదరుడు అభ్యాసీయై ఉన్నందువలన బలవంతంగా అతడిని పంపాడు. అతడు తన భార్య మరియు కుమార్తెను వెంటబెట్టుకుని వచ్చాడు. తను "సహజమార్గం"కు సంబంధించిన ఒకటి రెండు పుస్తకాలు చదివినట్లు, అయినా ఏమీ అర్థం చేసుకోలేకపోయాను అని చెప్పాడు.

అతడు, "బాబూజీ! నేను ఏవో కొన్ని ప్రశ్నలు అడగాలను కుంటున్నాను, కాని ఏమి అడగాలో తెలియటం లేదు" అన్నాడు. అప్పుడు బాబూజీ అతనితో "ఇది అనుభూతికి చెందిన విషయం. అందుచేత సాధనచేసి నీ అంతట నీవే తెలుసుకో" అన్నారు.

ooo

బాబూజీ చెప్పారు: "లాలాజీ సాహెబ్ ప్రతినిధిత్వం గురించి మంచి చర్చనీయాంశమైంది. ఎక్కడో ఒకచోట నేను 'వారి' ప్రతినిధిగా ఉండి, పశ్చిమ దేశాల్లో ఆధ్యాత్మికతను చాటి చెప్పవలసిందని వ్రాసి ఉన్నట్లుగా చెప్పబడింది. దీనిని ఉరయ్‌కు చెందిన ఒక అభ్యాసీ సోదరుడు తర్వాత నాకు చెప్పాడు. నేను అంటె గిట్టని 'వారి' శిష్యులు ఆ పేజీలను చింపివేశారు. వాళ్ళు అంగీకరించినా అంగీకరించక పోయినా కూడా నాకు పోయేది ఏముంటుంది? దానికి బదులుగా వారంతట వారే పొందవలసిన లాభాన్ని కోల్పోయారు. ఎందుకంటే, లాలాజీ సాహెబ్ కృప వారి ప్రతినిధి ద్వారానే ప్రవహించింది. నావరకు నాకు, లాలాజీ సాహెబ్ నా జీవిత సమస్యను పరిష్కరించారు. ఇప్పుడు నా నుంచి లాభం చేకూర్చుకోవాలో లేదో వారికే వదిలివేస్తున్నాను. **మీరా వెన్న తీసింది, ఆ మజ్జిగను ఎవ్వరైనా త్రాగవచ్చు.** లాలాజీ సాహెబ్‌కు అనేక ధన్యవాదాలు." బాబూజీ ఈ పర్షియన్ పద్యాన్ని ఉదహరించారు: "ఆ కాంతి నాలో ఎంతగా వ్యాపించింది అంటె, అదే సమస్యగా తయారైంది."

ooo

బాబూజీ చెప్పారు: "నేను ఒకసారి, లక్ష్మణుడు, వాళ్ళు అడవిలో ప్రవాసం ఉంటున్నప్పుడు సీత ఉన్న కుటీరం చుట్టూ ఆమె రక్షణార్థం, వలయాకారంలో గీతలు ఎలా గీశాడు అని దీర్ఘంగా ఆలోచించాను. అతడు తన ఇచ్ఛాశక్తితో ఆ రక్షణ వలయాలు గీశాడు. తన ఇచ్ఛాశక్తితోపాటు అగ్నిని కూడా దానితో జతపర్చాడు. రావణుడు వచ్చి, ఆ కుటీరం యొక్క తలుపువద్దకు చేరాలని అనుకుంటూ ఆ రక్షణ రేఖలను సమీపించేసరికి వాటి నుంచి అగ్ని ఒక్కపెట్టున ప్రజ్వరిల్లింది. అప్పుడు రావణుడు ఆ గీతలను దాటడానికి సాహసించలేకపోయాడు. కస్తూరి ఈ ప్రయోగాన్ని చేపట్టింది. దానివలన లాభం కలిగింది కూడా. దివంగత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ రక్షణభారం నేను కస్తూరిమీద మోపాను. ఒకసారి, అతడు ఇండోర్ సందర్శించినపుడు, అతని జీవితానికి ప్రమాదం ఉన్నదని కస్తూరి గ్రహించి అతని రక్షణార్థం అతని చుట్టూరా లక్ష్మణ రేఖల వంటి వాటిని కల్పించింది. మరొక సందర్భంలో, నేను ఈశ్వర్ సహాయ్‌గారితో కలిసి దక్షిణ భారతదేశంలో పర్యటిస్తున్నప్పుడు దొంగలు, దోపిడీదారులు నుండి రక్షణ నిమిత్తం షాజహాన్‌పూర్‌లో నా ఇంటి చుట్టూరా కూడా ఆమె ఇటువంటి రక్షణ రేఖలనే కల్పించింది. నేను ఆమె చేసిన ఈ పనులకు అభినందలు తెలుపవలసి ఉంది. వీటిని నమ్మటానికి ఎవరు సిద్ధంగా ఉన్నారు?" బాబూజీ తను కూడా ఇదే విధంగా చాలామంది జీవితాలను కాపాడినట్లుగా చెప్పారు.

ఒకసారి బాబూజీ భూతాలు, ప్రేతాత్మలు గురించి మాట్లాడుతూ అవి ఉన్నట్లుగా ధృవపర్చారు. అంతే కాకుండా, అవి మనుష్యులకు హాని కలిగిస్తాయి అని కూడా బాబూజీ చెప్పారు. 'వారు' ఇంకా ఏమి చెప్పారంటే, ఎక్కడైతే స్వచ్ఛమైన దైవభక్తి విలసిల్లుతుందో అక్కడ అవి ఏమీ చేయలేవు అని చెప్పారు. అటువంటి భూతాలు, ప్రేతాత్మలు ఎక్కువగా భారతదేశంలోనే ఉంటూ ఉన్నట్లుగా బాబూజీ అనుభూతి చెందారు. ఇది 'వారి' పరిశీలన మరియు అనుభవంగా ఉంది. దీనికి కారణం దైవారాధనకు ఆచరించే తప్పుడు విధానాలే అని అన్నారు. 'వారు' అటువంటి భూత ప్రేతాత్మలను చాలా వాటిని అణచివేసి అవి ఆవహించిన చాలామందిని కాపాడినట్లుగా బాబూజీ చెప్పారు. వారి మాటల్లో: "నేను ఇప్పుడు అటువంటివి చేపట్టటం లేదు. అటువంటి అనవసర విషయాలలో నేను ఎందుకు నా సమయం వృథా చేసుకోవాలి?" అని అన్నారు.

"లాలాజీ సాహెబ్ తమ అనుభవాలన్నింటినీ నాకు బదలాయించారు. దాని వలన నేను చాలా రకాల అనుభవాలను కలిగి ఉన్నాను. అదంతా వారి కృపయే" అన్నారు బాబూజీ.

○○○

బాబూజీ తమకు 15 లేక 16 సంవత్సరాల వయస్సు ఉన్నప్పుడు నిద్ర నుంచి ఎలా మేల్కొనేవారో వివరించారు. బాబూజీ చెప్పారు: "నిద్రలో ఉండగా, నా చేతుల్లో ఏదో ఒక చెయ్యి నా బుగ్గను మృదువుగా తాకేది, అప్పుడు నేను వెంటనే నిద్ర నుండి లేవటం జరిగేది. ఇలా ఎందుకు జరిగిందో నాకు అర్థం కాలేదు. ఒకసారి నేను లాలాజీ సాహెబ్ వద్దకు వెళ్ళినప్పుడు, ఈ విషయం వారికి నివేదించాను. ఈ సంగతి వింటూనే 'వారు' చిరునవ్వు నవ్వారు. ఇంక అప్పటినుండి ఈ అనుభవం ఆగిపోయింది."

○○○

బాబూజీ, 1968వ సంవత్సరంలో హైదరాబాద్‌లో జరిగిన సంఘటన గురించి చెప్పారు. ఒక నిరుద్యోగ యువకుడు తను తన కుటుంబాన్ని పోషించుకునే దారిలేక ఆత్మహత్య చేసుకోవటానికి నిర్ణయించుకున్నాడు. అతడు బాబూజీ గురించి విని 'వారి' దర్శనానికి వచ్చాడు. బాబూజీని ఏకాంతంగా కలిసి, తన స్థితిని గురించి తెలిపి దుఃఖించసాగాడు. బాబూజీ అతనికి తగిన మార్గాంతరం ఉపదేశించి, కొంత ఆర్థిక సాయం కూడా అందించి పంపించివేశారు. ఆ తర్వాత అతడు హైదరాబాద్ పరిసరాలలో ఒక హిందీ భాష అధ్యాపకుడుగా ఉద్యోగం పొందాడు.

ooo

బాబూజీ చెప్పారు: "మా తండ్రిగారు పెద్ద మొత్తాలలో ధనాన్ని విద్యా సంస్థలకు దానం చేసేవారు. వారికి దివంగత పండిట్ మదన్ మోహన్ మాలవీయతో సన్నిహిత స్నేహం ఉండేది. వారు ప్రతి సంవత్సరం కాంగ్రీ గురుకుల్ మరియు బనారస్ హిందూ యూనివర్శిటీకి డబ్బు పంపించేవారు. కొన్ని సందర్భాలలో పండిట్ మాలవీయగారు మా ఇంటికి వచ్చినప్పుడు, మా తండ్రిగారు వారితో సరదాగా, "పండిట్‌జీ చందా అర్థించటానికి వచ్చారా?" అనేవారు. పండిట్ మాలవీయ మరణాంతరం, దీనికి సంబంధించి ఒక ఉత్తరం నాకు వచ్చింది. అప్పటికి జమీందారీ వ్యవస్థ రద్దు చేయబడిన కారణంగా, మా ఆర్థిక స్థితి కూడా క్షీణించింది. నేను గత్యంతరంలేక దానిని ఆపివేయాల్సి వచ్చింది. మా తల్లిగారు కూడా ప్రతి సంవత్సరం "కాళీ కమ్లివాలా ధర్మశాల"కు కొంత ధనం పంపిస్తూ ఉండేది."

ooo

ఒకరోజున లాలాజీ సాహెబ్ నన్ను (బాబూజీ) అడిగారు: "నీవు ఆశ్రమం గురించి తీవ్రంగా వ్యథ చెందుతున్నావు. దాని నిర్మాణం పూర్తయ్యిందా, కాలేదా?" అని. అప్పుడు నేను చెప్పాను: "నా స్వామీ, ఇదంతా తమ కృపయే."

ooo

షాజహాన్‌పూర్‌లో ఆశ్రమ భవన రూపురేఖల (Architecture) గురించి చర్చ జరుగుతున్నప్పుడు బాబూజీ చెప్పారు: "అందరూ కూడా ఆశ్రమం యొక్క సాటిలేని అందాన్ని గూర్చి పొగుడుతున్నారు. ఇటువంటి భవనం షాజహాన్‌పూర్ అంతటిలోను, పరిసర ప్రాంతాలలో కూడా ఎక్కడా లేదు. నాకు గృహ నిర్మాణ విద్య (Architecture) గురించి తెలియదు. అయినా కూడ నిర్మాణ సమయంలో నేను చాలా ఉపయోగకరమైన సలహాలు ఇచ్చాను. లాలాజీ సాహెబ్ కృపవలన అనేక విషయాల రహస్యం నా ఎదుట ప్రత్యక్షమవుతూ ఉండేది. నా హృదయం ఆ విషయానికి సంబంధించి సంకేతం ఇచ్చేది."

బాబూజీ ఇంకా ఇలా చెప్పారు: "ఒకసారి ఒక అద్భుత ఘటన జరిగింది. నా స్నేహితుడు ఒకరు చాలా అందమైన గృహం నిర్మించుకున్నాడు. దాని నిర్మాణం పూర్తయ్యాక, అతడు దానిని చూపించటానికి నన్ను తీసుకుని వెళ్ళాడు. ఇంటిలో కొన్ని వసతులు చాలా బాగా సమకూర్చబడ్డాయి. అతడిని ప్రశ్నించాను– 'ఈ ఇంటి ప్లాను నీవే స్వయంగా తయారుచేసుకున్నావా లేక ఎవ్వరైనా నిర్మాణ నిపుణుడ్ని (Architect) సంప్రదించావా?' అని. అతడు నవ్వుతూ నాకు చెప్పాడు: 'బాబూజీ, ఈ ఇంటి ప్లాను తమచేతనే తయారు చేయబడింది' అని.

నాకు ఆశ్చర్యం కలిగింది. 'నీవు నన్ను నవ్వులాట పట్టిస్తున్నావా?' అన్నాను. దానికి అతడు గట్టిగా స్పందించాడు: 'నేను దీని నిర్మాణం ప్రారంభించినపుడు ఎవ్వరినీ సంప్రదించలేదు. దీని బ్లూప్రింట్ (ప్లాను కాపి) నేను తయారు చేసుకున్నాను, మధ్యలో కొన్ని వసతుల గురించి నాకు ఆలోచన వచ్చింది కాని వాటిని ఎలా పొందుపర్చి, ఆచరింపజేయాలో తెలియలేదు. ఈ సమస్య నన్ను కొంతకాలం వేధించింది. దానితో పని నిలిపివేశాను. ఒకరోజు రాత్రి మీరు నాకు కలలో కనిపించి, నా సమస్యకు పరిష్కారం డ్రాయింగ్ (రేఖాచిత్రం) రూపంలో చూపించారు. నేను నిద్రలేచీ లేవటంతోనే, మీరు నాకు కలలో చూపించిన విషయాలను వ్రాసుకోవటమే నా మొట్టమొదటి పనిగా చేశాను. దాని ఫలితంగానే ఈ ఇంటి నిర్మాణం ఈ విధంగా జరిగింది' అని చెప్పాడు. నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. ఇటువంటి సంఘటనలు ఎలా జరుగుతాయో నాకు తెలియదు."

ooo

బాబూజీ చెప్పారు: "రెండవ ప్రపంచ యుద్ధం – జర్మనీ యుద్ధ సమయంలో నేను కాళికాదేవిని పురికొల్పాను. రెండవసారి, ఆ పని నేను స్వయంగా చేయాల్సి వచ్చింది. వీటన్నింటినీ ఎవ్వరు నమ్ముతారు? ప్రజలు ఏమనుకుంటారు అంటే –ఇతడు స్వంత గొప్పలు చెప్పుకోవటంలో మంచి నేర్పరి, అని. అవునా, కాదా?"

ooo

సంస్థ నిర్వహణ గురించిన 'వారి' (బాబూజీ) యొక్క భావాలు చాలా సూచనాత్మకంగా (Instructive) ఉండేవి. బాబూజీ చెప్పారు: "మన మిషన్ ఏ విధంగా నిర్వహించబడాలి అంటె, ఏ ఒక్కరుగాని, మిషన్ యొక్క సెంటర్‌గాని తప్పు చేసినట్లయితే, ప్రతి ఒక్కరు దాని గురించి విచారించటమేగాక దానిని సరిదిద్దే ఆలోచన చేయాలి. ఏదైనా గడ్డగాని, మొటిమగాని మన శరీరం మీద కనిపించినట్లయితే, మన శ్రద్ధ అంతా దానిమీద కేంద్రీకరించబడి దాని నివారణ గురించి ఆలోచించటం జరుగుతుంది. అదే విధంగా మిషన్ యావత్తు ఒకే ఒక్క శరీరంలాగా పని చేయాలి. ఈ సందర్భంలో కబీరు గురించిన కథ ఒకటి నాకు జ్ఞాపకం వస్తోంది, దీనిని నేను చాలాకాలం క్రిందట చదివాను. ఒకసారి కబీరు తన కుమారుడు కమల్‌తో దీపం వెలుగుతో దేనినో వెదకమన్నాడు. కమల్ లాంతరు వెలిగించి ఇల్లంతా వెదికాడు కాని ఏమీ కనిపించలేదు. అప్పుడు కబీర్, తన కుమార్తె అయిన కమాలితో కూడా అదే విషయం చెప్పాడు. చేతిలో లాంతరు (దీపం) తీసుకుని ఆమె కూడా ఎంత వెదికినా ఇంట్లో ఏమీ కనిపించనందున వచ్చి తన తల్లి చెంతన కూర్చుంది. కబీరు వారిద్దరినీ ప్రశ్నించాడు: 'నా బిడ్డలారా! మీరేమి వెదికారు?' అని. దానికి సమాధానంగా వారు 'దాని గురించి మాకు ఏం తెలుసు? కేవలం మీ ఆజ్ఞను పాటించటం మాత్రమే మాకు తెలుసు' – అన్నారు. ఈ జవాబుతో కబీరు చాలా సంతోషించాడు. మన మిషన్ వ్యవస్థ నిర్వహణ కూడా ఇదే విధంగా ఉండాలి. ఏ ఒక్కరు కూడా పెద్దల (అనగా ప్రిసెప్టర్సుగాని, సెంటర్ ఇన్‌చార్జ్‌గాని) ఆజ్ఞను ధిక్కరించకూడదు. దీని అర్థం, వారు ఏది చెప్పినా, ప్రతి దానినీ శిరసావహించమనీ కాదు. నేను ఇలా చెప్పటంలో నా ఉద్దేశ్యం, వారంతా స్వచ్ఛంగా పని చేయటంలో ఏకాభిప్రాయంతో ఉండాలి."

ooo

బాబూజీ ఈ సంఘటన గురించి చెప్పారు: "ఆలోచన యొక్క కదలిక చాలా వింతగా ఉంటుంది. ఇప్పుడు చూడండి, నేను ఇప్పుడు ఆలోచనారహిత స్థితిలో ఉన్నప్పటికీ, నా ఆలోచన చైనా దేశపు పశ్చిమ ప్రాంతంవైపు మళ్ళింది. నేను అక్కడి ఒక నల్లటి రేఖను చూస్తున్నాను. బహుశా అక్కడ ఏదో గడబిడ జరుగుతోంది. ఒకసారి నేను లాలాజీ సాహెబ్‌తో అన్నాను: 'దయచేసి నన్ను పాకిస్తాన్ మీద మూడు రోజులు, చైనామీద వారం రోజులు పనిచేయటానికి అవకాశమివ్వండి. వాళ్ళ దుడుకు ప్రవర్తన ఏమిటో నేను చూస్తాను' అని. అప్పుడు లాలాజీ సాహెబ్, 'వద్దు, వాళ్ళు మన దేశానికి శత్రువులే కావచ్చు కాని దైవంపట్ల అలా కాదు' అన్నారు. అప్పుడు నేను మౌనం దాల్చవలసి వచ్చింది. ఏ విషయంలోనైనాగాని మనం ప్రకృతి నియమాన్ని ఉల్లంఘించిపోరాదు."

ooo

ఆత్మను గురించిన చర్చలో బాబూజీ చెప్పారు: "ఆత్మ శరీరంలో కొంతకాలం నివసించి ఉన్నందున దానితో దానికి (ఆత్మకు) అనుబంధం ఏర్పడుతుంది. ఒకసారి నేను ఆఫీసుకు వెళ్ళుతున్నాను. తోడుగా ఈశ్వర్ సహాయ్‌గారు కూడా ఉన్నారు. ఆ సమయంలో అకస్మాత్తుగా ఒక మృతదేహం స్మశానానికి తీసుకు వెళ్ళబడుతోంది. ఆ మృతదేహం యొక్క రొమ్ము భాగంలో ఏదో సుడులు తిరుగుతూ దానిలో ప్రవేశించటానికి ప్రయత్నిస్తోంది. నేను ఈశ్వర్ సహాయ్‌గారితో, 'మాస్టర్ సాహెబ్! అటు చూడండి. ఆత్మ ఆ శరీరంలో ప్రవేశించటానికి ఎలా ప్రయత్నిస్తున్నదో చూడండి!' అన్నాను. అలా చెప్పి వారికి దానిని చూపించాను. మృత దేహాన్ని దహనం చేయటం మంచి విధానం. దానివలన శరీరంతో ఆత్మ యొక్క అనుబంధం విచ్ఛిన్నం చేయబడుతుంది."

ooo

"సోమరితనాన్ని ఎలా నిర్మూలించాలి" అను ప్రశ్నకు సమాధానమిస్తూ– "నీవు ఏదైనా ఉపయోగకరమైన పనిలో నిమగ్నమై ఉండు. అప్పుడు సోమరితనం దానంతట అదే పారిపోతుంది. నన్ను నీవు చూస్తున్నావు, నా కంటె సోమరి ఎవ్వరూ లేరు" అన్నారు బాబూజీ.

ooo

"లాలాజీ సాహెబ్ ఎవరైనా తన పాదాలను ముట్టుకోవటానికి ఇష్టపడేవారు కాదు. ఒకసారి 'వారు' దానిని బహిరంగంగా చెప్పారు. ఆ రోజు నుంచి నేను ఈ ఆచరణను మానివేశాను. వారికి నేను దూరం నుంచి నమస్కారం చేసేవాడను. గురువుకు అయిష్టమైన పనిని మనం ఎందుకు చేయాలి" అని చెప్పారు బాబూజీ.

ooo

బాబూజీ ఒక సామెత గురించి చెప్పారు: "లక్ష్మీ దేవత యొక్క వాహనం గుడ్లగూబ అని చెప్పబడింది. ఎవరి ఇంట్లోనయితే లక్ష్మీదేవి నివసిస్తుందో వారి వివేకం, గుడ్లగూబకు పగలు కళ్ళు కానరానట్లు గానే అవుతుంది. ఇది చాలా అర్థవంతమైన ఉపమానం."

ooo

"లాలాజీ సాహెబ్‌తో నాకు సంబంధం ఏర్పడిన తర్వాత, వారి (లాలాజీ సాహెబ్) తర్వాత ఏమి జరుగుతుంది అను సంకేతం వచ్చింది. కాని దానికి నా హృదయంలో స్థానం ఇవ్వలేదు. తర్వాత ఖచ్చితంగా అదే జరిగింది. లాలాజీ సాహెబ్ తర్వాత, నా గురుభాయీలు (సహఅభ్యాసులు) కొందరు నన్ను వ్యతిరేకించారు. కాని రామేశ్వర్ ప్రసాద్ గారు మాత్రం నన్ను లాలాజీ వారసునిగా ఫతేఘర్‌లోని భండారా (బసంత పంచమి) ఉత్సవంలో ప్రకటించారు. క్రమంగా వ్యతిరేకత సద్దుమణిగింది. కాని నన్ను వ్యతిరేకించిన వారిలో చాలామంది నావద్దకు ఎప్పుడూ రాలేదు" అన్నారు బాబూజీ.

ooo

బాబూజీ, తను లాలాజీ నుంచి ఎటువంటి మార్గదర్శనం పొందారో, ఇప్పటికీ పొందుతున్నారో దానిని వివరించారు. బాబూజీ లేఖ వ్రాసిన ప్రతిసారీ, లాలాజీ ఇతరులవద్ద వారిని (బాబూజీని) పొగడుతూ ఉండేవారు. "ఆధ్యాత్మిక అనుభూతులను అభివ్యక్తం చేయాలంటే ఎవ్వరైనాగాని రామచంద్రను అనుసరించాలి. ఇది నిజమైన అనుభూతి అవుతుంది. మీరందరూ అతని ఉత్తరాలను చదివి నేర్చుకోవాలి" అని లాలాజీ చెబుతూ ఉండేవారు.

ooo

"నేను విదేశాలలోని అభ్యాసులకు ఉత్తరం వ్రాయవలసిన సందర్భం ఏర్పడినప్పుడల్లా, నేను లాలాజీని ప్రార్థించేవాడను. అప్పుడు లాలాజీనే వాటికి సమాధానం చెప్పి వ్రాయించేవారు. అయితే ఒక్కసారి, అటువంటి సందర్భంలో నన్ను –'నేను నీ సేవకుడిని అనుకుంటున్నావా? నీవు స్వయంగా వ్రాయటం ఇంక నేర్చుకోవాలి' అని కోపగించుకున్నారు. నేను 'వారి' సలహా ప్రకారమే చేశాను. అప్పుడు 'వారు' నాతో 'చూడు, నీవు ఎంత బాగా వ్రాసావో!' అన్నారు. ఇంక అప్పటినుంచి నేను వారికి ఈ విషయంలో శ్రమ కలిగించలేదు" అని చెప్పారు బాబూజీ.

ooo

"ఒకసారి, చాలా సంవత్సరాలకు పూర్వం, నేను ఒక స్వామీజీని కలవటానికి వెళ్ళాను. వారిని దర్శించటానికి వచ్చినవారు చాలామంది వేచి ఉన్నారు. నేను నిశ్శబ్దంగా కొంత దూరంలో నిలబడి ఉండిపోయాను. అప్పుడు ఆ సమూహంలో నుంచి స్వామీజీ నన్ను దగ్గరకు రమ్మని పిలిచి– 'ఇక్కడ ఇటుకలు, సున్నంతప్ప ఇంకేమీ లేదు. ఇప్పుడు నీవు చేస్తున్నటువంటిది చాలా మంచి పని. దయచేసి దానిని కొనసాగించు' అని అన్నారు. అప్పుడు నేను స్వయంగా వారితో నేను లాలాజీ సాహెబ్ శిష్యుడను అని పరిచయంగా చెప్పాను. వెంటనే దానికి వారు– 'ఓ అలానా! నేను 'వారి'ని బాగా ఎరుగుదును. వారొక గొప్ప సెయింట్. వారిని విడిచిపెట్టవద్దు' అని సలహా నిచ్చారు. నేను వెనుదిరిగి వచ్చాను" అన్నారు బాబూజీ.

ooo

విదేశంలో ఒకచోట బాబూజీకి ఈ ప్రశ్న వేశారు: "బాబూజీ! మానవుడు, ఒక బంధనాల మూట అని మీరు చెబుతారు కదా! అటువంటప్పుడు మీరు ధ్యానం అనే బంధనాన్ని ఎందుకు అంటగట్టతారు?" అని. దానికి సమాధానంగా బాబూజీ, **"ధ్యానం అనేది ఒక బంధనం కాదు. అది ఇతర బంధనాలను తెగత్రెంచే ఒక చర్య"** అని చెప్పారు.

ooo

“కుమారునికి తన తండ్రి యొక్క ప్రతి మాటను ఆమోదించటం కర్తవ్యంగా ఉంటుంది. ఆ తండ్రి కనుక భగవంతునికి విరుద్ధమైన ఏ మాటలైనా చెప్పినట్లయితే, కొడుకు దానిని పాటించాల్సిన అవసరంలేదు. ఎందుకంటే, మానవునికి భగవంతుని సాక్షాత్కారం అనేది మొట్టమొదటి కర్తవ్యంగా ఉంటుంది. భక్తుడైన ప్రహ్లాదుడు ఇందుకు ఒక స్వచ్ఛమైన ఉదాహరణ, ఈ విషయంలో దానిని అనుసరించటం మంచిదవుతుంది. నేను ఎప్పుడూ నా తండ్రిగారి ఆజ్ఞను జవదాటలేదు. నేను ఆయనకు తెలియకుండా లాలాజీ వద్దకు వెళ్ళే వాడిని” అని బాబూజీ చెప్పారు.

“ఒకసారి లాలాజీ సాహెబ్ నాతో, ‘ఎవ్వరైనా భగవంతుని నుంచి ఎక్కువ పని తీసుకున్నారు అంటే, అది నీవు మాత్రమే’ అని అన్నారు. ఇందులో హాస్యం కూడా మిళితమై ఉంది” అని బాబూజీ చెప్పారు.

ooo

“మా తండ్రిగారు స్పృశ్యత మరియు అస్పృశ్యత (అనగా అంటుకోవటం, అంటరానితనం) గురించి చాలా కఠినమైన వైఖరితో ఉండేవారు. బ్రాహ్మణులచేతి భోజనంతప్ప మరెవ్వరి భోజనం కూడా ఎప్పుడూ తీసుకునేవారు కాదు. ఒకవేళ వైశ్యులు మరియు ఇతరుల ఇంటికి వెళ్ళవలసివస్తే పూరీలు మాత్రమే స్వీకరించేవారు. ఇతరులు ఉపయోగించిన హుక్కాను ఎప్పుడూ ఉపయోగించేవారు కాదు. అప్పుడప్పుడు నాకూ అదే ఆలోచన ఉండేది కాని దానిని సర్దుబాటు చేసుకున్నాను. ఇతరులు అంటుకున్నదాని వలన ఏం జరుగుతుందో నాకు తెలియదు. ఇది అర్థరహితమైన ఆలోచన. అస్పృశ్యతను, స్పృశ్యతను అతిగా ఆచరించటంలో అర్థం లేదు” అని అన్నారు బాబూజీ.

ooo

“ఆశ్రమంలోని బోరుపైపు నీరు చాలా రుచిగా ఉంటుంది. దానిలో ఇనుప ధాతువు బాగా ఉంది. ఆశ్రమ వాతావరణం చాలా ఆరోగ్యకరమైనది. ప్రకృతి వైద్యానికి ఇంతకుమించి ఇంకేమి కావాలి? ఇవి ఆరోగ్యాన్ని మెరుగుపర్చటంలో చాలా సహాయపడతాయి. మీరు ఏదైనా నీరు ఇవ్వండి, దానిలో ధాతువులు (మినరల్స్) ఏమున్నాయో దానిని రుచి చూసి నేను చెప్పగలను” అని చెప్పారు బాబూజీ.

ooo

“అమెరికాలో నన్ను చూడటానికి ఒక పెద్దమనిషి వచ్చాడు. ఒక వ్యక్తి యొక్క సత్ప్రవర్తన ఎటువంటిదో అతని చేతివ్రాత చూసి తను చెప్పగలనని అతడు చెప్పాడు. అతడు నన్ను కూడా ఏదైనా వ్రాయమన్నాడు. నేను ఒకటి, రెండు వాక్యాలు వ్రాసాను. దానిని పరిశీలించి ‘మీకు దృఢమైన సంకల్పం (ఇచ్ఛ) ఉంది’ అని అతడు చెప్పాడు. ‘ఇంకా ఏమైనా ఉందా!’ అని నేనే అతడిని ప్రశ్నించాను. అతడు ఏమీ లేదని చెప్పాడు. మీరు (అనగా ప్రిసెప్టర్లు) కూడా దీనిని పెంపొందించుకొనవచ్చు. ఇది సాధన ద్వారా సాధించుకున్న ఒక కళ” అని చెప్పారు బాబూజీ.

ooo

బాబూజీ చెప్పారు: "ఒకసారి ఒక స్త్రీ నావద్దకు వచ్చి నన్ను– 'నేను నిరక్షరాస్యురాలను. నేను దైవ సాక్షాత్కారం పొందగలనా?' అని అడిగింది. నేను అప్పుడు చెప్పాను –**'దైవం కూడా ఎక్కడా చదువుకోలేదు. అతడికి ఏ విశ్వవిద్యాలయానికి చెందిన డిగ్రీ లేదు. దైవ సాక్షాత్కారం పొందటానికి చదువు అవసరం లేదు'** అని. ఈ సమాధానంతో స్వామి వివేకానంద చాలా తృప్తి చెంది నాకు అంతర్వాణి ద్వారా ఇలా చెప్పారు: 'నీవు చాలా ముచ్చటైన సమాధానం చెప్పావు' –అని."

౦౦౦

ఎవ్వరైనాగాని ఒకేసారి ఒకే రకమైన సాధన చేపట్టాలి అని తెలియజెప్పటానికి బాబూజీ ఒక హాస్యపూరితమైన కథను ఇలా చెప్పారు: "ఒకసారి ఒక హిందువుడు, ఒక మహమ్మదీయుడు మిత్రులయ్యారు. ఇద్దరూ కలిసి మరొక గ్రామానికి ప్రయాణిస్తున్నారు. ఆ మహమ్మదీయుడు తన దైవమైన 'అల్లా' మాత్రమే బాగా శక్తిమంతుడు అని చెప్పగా, హిందువుడైన వ్యక్తి తన రాముడే శక్తిమంతుడు అని ఇద్దరూ వాదప్రతివాదనలకు దిగారు. అనుకోకుండా వారిద్దరూ మరీ అంతపెద్దదికాని ఒక ప్రవాహం వద్దకు వచ్చారు. ఒక్క అంగతో ఎవ్వరైనా దానిని దాటివేయవచ్చు. ఇద్దరూ ఒక అంగీకారానికి వచ్చారు. ఎలాగంటే, 'ఎవ్వరైతే ఒక్క గెంతులో ఆ ప్రవాహాన్ని దాటగలుగుతారో వారి ఆరాధ్య దైవమే గొప్పగా నిర్ణయించుకోవటం' దాని సారాంశం. ముస్లిం మిత్రుడు 'యా అల్లాహ్' అంటూ దూకి ఆ ప్రవాహాన్ని దాటాడు. హిందూ మిత్రుడు, 'తను రామ నామం స్మరించుకొని దానిని దాటగలనా!' అని సందేహంలో పడ్డాడు. 'అయితే రెండు పేర్లు స్మరించి దుముకుతాను' అనుకుని అతడు బిగ్గరగా, 'ఓ రామా! యా ఖుదా!' అంటూ దుమికాడు. దురదృష్టవశాత్తు అతడు నీటిలో పడ్డాడు. కనుక ఏక పక్షమైన సాధన తప్పనిసరి. మనం కనుక రెండు విధానాలు ఒకేసారి ఆచరించినట్లయితే, మనం ప్రవాహంలో పడవలసి వస్తుంది (అనగా ఆరాధించే దైవం మీద సంపూర్ణ విశ్వాసం లేకపోతే లక్ష్యం సాధించటం అసాధ్యం అని చెప్పటానికి ఇదొక ఉదాహరణ)."

౦౦౦

ఏ దేశపతనానికి అయినా సోమరితనం కారణమవుతుందని చెప్పటానికి బాబూజీ ఒక చక్కటి ఉదాహరణ చెప్పారు: "బ్రిటిషు వాళ్ళు లక్నోమీద దాడిచేసినప్పుడు, అక్కడి సైన్యం చెల్లాచెదరై పారి పోయింది. స్థానికంగా ఉన్న నవాబు, వజీద్ ఆలి ఒక పిరికివాడు కావటమేకాక సోమరి కూడా. అతడైతే పారిపోలేదు, మరి బ్రిటిషు వాళ్ళతో పోరుసల్పలేదు. ఆ తర్వాత అతడిని అందరూ పారిపోతూ ఉంటే నీవు ఎందుకు పారిపోలేదని అడిగినప్పుడు, 'నా పాదరక్షలు ధరింపజేయటానికి ఎవ్వరూ లేకపోయారు. మరి నేను ఎలా పరుగెత్త గలను?' అని జవాబిచ్చాడు. ఆ నవాబు ఎంత సోమరి మనిషో గమనించండి"

౦౦౦

బాబూజీ 'భోండు జాట్' గురించిన కథ చెప్పారు. ఒక గ్రామంలో భోండు అను ఒక జాట్ (కులస్థుడు) ఉన్నాడు. అతడు నిరక్షరాస్యుడే అయినప్పటికి, చుట్టుప్రక్కల గ్రామాలన్నిటిలోను అతడు ఒక జ్ఞానవంతుడుగా ప్రసిద్ధి పొందాడు. ఈ విషయంలో అతడిని తలదన్నేవారు అనగా మించినవారు ఎవ్వరూ లేరు. ఒకసారి, ఒక పండితుడు (మేధావి) ఆ గ్రామానికి వచ్చాడు. అతడు తనకు సాటియైన పాండిత్యంకలవారు ఎవ్వరూ

లేరని, తను ఎందరో మహా పండితులను సైతం ఓడించానని ప్రకటించాడు. భోందు జాట్ అక్కడే ఉండటం తలస్థించింది. అతడు ఆ పండితుడిని ఓడిస్తానని చెప్పి, తన గుప్పిటి నిండా ఇసుక తీసుకుని, ఆ పండితునితో 'పండిట్‌జీ, నా చేతిలో ఉన్న ఇసుకలో ఎన్ని ఇసుక పలుకులు ఉన్నాయో చెప్పగలవా?' అని ప్రశ్నించాడు. పాపం, ఆ పండితుడు నివ్వెర పోయాడు. లెక్కించకుండా అతడు ఆ పలుకుల సంఖ్య ఎలా చెప్ప గలడు? ఈ సమస్యతో సతమతమైపోయి, అతడు చివరకు భోందునే చెప్పమన్నాడు. వెంటనే భోందు, 'గుప్పెడు' అని చెప్పాడు. ఆ పండితుడు అతడి తెలివితేటలకు ఆశ్చర్యపోయి, అతడిని అభినందిం చటంతోపాటు తన ఓటమిని అంగీకరించాడు.

ooo

బాబూజీ చెప్పారు: "నేను జబ్బుపడితే, లాలాజీ సాహెబ్ నన్ను సంరక్షించేవారు. ఆ పరిస్థితిలో కూడా అప్రయత్నంగానే, రాత్రి సమయంలో కూడా నా నుంచి దివ్యకార్యం జరుగుతూ ఉండేది. లాలాజీకి నేను ఎంత ఋణపడి ఉన్నానో మాటల్లో చెప్పలేను. ఒకసారి నేను దక్షిణ భారతదేశ పర్యటనలో ఉండగా, ఉమేష్ (బాబూజీ రెండవ కుమారుడు, అప్పుడు చాలా చిన్నవాడు) జబ్బు పడ్డాడు. అప్పుడు లాలాజీ అతడిని సంరక్షించారు. 'వారు' ఉమేష్ ఆరోగ్యం కుదుటపడిన తర్వాత నాకు ఈ విషయం తెలియజేశారు. ఈ విధంగా లాలాజీ ఎల్లప్పుడూ నన్ను రక్షిస్తూ నా ప్రకృతి కార్య నిర్వహణలో అడ్డంకులు ఏర్పడకుండా చేసేవారు."

ooo

బాబూజీ చెప్పారు: "కొన్ని సందర్భాలలో లాలాజీ సాహెబ్ చాలా ఉగ్రుడైపోతారు, కాని అది నా మంచికే. ఒకసారి నేను, ప్రకృతికార్యం నిర్వహిస్తూ చాలా అలసిపోయాను. నా శరీరం కూడా సహకరించటం లేదు. నేను లాలాజీని ఒక వారం రోజులు విశ్రాంతి కల్పించమని ప్రార్థించాను. అప్పుడు లాలాజీ సాహెబ్ చాలా గడుసుగా అన్నారు: 'నీవు ఒక్క గంట అయినా విశ్రాంతి తీసుకోవటానికి వీలుపడదు' అని. ఇవన్నీ చాలా కుతూహలం కలిగించేవిగా ఉంటాయి. మనం మాస్టర్‌లో విలీనమై ఉన్నట్లయితే ఈ విషయాలు తలవనితలంపుగానే తెలుస్తాయి."

ooo

బాబూజీ చెప్పారు: "ప్రస్తుతకాలంలో భారతదేశంలో ఆత్మహత్యలు జరుగుతున్నాయి. ఇవి అరికట్టబడాలి అని నా అభిప్రాయం. విదేశాలలో కూడా ఆత్మహత్యలు అధికమయ్యాయి. ఒకసారి, ఒక విదేశంలో ఒక స్త్రీ దుఃఖిస్తూ నావద్దకు వచ్చి, తన భర్త ఆత్మహత్యకు పాల్పడబోతున్నాడని, ఆ పనిని ఏదో విధంగా నిరోధించమని నన్ను వేడుకుంది. నేను ఆమెను ఓదార్చి ఇంటికి పంపించివేశాను. లాలాజీ సాహెబ్ కృపవలన, ఆమె భర్త ఆత్మహత్య చేసుకోవాలను తన తలంపును విరమించుకున్నాడు. ఇప్పుడు వారిద్దరూ మన మిషన్‌లో అభ్యాసులే. అప్పుడప్పుడు, విదేశాలలో ఆధ్యాత్మికతపట్ల విశ్వాసం కల్పించటానికి నేను ఇటువంటి పనులు చేస్తూ ఉంటాను."

ooo

బాబూజీ చెప్పారు: "లండన్‌లో ఒకామె నన్ను 'మీరు బాధలను తీరుస్తారా?' అని అడిగింది. నేను 'కాదు' అన్నాను. ఆ సంభాషణ సమయంలోనే సాక్షాత్కారం గురించిన విషయం ప్రస్తావనకు వచ్చింది. సాక్షాత్కారం చాలా కష్టం అని ఆమె చెప్పింది. అప్పుడు ఆమెతో నేను, 'అది నీవు అనుకుంటున్నట్లుగా కష్టమేమీ కాదు. దీనిని నేను సాధన చేశాను కనుక నా స్వానుభవంతో చెబుతున్నాను. నీవు సాధన చేసావా?' అని ప్రశ్నించాను. అప్పుడు ఆమె మౌనంగా ఉండిపోయింది. కనుక మనం ఎప్పుడు కూడా ఒక ప్రత్యేక విషయం దేనినైనా కష్టం అని తలంచకూడదు. మనం ఆ విధంగా ఆలోచించినట్లయితే దానిపట్ల ఆకర్షితులం కాలేము."

ooo

స్నానం చేయటానికి వెళ్తూ బాబూజీ అన్నారు: "నేను ఎన్ని దుస్తులు ధరించి ఉన్నాను!" అని. అసలు 'వారు' ధరించినవి మూడు దుస్తులు మాత్రమే అనగా ఒక స్వెట్టర్, ఒక చొక్కా మరియు ఒక బనియన్. ఇవి కేవలం మాటలు మాత్రమే కావు. అవి ఎన్నో ప్రగాఢమైన ఆంతరిక విషయాలుగా అభ్యాసీల కొరకు భావగర్భితంగా ఉంటాయి. మన ఆత్మ చుట్టూరా ఎన్నో వలయాలు సృష్టించు కున్నాము అని చెప్పటమే బాబూజీ ఆంతర్యం.

ooo

ఒకసారి, గ్రీకు దేశపు ఒక జంట బాబూజీవద్దకు వచ్చారు. భార్యభర్త లిద్దరూ అభ్యాసులే. వారు విడాకులు తీసుకోవాలను సంకల్పంతో ఉన్నారు. బాబూజీ వారిని కలిసి జీవించమని, సహనం, సహకారం కల్పించుకొనమని చెప్పారు. బాబూజీ చెప్పారు: "అదృష్టవశాత్తు నా సలహా విజయం సాధించింది. విడాకులు త్రోసి పుచ్చారు. భార్య తన కృతజ్ఞతను తెలిపి, నాకు కొంత ధనం ఇవ్వ జూపింది. నేను అందుకు తిరస్కరించాను. నేను ఆమెతో –'నేను కూడా సరిపడా ధనం ఇవ్వగలను. దానివలన ప్రయోజనం ఏమిటి?' అని. చూడండి, మానవుడు ప్రతిదానిని ధనంతో తూస్తాడు."

ooo

బాబూజీ చెప్పారు: "చాలాకాలం క్రితం నేను తిరుపతిలో జబ్బుపడ్డాను. డాక్టర్ వచ్చి నన్ను పరీక్షించి మందు ఇచ్చాడు. నేను అతనితో –'నాకు ఉన్న ఇబ్బంది గుండెలో, కాని నీ మందు నా ఊపిరితిత్తుల మీద పని చేస్తుంది' అన్నాను. ఆ డాక్టర్ విస్తుపోయి, మందు మార్చి వ్రాసి ఇచ్చాడు. నేను చాలా సునిశిత జ్ఞానం (Sensi- tive) కలవాడినని లాలాజీ సాహెబ్ నాకు ఒక సర్టిఫికెట్‌ను బహుకరించారు."

ooo

ప్రారంభంలో తాను 5 లేదా 6 గురుతో అభ్యాసం ప్రారంభింప జేసినట్లుగా బాబూజీ చెప్పారు. 'వారు' చెప్పారు: "లాలాజీ సాహెబ్ ట్రాన్స్‌మిషన్ ఇతరులకు ఇచ్చినప్పుడు దానిని నేను వెంటనే పసికట్టేవాడిని. నా సూక్ష్మ గ్రాహ్యత్వం (Sensitive- ness) అంత నిశితంగా ఉండేది. నేను ఈ విషయాలన్నింటినీ నా డైరీలో వ్రాసిపెట్టేవాడిని, దానికి లాలాజీ చాలా సంతోషించేవారు."

ooo

ఒకసారి, చర్చ జరుగుతూ ఉండగా, ఒక సందర్భంలో స్వర్గ నరకాల ప్రస్తావన వచ్చింది. అప్పుడు బాబూజీ అన్నారు: "స్వర్గాన్ని వర్ణించటంలో చాలా కవితా కాల్పనికత ఉంది. ఒక పర్షియన్ కవి దానిని ఇలా చెప్పాడు: 'ఎక్కడైతే ఎటువంటి దుఃఖం లేకుండా ఆత్మలకు ఒక దానితో మరొక దానికి పని లేకుండా ఉంటుందో అది స్వర్గం' అన్నాడు. నరకంలో చపలత్వం లేదా భ్రమతప్ప ఇంకేమీ లేదు. నేను ఒకసారి దాని అనుభూతి చెందాలనుకున్నాను. లాలాజీ నన్ను మందలిస్తూ –'నేను నిన్ను ఇందుకే సిద్ధపరచానా?' అని ప్రశ్నించారు. నేను అంతటితో మౌనం దాల్చాను."

ooo

బాబూజీ చెప్పారు: "నేను యువకునిగా ఉన్నప్పుడు ఎప్పుడైనా సాక్సు విడువకుండా నిద్ర పోవటం జరిగినప్పుడు, మా అమ్మ వెంటనే వాటిని తొలగించివేసేది. బహుశా పాదాలలో జనించిన ఉష్ణం మెదడుకు చేరుకుని హాని కలిగించకుండా ఉండాలని ఆమె ఉద్దేశ్యమై ఉండవచ్చు."

ooo

బాబూజీ తమ తల్లిగారి జ్ఞాపకాలను తెలుపుతూ– "మా తల్లిగార్కి పర్ష్యన్ భాష తెలుసు. ఆ రోజుల్లో మా ఇంటిలో దాదాపు అందరికీ ఆ భాషతో పరిచయం ఉంది. ఒకటి రెండు కవితలు నేను ఉర్దూలో వ్రాయటానికి ప్రయత్నించాను కాని సఫలం కాలేదు. అయితే వచనం (Prose) మాత్రం బాగా వ్రాయగలిగేవాడిని. ఒకసారి నేను హోలీ పండుగ మీద ఒక వ్యాసం వ్రాశాను, అది ప్రచురించబడింది. అందులో ఒక్క పర్షియన్ భాషా శబ్దం కూడా ఉపయోగించకపోయినప్పటికీ అది చాలా రక్తికట్టించిన వ్యాసం అయ్యింది. కరాచీ నుంచి దానికి మంచి ప్రశంస వచ్చింది" అని చెప్పారు. బాబూజీ, ఉర్దూలో వచన ప్రయోగం కవితా ప్రయోగంతో సరిసమానంగా ఉండటమేగాక చాలా ఘాటుగా ఉండేది.

ooo

ఒకసారి ద్రాక్ష సారాయిని గురించి చెప్తూ బాబూజీ అన్నారు: "నాకు ద్రాక్ష సారాయిపట్ల చాలా విముఖత ఉండేది. అయితే అదే సందర్భంలో దానిమీద అంతే అభిమానం కూడా ఉండేది. దానిలో "దైవభక్తి ద్రాక్ష సారా" లేదా "ఆధ్యాత్మిక సుధారసం (షరాబ్–ఇ–మారిఫత్)" అనేది ఉంది. అది చాలా అద్భుతంగా ఉంటుంది. ఒకసారి ఒక పెద్దమనిషి హోలీ సమయంలో నావద్దకు వచ్చి (వైన్) ద్రాక్ష సారాయి త్రాగాలని కోరికగా ఉన్నట్లు చెప్పాడు. నేను ట్రాన్స్‌మిషన్ ద్వారా అతనికి మత్తు కల్పించాను. ఇచ్ఛాశక్తి బలీయంగా ఉన్నట్లయితే దేనినైనా సాధించవచ్చు."

ooo

బాబూజీ తమ బాల్యం, యవ్వనం గురించి చెబుతూ, "మా ఇంట్లో ప్రతి ఒక్కరూ నన్ను నిరాడంబరునిగా భావించేవారు. నా బంధువుల నుంచి నాకు 'మందకొడి' అని సర్టిఫికెట్ వచ్చింది. నేను ధ్యానం చేస్తాను కనుక నా తండ్రిగారు నన్ను అలాగే భావించేవారు" అన్నారు.

ooo

బాబూజీ, తన చిన్నతనంలో ఉండగా దైవం ఎలా ఉంటాడో ఊహించుకొనటం గురించి చెప్పారు. “పర్షియన్ భాష నేర్చుకుని ఉన్న మూలంగా దైవం ముస్లింలలాగా పైజామా ధరించి ఉన్నట్లు ఊహించు కున్నాను. అయితే నేను హిందూ ధర్మ ప్రకారం పెరిగి పెద్దవాడైనందున, ‘అతడు’ (దైవం) పంచె ధరించి ఉన్నట్లుగా ఊహించుకున్నాను. ఈ రెండింటిలో ఏది వాస్తవం అను సందిగ్ధం నాలో ఉత్పన్నమైంది” అన్నారు బాబూజీ. ఇది విన్న తరువాత ‘వారి’ని గుమికూడి ఉన్న అభ్యాసులందరూ పక్కున నవ్వారు.

ooo

బాబూజీ, తన చిన్నతనంలో సిగరెట్ కాల్చటానికి ఎలా అలవాటుపడ్డారో, వారి తండ్రిగారు తమ తల్లి ద్వారా దానిని మానుకోమని ఎలా చెప్పించారో వివరించారు. బాబూజీ తనకు దానిని విడిచిపెట్టటం సాధ్యం కాదు అని చెప్పినప్పుడు వారి తండ్రిగారు – “అతడిని హుక్కా పీల్చమనుగాని సిగరెట్ వద్దు” అని చెప్పించారు. ఈ వివరణ విని అందరూ నవ్వుకున్నారు.

ooo

బాబూజీ చెప్పారు: “ఒక నవ్వించే సంఘటన ఏమి జరిగిందో మీకు తెలుసా? ఒకసారి మేము ‘C’ అని పిలిచే ప్రిసెప్టర్ ‘B’ అను ప్రిసెప్టర్‌ను కలిసి అతడిని ప్రశ్నించాడు– ‘నీవు ప్రతిరోజూ ధ్యానం చేస్తున్నావా?’ అని. ఆ మాటకు ‘B’ అనబడు ప్రిసెప్టర్ –‘లేదు, నేను ఇప్పుడు ప్రిసెప్టర్‌ను అయ్యాను కదా!’ అన్నాడు. అప్పుడు ‘C’ అను ప్రిసెప్టర్– ‘అయితేమాత్రం ఏమిటి? నీవు విడిచిపెట్టకుండా ధ్యానం చేయాల్సి ఉంటుంది’ అని చెప్పాడు. ఈ సలహాకు ‘B’ స్పందించి, ‘మరైతే, బాబూజీ కూడా ధ్యానం చేయటం లేదు’ అన్నాడు. కనుక, ఇటీవల నేను (బాబూజీ) కూడా ధ్యానం ప్రారంభించాను” అని. ఇది విన్న అభ్యాసులందరూ పకపకా నవ్వారు.

ooo

“ఫ్రాన్స్ దేశంలో, అక్కడి వారు కస్తూరీని –‘మీ మాస్టర్ యొక్క అద్భుతాలకు (Miracles) ఏదైనా ఉదాహరణ చెప్పగలరా?’ అని అడిగారు. అప్పుడు కస్తూరీ ఏం సమాధానం చెప్పినదో మీకు తెలుసా? ఆమె – ‘నేను ఎనిమిదవ తరగతి వరకే చదువుకున్నాను. అయినప్పటికి నేను మీతో ఆంగ్లంలో సంభాషిస్తూ, మీరు అడిగిన సందేహాలకు సమాధానం ఇస్తున్నాను, దానితో మీరు సంతృప్తి చెందు తున్నారు. ఇంతకుమించిన గొప్ప అద్భుతం (Miracle) ఇంకేమి కావాలి?’ ఈ సమాధానానికి అక్కడి వారందరూ అభినందించారు” అన్నారు బాబూజీ.

ooo

తనకు సమాధి చెందాలని దృఢమైన కోర్కె ఉన్నట్లుగా బాబూజీ చెప్పారు. వారికి దాని అనుభూతి చాలాసార్లు కలిగి, చాలా ఉన్నతంగా ఎదిగినప్పటికీ, ఆ తీవ్రమైన కోర్కె తగ్గుముఖం పట్టలేదు. ఒకసారి లాలాజీ, బాబూజీని మందలించారు– “సమాధిని గురించిన నీ మోజు ఇంకా తొలగిపోలేదా?” అని. ఇంక అప్పటి నుండి దానిపట్లగల ఆకర్షణ పూర్తిగా మాయమైపోయింది. “ఆ స్థితి మంచిది అను భావం ఒకటి నాలో గట్టిగా నాటుకు పోయింది. దానిని లాలాజీ సాహెబ్ నాకు అనుగ్రహించారు” అని చెప్పారు బాబూజీ.

ooo

ఒకసారి బాబూజీ యవ్వనంలో ఉన్నప్పటి తమ స్వంత స్వభావాన్ని గురించి చెప్పారు: "ఒక యువకునిగా, నేను జనాన్ని బాగా నవ్వులతో కవ్వించే వాడిని. ఆఫీస్‌లో నా సహెూద్యోగులు వారికి తమ పనిలో అలసట కలిగినప్పుడు నావద్దకు వస్తుండేవారు. నేను వాళ్ళకు ఏవో కొన్ని హాస్యానికి సంబంధించినవి చెప్పి, వాళ్ళు నవ్వుకుంటూ వేళ్ళేటట్లుగా చేసేవాడిని. వాళ్ళ అలసట దానితో తొలగిపోయి వాళ్ళు కూడా ఉపయోగకరమైన మంచి ఆలోచనలు చేసుకునేవారు."

ooo

బాబూజీ చెప్పారు: "నేను లాలాజీ వంటి సద్గురువును ఎన్నడూ చూడలేదు. 'వారి' మార్గదర్శకత్వంలో నా సాధన ముగింపు కావటానికి చాలా సంవత్సరాలు పట్టింది. దీనినంతటినీ నా ఆత్మకథలో వ్రాసాను. నాకు నా ఆత్మకథ వ్రాయాలను ఉద్దేశ్యమైతే లేదు, కాని ప్రజల అభీష్టం మరియు ఒత్తిడితో వ్రాయాల్సి వచ్చింది. ఇటువంటి పనికిమాలిన విషయాలు వ్రాయటం వలన ఏమి ప్రయోజనం కలుగుతుంది? ఒకసారి నేను లాలాజీ యొక్క జీవిత సంగ్రహాన్ని వ్రాయాలను సంకల్పంతో 'వారి' జీవితంలోని కొన్ని సంఘటనలను వివరించమని అడిగాను. దానికి లాలాజీ చిరునవ్వుతో –నీవు నీ జీవిత కథ వ్రాస్తే అది నాదే అవుతుంది, అని అన్నారు."

ooo

బాబూజీ చెప్పారు: "నేను సాక్షాత్కారం కొరకు తత్త్వశాస్త్రాన్ని (Philosophy) అధ్యయనం చేయటం మానివేశాను. నేను దానిని పొందాలను సంకల్పంతోనే సాధన ప్రారంభించాను. దానిని పొందటం ద్వారా ప్రతిదీ పొందినట్లయ్యింది. లాలాజీ, నా తత్త్వశాస్త్రం (Philosophy) చదవాలనే కోరికను అణచివేశారు."

ooo

"నాలో, స్వంత ట్రాన్స్‌మిషన్ విధానం ప్రయోగించాలి అను ఆలోచన తలెత్తింది. అప్పుడు లాలాజీ చిరునవ్వు నవ్వుతూ – 'నీవు నా అవుసరం లేకుండా చేయాలని ఆలోచిస్తున్నావా?' అని అడిగారు. నేను సిగ్గుతో తలదించుకున్నాను" అన్నారు బాబూజీ.

ooo

బాబూజీ చెప్పారు: "నేను అరబిక్ చదువలేదు కాని పర్శ్యన్ మాత్రం చదివాను. నేను పర్శ్యన్ భాష పద్యాలను చాలా చదివాను. దాని సాహిత్యం చాలా బాగుంటుంది." బాబూజీ ఒక పర్శ్యన్ పద్యాన్ని ఉదహరించారు. దాని భావార్థం: "నీవు విల్లు లేకుండా బాణం ఎక్కుపెట్టావు, అది నా హృదయంలో గ్రుచ్చుకొంది, కాని గాయపడలేదు." బాబూజీ వివరణ ఇస్తూ– "ఇక్కడ, బాణం అంటె అది దైవకృప" అన్నారు.

ooo

బాబూజీ క్రోధం గురించి చెప్తూ –"నేను కూడా చిన్నతనంలో చాలా కోపిష్టిగా ఉండేవాడిని. కొన్నిసార్లు, ఆహారం తింటున్నప్పుడు ఏదైనా ఉద్రేకపరచే సంఘటన వినవస్తే, నా ఆహార పాత్రను విసిరివేసేవాడిని. నా

తండ్రిగారు కూడా శీఘ్రంగా కోపం చెందేవారు. అందుచేత అప్పుడప్పుడు నన్ను దండించేవారు. నా స్థితి ఎటువంటిది అంటే, నేనే కనుక లాలాజీని కలిసి ఉండకపోతే, నా జీవితంలో కనీసం ఒకరిద్దరిని కాల్చివేసి ఉండేవాడిని" అని అన్నారు.

ooo

"నేను సున్నితమైన పనులు నిర్వహించేటప్పుడు లాలాజీ నా ప్రక్కన కూర్చుని ఉండేవారు. అయినా కూడా నేను స్వయంగా 'వారి' సహాయం లేకుండా చాలా పనులు నిర్వహించాను. మీరు దీనిని నా అహంకారంగా భావించవచ్చు" అని బాబూజీ ఎప్పుడైతే దీనిని చులకనగా చెప్పారో, అప్పుడు అక్కడ ఉన్నవారు అందరూ పక్కున నవ్వారు.

ooo

బాబూజీ చెప్పారు: "ఇప్పుడు చూడండి, సాక్షాత్కారం తర్వాత ఎవ్వరికైనా ఆకలి దప్పులు, నిద్ర వంటివి తగ్గుముఖం పట్టాయి. అయితే నా సోమరితనం మాత్రం తగ్గలేదు. నా సోమరితనాన్ని తొలగించమని నేను లాలాజీని ప్రార్థించాను. దానికి విరుద్ధంగా 'వారు' దానిని నాలో పెంపొందించారు. నా తొందరపాటు స్వభావం, సోమరితనం మాత్రం తొలగిపోలేదు."

ooo

"ఇంగ్లాండ్‌లో ఒక గౌరవనీయుడు, మహేష్ యోగిని ఒక ఉన్నత శ్రేణికి చెందినవాడుగా పేర్కొంటూ బాగా పొగిడాడు. అతడు చాలా సత్తా కలిగినవాడుగానే అంగీకరించామనుకోండి. అతడు ఆ యోగిని ఆ విధంగా పొగడటానికి కారణం ఏమిటయ్యా అంటె, మహేష్ యోగి తాకిన ప్రాంతంలో (అది హృదయం లేదా నుదురు కావచ్చు) అతడు ప్రకంపనలు అనుభూతి చెందాడట. నాకు నవ్వు వచ్చింది. అతని చేతిని నా చేతిలోకి చేర్చుతూ, 'నీవు ప్రకంపనలు అనుభూతి చెందుతున్నావా?' అని అడిగాను. అతడు 'అవును' అన్నాడు. 'ఈ ప్రకంపనల యొక్క తీవ్రతను ఇంక ఎంతగా పెంచమంటావో చెప్పు' అని నేను అతడిని ప్రశ్నించాను. అతడు దిగ్భ్రమ చెందాడు. జనం అటువంటి అల్పమైన అనుభూతులతో సంతృప్తి చెందుతున్నారు. అంతేగాని వారు ఉన్నతమైన అనుభూతులను ఆశించరు" అని అన్నారు బాబూజీ.

ooo

బహుశా 1955వ సంవత్సరంలో కావచ్చు, శ్రీ అరబిందో శిష్యుడు ఒకరు శ్రీ బాబూజీని కలుసుకోవటానికి వచ్చాడు. అతడు సూపర్ మైండ్ (అధిచేతనా మనస్సు) గురించి మాట్లాడుతున్నాడు. అప్పుడు బాబూజీ వారితో "అంతిమ చైతన్యం (Ultimate Consciousness) మాత్రమే విపరీతమైన మార్పును తీసుకు రాగలదుగాని, సూపర్ మైండ్ కాదు" అని చెప్పారు.

ooo

బాబూజీ చెప్పారు: "ట్రాన్స్‌మిషన్ (ప్రాణాహుతి) తిరుగులేనిది. దానిపట్ల విశ్వాసం లేకపోవటం దురదృష్టం. మా తండ్రిగారి మరణానంతరం పదమూడవ రోజున, వారి ఆత్మ నా వద్దకు వచ్చింది.

అప్పుడు నేను చెప్పాను: 'మీ జీవితకాలంలో దానిని వ్యతిరేకించారు' అన్నాను. అప్పుడు ఆ ఆత్మ– 'నేను నిన్ను అర్థం చేసుకోలేకపోయాను' అని చెప్పింది. తండ్రికి నేను చేయవలసి ఉంది కనుక (పితృఋణం తీర్చుకోవాల్సి ఉంది) నా బాధ్యతను నిర్వర్తించటానికని నేను ఆ ఆత్మకు ప్రాణాహుతి నిచ్చాను."

ooo

ఇంగ్లాండ్‌లో, ఒకరు బాబూజీని, "మీ సాధనా విధానాన్ని విజ్ఞానశాస్త్రపరంగా (Scientifically) నిరూపించగలరా?" అని ప్రశ్నించాడు. దానికి బాబూజీ ఈ విధమైన సమాధానమిచ్చారు: "ఇది భౌతిక పరమైనంతవరకు సాధ్యమే కాని దానికిమించి సాధ్యపడదు. ఇది పూర్తిగా ప్రత్యేకమైన శాస్త్రం, దీనిని వివరించటానికి ప్రత్యేకమైన శబ్దజాలం (Terminology), అలాగే దీనిని అంచనా వేయటానికి ప్రత్యేకమైన సిద్ధాంతం కావాలి."

ooo

బాబూజీని ఎవరో ఒక వ్యక్తి ప్రశ్నించారు: "మీరు పతంజలియోగి కంటె గొప్పవారా?" అని. దానికి పోటీగా బాబూజీ అతనికి ఎదురు ప్రశ్న వేశారు: "భగవంతునికి ఆయన కంటే ఉన్నత వ్యక్తిత్వం కలవారిని సృష్టించటం సాధ్యపడదా?" అని. దానికి అతడు సమాధానం ఇవ్వలేకపోయాడు.

ooo

బాబూజీ ఒకానొక సందర్భంలో చెప్పారు: "ఒకతను రొంపా అను పేరుగల వారు– 'యోగ అనునది యూరోపియన్లకు ఉద్దేశించినది కాదు' అన్నట్లుగా చెప్పబడింది అని. నేను దానికి తగిన సమాధానంగా –'ఒక మందు ఫలానా ఫలానా దేశానికి ఉద్దేశించబడినది కాదు అని చెప్పగలమా?' అన్నాను. ఇది పూర్తిగా మూర్ఖత్వం."

ooo

బాబూజీ డెన్మార్క్‌లో కొన్ని సంఘటనల గురించి చెప్పారు: "అక్కడ, వారు నా కొరకు సర్వసౌకర్యాలు కలిగిన ఒక గదిని నిర్మించారు. అక్కడికి నా రాకకు పూర్వం చాలా రోజులు ముందుగానే నన్ను గురించి ఆలోచిస్తూ ఉంటారు. అవునా, కాదా? కేవలం నన్ను జ్ఞాపకం చేసుకోవటం ద్వారా వారు ఆనందం పొందుతూ ఉంటారు. అలాకాకపోయి ఉంటే, భక్తి విశ్వాసాలతో నన్ను ఆహ్వానించటానికి చేసే ఏర్పాట్లలో ఎందుకు తలమునకలై ఉంటారు? దానికి మీరు –'అక్కడ మీ ట్రాన్స్‌మిషన్‌లో ఏదో ప్రత్యేకత ఉండి ఉండవచ్చు' అని చెప్పగలరు. కాని అక్కడ నేను ఇచ్చేది కూడా మీకు ఇచ్చే ట్రాన్స్‌మిషన్ వంటిదే, దానిలో భేదం ఏమీ ఉండదు."

ooo

బుద్ధునితో జరిగిన అంతర్వాణిలలో బాబూజీ చెప్పారు: "మీ (Philosophy) తత్త్వశాస్త్రంలో దేవుని గురించిన ప్రస్తావన లేదు" అని. దానికి బుద్ధుడు సమాధానంగా "భగవంతునికి చెందకుండా వేరుగా నేను ఎప్పుడు ఉన్నాను" అన్నాడు.

ooo

బాబూజీ చెప్పారు: “చాలాకాలం క్రితం, బుద్ధుడు నన్ను ఉద్యోగం వదిలిపెట్టమని సలహా నిచ్చారు. అయితే లాలాజీ దానిని అమలుపరచవద్దని నాకు చెప్పారు. అప్పుడు నేను బుద్ధునితో చెప్పాను: 'నీవు నీ రాజ్యాన్ని భగవత్ సాక్షాత్కారం లేదా నిర్వాణం కొరకు త్యాగం చేశావు. ఇప్పుడు నేను దైవ సాక్షాత్కారం సిద్ధింపజేసుకున్నాను, కనుక నేను నా కుటుంబాన్నికాని, సేవనుకాని త్యాగం చేయాల్సిన అవుసరం లేదు.”

ooo

సూక్ష్మగ్రాహ్యత (Sensitivity), అంతర్ జ్ఞానం (Intuition) మరియు తదితర విషయాల గురించి మాట్లాడుతూ బాబూజీ, డాక్టర్ షాతో ఇలా చెప్పారు: “ఒకసారి, కలకత్తాలో అభ్యాసియైన ఒక డాక్టర్, ఒక రోగిని పరీక్షించి అతడు ఫలానా వ్యాధితో బాధపడు తున్నట్లుగా చెప్పాడు. అప్పుడు నేను ఆ డాక్టర్‌ను ఉద్దేశించి అతని రోగ నిర్ధారణ తప్పుగా ఉందని, ఆ రోగి వ్యాధి అతని మెదడులోనే ఉన్నదని చెప్పి, దానికి తగిన వైద్యం చేయమని సలహా నిచ్చాను. ఆ విధంగా ఆచరించటం మూలంగా ఆ రోగి బాగుపడ్డాడు” అని. అప్పుడు డాక్టర్ షా తనకు కూడా ఈ విద్య బోధించమని అర్థించాడు. దానికి బాబూజీ ఇలా సమాధానం ఇచ్చారు: “నేను దీనిని ఎవ్వరి నుండీ నేర్చుకొనలేదు. నేను లాలాజీ యొక్క బానిసను మాత్రమే. **భగవంతుణ్ని పట్టుకో, ప్రతిదీ సాధ్యపడుతుంది**” అని.

ooo

“నేను లాలాజీ ప్రతినిధిగా నా పని ప్రారంభించినప్పుడు ఒక పెద్దమనిషి అభ్యంతరం తెలిపాడు.– ఒక అస్థిపంజరంలాగ ఉన్న ఈ మనిషి ద్వారా ఏ పనిని మాత్రం ఎవ్వరైనా ఆశించగలరా? –అని. అప్పుడు లాలాజీ, అంతర్వాణి ద్వారా ఈ విధంగా చెప్పారు: 'నీవు ఈ ప్రకృతికి మూలమైనట్టివాడవు' అని. ఒకరోజు భండారా (బసంత పంచమి) సందర్భంగా లాలాజీ రూపంతో నా ముందు, మూడుసార్లు దర్శనం ఇచ్చారు. ఆ మూడవసారి నేను వారితో ఏకమైపోయినట్లుగా స్పష్టంగా చూసాను” అన్నారు బాబూజీ.

ooo

బాబూజీ చెప్పారు : “నేను పుస్తకాలు వ్రాస్తానని లాలాజీ సాహెబ్ ఊహించారు. అది నిజమైంది. నేను కొన్ని చిన్న పుస్తకాలు వ్రాసాను.”

ooo

బాబూజీ చెప్పారు: “లాలాజీ నాకు ఉత్తర ధృవాన్ని సాదృశ్యం చేశారు. ఇటీవల నేను డెన్మార్క్ వెళ్ళినప్పుడు, అక్కడి వాళ్ళు ఉత్తర ధృవంకు చెందిన ఫిల్మ్‌ను ఒక దానిని చూపించారు. అది చాలా అందంగా ఉండటమేగాక లాలాజీ సాదృశ్యం చేసిన దానితో ఖచ్చితమైన పోలిక కలిగి ఉంది.”

ooo

“నేను ప్రథమంగా దక్షిణ భారతదేశం వెళ్ళినప్పుడు చాలా ఇబ్బందులకు గురయ్యాను. లాలాజీ కృప వలన, ఆ ఇబ్బందులన్నీ తొలగించబడి నా పని సులభంగా జరిగిపోయింది” అన్నారు బాబూజీ.

ooo

"కొన్ని పుస్తకాల ప్రచురణ సందర్భంగా నేను ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాను. అప్పుడు నేను లాలాజీని వేడుకున్నాను. ఆ అద్భుతం ఏమిటో చూడండి! నా తండ్రిగారు మామూలుగా చాలామందికి అప్పులు ఇచ్చారు. అలా అప్పు తీసుకున్నవారిలో చాలామంది ఋణం తీర్చారు. నేను కొన్ని మొండిబాకీల మీద ఆశ వదులుకున్నాను. కాని వాళ్ళలో కొంతమంది ఋణం తీర్చారు. లాలాజీ కృప ఆ విధంగా ఉంటుంది!" అన్నారు బాబూజీ.

ooo

1970వ సంవత్సరంలో బాబూజీ రాయచూర్ సందర్శించారు. ఆ సందర్భంలో 'వారు' తీవ్రంగా జబ్బుపడి, పది రోజులు పస్తులు ఉండిపోయారు. అప్పుడు ఒకరోజున, 'వారు' ఉన్నట్లుండి కోలుకుని హైదరాబాద్‌కు ప్రయాణమయ్యారు. సోదరుడు రాఘవేంద్రరావుగారు, "అది ఎలా సాధ్యపడుతుంది?" అని అన్నారు. దానికి జవాబుగా బాబూజీ –"శక్తి 'ఆత్మచక్రం' నుంచి రాబట్టడం జరిగింది. సూక్ష్మ శరీరానికి ఆత్మ యొక్క స్థానం నుంచి ట్రాన్స్‌మిషన్ ఇవ్వాల్సి ఉంటుంది. అయితే అది మించిపోకుండా జాగ్రత్త వహించాల్సి ఉంటుంది" అని చెప్పారు.

ooo

బాబూజీ చెప్పారు: "ప్రాపంచిక అధోగతి (Downward) ధోరణులను చూసి నేను నిరుత్సాహపడ్డాను. దానిని ఊర్ధ్వముఖంగా (Upward) మళ్ళించటానికి నాకు శక్తిని ఇవ్వమని లాలాజీని ప్రార్థించాను. అప్పుడు లాలాజీ ఏమి చెప్పారో తెలుసా? 'నీకయితే శక్తి ఉంది కాని ధైర్యం లేదు' –అని అన్నారు."

ooo

"పలురకాల రాగాలు శరీరం యొక్క వివిధ చక్రాల నుంచి పలికించటం సాధ్యపడుతుంది. సెంట్రల్ రీజియన్ మినహాయించి మరి ఇతర అన్ని కేంద్రాల నుంచి నేను పాడగలను; అయితే నా స్వరం అంతగా బాగుండకపోగా నాకు రాగాల పరిజ్ఞానం లేకపోయింది. కాని, వివిధ రకాల ధ్వని ప్రకంపనలు (Sound Vibrations), ఆ చక్రాలు లేదా కేంద్రాల నుంచి ఉత్పత్తి చేయవచ్చు. ఒకసారి నేను ఒక గాయకునితో 'నీవు వివిధ చక్రాల నుంచి పాడగలవా?' అని అడిగాను. అతడు దానికి జవాబుగా– 'ఋషులకు మాత్రమే ఆ పరిజ్ఞానం ఉంది. నా వంటి గాయకులకు అది తెలియదు' అని చెప్పాడు. కేంద్ర మండలం నుంచి పాడటమే కనుక జరిగినట్లయితే, ప్రపంచపు జీవన బిగువులు సడలిపోతాయి. దీనిని నమ్మేవారు ఎవరున్నారు? అది ఎలా ఉంటుందో చూడాలని నేను ఒకసారి ప్రయత్నించాను. 'ఆపు, ఇంకా ముందుకు ప్రయత్నం చేయవద్దు'– అని వెంటనే లాలాజీ ఆజ్ఞాపించారు."

ooo

'శబ్దవేధి' విద్య యొక్క రహస్యం మీకు తెలుసా? (శబ్దవేధి అనగా కేవలం ధ్వని ఆధారంగా, అక్కడి వస్తువు / జీవి కనిపించకపోయినా గాని బాణంతో సంధించగల విద్య) శబ్ద తరంగాలు వెలువడుతున్న మధ్య, కేంద్ర ప్రదేశానికి బాణాన్ని ఎక్కుపెట్టటమన్న మాట. దీనికి కొంత సాధన అవసరమవుతుంది. రామాయణంలోని దశరథ మహారాజు, మహాభారతంలోని అర్జునుడు ఈ విలువిద్య కళను సాధనచేసి దానిమీద ఆధిపత్యం సాధించారు.

ooo

బాబూజీ చెప్పారు: "నాకు 'దీపక్' మరియు 'మేఘ్ మల్హార్' రాగాలు తెలుసు. కాని వాటిని ఎవ్వరూ సాధించలేకపోయారు. నేను కొన్ని ప్రయోగాల ద్వారా దానిని తెలుసుకున్నాను. దీపక్ రాగంలో పాడినప్పుడు ఒక లాంతరు యొక్క వెలుగు ఇంకా వృద్ధి చెందింది. మానవుడు అన్ని చక్రాలనుంచి పాడగలడు. ధ్వనిలో / శబ్దంలో నిర్మాణాత్మకమైనవి మరియు విధ్వంసాత్మకమైనవి రెండు రకాల శక్తి ఉంది. ఒకసారి నేను విధ్వంసాత్మకమైన శబ్దం మీద ప్రయోగం తలపెట్టాను. దానివలన ప్రకృతిలో విధ్వసం ప్రారంభం అయ్యే అవకాశం ఉందని, మొత్తం నశించిపోవచ్చుననే కారణంతో లాలాజీ నన్ను నిరోధించారు."

ం౦౦

అభ్యాసుల గురించిన ప్రస్తావన వచ్చినప్పుడు –"కొంతమంది అభ్యాసులు నేను చెప్పిన విధంగా ఆచరణ చేయరు. వాళ్ళు ఇష్టాను సారంగా దానిని సాధనచేసి పురోగతి సాధించలేకపోయేసరికి నన్ను నిందిస్తారు. ఒక అభ్యాసీ ప్రార్థన చేస్తున్నప్పుడు, మేము ఇంకను కోర్కెలకు బానిసలము– అని చెప్పటానికి బదులు మేము ఇంకను చెడు కోర్కెలకు బానిసలము– అని ఉచ్చరిస్తూ ఉండేవాడు. దీనిని మీరు గమనించండి. కోర్కెలు మంచివైనా, చెడ్డవి అయినా అవి కోరికలే కదా! ఒక తోడేలు ముసుగు ధరించినంతమాత్రాన మనిషి తోడేలు అవుతాడా? కనుక 'కోరికలు' అను దానికి విశేషణం అవుసరంలేదు. కొన్ని సందర్భాలలో, ముక్తి కొరకు బలీయమైన కోర్కెసైతం అభ్యాసీ యొక్క పురోగతికి అవరోధం అవుతుంది. ఇంక ఇతర కోర్కెల గురించి ఏమని చెప్పాలి? నేను అప్పుడు ఆ వ్యక్తితో –"ఈ రోజు 'చెడు కోర్కెలు' అను మాటను ప్రయోగించటంలో తప్పు ఏమిటి? అని ప్రశ్నిస్తున్నావు. రేపు నీవు –'అసలు ప్రార్థననే మార్పుచేస్తే తప్పు ఏమిటి?' అని ప్రశ్నించితే అప్పుడు నేను ఏం చేయాలి? నీవు నేను చెప్పినట్లుగా ఆచరించదలుచుకుంటే ఈ మిషన్‌లో ఉండు. ఇక్కడ నీవు గురుత్వం చూపించాలనుకుంటే అది కుదరదు. నీవు మరి ఎక్కడికైనా వెళ్ళిపో' అని చెప్పాల్సి వచ్చింది" అని ఒక సందర్భాన్ని వివరించారు.

ం౦౦

బాబూజీ చెప్పారు: "ఒక అభ్యాసీ, తనకు ఒక క్షణంలో సాక్షాత్కార స్థితిని కల్పించమని లాలాజీని అర్థించాడు. అప్పుడు లాలాజీ ఏమి చెప్పారో తెలుసా, "నేను అలా చేసినట్లయితే నీ నాడీ మండలం వ్యవస్థ అంతా ఛిద్రమైపోతుంది" అని చెప్పారు. ఇప్పుడు లాలాజీ ఏమంటున్నారు అంటే, 'ఇప్పుడు అటువంటి పరిస్థితి లేదు. నీవు (బాబూజీ) ప్రపంచం అంతటిలోను ఒక రికార్డ్ (ప్రత్యేకత)ను సాధించావు' అని. అభ్యాసులకు తెలియకుండా వారికి ట్రాన్స్‌మిషన్ ఇచ్చినట్లయితే వారి నాడీ మండలం సురక్షితంగా ఉంటుంది, అప్పుడు వారి పురోభివృద్ధి కాలక్రమంగా జరుగుతుంది. దీనిని నేను నా ప్రయోగం ద్వారా గ్రహించాను."

ం౦౦

బాబూజీ చెప్పారు: "ఒకసారి నాకు ఒక ఆలోచన వచ్చింది. అది ఏమిటంటే, స్వరంలో / ధ్వనిలో తేడాలు ఎందుకు ఉంటాయి –అని. మానవుని స్వరం ఒక రకంగా ఉంటే, ఇతర జీవుల స్వరాలు వేర్వేరుగా ఉంటాయి. దానికి దొరికిన సమాధానం ఏమిటంటే –శబ్దం లేదా స్వరం అనేది ఒక ఉత్పత్తియే కాని

సత్యత్వం కాదు –అని. అది స్వరపేటిక యొక్క హద్దులు లేదా దాని బాహ్య నిర్మాణాన్ని బట్టి మారుతూ ఉంటుంది. ఉదాహరణ చెప్పాలంటే, ధ్వని ఒక బాహ్యప్రదేశంలో ఒక విధంగా ఉంటే, అది ప్రత్యేకంగా నిర్మితమైన భవనంలో మరొక విధంగా ఉంటుంది."

ooo

బాబూజీ చెప్పారు: "లాలాజీ తరచుగా ఈ విషయం చెప్తూ ఉండేవారు –"మనకు ప్రసాదించేవాడు వేరుగా ఉంటాడు. అతడు అలా నిశ్చయించుకున్నట్లయితే, అతడు మన చెవులు గుంజుతూ ఇస్తాడు. అయితే ఇది మరొకరి ద్వారానే జరుగుతుంది" అని.

ooo

బాబూజీ చెప్పారు: "అభ్యాసులు కేంద్ర మండలానికి చేరాక కూడా చెడిపోతూ ఉంటారు. ఈ దశలో, వారిలో అత్యంత శక్తి ఉండటం మూలంగా, అది ఎంత స్వల్పమైన లోపమే అయినా శక్తివంతంగా పరిణమిస్తుంది. దీనికి పురాతన ఆరాధనా విధానాలకు కట్టుబడి ఉండటమే ఒక కారణమవుతుంది. అటువంటి వారికి శిక్షణ నివ్వటం నాకు కష్టతరమవుతుంది. అయితే ఒక్క విషయం ఏమిటంటే, దాని చెడు ఫలితాన్ని నాకు ఇవ్వబడిన ప్రత్యేక శక్తి ద్వారా అణచివేస్తాను. ఆ శక్తి మాత్రం, అందుకు పూర్తిగా విభిన్నమైన పనికి మాత్రమే ఉపయోగించాల్సి ఉంటుంది."

ooo

వివిధ దేశాలకు సంబంధించిన విషయాలు చర్చించబడ్డాయి. వాటి శక్తి సామర్థ్యాలను గురించి చర్చిస్తూ– "శత్రువులను అణచి వేయటానికి అవసరమైన ఆయుధాలు లేనటువంటి దేశం ఒక దేశమే కాదు.

క్రీస్తు శిలువ వేదిక మీద ఇచ్చిన సందేశం నాకు నచ్చదు. అయితే నేను ఏమి అంటాను అంటె, 'నీ కుడి చెంప మీద ఎవ్వరైనా చెళ్ళుమనిపిస్తే, అతడిని ఒక కర్రతో బాదు' అని. అలా ఎందుకు అన్నానో మీకు తెలుసా? జీసస్ ఒక ప్రవక్త, నేను మాత్రం కాదు" అని అంటూ బాబూజీ పగలబడి నవ్వారు. ఆ తర్వాత ఇలా చెప్పారు: "అలా చెయ్యడంలో ఆత్మ గౌరవం ఉంది. ఆత్మరక్షణ కోసం ప్రతీకారాన్ని ఆశ్రయించటంలో తప్పులేదు. సహనం వహించటం అనేది ఒక ఘోరమైన శిక్ష అవుతుంది. ఎవ్వరైనాగాని నిన్ను కోపగించినా లేదా నిందించినాగాని, దానిని ఎప్పుడూ సమ్మతించ వద్దు. (అందుకు ప్రతీకారం చేయవద్దు) అందుకు ప్రతిక్రియగా ఏమీ చేయవద్దు. వాళ్ళ కోపం రెట్టింపు అయి, అది వారి శరీరంలోనే అణిగిపోతుంది. చెడు వారి పతనానికి కారణమవుతుంది."

ooo

బాబూజీ చెప్పారు: "నేను శివాజీ మహరాజ్ గురుభక్తిని బాగా ప్రశంసిస్తాను. గురువుపట్ల అతనికిగల భక్తి అద్వితీయమైనది. ఒకసారి, స్వామి రామదాసు శివాజీ కొలువుకు భిక్షాటనకు వచ్చాడు. అప్పుడు శివాజీ మహరాజ్ ఒక కాగితం మీద, తన ఆస్తి అంతా స్వామీజీకే చెందుతుంది అని వ్రాసి, దానిని వారి బిక్షాపాత్రలోపెట్టి, చేతులు జోడించి వినయంగా నిలబడ్డాడు. ఆ విధంగా ఆయన తన సామ్రాజ్యాన్ని

స్వామి రామదాసుకు సమర్పణచేసి, తర్వాత స్వామి రామదాసు కోర్కెమేరకు దానిని వారి ప్రతినిధిగా పరిపాలించాడు. ఆ రోజు నుంచీ శివాజీ సింహాసనం అధిష్టంచ కుండా దాని ప్రక్కనే కుర్చుండి రాజ్యపాలన చేశాడు."

ooo

"శివాజీ సద్బుద్ధి కూడా సాటిలేనిది. తనకు వశీభూతమైన ముస్లిం బాలికలపట్ల ఆయన ప్రవర్తించిన మంచి తీరు చరిత్రలో ఎక్కడా కనిపించదు. మరైతే ముస్లిం రాజులలో అటువంటి మహోన్నతమైన రాజు ఎవ్వరైనా ఉన్నారా?" అన్నారు బాబూజీ.

ooo

బాబూజీ మహరాజ్, శివాజీ మహరాజ్ యొక్క పరాక్రమాన్ని, కారుణ్యాన్ని అలాగే గురుభక్తినీ కొనియాడుతూ అన్నారు: "సాంఘిక ప్రవర్తన వంటి వాటిలోనైతే ఎవ్వరైనా గాని తమ తప్పును బాహ్య ప్రవర్తనలో సరిదిద్దుకుంటారు. కాని మానవుడు తన ఆంతరంగిక దృష్టిని మలచుకోవటం కష్టమైనది."

ooo

బాబూజీ చెప్పారు: "మన జనం సద్గుణాలకు దూరమైన సన్యాసులను కూడా గౌరవిస్తారు. ఒకవేళ ఎవ్వరైనా మొదట తప్పు దారి బట్టి మళ్ళీ సరిదిద్దుకుంటే అది వేరే విషయం. కాని సత్ప్రవర్తన లోపించినవారి విషయంలో అలా కాదు. వారు ఆ విధంగా దిగజారి పతనమై పోతూనే ఉంటారు. అయినా కూడా సమాజం అటువంటి వారిని గౌరవిస్తున్నది అంటే ఏమని చెప్పాలి? నేను ఒక విధంగా సన్యాసి అను మాట వినగానే ఆవేశపడతాను."

ooo

సన్యాసులే మన దేశాన్ని భ్రష్టుపట్టించారని బాబూజీ చెప్పారు. బాబూజీ ఏమన్నారో చూడండి: "ఇతరులు మనల్ని గౌరవించాలను భావంగాని, కోర్కెగాని మనకు ఉండకూడదు. అదే కనుక ఉన్నట్లయితే, మనం గౌరవించబడం. కేవలం ఈ భావనతోనే ప్రజలు సన్యాసులను గౌరవించలేకపోతున్నారు. వారు ప్రజలకు సత్ప్రవర్తన గురించి బోధించకుండా పనికిరాని మాటలు వల్లిస్తూ సంచారం చేస్తూ ఉంటారు. వాళ్ళు తమ దుష్టప్రవర్తనను ఆధ్యాత్మికపరమైన ప్రసంగాలతో కప్పిపుచ్చుకుంటూ ఉంటారు.

ooo

బాబూజీ చెప్పారు: "సన్యాసులు ధరించే వస్త్రధారణనుబట్టి, వారు తమ ఇంద్రియాలను నిగ్రహించుకున్నట్లుగా భావించాల్సి ఉంటుంది. అతడు భగవత్ కార్యానికి నిరంతర (వాలంటీర్) సేవకుడుగా ఆ వస్త్రధారణ (కాషాయ రంగు) గుర్తింపజేస్తుంది. కాలం గడిచినకొద్దీ, మానవుని ఆంతరిక స్థితి గుర్తించలేని పరిస్థితి ఏర్పడిన కారణంగా ఆ వ్యవస్థ అంతా మరుగున పడిపోయింది."

ooo

బాబూజీ కొన్ని నిరర్థకమైన సాధనల గురించి చెప్తూ, “ఒక పేపరుమీద రామ నామం వ్రాసి, దానిని ముక్కలు ముక్కలుగా చేసి, వాటిని గోధమ పిండిలో కలిపి చిన్న చిన్న ఉండలుగా చేసి, చేపలకు ఆహారంగా తినిపించడమనేది ఒక సాధనయేనా? ఈ విధంగా చేయటంవలనగాని, మరి ఇటువంటి ఇతర సాధనల ద్వారాగాని ఆధ్యాత్మిక పురోగతి పొందటం సంభవమేనా? ఆ విధంగా రామ నామం వ్రాసి ముక్కలుగా చేసి గోధుమపిండితో గోలీలుగా చేసినవి చేపల కడుపులోకి వెళ్తే మనం పొందే ఆధ్యాత్మిక లాభం ఏమిటి?” అని ప్రశ్నించారు.

ooo

బాబూజీ దశ నియమాలు ఏ విధంగా రూపొందించారో దాని వృత్తాంతం తెలిపారు. వారి ఆధ్యాత్మిక సోదరుడు పండిట్ రామేశ్వర్ ప్రసాద్‌గారు ఒకసారి బాబూజీతో సత్సంగీయులకు, ఆచరణకు కొన్ని నియమాలు ఉంటే బాగుంటుంది అని చెప్పారు. ఆ విధంగా ఒకరోజున మధ్యాహ్న సమయంలో బాబూజీ, రామేశ్వర్ ప్రసాద్ గారిని పిలిపించి, వారికి కాగితం, కలం అందించి తాను చెప్పినది వ్రాయమన్నారు. కొంచెం ఆలోచించిన తరువాత ఆ నియమాలు ఒక్కొటొక్కటిగా వెలువడ్డాయి. ‘వారు’ చెప్పిన మాటలు– “పదవ నియమం వ్రాసిన తరువాత ఆలోచన తెగిపోయి, ఆ తర్వాత నాకు ఏమీ స్ఫురించలేదు. అప్పుడు రామేశ్వర్ ప్రసాద్‌గారు, ఆ పది నియమాలు (దశ నియమాలు, Ten Commandments) మీద వ్యాఖ్యానం వ్రాసి ప్రచురించమని నన్ను ప్రేరేపించారు. నేను అలాగే చేశాను. "Commentary on Ten Commandments" “దశ నియమాల వ్యాఖ్యానం” నేను వ్రాసినది మకుటాయ మానమైనది. చాలామంది దానిని సరిగ్గా అర్థం చేసుకోలేకపోయారు. అప్పుడు నేను వాటిలోని క్లిష్ట విషయాలను సులభశైలిలో స్పష్టంగా వ్రాశాను” అన్నారు.

ooo

బాబూజీ చెప్పారు: “దుష్టశక్తులు, దయ్యాలు పీడించటం ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లోనే ఉంటుంది. అప్పుడప్పుడు గ్రామీణులు కొన్ని వ్యాధులు దయ్యాల మూలంగానని భావించి వ్యాధి నివారణ కోసం వైద్యం చేయించుకోకుండా మంత్ర తంత్రాలు మరియు తావీదుల (రక్షరేకుల) వెంటబడతారు. ఇది శుద్ధ తప్పు. ఆ వ్యాధులను డాక్టర్‌తో పరీక్ష చేయించుకుని, సరైన వైద్యం చేయించుకోవాలి. ఎవరిలోనైతే గట్టి సంకల్పం ఉంటుందో వారిని అవేమీ చేయలేవు.”

ooo

బాబూజీ ధర్మానికి సూత్రం చెప్పారు: “ధర్మం ఎక్కడ చేయాలో మీకు తెలుసా? ఎవ్వరైతే కడుబీదవారై ఉండి ధర్మం (ఇతరుల దయకోసం) అర్థించలేరో అటువంటివారికి ధర్మం చేయాలి. ఆ ధర్మం అర్థించినవానికి, కనీసం దానిని అతనికి ఎవ్వరు ఇచ్చారో కూడా తెలియకూడదు. నేను ఎప్పుడూ కూడా ఇదే విధానాన్ని ఆచరిస్తాను.”

ooo

బాబూజీ చెప్పారు : “నేను మీకు ఒక మంచి విషయం చెబుతాను. మనలో అహంభావం లేదని మనం ఎలా తెలుసుకో గలుగుతాము? మనకు చెందిన ప్రతిదానితోను మనకు సంబంధం లేనట్లుగా

అనిపిస్తుంది. ఇది 'నేను', ఇది 'నాది' అను భావం మరుగై పోతుంది. ఇప్పుడు మీరు మీ హృదయాలను స్పర్శించి మీకు మీరుగా గ్రహించండి."

ooo

ఒకసారి షాజహాన్‌పూర్‌లో ఈశ్వర్ సహాయ్‌గారు బాబూజీకి ఎదురుగా కూర్చుని ఉన్నారు. అప్పుడు ఈశ్వర్ సహాయ్‌గారు, "బాబూజీ, ఇప్పుడు మీరు నా ఎదుట ఉన్నారు. మీ సాన్నిధ్యంలో నేను ఇప్పుడు చాలా సంతోషంగా ఉన్నాను. నా స్థితి కూడా ఇప్పుడు బాగుంది" అన్నారు. దీనికి సమాధానంగా బాబూజీ– "నీవు ఈ విధంగా భౌతిక దృష్టితో ఆలోచించినట్లయితే, నీవు ఎన్నటికీ ఈ భౌతిక బంధానల నుంచి విముక్తి చెందలేవు" అన్నారు.

ooo

ఒకసారి బాబూజీ ప్రయాణంలో, ఈశ్వర్‌సహాయ్‌గారు, బాబూజీ విశ్రాంతి తీసుకోవలసిన పరుపుమీద దుప్పటిని పరిచారు. అప్పుడు ఇది గమనించిన అభ్యాసీ ఒకరు, ఎటువంటి దుమ్ము, ధూళి లేకుండా పరిశుభ్రంగా ఉన్న ఈ పరుపుమీద దుప్పటి ఎందుకు పరిచారు? అని అడిగాడు. బాబూజీ అందుకు సమాధానం ఇస్తూ, "సర్వ సామాన్యంగా అందరూ ఉపయోగించే ఈ పరుపును ఆరోగ్యకరంగాలేని వ్యక్తి ఉపయోగించి ఉన్నట్లయితే అది కొన్ని వ్యాధులకు నిలయమై ఉండవచ్చు. వాటిని నివారించటంకోసం ఈ విధంగా దుప్పటి పరచబడింది. ఇది నా ఆరోగ్య రక్షణ కోసం, లాలాజీ సాహెబ్ సూచించిన పద్ధతిని నేను అనుసరిస్తున్నాను" అని అన్నారు.

ooo

ఒక అభ్యాసీ బాబూజీని అడిగాడు– "కోరికలు ఆధ్యాత్మిక ఉన్నతికి అపకారం అంటారు కదా! అలాగైతే ఆత్మ సాక్షాత్కారం కూడా ఒక కోరికే కదా! అప్పుడు అది కూడా అపకారి కాదా?" అన్నాడు. దానికి బాబూజీ ఇలా సమాధానం ఇచ్చారు: "సాక్షాత్కారం అనేది ఎటువంటి కోరిక నుంచి జనించలేదు. కనుక అది కోరికకు అతీతమైనది. మానవ జీవితం యొక్క ప్రయోజనం భగవత్ సాక్షాత్కారం కొరకే. అందుకోసమే ఈ దేహం ఇవ్వబడింది."

ooo

ఒక అభ్యాసీ, బాబూజీ ఒక మహాత్ముడు అయినప్పుడు, తన కొరకు బాబూజీ ఏదైనా చేయవచ్చునుగదా అని భావించాడు. బాబూజీ దానికి సమాధానం ఇస్తూ, "ఈ ప్రపంచం ఎలా ఉందో చూడండి! నేను మందు సేవిస్తే అభ్యాసీ ఆరోగ్యవంతుడు కావాలి. ఒక రోగి తన జబ్బు నయంకాకపోతే మరొక డాక్టర్‌వద్దకు వెళ్ళవచ్చు కాని ఒక డాక్టర్ ఆ రోగిని వెళ్ళిపొమ్మని చెప్పలేదు" అన్నారు. అలాగే అభ్యాసులు బాబూజీని విడిచిపెట్టినప్పటికీ బాబూజీ తన అభ్యాసులను విడిచిపెట్టరు.

ooo

ఒక అభ్యాసీ ఒకసారి బాబూజీతో, “బాబూజీ! మీరు మాకు తండ్రి వంటి వారు, మేము మీ బిడ్డలం. కాబట్టి మీ నుంచి మాకు ప్రతిదీ పొందే హక్కు ఉంది” అన్నాడు. బాబూజీ దానికి సమాధానంగా, “మీరు ఏ రోజునైతే నా బిడ్డలు (నిజమైన బిడ్డలు)గా తయారవుతారో, ఆ రోజున మీరు నా నుంచి పొందవలసినది ప్రతిదీ పొందుతారు” అన్నారు. ఒక బిడ్డకు తన తల్లితప్ప మరేదీ తెలియదు. ఆ బిడ్డ తన తల్లి లేకుండా మనజాలదు.

ooo

ఒక అభ్యాసీ బాబూజీతో, “నేను మిమ్మల్ని చాలాసార్లు తలచుకుంటాను. మీరు నన్ను ఎలా గుర్తు చేసుకుంటారు?” అని ప్రశ్నించాడు. దానికి సమాధానంగా బాబూజీ, “నేను నిన్ను ఒక ప్రశ్న అడుగుతాను; నీవు జవాబు చెప్పు. నీ ప్రశ్నకు సమాధానం నీవు ఇచ్చే జవాబులోనే ఉంటుంది. నీవు నిన్ను స్వయంగా ఎన్నిసార్లు మరిచిపోయావు?” అన్నారు. అభ్యాసీ ఏమీ సమాధానం చెప్పలేక పోయాడు. అప్పుడు బాబూజీ, “రెండు విషయాలు ఒకే సమయంలో జ్ఞాపకం చేసుకోబడవు. నీవు నన్ను జ్ఞాపకం చేసుకోవాలి అనుకుంటే, నిన్ను నీవు మర్చిపోవాలి. ఆ సమయంలో నీ జ్ఞాపకం కనుక నీవు కలిగి ఉంటే నేను అక్కడ లేనన్నమాట. నా జ్ఞాపకం నీలో ఉన్నది అంటే, అక్కడ నీవు లేవన్న మాట” అన్నారు.

ooo

ఎప్పుడైనా, ఎవ్వరైనా బాబూజీకి తన కష్టాలు వివరించి నప్పుడు బాబూజీ అనేవారు, “రండి, నీవు, నేను కలిసి దైవాన్ని ప్రార్థించుదాం. ‘అతడే’ అందరికీ దిక్కు” అని.

ooo

షాజహాన్‌పూర్‌లో, అభ్యాసులు సాధ్యపడినంతవరకు బాబూజీ ఎదుట కూర్చొనటానికి ప్రయత్నించే వారు. ఒక అభ్యాసీమాత్రం ఇతరులెవ్వరికీ ఇబ్బంది కలగకుండాను, వారికి భంగం వాటిల్లకుండాను ప్రశాంతంగా వెనుక కూర్చునేవాడు. రెండు, మూడు రోజుల తర్వాత, ధ్యానం పూర్తయ్యాక, బాబూజీ అతడిని పిలిచి, “నీవు చేసిన పని నాకు నచ్చింది. నీవు ఇతరులకు భంగం కలిగించ కుండా ఒక మూలన కూర్చున్నావు. భంగం కలిగించటం అంటే అందరికీ దూరంగా ఉండటం కాదు. ఏ కోణం నుంచి అయినా సరే, నీవు నన్ను చూడవచ్చు అను (అంటే సర్వత్రా ఉన్నాను) నీ భావమే ఇతరులకు భంగం కలిగించదు. నీలో ఉన్న ఈ భావం నన్ను బాగా ఆకర్షించింది” అన్నారు. దీనిలో మనందరికీ ఒక గుణపాఠం ఉంది. అది ఏమిటంటే, మనం ఎక్కడ కూర్చున్నాగాని మన ‘అహం’ వారికి సమర్పించబడాలి.

ooo

బాబూజీ ఏ అభ్యాసితోనైనా ఉదయం 6 గంటలకు సిట్టింగ్‌కు కూర్చోమన్నారు అంటే, సరిగ్గా అదే సమయానికి ప్రాణాహుతి నిస్తారు. అభ్యాసీ యొక్క సమయం వృధా కాకుండా వారు విధిగా సమయపాలన పాటిస్తారు.

ooo

ఒక అభ్యాసీ బాబూజీతో, తాను దేవాలయాలు సందర్శించినప్పుడు, బాబూజీ అక్కడి దేవతా విగ్రహాలలో ఉన్నట్లుగా భావించు కుంటాను అని చెప్పాడు. దీనికి సమాధానంగా బాబూజీ, తనను ఎప్పుడూ విగ్రహాలలో ఇమిడి ఉన్నట్లుగా భావించవద్దని, అతడు బాబూజీని దర్శించాలనుకుంటే, మరో విధంగా దర్శించకోవచ్చు అని చెప్పారు.

ooo

ధ్యాన సమయంలో పొందిన ప్రాణాహుతిని, దివ్యత్వాన్ని జీర్ణించుకోవాలని అనగా తనలో ఇమిడిపోయేటట్లుగా చేసుకోవాలని బాబూజీ పునరుద్ఘాటించారు. బాబూజీ ఇస్తున్నారు, బాబూజీ చేస్తున్నారు అని అభ్యాసీ భావించినట్లయితే ప్రయోజనం ఏం ఉంటుంది? "రొట్టెను నీవు తినకుండా నేనుగా తింటున్నట్లయితే దాని రుచిని నీవు ఎలా అనుభవించగలవు? కనుక నీవు స్వయంగా అనుభూతి చెందాలి" అన్నారు బాబూజీ.

ooo

ఒకసారి ఇద్దరు అభ్యాసులు బాబూజీ వద్దకు వచ్చారు. అందులో ఒకరు బాబూజీతో– "నేను కూర్చుని ఉండి ధ్యానం చేయలేకపోతున్న కారణంగా, ప్రక్కమీద పండుకొని ధ్యానం చేస్తున్నాను" అని చెప్పాడు. అందుకు సమాధానంగా బాబూజీ, "నీవు నిజంగా కూర్చుండలేకపోతే నీవు ఆ విధంగా చేయవచ్చు" అన్నారు. ఇక ఆ రెండవ అభ్యాసీ, ఆ విషయం విన్నమీదట (తాను అశక్తుడు కాకపోయినప్పటికీ) తనుకూడా అదే విధంగా ఆచరించాడు. మరుసటిరోజు ఆ అభ్యాసులు ఇద్దరూ బాబూజీ వద్దకు వచ్చినప్పుడు, మొదటి అభ్యాసీతో, బాబూజీ– అతడు ఆ విధంగా ప్రక్కమీద పరుండి ధ్యానం చేయటం బాగా సౌకర్యంగా ఉందా అని అడిగారు; ఆ అభ్యాసీ సౌకర్యంగానే ఉందనిపించింది అని చెప్పాడు. రెండవ అభ్యాసీ కూర్చుని ధ్యానం చేయగలవాడై ఉండి కూడా, తాను కూడా అదే విధంగా ధ్యానం చేసినట్లు చెప్పాడు. అప్పుడు బాబూజీ ఈ విధంగా అన్నారు– "నీవు భౌతికంగా కూర్చుని ధ్యానం చేయగల సత్తా నీకు ఉంది. అటువంటప్పుడు నీవు ప్రక్కమీద పరుండి ధ్యానం ఎందుకు చేశావు? నీవు భౌతికంగా కూర్చుండి ధ్యానం చేయలేక పోయినప్పుడు మాత్రమే పరుండి ధ్యానం చేయాలి గాని, ఆరోగ్యకర పరిస్థితుల్లో కాదు" అని.

ooo

బాబూజీ అమెరికా సందర్శించినప్పుడు, ఒక దినపత్రికలో వారి ఫోటో ప్రచురించబడింది. అక్కడ ఒక వృద్ధుడు బాబూజీని చూడటానికని చాలా దూరం నుంచి వచ్చాడు. బాబూజీ ఆయన రాకను గమనించగానే లేచి నిలబడి వారిని కూర్చుండబెట్టి పండ్లు, నీరు సమకూర్చారు. వారు సుఖంగా ఆసీనులయ్యాక బాబూజీ వారితో– "మీరు నన్ను చూడటానికి ఇంతదూరం అవస్థపడి ఎందుకు వచ్చారు?" అని ప్రశ్నించారు. దానికి ఆ వృద్ధుడు ఇలా సమాధానం ఇచ్చాడు : "నిన్న రాత్రి నేను షిర్డి సాయిబాబాను కలలో చూశాను. నేను వారికి సవినయంగా నమస్కరించటానికి వెళ్ళినప్పుడు, వారు నా చేతిని తమ చేతిలోకి తీసుకుని దానిని ఒక మహాత్ముని చేతిలో పెట్టారు. ఉదయం నేను నిద్ర నుంచి లేచిన తరువాత, ఎవరి చేతి లోనయితే నా

హస్తం షిర్డి సాయిబాబాచేత ఉంచబడిందో ఆ మహాత్ముని ఫోటోను దినపత్రికలో చూసాను. కనుక నేను మిమ్మల్ని దర్శించుకోవటానికి వచ్చాను" అని.

ooo

ఒకసారి న్యాయమూర్తి చతుర్వేది బాబూజీని ఈ విధంగా ప్రశ్నించారు: "బాబూజీ! భగవత్ సాక్షాత్కారం కొరకైన తపన నాలో ఉంది. అయితే మరణశయ్యమీద మానవులు భగవంతుని స్మరించు కోవాలి. కనుక తుది శ్వాస సమయంలో మాకు మీ జ్ఞాపకం కనుక కలగక పోయినట్లయితే మా గతి ఏం కాను?" దానికి సమాధానంగా బాబూజీ, "నేను మీ కొరకే వచ్చాను. నేను మిమ్మల్ని జ్ఞాపకం ఉంచుకున్నాను. మీరు నన్ను అప్పుడప్పుడు జ్ఞాపకం చేసుకోండి. మీరు న్యాయమూర్తి స్థానంలో కూర్చుని ఉన్నప్పుడు నన్ను జ్ఞాపకం చేసుకుంటారా? అలా జరగదు. కాని నేను మాత్రం మిమ్మల్ని ఎప్పుడూ జ్ఞాపకం ఉంచుకుంటాను. మీ అందరినీ జ్ఞాపకం చేసుకోవటానికే నేను ఇక్కడకు వచ్చాను. కనుక విచారించవద్దు. దయచేసి నిస్పృహ చెందవద్దు" అన్నారు.

ooo

"నేను ఉన్నతంగా ఎదిగే కాలంలో ఒక విధమైన కలకన్నాను. నల్లని మేనుఛాయ కలిగిన మనిషి కలలో కనిపించి నన్ను నా మాస్టర్‌ను విడిచిపెట్టమన్నాడు. ఆ పని చేయటానికి నన్ను అనేక రకాలుగా పీడించాడు. నేను అతనితో పోరాడి నా ప్రాణం పోయినా సరే ఆ పని జరగదు అన్నాను. ఆ దిగువస్థాయి మనోవృత్తి మళ్ళీ చోటుచేసుకోవాలి అనుకుంది. నా మాస్టర్‌పట్ల నాకుగల విశ్వాసాన్ని సడలించేందుకుగాను, అలాచేస్తే నాకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని నన్ను ప్రేరేపించసాగింది" అని చెప్పారు బాబూజీ.

ooo

బాబూజీ చెప్పారు: "అభ్యాసీకి తారసపడే రకరకాల స్థితులు వివరించటం ఒక రకంగా కష్టమైన పనే. ఇది అందరి విషయంలోను ఒక్కటిగానే ఉండకపోవచ్చునుగాని, తమ ఆంతరిక స్థితుల్లోను, ఆంతరంగిక జీవనంలోను ఎల్లప్పుడు మునిగి ఉండేవారికి ఆ అనుభవం ఎదురవుతుంది. నా మాస్టర్‌కు వందలాదిగా ఉన్న శిష్యగణంలో, నేను ఒక్కడిగా అందుకు ఉదాహరణ అని నా గురువర్యులు, వారి ఉత్తరాలలోని ఒక దానిలో పేర్కొన్నారు. ఒక విధంగా నేను నా చిన్నతనం నుంచే చాలా (sensitive) సునిశితంగా ఉండేవాడను, అందులో ముఖ్యంగా, నేను ఈ విధానం ఆచరించటం మొదలుపెట్టినరోజు నుంచి దానిలో మునిగిపోయాను. నేను అంతర్ జ్ఞానంలోకి జారుకున్నానేమోనని జనం అనుమానిస్తూ ఉండేవారు. నేను ప్రతిదీ దాని జోలికే వదలిపెట్టి, నాకు కలుగుతున్న స్థితిలో నా గురువు ధ్యానం చేస్తున్నట్లుగానే భావించటంతప్ప స్వయంగా ఏమీ తలపెట్టేవాడను కాదు. నేను నా అనుభూతి శక్తిని అభివృద్ధి చేసుకోవాలన్న ఆలోచన ఏదీ లేకుండా, నా మాస్టర్‌తో లయ అవస్థను కల్పించుకోవటానికి ప్రయత్నించేవాడిని."

ooo

బాబూజీ చెప్పారు: "నా గురించి నేను ఒక విషయం చెబుతాను. నేను నా మాస్టర్ (లాలాజీ సాహెబ్) పవిత్రపాదాలచెంత అభ్యాసం ఆరంభించినపుడు, ఏమీ తెలుసుకొనాలనే ఉబలాటం లేకుండా,

లాలాజీని జ్ఞాపకం ఉంచుకోవటం మాత్రమే చేసేవాడను. నా 'అనుభవ శక్తి'ని గురించి లాలాజీ సాహెబ్ స్వయంగా నన్ను తరచుగా పొగడుతూ ఉండేవారు. అంతకుపూర్వం నేను ఆధ్యాత్మిక విద్యార్థిగా ఒక మందకొడివానిగానే ఉండేవాడిని."

ooo

అప్పట్లో నా ఆంతరిక స్థితిని గుర్తించలేకపోతున్నానని నేను నా గురువర్యునికి ఒకసారి ఫిర్యాదు చేసినట్లుగా నాకు జ్ఞాపకం ఉంది. దానికి 'వారు' ఏమన్నారంటే, 'నీవు ఒకరికి ప్రాణాహుతి నిచ్చి అతని స్థితి ఎలా ఉందో గమనించు' అని. దానిలో వారి ఉద్దేశ్యం ఏమిటంటే, నాలోనే కనుక శాంతి నెలకొని ఉంటే, అదే అతనిలో కూడా చోటు చేసుకుంటుంది. ఆంతరిక స్థితిని అంచనా వేయటానికి ఇదొక పరసువేది. నీవు దానిని పరిశీలించావు అన్నారు. ఆ అనుభూతి శక్తి ముఖ్యంగా సాధనమీద ఆధారపడి ఉంటుంది అని నేను ఇదివరకే వ్రాశాను.

ooo

ఎటువంటి అనుభవం లేదా అనుభూతి లేకుండానే అత్యున్నత స్థానానికి ఎదిగినవారి గురించి బాబూజీ వివరిస్తూ ఇలా చెప్పారు: "నా పరిశీలనకు తోడుగా నేను నా గురువర్యుని మాటల్ని ప్రస్తావిస్తాను. తమ ఆధ్యాత్మిక జీవితంలో ఎటువంటి అనుభవం లేదా అనుభూతి యొక్క గ్రహింపు లేకుండానే ఉన్నత స్థితులు పొందినవారు చాలామంది ఉన్నారు. సెయింట్ తత్వం అనేది కేవలం అనుభూతిమీదనే ఆధారపడి ఉండకుండా దానిని పొందటంమీదనే ఆధారపడి ఉంటుంది. నేను నా మాస్టర్ సత్సంగానికి చెందిన ఒక ఉదాహరణ వివరిస్తాను. వారు తరచుగా నా డైరీలను నా సోదర శిష్యుల ముందు ఉంచి, వాటిలో నేను వివరించిన స్థితులను, వాటిని వ్యక్తంచేసిన తీరును చదవమని ఆదేశించేవారు. దీనివలన వారు స్థితులను ఎలా వ్యక్తం చెయ్యాలో వారు నేర్చుకోవచ్చు. మీకు నిజం చెప్పాలంటే, అతిస్వల్ప అంశాన్ని కూడా అనుభూతి చెందగలిగిన వాడిని, వారి సత్సంగంలో నేను ఒక్కడినేనని వారు తరచుగా వ్యాఖ్యానిస్తూ ఉండేవారు. దీనిని నేను నా గతజీవితంలోనే సేకరించుకొని, నా సామర్థ్యంమేరకు అభివృద్ధిపరచుకున్నాను. నా బాల్యంలో నేను ఎంత (sensitive) సునిశితంగా ఉండేవాడను అంటే, ఆఖరికి వాయుతరంగాల గమనాన్ని కూడా గ్రహించగలిగి ఉండేవాడిని. ఒక మనిషి యొక్క శీలాన్ని, కేవలం అతని చెమట వాసన ద్వారా గ్రహించగల సత్తా కలిగి ఉండేవాడను. అయితే సహజ గుణాలను నేను ఎలా అలవర్చుకున్నాను అనేది ప్రశ్నగా ఉండిపోతుంది. నేను ఆ సమయంలో ప్రత్యేక ప్రాంతంలో కలిగి ఉన్న స్థితితోపాటే నా గురువర్యుని గురించిన ఆలోచన కూడా కలిగి ఉండేవాడిని. దానితోపాటుగానే నేను చేసిన పని ఏమిటంటే, ఆంతరికంగా నా గురువర్యుని పోలి ఉన్నట్లుగా లయ అవస్థను ఉత్పన్నం చేసుకునేవాడను. అదృష్టవశాత్తు నాకు దాని దర్శనం కలిగింది. దీనిని మీరుగాని, ఇంకెవ్వరైనాగాని ఇదే పనిని చేయగలిగి ఉన్నట్లయితే, ఆ అనుభవాల దిశగా మీరు ముందుకు పోలేకపోతున్నారు అనటానికి కారణం ఉండదు.

ooo

నా గురువర్యులు లాలాజీ సాహెబ్ తమ భౌతిక దేహం విడిచిపెట్టిన తర్వాత నన్ను ఈ ప్రస్తుత స్థితికి చేర్చటానికి 12 సంవత్సరాల కాలం పట్టింది. వారు ఏమన్నారంటే, "నేను ఇంకా ఎక్కువ సమయం తీసుకుని ఉండేవాడను, కాని కొంతకాలం తర్వాత ఇంకెవ్వరికైనా దీనిని నేర్పగలిగిన సత్తా కలిగి ఉండలేవు అని గ్రహించి ఈ విధంగా, త్వరితంగా పూర్తిచేయక తప్పలేదు" అన్నారు. నాకు జ్ఞాపకం ఉన్నంతవరకు, దానికి కారణం చెప్పాలంటే, నేను అప్పటికి నెగేషన్ నుంచి నెగేషన్ స్థితికి, చేరబోతున్నాను కనుక, దాని ఫలితంగా నేను ఏమీలేదు (అనగా అస్తిత్వం తెలియని స్థితి) అయిపోవటానికి చేరువవుతున్నట్లు వారు గ్రహించి ఉంటారు. నెగేషన్ నుంచి నెగేషన్ స్థితికి తర్వాత కలగనున్న స్థితి– 'నెగేషన్ నుంచి నెగేషన్ యొక్క మరపుస్థితి' అవుతుంది. దాని మూలంగా నేను శరీరం విడిచిపెట్టాల్సి రావచ్చు. అందుచేత వారు తమ కార్యాన్ని వేగవంతం చేశారు.

ooo

సమర్థగురు మహాత్మా రామచంద్రజీ, ఫతేఘర్ – మహా సమాధి చెందిన తర్వాత, వారి ఆధ్యాత్మిక శక్తి అంతా నాలో ప్రవేశించి అంతర్నిహితం అయిపోయినట్లుగా నేను అనుభూతి చెందాను. అప్పుడు తక్షణమే నేను, ఈ స్థితి (శక్తి) నాకు బదలాయించ బడినట్లుగా అర్థం చేసుకున్నాను. ఆ తర్వాత వారి మహాసమాధి గురించిన వార్త నాకు తెలిసింది. ఆ శక్తిని ఇముడ్చుకోవటంలో నా నాడీవ్యవస్థ అంతా చెల్లాచెదురైంది. నాడీవ్యవస్థలో ఆ వైపరీత్యం మూలంగా నేను తీవ్రమైన అనారోగ్యాన్ని అనుభవించిన తర్వాత ఆ శక్తినంతటనీ నాలో ఇముడ్చుకున్నాను. ఇప్పుడు 'వారి' సంపూర్ణ శక్తితోపాటు నేను స్వయంగా సంపాదించుకున్న శక్తి కూడా నాలో అంతర్లీనంగా ఉంది. ఆ విధంగా నా గురువర్యుని (శక్తి) సంపాదనను నేను వృద్ధిచేశానేగాని ఏమాత్రం తగ్గించలేదు.

ooo

పిల్లలు ఒక కుక్కను బాగా మచ్చిక చేసుకొని దానిని బాగా ప్రేమించేవారు. నాకు కూడా దానిపట్ల కొంత అభిమానం ఉండేది. అది చివరకు 27 జనవరి 1953న చనిపోయింది. దాని జీవిత కాలంలో ఒక సంఘటన జరిగింది. దాని అదృష్టవశాత్తు స్వామి నారదానంద్ అప్పుడు షాజహాన్‌పూర్ వచ్చారు. ఆయన కొన్ని ఉపన్యాసాలు ఇస్తూ చాలా మంచి విషయాలు చెప్పారు. ఆ కార్యక్రమం నా ఇంటికి సమీపంలోనే ఏర్పాటైంది. మైక్రోఫోన్ కూడా ఏర్పాటు చేసినందున వారి ఉపన్యాసాలు కొంతగా వినపడుతూ ఉండేవి. ఆయన ఎదుట ఎంతో జనసమూహం ఉండగా నా ఎదుట ఆ కుక్క మాత్రం ఉంది. అప్పుడు నాకు అనిపించింది, ఆయన చాలామంది జనానికి బోధనలుచేస్తూ తన తాపసిక ధర్మాన్ని నిర్వర్తిస్తూ ఉన్నారు; అయితే అది మానవులకు మాత్రమే పరిమితమై ఉంది. ఆయన ఒక మానవుడు కనుక, మానవులపట్ల ఆయనకు సహానుభూతి ఉండాల్సి ఉంటుంది. మన మతంలో, ఎవ్వరైతే భగవంతుడ్ని ఆరాధించరో వారు ఒక జంతువుతో సమానమని చెప్పబడింది. ఈ సూక్తిని దృష్టిలో పెట్టుకున్నట్లయితే నేను భగవంతుడ్ని ఆరాధించను కనుక నేను కూడా ఈ కోవకే చెందుతాను. ఒక మానవుడు ఎప్పుడైతే తోటి మానవునికి అతని ప్రయోజనం కోసం సహాయపడుతున్నాడో, అప్పుడు నేను కూడా నా జాతికి (జంతు జాతి) చెందిన

జీవికి ఎందుకు సహాయపడ కూడదు? అనిపించింది. స్వామీజీ తన బాధ్యతలు విస్మరించనపుడు నేను మాత్రం నా బాధ్యతను ఎందుకు విస్మరించాలి. కనుక ఒక మహాత్ముని రాకతో నేను కూడా నా బాధ్యతా నిర్వహణ గురించి తెలుసుకోవాల్సి ఉంటుంది అని అనిపించింది. దాని ఫలితంగా నేను కూడా నా స్థాయికి చెందిన ఒక సజీవ ప్రాణికి మేలు సమకూర్చాను, దానితో అది (ఆ జీవి – కుక్క) ఏమి పొందిందో తెలుసా? ఒక జంతువు ఇంకొక జంతువు నుంచి పొందగల దానినే పొందింది. జంతువులకు తెలివితేటలు ఉండవు. అలాగే నాకూ తెలివి తేటలు లేవు. ఈ విషయానికివస్తే, కుక్కకు నాకు మధ్య భేదం ఏమీ లేదు. కనుక అది తెలివి తేటలతో సంబంధం లేకుండా ప్రయోజనం పొందింది. (బాబూజీ ఇక్కడ తమ జీవకారుణ్య దృష్టిని ప్రదర్శించిట్లయ్యింది.) ఈ సందర్భాన్ని పురస్కరించుకుని స్వామి వివేకానంద, "ఇది ఒక సామాన్య మానవుడు వ్రాయగలిగిన విషయమా? ఇది పూర్తిగా తత్త్వజ్ఞానంతో కూడి ఉంది" అని వ్యాఖ్యానించారు.

నా మాస్టర్ సాహబ్‌కు నేను ఫలితాన్ని చెప్పవలసిన బాధ్యత ఉంది కనుక, ఆ కుక్క బ్రైటర్‌వరల్డ్‌కు వెళ్ళబోతున్నదని, దాని సంస్కారాలను కూడా అది తొలగించుకొనబోతున్నదని వారికి వ్రాశాను. అది 26 ఫిబ్రవరి 1953న రాత్రి 8 గం. 40 ని॥లకు బ్రైటర్ వరల్డ్‌కు చేరుకుంది. అది తొలగించుకున్న సంస్కారాల సముదాయం నావైపు చూస్తూ ఉంది. లాలాజీ వెంటనే వాటిని దహించి వేయమని నన్ను ఆజ్ఞాపించారు కాని నేను ఆ విషయం మరచి పోయినందున వాటి ప్రభావం నామీద కొంతగా ఏర్పడింది. ఇంకా ఒకటి రెండు సంస్కారాల ప్రభావం అలాగే ఉండిపోయింది కాని అందుకు నేనేమీ చేయలేదు. ఆ సంస్కారాలు నా హృదయంలో నిలిచి పోయాయి కనుక వాటిని గురించి చింతించాల్సిన పనిలేదు. ఆ శునకం మాత్రం ఖచ్చితంగా ప్రయోజనం పొందింది. నేను లాలాజీ సాహెబ్‌కు ముందుగా ఈ విషయం చెప్పి అనుమతి పొంద లేదు కనుక నేను వారిని ఈ సంస్కారాలను తొలగించమని కోరటానికి సాహసించలేదు. ఇంతలో లాలాజీ సాహెబ్ నాతో ఒక నిమిషం ఉండమని చెప్పి ఆ సంస్కారాలను తొలగించారు. కాబట్టి లాలాజీ సాహెబ్ నన్ను ప్రేమిస్తున్నారో లేక నేను లాలాజీ సాహెబ్‌ను ప్రేమిస్తున్నానో, మీరే చెప్పండి.

ooo

సాక్షాత్కారం గురించిన నా ఆలోచన ఉన్నత ప్రమాణంగా ఉంటుంది. ఏ అభ్యాసీ అయినాగాని అతడు స్వయంగా దైవంలో లయం కానంతవరకు అతడిని నేను ఆత్మ సాక్షాత్కారం పొందిన వానిగా చెప్పను. ప్రస్తుతం నాకు అటువంటి వ్యక్తి ఎవ్వరూ కనిపించటం లేదు. అటువంటి వ్యక్తిని నా గురుమహారాజ్ తయారు చేసి ఉంటే అది వేరే సంగతి. బిటియా! నేను ఆధ్యాత్మికంగా హ్రస్వదృష్టి (చిన్నచూపు) కలిగి ఉండవచ్చు. నేను ఒక వృత్తాంతం చెబుతాను. ఒకసారి దుర్యోధనుడు శ్రీకృష్ణునితో, "నేను కూడా నీకు బంధువునే అయి ఉండగా నీవు నన్ను ప్రేమించకుండా అర్జునుడినే ఎందుకు ఎక్కువగా ప్రేమిస్తావు?" అని అడిగాడు. దానికి శ్రీకృష్ణుడు ప్రతిస్పందించాడు. కొంతసేపు అయిన తర్వాత శ్రీకృష్ణుడు దుర్యోధనునితో అతని సామ్రాజ్యంలోని మంచి వ్యక్తుల జాబితా ఒకటి తయారుచేయమని, అలాగే అర్జునునితో అతని సామ్రాజ్యంలో దుష్టవ్యక్తుల జాబితా ఒక దానిని తయారుచేయమని ఆదేశించాడు. ఆ ప్రయత్నంలో ఇద్దరూ వెళ్ళిపోయారు. అర్జునుడు తిరిగివచ్చి, తాను ఒక్క దుష్టవ్యక్తిని కూడా జాబితాలో చేర్చలేకపోయాను అని

చెప్పగా దుర్యోధనుడు, తన జాబితాలో చేర్చటానికి ఒక్క మంచి వ్యక్తి కూడా కనిపించలేదని చెప్పాడు. అప్పుడు శ్రీకృష్ణుడు తాను అందుకే అర్జునుణ్ని ఎక్కువగా ప్రేమిస్తున్నానని చెప్పాడు. అతడు చాలా మంచివాడు కనుక అతనికి అందరూ మంచిగానే కనిపిస్తున్నారు, నీవు చాలా చెడ్డవానివి కనుక నీకు ఎవ్వరూ మంచి వారుగా కనిపించటంలేదు అని దుర్యోధనునితో చెప్పాడు. నా దృష్టి కూడా దుర్యోధనుని వంటిదేమోనని నేను భయపడుతున్నాను.

ooo

బాబూజీ తాను చెప్పదలచిన విషయాన్ని శ్రీకృష్ణ భగవానునికి చెందిన ఒక వృత్తాంతంతో పోల్చి చెప్పారు. శ్రీకృష్ణ భగవానుడు ఒకసారి తన భార్య రుక్మిణితో తీరిక సమయంలో కాలక్షేపానికి పాచికలాడుతున్నాడు. ఆ సందర్భంలో శ్రీకృష్ణుడు ఒక్కసారిగా కోపంతో తన కనుబొమ్మలు ముకుళించి, ఆ పాచికలను అలాగే తన చేతపట్టి ఉంచాడు. రుక్మిణీదేవి కలవరంచెంది కారణం ఏమిటి అని అడిగింది. మరుక్షణంలోనే, శ్రీకృష్ణుడు నవ్వుతూ తన ఆటను కొనసాగిస్తూ పాచికలను విసిరి, దానికి కారణం ఈ విధంగా చెప్పాడు: “ఇందులో భయపడాల్సింది ఏమీలేదు. ఇద్దరు రజకులు (బట్టలు ఉతికేవారు) తగవులాడుకుంటున్నారు” అని. రుక్మిణీదేవి ఇంకా ఆశ్చర్యపోయి వివరం చెప్పమని కోరింది. అప్పుడు ఆమెకు శ్రీకృష్ణుడు ఈ విధంగా వివరించాడు: ఒక ఋషి నది ఒడ్డున ఒకచోట ధ్యానసాధన చేస్తూ ప్రార్థనకు పూనుకున్నాడు. ఆ సమీపంలోనే ఒక రజకుడు బట్టలు ఉతుకుతున్నాడు. అప్పుడు అతడు ఉతికిన బట్టల నుంచి తడి విరజిమ్ముతూ ఆ ఋషికి భంగం కలిగించేటట్లుగా వ్యవహరిస్తున్నాడు. ఆ సందర్భంలో శ్రీకృష్ణుడి కనుబొమ్మలు కోపంతో ముకుళించబడ్డాయి. శ్రీకృష్ణుడు ఆ చాకలివానిమీద చర్య తీసుకుందామని అనుకున్నంతలోనే ఆ ఋషి తన ధ్యానాన్ని, ప్రార్థనను నిలిపివేసి ఆ చాకలివానితో పోట్లాడటానికి సిద్ధపడ్డాడు. దీనిని శ్రీకృష్ణుడు పెద్ద విషయం ఏమీలేదని చెబుతూనే “ఇద్దరు రజకులు పోట్లాడుకుంటున్నారు” అని వ్యాఖ్యానించారు. తన ధ్యానసాధన, ప్రార్థనను నిలిపివేసి చాకలివానితో పోట్లాడటానికి సిద్ధమయ్యిన ఆ ఋషిని కూడా శ్రీకృష్ణుడు చాకలివానితో పోల్చారు.

ooo

వర్షాలు ఆలస్యం కావటంతో నేను చాలా కలత చెందాను. నేను ప్రకృతిని విశ్లేషణ చేస్తున్నప్పుడు, వర్షాన్ని కురిపించటంలో ప్రకృతి కార్యంమీద దృష్టి సారించవద్దని అనుకున్నాను. తర్వాత కొన్ని కారణాలవలన, నా హక్కుల వినియోగం దృష్ట్యా, వర్షం కురిపించటానికి ప్రకృతి నుంచి నేను ఆదేశం పొందాను. అయితే అలా వర్షం కురిపించటానికి అనుకూల పరిస్థితులేవీ కనిపించలేదు. అప్పుడు నా శ్రమను తగ్గించుకోవటం కోసం నేను అత్రిఋషికి ఈ పని పురమాయించాను. అతడు సముద్రంలో ఈ వర్ష పవనాలను కల్పించే పనిలో బాగా నిమగ్నమైపోయాడు. ఆ మూడవరోజున వర్షం కురవనారంభించింది. నేను అప్పుడు అత్రిఋషి శక్తిని, విధానాన్ని అంచనా వేసే అవకాశం కలిగింది. అత్రిఋషి ఇప్పటికీ సజీవుడై ఉన్నాడు. అతని ఉనికి గంగ, యమునలకు మధ్యలో ఉత్తరపుటంచున ఉంది.

ooo

నా మాస్టర్ లాలాజీ సాహెబ్ నన్ను తన ప్రతినిధిగా తయారు చేసినప్పుడు నా నుంచి గురుదక్షిణ కోరారు. అలా కోరటం హిందువులలో అనాదిగా ఒక ఆచారంగా ఉండిపోయింది. హిందువులలో ఈ ట్రాన్స్‌మిషన్ విధానం తెరమరుగై పోతున్నందు వలన, ఆధ్యాత్మికతను అంతటా విస్తరింపజేయటానికని అటువంటి గురుదక్షిణ కోరబడుతూ ఉండేది. అప్పుడు నేను వారికి నా జీవిత పర్యంతం ఇటువంటి సేవ చేయటానికి అంకితమై ఉంటానని గంభీరంగా ప్రకటించాను. ఆ విధంగా నా ఆధ్యాత్మిక శక్తి అంతా కూడా మానవ సేవకోసం సమకూర్చబడింది. ఆధ్యాత్మికతను నా తోటివారికి వినియోగించటం కోసం తరచుగా నాకు విరామం లేకుండా పోతుంది. నాకు శక్తి ఉన్న ఈ అనతికాలంలోనే నేను చేసిన పని, నేను నిర్వహించిన పనులు వెలుగులోకి వచ్చినప్పుడు, నా తర్వాత ప్రపంచం వాటిని జ్ఞాపకం చేసుకుంటుంది. అందుచేత ఎవ్వరైనా నావద్దకు ఆధ్యాత్మిక సేవ నాశించి వచ్చినప్పుడు, నేను వారికి ఋణపడి ఉన్నానని అనుకుంటాను. ఆధ్యాత్మిక శిక్షణ నివ్వటానికి నేను ఒక గురువుగా వ్యవహరించకుండా మానవాళికి ఒక సేవకునిగానే వ్యవహరిస్తాను. అందువలన, నిస్సందేహంగా మీకు ఎటువంటి ఉన్నతికొరకైనా, అవకాశం ఉన్నంతవరకు తోడ్పడటానికి నేను ఎటువంటి ఇబ్బందిగాను భావించను. అనివార్యమైన మార్పులకు ఆలవాలమైన ఈ ప్రపంచం మీద వ్యామోహం ప్రతి ఒక్కరి మనస్సులోను ప్రగాఢంగా ఉంది. ఎందు కంటే, మనం స్వశక్తితో దానివైపు ఆకర్షించబడ్డాము. ఆ స్వశక్తినే కనుక ఆ సర్వశక్తునివైపు మరల్చినట్లయితే, మనం ప్రకృతిసిద్ధంగానే ఈ బాధలు, దుఃఖాలన్నింటి నుంచి విముక్తులమవుతాం.

ооо

వాతావరణం, సామాన్యం కానటువంటి అమితమైన ఆలోచనలు కల్పిస్తూ ఉంటుంది. ఎందుకంటే, యోగి అయినవాడు అపరిమిత గ్రహణశక్తిని కలిగి ఉండి, నిశితమైన జ్ఞానాన్ని కలిగి పవిత్రంగా ఉంటాడు. అతికొద్ది చీకటి కూడా అతనికి కొండంతగా కనిపిస్తుంది. ఆ వాతావరణ ప్రభావం ఎలా ఉంటుందో మీకు ఒక చిన్న ఉదాహరణ ఇస్తాను. కొన్ని సంవత్సరాలక్రితం నేను మథుర వెళ్ళినప్పుడు శ్రీకృష్ణుని జన్మస్థలంవద్ద ధ్యానం చేశాను. అక్కడ ఒక మసీదు ఉంది; దాని అరుగుమీద ధ్యానంలో కూర్చుని ఉండగా దొంగతనం గురించిన ఆలోచనలు ప్రతిధ్వనిస్తూ ఉన్నాయి. నేను కొన్ని క్షణాలు కళ్ళు తెరచి చూసి మళ్ళీ ధ్యానంలో నిమగ్నమై పోయాను. నన్ను భంగపరచటానికి మళ్ళీ అవే ఆలోచనలు రేకెత్తాయి. నేను అప్పుడు అక్కడి పరిస్థితిని సమీక్షించగా, అది దొంగలు దాగి ఉండే స్థలంగా గుర్తించబడటమేకాక, స్థానికంగా విచారించిన మీదట అది వాస్తవమేనని ధృవపడింది.

ооо

నేను ఇటువంటిదానికి సంబంధించినదే అయిన మరొక ఉదాహరణ ఇస్తాను. నేను కొంతకాలం క్రితం హరిద్వార్‌లో ఉన్నప్పుడు, ఒక సత్రంలో వసతి కల్పించుకున్నాను. నాకు కేటాయించిన గదిలో ధ్యానం చేస్తూ ఉండగా కంఠంలో బల్లెం గుచ్చబడిన ఒక స్త్రీ నా ఎదుట కనిపించింది. ఈ దృశ్యం నాలో కొంతసేపు నిలకడగా ఉన్న తర్వాత, నా కళ్ళు తెరచి ధ్యానాన్ని కొంతసేపు ఆపివేశాను. నేను మళ్ళీ ధ్యానం ప్రారంభించగానే మళ్ళీ అదే దృశ్యం నాకు కనిపించింది. అప్పుడు నేను ఆ విషయం గురించి బాగా

పరిశోధించగా ఆ స్త్రీ అక్కడ హత్య చేయబడి, నేను ధ్యానానికి కూర్చున్న స్థానంలోనే పాతిపెట్టబడినట్లుగా గ్రహించాను. ఆమె చనిపోయి అప్పటికి ఎన్నాళ్ళు గడిచింది అనే విషయంపై నేను నా ఊహను పురికొల్పలేదు. అప్పుడు నేను ఆ స్థలాన్ని నిర్మలీకరించి ఆమె ఆత్మ శాంతికై కొంత ప్రాణాహుతి నిచ్చాను. ఆ తర్వాత అంతా ప్రశాంతంగా అయిపోవటమేగాక, అలా మృతిచెందిన స్త్రీ మళ్ళీ నా దృష్టికి రాలేదు.

ooo

గురువర్యునిలో (Absorption) విలీనం కావటం గురించి బాబూజీ ఈ విధంగా చెప్పారు: "మీకు నిజం చెప్పాలంటే, నేను కూడా నా గురువర్యునిలో విలీనమయ్యాను. నాకు ఉన్న ముఖ్య లక్ష్యం ఏమిటంటే, నేను నా గురువర్యుని సాక్షాత్కరింపజేసుకోవటమే. ఊహించుకోవటానికి భగవంతుడు నాకు బహు దూరంలో ఉన్నాడు. ఒక దీపావళి పర్వదినాన, నా గురువర్యులు స్వయంగా నాలో విలీనం కావటం గ్రహించాను, తర్వాత అది వారిచేత ధృవీకరించ బడింది కూడా. ఈ విషయంలో, దీపావళి నా జీవితంలో ఒక ప్రత్యేకతగా నిలిచిపోయింది. నేను ఇదంతా ఎందుకు చేశాను అంటే, నా గురువర్యులు అందుకు తగినవారు అయి ఉండబట్టిన్నీ, నేను వారు అంటే వారిని మాత్రమే ఎరుగున్నాను కనుక."

ooo

నేను (బాబూజీ) మీ అందరినీ ఒకరోజున వీడిపోతానని దయచేసి భీతిచెందవద్దు. కాలం సమీపించినప్పుడు మాత్రమే అలా జరుగుతుంది, కాని నా విషయంలో అది వేరుగా ఉంటుంది. నేను నా దేహ త్యాగంచేసిన తర్వాతనే నేను మీకు బాగా ఉపయోగపడతాను. నేను ఈ ప్రపంచంలో ఉన్నంతవరకు నా సేవలు మీకు అందిస్తూనే ఉంటాను, ఆ తర్వాత కూడా నా సేవలు మీకు లభిస్తాయి. ఇంకా చెప్పాలంటే, నా శరీరత్యాగం చేయబోయే ముందు నా ఆధ్యాత్మిక శక్తిలో ఇసుమంత కూడా తీసుకుపోను. దానినంతటినీ మీకందరకు బదాలాయించి వెళ్తాను; ఎవ్వరైతే గాఢంగా అనుబంధించి యున్నారో దాని నుంచి వారికి అధిక వాటా లభిస్తుంది. ఇంకొక విషయం ఏమిటంటే, మీలో అత్యుత్తమమైనవారు నా స్థానాన్ని అలంకరించాలి. నా గురువర్యులు నాకు పని అప్పగించినప్పుడు, నన్ను వారసునిగా ప్రకటించినప్పుడు, నేను ఒక సంవత్సరంపైబడి నా పని ప్రారంభించలేదు (నిస్సందేహంగా వారి అనుమతితోనే). ఈ వ్యవధి అంతా నేను ప్రజలకు చెందిన వివిధ రకాలైన విధానాలమీద, వారి ఆధ్యాత్మిక ఉన్నతికి ఉపయుక్తమైన విధానాలమీద ధ్యాసపెట్టి పరిశీలన జరిపాను. నేను పని ప్రారంభించి నప్పటి నుంచి చాలా సంవత్సరాలపాటు నేను పైనుంచి, శిక్షణకు చెందిన అన్ని విషయాల గురించి సూచనలు స్వీకరించాను. నేను బాగా జ్ఞానం సంపాదించుకుని ప్రతిదీ బాగా అనుభవం చెందాక, నేను అన్వేషణ చేసి, ఎటువంటి హాని కలగకుండా ఉన్నత శిఖరాలకు చేర్చే విధానాన్ని, అనతికాలంలోనే సాధించి ప్రయోగించాను. ఒక మనిషిలో, ఒక్క చూపు మాత్రంతోనే ఎటువంటి హాని జరగకుండా, పరిపూర్ణతను సిద్ధింపజేయగల నా విధానాన్ని నా మాస్టర్‌కు తెలిపినప్పుడు వారు నన్ను ఎంతగానో అభినందించారు. దీనిలో నావలన తొలగింపశక్యంకానిది ఒక లోపం ఉంది. ఇటువంటి సందర్భాలలో, అతని నిజస్థితిని (కలిగిన అసలైన స్థితి) అతనికి వెంటనే కాకుండా కాలానుగతంగా తెలియజేయబడుతుంది; ఎందుకంటే, మరణం అనివార్యం అవుతుంది కనుక.

దీనికి పరిష్కారం ఎవ్వరైనా చెప్పగలిగితే నేను అందుకు సంతోషిస్తాను. ఉద్దేశించబడిన ఫలితాన్ని, నాడీ మండలం మీద ఎటువంటి వత్తిడికాని, హానికాని కలగకుండా పొందాలంటే, ప్రాణాహుతి శక్తిని తగినరీతిలో మరల్చాల్సి ఉంటుంది.

ooo

నా గురువర్యులు లాలాజీ సాహెబ్ నాతో (బాబూజీతో) ఒకసారి ప్రత్యేకించి, వారికి చాలామంది శిష్యులు ఉన్నప్పటికీ, వారిలో ఏ ఒక్కరు కూడా లయావస్థ పొందలేదు అని చెప్పారు. ఆధ్యాత్మికంగా, వారు బాగా ఎదిగారు. కాని ఆధ్యాత్మిక జీవితంలో ఇది చాలా ముఖ్యమైన విషయం. అది ఏమిటంటే, అది ఎప్పుడైతే వికసిస్తుందో, ఆ మనిషిని అతిత్వరగా ఉన్నతదశకు చేర్చుతుంది. బాగా ఉన్నత స్థాయిని పొందినప్పుడు ఈశ్వర్‌సహాయ్‌గారు, ఈ విధానాన్ని తెలుసుకోగలిగారు. దీనిని మిషన్ యొక్క ప్రేమికులకు మాత్రం చెప్తూ ఉండేవారు. దీని ఫలితం ఏమిటంటే, ఎవ్వరైతే దానిని అనుసరిస్తున్నారో వారు లక్ష్యంవైపు మార్గం చూపెట్టబడతారు.

ooo

ఇతరుల స్థితిని పసిగట్టాలంటే అది సాధనమీద ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు నేను నా అనుభూతిని వివరిస్తాను. ఒకసారి నేను ఒక పెద్దమనిషికి సిట్టింగ్ ఇచ్చినప్పుడు అతని గుండెలో పెద్ద ఇటుక గుట్టలు కనిపించాయి. నేను దానిని నిర్మలం చేశాను. తర్వాత అదే స్థానంలో బొగ్గు గుట్టలు కనిపించాయి. నేను అతడిని ఇదివరలో ఎప్పుడైనా ఇటుక మరియు బొగ్గు వ్యాపారం చేశాడా అని అడిగితే అతడు దానిని ధృవపరిచాడు. ఆంతరిక జ్ఞానం ద్వారా ఇవన్నీ నాకు తెలిశాయి, కాని సరైన నిర్ణయానికి రావటానికి అనుభవం, తెలివితేటలు నాకు సహకరించాయి.

ooo

బాబూజీ చెప్పారు: "ఒకసారి నా అనుచరుల్లో ఒకరు (కొన్ని నెలల క్రితం మాత్రమే పరిచయమైనవారు), ఆత్మహత్య చేసుకోవాలని నిశ్చయించుకుని అందుకు సిద్ధమవుతున్న ఇద్దరు స్నేహితులను కలుసుకోవటం తటస్థించింది. అతడు వారితో కొంతసేపు మాట్లాడాడు. అలా మాట్లాడుతూనే, వారి మనస్సులను మార్చటానికి నా శక్తి అతని ద్వారా పనిచేస్తున్నట్లుగా తలుస్తూ ఆంతరికంగా ధ్యానం చేశాడు. కొన్ని నిమిషాల తర్వాత, వారు తమ అభిప్రాయం మార్చుకున్నట్లుగా అంగీకరించారు.

ooo

తిన్‌సుకియాకు చెందిన శ్రీ కాశీరామ్ అను నతడు, ఆధ్యాత్మిక పిచ్చి ఆవేశంతో మూర్ఛిల్లినవానిగా తన తలను గోడకు కొట్టుకుని తన జీవితానికి అంతం పలకాలని నిశ్చయించుకున్నాడు. అతను దానికి సిద్ధపడి నిలబడగానే, నేను (బాబూజీ) అతడిని ప్రక్కకులాగి ఆ పనిని నివారించి కోప్పడినట్లుగా ఒక దృశ్యంలో నన్ను చూసాడు.

ooo

తిన్‌సుకియాకు చెందిన కాశీరామ్‌గారు, షాజహాన్‌పూర్ విడిచిపెట్టి అస్సాం వెళ్ళుతున్నారు. వారు పశ్చాత్తాపంతో, దీనంగా ఉండటం చూసి, వారి ప్రయాణంలో చివరిదాక నేను (బాబూజీ) తోడుగా ఉంటానని చెప్పాను. ఆయన ప్రయాణంలో నా ఉనికిని గ్రహించాడు. ఆ ప్రయాణంలో భాగంగా వారు బ్రహ్మపుత్ర నదిని స్టీమర్‌లో దాటవలసి ఉంది. కాని ఆ సమయంలో ఏ స్టీమర్ లేనందున, ఆలస్యం లేకుండా వెళ్ళటానికని ఆయన ఒక పడవలో వెళ్ళటానికి ఉపక్రమించారు. కాని దురదృష్టవశాత్తు మార్గమధ్యంలో ఆ పడవ తిరగపడిపోసాగింది. అప్పుడు వెంటనే కాశీరామ్‌గారు ప్రయాణిస్తున్న పడవ, ప్రమాదంలో ఉన్నట్లుగా నా మనస్సు ప్రతిధ్వనించింది. అప్పుడు నేను వెంటనే (Astral form) సూక్ష్మ రూపంలో వెళ్ళి సురక్షితంగా ఆ పడవను ఆవలి ఒడ్డుకు చేర్చాను. కాశీరామ్‌గారు, నేను ఆ పడవను కుడి ఎడమల పట్టుకుని ఒడ్డుకు చేర్చినంతసేపు నా రూపాన్ని చూసినట్లుగా చెప్పారు.

ooo

స్వామి వివేకానంద వాస్తవంగా, ఒక ఉన్నతశ్రేణి వ్యక్తిత్వానికి చెందినవారు. వారి గురువర్యులు ఒకసారి నాకు ఏమి బహిర్గతం చేశారు అంటే, తాను ఒక్క మనిషిని మాత్రమే అటువంటివానిగా తయారుచేయగలిగాననీ, మరణశయ్యమీద ఉన్నప్పుడు తన శక్తులన్నీ అతనికే అర్పించి వేశాననీ చెప్పారు. నా విషయంలో, నా గురువర్యులు కూడా అలాగే చేశారు. ఒక ఉన్నతశ్రేణికి చెందిన సెయింట్ ఈ ప్రపంచం విడిచిపెట్టివెళ్ళేప్పుడు అతడు పొందిన శక్తి అంతా అతని శిష్యులకు ప్రాప్తిస్తుంది. దానిని జీర్ణించుకొనడానికి అర్హత కలగిన శిష్యుడు ఎవ్వరూ లేకపోయిన పక్షంలో, అందుకొరకు తన సంస్థకు చెందనివాడైనాగాని మరియొక యోగ్యునకు బదలా యించటానికి అతడు (గురువు) వేచి ఉండాల్సి ఉంటుంది. ఆయన (వివేకానందుడు) తన గురువర్యుని ఆజ్ఞ ప్రకారం, నన్ను తన ప్రతినిధిగా ఎంచుకుని తన శక్తిని నాకు బదలాయించారు. నేను నా మాస్టర్ లాలాజీ సాహెబ్ ఆదేశానుసారం అందుకు అంగీకరించ వలసి వచ్చింది. ఇంకొక ఇద్దరు సెయింట్స్ కూడా అదే విధంగా చేశారు. వారు చైతన్య మహాప్రభు మరియు మహాత్మ బుద్ధుడు. ఈ మహోన్నత వ్యక్తులతోపాటుగా, యుద్ధ సమయంలో క్రీస్తు కూడా నాకు క్షేత్రాన్ని కల్పించారు. ముందస్తుగానే యుద్ధ ఫలితాన్ని కూడా తెలియజేశారు. గురునానక్ కూడా అదే విధంగా చేశారు. ఎవ్వరైనా స్వయంగా కోరితేతప్ప ఆ పని చేయలేనని, ఒకవేళ కోరినట్లయితే నా శక్త్యానుసారం మాత్రం చేయగలనని వారికి హామీ ఇచ్చాను. కాని నాకు నేనుగా ఆ పని కల్పించుకోవటానికి ఇష్టపడని వారికి నా క్షమాపణ చెప్పుకున్నాను. నాకు తెలియనటువంటివారు, చాలా మంది సెయింట్స్ కూడా నాకు కలలో ప్రసారంచేసి తమ పని చేయటానికి నన్ను అంగీకరించే విధంగా చేశారు. నా గురువర్యుని విషయంలో కూడా ఇలాగే జరిగింది. ఇటువంటిదే మరొక ఉదాహరణగా, సూఫీలకు చెందిన ఒక గొప్ప సెయింట్, 150 సంవత్సరాల తర్వాత తన ప్రతినిధిని ఎంపిక చేశారు. నా గురు వర్యులు, స్వామి వివేకానందను కూడా గురువుగా పరిగణించ మని సూచించి, వారి ఆజ్ఞలను స్వీకరించటానికి తన ఆమోదం అవసరంలేదని కూడా చెప్పారు. స్వామి వివేకానంద తమ స్వంత సంస్థ నుంచి తమ అనుబంధాన్ని 1949వ సంవత్సరంలోనే తెగతెంపులు చేసుకున్నారు. ఆ సమయంలో నేను ఈశ్వర్ సహాయ్‌గారితో కలిసి గయ పర్యటనలో ఉన్నాను. అప్పటినుండి ఆ సంస్థలో కొంత మలుపు ప్రారంభమై, ఇప్పుడు ఇంకా శిథిలస్థితికి చేరుకుంటోంది.

దీనిని మద్రాసులోని శ్రీ కృష్ణమూర్తి (బహుశా జిడ్డు కృష్ణమూర్తి కావచ్చు) ఎప్పుడో పసికట్టారు. స్వామీజీ ఆదేశాను సారం, నేను ఈ విషయాన్ని శ్రీ రామకృష్ణ మిషన్, కలకత్తాకు చెందిన ప్రెసిడెంట్‌కు తెలియజేసి, ఆధ్యాత్మికపరమైన సహాయం కొరకు తనతో సంబంధం కల్పించుకొనమని అభ్యర్థించాను. అందుకు సమాధానం రాలేదు. బహుశా ఆయన నన్నొక వెఱ్ఱివానిగా భావించి ఉండవచ్చు.

ooo

ఒక సెయింట్ కనుక నన్ను (బాబూజీ) ఆంతరికంగా బేరీజు (judge) చేయదలిస్తే, అతడు నన్నొక మందబుద్ధిగలవాడుగానో లేదా సామాన్య మనస్కుడుగానో (అతను సానుభూతి దృక్పథంతో ఆలోచించే వాడైతే) నిర్ణయించుకుంటాడు. ఎప్పుడైతే ఒక మానవుడు నెగేషన్ యొక్క ఆఖరి దశకు చేరుకుంటాడో, అతని అసలైన నిగూఢతను అంచనా వేయటం దుర్లభం. ఏ కల్మషం లేకుండా చెప్పాలంటే, ఇప్పటికీ నా మాస్టర్ లాలాజీ సాహెబ్ యొక్క నిగూఢతను నేను తెలుసుకొనలేనివాడనవుతాను.

ooo

భగవంతుని కృపమీద ఆధారపడి ఉండటానికిగాను బాబూజీ ఈ సంఘటన ప్రస్తావించారు: "నా సహఅభ్యాసుల విషయంలో ఒక్కరిని గురించి నా ఇటీవలి అనుభవాన్ని మీ ముందు ఉంచుతున్నాను. అతడు మూడు సంవత్సరాలకు పూర్వం నావద్దకు మొదటిసారిగా వచ్చినప్పుడు అతడు పూర్తిగా స్థూలత్వం కలిగి ఉన్నాడు. నాకు చేతనైనంతవరకు నేను ఆ స్థూలత్వాన్ని తొలగించాను. మళ్ళీ ఈ సంవత్సరం, రెండవసారిగా వచ్చినప్పుడు, మళ్ళీ అతడ్ని స్థూలత్వంతో ఉన్నట్లు గుర్తించాను. అయితే అది సూక్ష్మరూపంలో ఉన్న స్థూలత్వం; ఆ సూక్ష్మరూప స్థూలత్వాన్ని సరిదిద్దటం చాలా శ్రమతోకూడిన పని. లాలాజీ సాహెబ్ కృపతో, అతికష్టంమీద దాని మూలకారణం ఏమిటో కనుగొన్నాను. అది ఏమిటంటే, అతడు తన స్వయంకృషి మీదనే ఆధారపడి ఉన్నాడుకాని భగవంతుని కృపమీద కాదు. ఇది నాకు ఒక క్రొత్త అనుభవం. కనుక ప్రతి సత్సంగీయుడు కూడా భగవంతుని కృప మీదనే ఆధారపడి ఉండి, తన కర్తవ్యాన్ని తాను చేయాలి."

ooo

నేను (బాబూజీ) గతజీవితం నుంచి అనుభవశక్తిని వెంట తెచ్చుకున్నానని, ఇంకా దానిని అభివృద్ధి పరచుకోవాలని లాలాజీ సాహెబ్ చెబుతూ ఉండేవారు. నేను నా గురువర్యుని ఎడతెగకుండా జ్ఞాపకం ఉంచుకొనేవాడిని; అదే సమయంలో నేను విమానంలో ఉన్నప్పుడు కలిగి ఉన్న స్థితితో అనుసంధానం చేసుకుంటూ ఉండేవాడిని. నేను రెండు పనులు ఒకేసారి నిర్వహించటానికి అలవాటుపడ్డాను. మీరు కొద్దిగా శ్రద్ధ వహించినట్లయితే మీ సాధన మీరు కోరిన ఫలితాన్ని సమకూరుస్తుంది.

ooo

బాబూజీ తన వ్యతిరేకులనుంచి ఎటువంటి దుర్మార్గాలు ఎదుర్కొనవలసి వచ్చినప్పటికీ, అటువంటి దుర్మార్గులను తగినరీతిలో శిక్షించమని బాబూజీ ఎప్పుడూ భగవంతుని ఎదుట ప్రతిపాదించలేదు. "నా జీవితంలోని ఒక ఉపాఖ్యానాన్ని మీకు వివరిస్తాను. జనవరి 7, 1933న నా తండ్రిగారి మరణానంతరం, మా దూరపు బంధువుల్లో ఒకరు, మా ఎస్టేట్ నిర్వహణ బాధ్యతలు వహించాలని కోరుకున్నారు. ఎందుకంటే,

దాని ద్వారా సక్రమంగా గాని, అక్రమంగా గాని అవకాశం ఉన్నంతవరకు తాను లబ్ధి పొంద వచ్చునని అతని అభిప్రాయం. నేను, నా సోదరుడు కూడా దీనికి అభ్యంతరం చెప్పటంతో అతడు మాకు విరోధి అయ్యాడు. చాలా సంవత్సరాలు అతడు అదే ద్వేషంతో ఉండి, అతడు 1956లో చనిపోయే వరకు అతని చాటుమాటు వ్యవహారాలతో నన్ను ఇబ్బంది పెట్టూ, తన పోకడతో నాకు కష్టాలు, నష్టాలు, సతాయింపులు తలపెట్టాడు. ఇతరులను నావైపు పురిగొల్పి, నన్ను కోర్టు కేసుల్లోను, ఇతరత్రా ఇరికించటానికి ప్రయత్నించాడు. నాకు అపకారం చేయటానికిగాను అతడు రౌడీయిజం చేయటానికి కూడా వెనకాడలేదు. అతనికి బుద్ధి చెప్పటానికి, నాకు ఒక ఎస్టేటు ఉన్నప్పటికీ, తలపడటానికి అవకాశం ఉన్నప్పటికీ నేను అందుకు సిద్ధపడలేదు. వాటి నన్నింటినీ సహిస్తూ, అతనికి ప్రతీకారం చేయాలను ఉద్దేశ్యం లేకుండా, ప్రశాంతంగా నన్ను కాపాడు కోవటానికి మాత్రమే ప్రయత్నించాను. అతని చివరి రోజుల్లో అతడి స్వంత ప్రణాళికయే అతనికి అడ్డం తిరిగింది.”

ooo

బాబూజీ ఇటువంటి ఉదాహరణయే మరొకటి చెప్పారు. “తిన్‌సుకియా (అస్సాం)కు చెందిన శ్రీ కాశీరామ్‌కు సంబంధించిన ఘటన ఇది. అతని బావమరది (సోదరి భర్త), వ్యాపారంలో భాగస్థుడు అయిన అతడు ఎలాగో అపహరించబడి, హత్యకు గురయ్యాడు. అతని మృతదేహం అయిదు నెలల తర్వాత అతని ఇంటి వెనుక పడి ఉన్నట్లుగా కనుగొన్నారు. ఒక నెల రోజుల క్రితం హత్య చేయబడినట్లుగా అది గుర్తించబడుతోంది. ఆ సమయంలో కాశీరామ్ ఇక్కడే (బాబూజీ వద్దనే) ఉన్నాడు. అతను ఇంటికి వెళ్ళిన తర్వాత, అతడిని దోషిగా భావిస్తూ పోలీసు సూపరింటెండెంట్ విచారణకు అతనివద్దకు వచ్చాడు. కాశీరామ్‌గారి ఆలోచన ఒక నూతన పంథాకు దారితీసింది. అతడు ఆ విధంగా తనను ప్రశ్నిస్తున్న పోలీసు సూపరింటెండెంట్‌ని నా రూపంలో, అత్యంత ప్రేమ కలిగి ఉన్నట్లుగా చూడసాగాడు. కొన్ని నిమిషాల తర్వాత ఆ పోలీసు సూపరిం టెండెంట్ కన్నీటితో ద్రవించిపోయి, కాశీరామ్‌గార్ని కౌగలించుకుని, అతని అమాయకత్వాన్ని అంగీకరించాడు. అంతే కాకుండా అసలైన దోషులను త్వరలోనే కనిపెట్టానని వాగ్దానం చేసి, అప్పటి నుంచి అతడు ఆ పనిలో బాగా నిమగ్నమైపోయి చాలామందిని అరెస్ట్ చేశాడు. ఇలా జరుగుతున్నంతవరకు కూడా పూర్తిగా అతడు నిశ్చింతగా, నిర్భయంగా ఉండిపోయాడు.

ooo

భవిష్యత్ చెప్పేవారి గురించి బాబూజీ కొన్ని విషయాలు చెప్పారు: ఇటీవల బాగా ఉన్నతినందిన నా అభ్యాసీ సహచరుల్లో ఒకరు, సర్వేశ్వరుని అంశ ఒక్కటి ఈ ప్రపంచ గతిని మార్చటానికని ఈ పృథ్విపైకి దిగిరావటానికి ఆరంభమైందని నాకు వ్రాశాడు. దీనికి ఏడు సంవత్సరాలక్రితం, నా సహచరులలో ఒకరు, ధ్యానంలో ఉండగా ఒక దృశ్యం చూసినట్లుగాను, ఇండియా పటం మీద ఒక కర్టెన్‌తో కప్పబడి ఉన్నట్లుగాను, దానిపైన ప్రపంచం ప్రమాదపు టంచున ఉన్నట్లుగా వ్రాసి ఉందని, నేను ప్రమాద ప్రాంతంలోకి చేరినట్లుగాను, నాకు ఉత్తరం వ్రాశాడు. అతడు మళ్ళీ అదే దృశ్యాన్ని స్వప్నంలోనూ చూసినట్లుగా వ్రాశాడు. స్వామి వివేకానంద తన ఉపన్యాసాలలో, దైవ శక్తి, కదలటానికి ప్రేరేపించబడిందని, ప్రపంచపు మంచికోసం ఒక

వ్యక్తి ఆసియా ఖండంలో ఎక్కడో ఒకచోట ప్రతిష్ఠితమై ఉన్నాడని తాను ఖచ్చితంగా చెప్పగలనని చెప్పారు. నేను కూడా ఆ విషయమై పరిశీలనచేసి దివ్య శక్తి క్రమంగా ఏదో మార్పు కోసం దిగివస్తున్నట్లుగా గమనించాను. అది ఏదో సంకల్పంతో వస్తోంది, ఎందుకంటే అది పూర్తిగా తరలి వచ్చేంతలో, ప్రత్యేకత కలిగిన వ్యక్తి యొక్క పని పూర్తవుతుందని, ఆ తర్వాత అతడు ఈ ప్రపంచాన్ని వెంటనే విడిచిపెట్టి వెళ్ళాల్సి ఉంటుందని నేను గ్రహించాను. పని అయితే అతడు పూర్తి చేశాడు కాని ఇంకా పరిశీలించాల్సి ఉంది. అతడు ఇంకా ఏదైనా ఆధ్యాత్మిక కార్యక్రమం కూడా మానవ కళ్యాణం నిమిత్తం చేయ సంకల్పించుకున్నాడేమో ఎవ్వరికి తెలుసు.

ooo

నాలో ఒక ప్రత్యేక విషయాన్ని నేను (బాబూజీ) గమనించాను. ఎప్పుడైనా నేను "భగవంతుడు నాకు అవకాశం ఇస్తే నేను ఒక పని చేస్తాను" అని చెప్పాను అనుకోండి, అప్పుడు నేను ఆ పని చేయలేకపోతాను. (ప్రతిసారి ఆటంకమే కలుగుతుంది.) ఉదాహరణకు ఈసారి దక్షిణ భారతదేశపు అభ్యాసులతో 1958 డిశంబర్‌లో, భగవంతుడు అవకాశం కల్పిస్తే, నేను అక్కడకు వస్తాను అని చెప్పాననుకోండి. అది జరగకపోతుంది. అయితే నేను ఒకసారి రోజు, సమయం నిర్ణయించానంటే నేను దానిని తప్పక అమలు చేస్తాను. ఈ విషయమై నేను ఆలోచించి తాత్త్వికంగా ఎటువంటి నిర్ణయానికి వచ్చేనంటే, నేను సందేహించటం వల్లనే నేను భగవదేచ్ఛ మీద ఆధారపడతాను. ఇందులో రహస్యం ఏమిటంటే, ఈ సందేహమే వ్యతిరేక ఫలితానికి కారణమవుతుంది. అందుచేత నేను నా స్నేహితులకు, అభ్యాసులకు ఇచ్చే సలహా ఏమిటంటే, **సంశయం (Doubt) అను దానిని మీ మనస్సులోనికి ఏ విధంగాను రానివ్వకండి; ఎందుకంటే, అంతర్గత శక్తి (Inner force) దానికి ఊతమిస్తుంది.** స్వామి వివేకానంద ఎక్కడో ఒకచోట చెప్పారు, అది మతానికి విరుద్ధమే అయినప్పటికీ, ఇలా చెప్పారు: **"బలహీనతకు భగవంతుడు సహాయపడడు (Weak is not helped by God)"** అని. కాబట్టి, మనం ఏదైనా చేయాలని అనుకున్నప్పుడు, మనం మన సంకల్పాన్ని దృఢంగా చేసుకొని, అవకాశం ఉన్నంతలో దానిని భగవంతుని సంకల్పంతో అనుసంధానం చేయాలి.

ooo

నేను (బాబూజీ) వ్రాసిన ఏ పుస్తకమైనా, బహుశా అది పిల్లవాడు వ్రాసిన వాటిలాగే ఉన్నప్పటికీ 21 గంటల సమయానికి మించి వ్రాసి ఉండలేదు. దానికి కారణం ఏమిటంటే, పుస్తకాలలో ఇతరులు వ్రాసిన భావాలను లక్ష్యపెట్టకుండా నా సొంత ఆలోచనలతోనే వాటిని వ్రాశాను.

ooo

ఈ మధ్యకాలంలో ఒక కాలేజికి చెందిన ఇంగ్లీషు ప్రొఫెసర్ ఒకాయన వచ్చి, మానవ కళ్యాణానికి హిప్నాటిజమ్ (వశీకరణ విద్య) చాలా ఉపయోగకరమైనది కనుకను, ఆధ్యాత్మికత అందుకు తగ్గదు కనుకను, దానిని నేర్చుకోవటానికి వచ్చినట్లుగా చెప్పాడు. నేను అతనితో ఆ విద్య గురించి నాకు ఏమీ తెలియదు, కనుక అతనికి నేను ఏమీ సహాయపడలేనని చెప్పాను. అతనికి హస్తరేఖా శాస్త్రం గురించి కూడా తెలుసు. ఆ మరుసటిరోజు ఉదయం, అతడు నా అరచేతిని పరిశీలించటానికి సిద్ధపడ్డాడు. నా చేయి చూడగానే,

అతడు ఆశ్చర్యసాగరంలో దూకేసినట్లుగా అయిపోయి, అటువంటి రేఖలు ఉన్న అరచేతిని తన జీవితంలో ఎప్పుడూ చూడలేకపోయానని చెప్పాడు. వాటిని అతడు పుస్తకాల్లో (హస్తరేఖా శాస్త్రాలు) చదివాడేకాని, ఎవరిచేతిలోను ప్రత్యక్షంగా చూడలేకపోయాడు. అతడు నాతో, నా అరచేతిలో ఆంతరిక జ్ఞానం గురించిన రేఖ (The line of intuition), చూపుడువేలికి ఉన్న రేఖ (Solomon Ring) ఉన్నాయని చెప్పాడు. ఇంకా ఏవేవో రేఖలు గురించి చెప్పాడు కాని, అవి నాకు జ్ఞాపకం లేవు. కారణం ఏమిటో నాకు తెలియదుగాని, అతడు ఇకమీదట హిప్నాటిజమ్ గురించిన ఆలోచన వదిలిపెట్టానని నాకు హామీ ఇచ్చి, మిషన్‌కు సంబంధించిన సాధనకు పూనుకున్నాడు. అప్పటినుంచి అతడు సంస్థ అభ్యాసాన్నే విశ్వాసంతో సాధన చేస్తున్నాడు.

ooo

తారీఖు తెలియదుగాని, ఆ రోజు రాత్రి గం. 7-55 ని॥లకు, సిలోన్‌కు చెందిన ఋషి ఒకరు నాకు అంతర్వాణి ద్వారా, నా జీవితంలో ఎంత భాగమైతే నేను కోల్పోయానో అంత భాగాన్ని తన జీవితకాలం నుంచి నాకు బదలాయించమని అతనికి ఆదేశించ బడినట్లుగా చెప్పాడు. అతడు చెప్పిన దానికి సంసిద్ధంగా ఉండమని నా మాస్టర్ (లాలాజీ సాహెబ్) నాకు చెప్పారు. ఈ ఋషి కొంతకాలం క్రితం నాతో అంతర్వాణి సంబంధం కలిగి ఉన్న మరొకరికి శిష్యుడుగా ఉన్నాడు. నేను ప్రథమంగా దక్షిణ భారతదేశ పర్యటనకు వెళ్ళినప్పుడు ఆ అంతర్వాణి సంబంధం కలిగి ఉన్న వ్యక్తి, సూక్ష్మ శరీరంలో (Astral form) నన్ను వ్యక్తిగతంగా అనుసరిస్తూ ఉన్నాడు. అతడు నా నుంచి ప్రేరణ పొందుతూ, నా శిక్షణలో ఉండేవాడు. నేను పర్యటనలో ఉన్నంతకాలమూ అతడు నన్ను అనుసరించి ఉన్నాడు. నాకు అతడు అవసరమైన విషయాలన్నింటి సమాచారం ఇస్తూ నాకు అడుగడుగునా సహాయపడ్తూ ఉండేవాడు. విదేశీయల ప్రభావంతో కొలంబో అత్యంత వ్యభిచారకూపంగా మారింది అని చెప్తూ దానిని (ఆ నగరాన్ని) నాశనం చేయమని నన్ను కోరాడు. నేను నా మాస్టర్‌ను సంప్రదించగా వారు అందుకు అంగీకరించలేదు. నా మాస్టర్ యొక్క మిషన్‌ను దక్షిణ భారతదేశంలో నెలకొల్పినట్లయితే అందుకు తాను పూర్తిగా సహకరిస్తానని కూడా నాకు వాగ్దానం చేశాడు. అతడు ఇప్పుడు బ్రైటర్‌వరల్డ్ (తేజో మండలం)లో ఉన్నాడు. ఇప్పుడు తన జీవితాన్ని ధారాదత్తం చేయదలచిన ఋషి ఆయనకు శిష్యుడు. అతడు తన గురువర్యుని యొక్క అజ్ఞ ననుసరించి ఈ గొప్ప త్యాగానికి సిద్ధపడ్డాడు. మార్చి 7వ తేదీన, మరికొంత మంది ఋషులు కూడా అదే మాదిరిగా తమ జీవిత కాలాన్ని అర్పించటానికి సిద్ధపడ్డారు కాని, నేను నాకు నిర్ణయించిన జీవితకాలంకంటే ఎక్కువకాలం ఉండదలచలేదు కనుక నేను అందుకు నిరాకరించాను. ఆ విషయం సెయింట్ కస్తూరికి తెలుసు, అందుకని ఆమె వెంటనే నాకు ఆ విషయం తెలిపి దానిని ధృవపరచు కొనమని చెప్పింది. ఆమె భక్తి అటువంటిది కనుక, ఇప్పుడు ఆమెవద్ద రహస్యం అంటూ ఉండదు. శ్రీ ఈశ్వర్‌సహాయ్ గారు కూడా తన ఆంతరిక జ్ఞానంతో దానిని ధృవీకరించారు. నేను ఈ ఋషి యొక్క త్యాగానికి ఎంతగానో ఋణపడి ఉన్నాను, దానిని ఎలా తీర్చాలి అని నేను ఆలోచనతో ఉన్నాను.

నాకు తన జీవిత కాలాన్ని బదలాయించిన ఆ ఋషి, సిలోన్‌కు చెందిన వారు, 5.01.1959న రాత్రి గం. 6-15 ని॥లకు తన దేహత్యాగం చేసారని చెప్పటానికి నేను విచారపడుతున్నాను. ఆయన అలా

చేసి ఉండకపోతే అదే రోజు నా దేహత్యాగం జరిగి ఉండేది. ఆ విధంగా బదలాయింపు జరిగేనాటికి నా జీవితకాల శేషం ఎంతయితే ఉందో అంతవరకు మాత్రమే వారి జీవితాన్ని నిలుపుకున్నారు. అతడు ముక్తిని పొందాడు. ఆధ్యాత్మిక చరిత్రలో ఇటువంటి ఉదాహరణలు చాలా అరుదుగా ఉంటాయి. దీని మూలంగా, నేను నాకు బదలాయించబడిన కాలంతో జీవిస్తాను, అంది ఎంతకాలమో తెలియదు. దీని తర్వాత, నేను నా సోదరీ సహచరులు ఇద్దరి నుండి రెండు ఉత్తరాలు అందుకున్నాను. వాటిలో ఏదో ఒక దానిలో, నేను నా శరీరాన్ని త్యాగంచేసి మళ్ళీ శరీర ధారణచేసినట్లుగా వారికి తలపించిందని వ్రాశారు. అదే రోజు రాత్రి కలలో నేను నా మాస్టర్‌తో షుమారు 4 గంటలు గడిపాను. వారు చాలా సంతోషంగా ఉన్నట్లు గుర్తించాను. అప్పటినుండి అల్ప విషయాలమీద నాకు కోపం లేదా చిరాకుగా అనిపించేది. దీనిని గురించి ఎంతో ఆలోచించినమీదట, నాకు చెప్పిన వారికి ఆ విధంగా అనిపించటం నాకు బదలాయింపు మూలంగానేనని గ్రహించాను. నేను ఈ కోపం లేక ఉద్రేకపడటం గురించి నేను అన్న మాటలను సమీక్షించుకోవటానికి నేను నా మనస్సులో నెమరు వేసుకున్నప్పుడు, నేను ఆ బాలికకు బదలాయింపు చేసినప్పటి సంగతి జ్ఞాపకం వచ్చింది (బహశా జడ్జిగారి కుమార్తెకు తన జీవితకాలం ఇచ్చినప్పుడు కావచ్చు). నేను అలా చేసిన తర్వాత ఆ బాలిక ప్రశాంతంగా, క్షేమంగా ఉన్నట్లు నాకు తెలిపింది. ఆమె జబ్బుపడి లేచాక, తన తల్లిని తనదిగా గుర్తించలేకపోయింది. ఆ లోపం నుంచి ఆ బాలిక తేరుకోవటానికి కొంత సమయం పట్టింది.

ooo

నేను (బాబూజీ) ఇప్పుడు కాలక్షేపంకోసం, నా దృష్టికి వచ్చిన కొన్ని నవ్వుపుట్టించే సంఘటనలను చెప్తాను. శ్రీ కుమారస్వామి గారు ఈ ఇంటిలో ప్రవేశించినప్పుడు నల్లుల తుట్టెలు చాలా ఎక్కువగా ఉండేవి. వాటిని నిర్మూలించటానికి ఎన్ని మందులు ప్రయోగించినప్పటికి వాటి దాడిని నివారించటం సాధ్యపడలేదు. కొంత కాలం ఆయనకు ఏమి చేయాలో తోచక చాలా దిగులు చెందారు. దానికి మార్గాంతరంలేక చివరకు ఆయన ప్రార్థన మరియు ధ్యానానికి కట్టుబడ్డారు. దాని ఫలితంగా ఇప్పుడు మనల్ని బాధించటానికి ఇక్కడ ఒక్క నల్లి కూడా లేదు.

ooo

అటువంటిదే మరొక సంఘటన ఇలా ఉంది: ఒకసారి శ్రీ కుమారస్వామి గారు తన స్నేహితులతో కలిసి ఒకే గదిలో ఉండేవారు. వారిలో ఒకరు అతిగా గురకపెట్టే తత్వం కలిగి ఉండటంతో, మిగిలిన వారందరికీ చాలా ఇబ్బందిగా ఉండేది. వేరే గత్యంతరం లేకపోగా ఆయన మళ్ళీ ధ్యానానికి కూర్చున్నారు. కొంతసేపటికి ఆ గురక ఇంకా ఎక్కువగా పెరిగి, తర్వాత అది పూర్తిగా నిదానించింది కొంతసేపు; అప్పుడు ఆ కొంత సమయంలోనే మిగతా వారందరు గాఢంగా నిద్రించారు. ఏదైనాగాని, ఆ రాత్రికి అతితక్కువ భంగం మాత్రమే కలగటంతో వారు అంతా సుఖంగా నిద్రించారు.

ooo

నేను 30 మార్చి 1960న ఒక ప్రత్యేకమైన కలగాంచాను. నాకు జ్ఞాపకం ఉన్నదేదో మీ ముందు ఉంచుతున్నాను; అది "అన్నా" అను దాని అర్థాన్ని మీకు వివరిస్తుంది. ఏదో విధంగా నా మెడలో ఒక కత్తి

వలన గాయమై నేను చనిపోయాను. నేను నదిలో విసిరి వేయబడ్డాను. అప్పుడు నాకు శ్వాసగాని, హృదయం కొట్టుకుంటున్న ధ్వనిగాని లేకపోయాయి, కాని నాకు ఏమి జరిగిందో దాని ఎరుకలో ఉన్నాను. నేను ఎవరివల్లనో హత్య కావించబడ్డానని గ్రహించిన ఒకాయన, ఆ విషయాన్ని పోలీసులకు తెలియజేయాలని భావించి, నన్ను నిశితంగా పరిశీలించాడు. అతడు నా ఆగిపోయిన నాడిని, ఆగిపోయిన గుండె శబ్దాన్ని పరిశీలించాడు. అప్పుడు నా శ్వాస ఆగిపోయి ఉన్నప్పటికీ ఇదంతా నాకు తెలుస్తూనే ఉంది. అప్పుడు మళ్ళీ జీవనం తలెత్తింది. గుండె దాని పనిని మళ్ళీ పుంజుకుంది. నాడీ శబ్దం అనగా గుండె చప్పుడు వినిపిస్తోంది. ఆ తర్వాత నేను నిద్ర నుంచి లేచి జరిగిన దాని గురించి ఆలోచించ నారంభించాను. శ్వాస లేకపోయినప్పటికీ, గుండె ఆగిపోయిన్పటికీ, శరీరం నిర్జీవంగా పడి ఉన్నప్పటికీ స్పృహ (ఎరుక లేదా జ్ఞానం) మాత్రం ఉన్నది అను నిర్ణయానికి వచ్చాను. దీనినిబట్టి స్పృహ లేదా ఎరుక అనేది జీవితానికి మూలాధారం అని నిరూపితమవుతుంది. శ్వాస యొక్క రహస్యాన్ని ఛేదించటానికి నాకు ఈ దృశ్యం చూపించబడింది అని నేను గ్రహించాను.

ooo

నేను (బాబూజీ) కొన్ని విశేషమైన విషయాలను మీకు తెలియ జేయటానికని వ్రాస్తున్నాను. షుమారు పది పన్నెండు సంవత్సరాలకు పూర్వం, లోపల కాగితాలతో ఉన్న ఒక గాలి చొరబడని వాహనాన్ని, మడగాస్కర్ సముద్ర తీరంలో ఒక రష్యన్ జలాంతర్గామి కనుగొన్నట్లుగా, ఆమెరికన్ మాగజైన్‌లో చదివినట్లుగా నా సహచరుడు ఒకరు తెలియజేశారు. ఆ పేపర్లు బహుశా 'పాళీ' భాషలో, రావణుని కాలంలో రాకెట్లకు సంబంధించినవిగా ఉన్నాయి. దీనిని బట్టి భారతదేశం కూడా మెటీరియల్ సైన్స్ (ద్రవ్యశాస్త్రం)లో ముందడుగు వేసిందని చెప్పుకోవచ్చు.

1906లో లార్డ్ కర్జన్, అజంతా గుహలను సందర్శించి నప్పుడు, ఆ గుహ గోడమీద ఒక రైలు మ్యాప్‌ను చూశాడు. నేను అదే గుహను సందర్శించినప్పుడు, అక్కడి గైడ్ (మార్గదర్శకుడు)ను ఆ రైల్వే మ్యాప్ చెక్కబడి ఉన్న ప్రదేశాన్ని చూపించమని అడిగాను. అతడు వెంటనే లార్డ్ కర్జన్ సందర్శించిన విషయాన్ని తెలుపుతూ, ఆ రంగు వివర్ణమైపోయినట్లుగా చెప్పాడు.

ఇంకొక ప్రత్యేకత కలిగిన వార్త, చాలా దినపత్రికలలో చోటు చేసుకుంది. అది ఏమిటంటే, షాజహాన్‌పూర్‌కు షుమారు 200 మైళ్ళ దూరంలో ఉన్న మీరట్‌లో పదహారేళ్ళ వయస్సు ఉన్న బాలుడు చనిపోయాడు. అతని మృతదేహాన్ని చితిపైకి తరలించబోతుండగా, ఆ శవం మళ్ళీ జీవం పొందింది. అతడు ఒక వాహనం నుంచి పడిపోయిన కారణంగా ఈ సంఘటనకు కొంత సమయం ముందే చనిపోయినట్లు చెప్పబడింది. అతడు మళ్ళీ శరీరంలో ప్రవేశించి నిర్జీవంగా పడి ఉన్నాడు. అక్కడికి కొన్ని మైళ్ళ దూరంలో ఈ ప్రమాదం జరిగింది. అతని కుటుంబీకులను పిలిపించగా ఆ కుర్రవాడు జరిగిన వృత్తాంతాన్ని వివరించాడు.

ooo

ప్రతి ప్రిసెప్టర్‌కు ఇటువంటి సందర్భాలు అనుభవానికి వస్తూ ఉంటాయి. అప్పుడప్పుడు కొన్ని ఆకలిగొన్న ఆత్మలు ప్రాణాహుతి కోసం అతని దగ్గరకు వస్తూ ఉంటాయి. ఇటీవల నా పర్యటనలో హైదరాబాద్,

భూత్‌పూర్ మరియు సేడమ్‌లలో నాకు ఇటువంటి అనుభవాలు కలిగాయి. కొన్నిసార్లు ఇది పురోగతినందిన సాధకుల విషయంలో కూడా జరగవచ్చు. మాస్టర్ నుంచి వారికి కలుగుతున్న ఫలితాలను పాలుపంచుకోవటానికి ఆ ఆత్మలు వస్తూ ఉంటాయి. నేను అభ్యాసం చేసే కాలంలో కూడా ఈ విధంగా చాలాసార్లు జరిగింది. ఇతర లోకాల నుంచి కూడా ఆత్మలు అప్పుడప్పుడు ఇందు కోసం వస్తూ ఉంటాయి. ఈ విధంగా చంద్రలోకం నుంచి ఒక సందర్భం, సూర్యలోకం నుంచి ఒక సందర్భమూ ఏర్పడ్డాయి. వీటితో, నేను కొన్నిసార్లు ఇదే ప్రయోజనంతో ఇతర లోకాలకు తీసుకుపోబడ్డాను.

०००

నేను (బాబూజీ) ఒక వ్యక్తి హృదయంలోనికి ఒక దివ్య మెరుపు (Divine spark)ను కల్పించాను. అనుకూలమైన వాతావరణం ఏర్పడినప్పుడు అది వృద్ధి చెందుతుంది అను అభిప్రాయంతో అలా చేశాను. ఎందుకంటే, ఆమె శరీరం చాలా దుర్బలమైనది కనుక ఏ రకంగాను ఆమెకు తోడ్పడే అవకాశం లేదు. రెండు రోజులు దీర్ఘంగా ఆలోచించాక నేను అందుకు తగిన విధానాన్ని కనుగొన్నాను. లాలాజీ సాహెబ్ కృపవలన, నేను అటువంటి మహత్తర కార్యాలు ఇతరులకోసం చేస్తున్నప్పటికీ, ఇప్పటికీ నమ్మగలిగేవారు లేకపోతున్నారు. పొయ్యిలో మంట రాజేసేందుకు నేను ఒక చిన్న కట్టెముక్కగానే భావించబడుతున్నాను. ఎటువంటి విలువగాని, ప్రాముఖ్యతగాని ఇటువంటి దివ్యానుగతమైన సేవలకు అనుసంధానించబడదు అని నా గురువర్యుని అభిప్రాయం. నేను నిజం చెప్పాలంటే, అది కొంతవరకు తటపటాయిస్తూ కూడా, ఇప్పటికీ నన్ను ఎవ్వరూ సరిగ్గా అర్థంచేసుకొనలేకపోతున్నారని చెప్పవలసి వస్తోంది. శ్రీకృష్ణ భగవానుడు నాకు కొంతకాలం క్రితం అంతర్వాణి ద్వారా నాకు తెలిపిన తన భవిష్యత్ ధర్మాన్ని జ్ఞాపకం చేసుకుంటే, ఇది నిజమనిపిస్తోంది. అది ఏమంటే, **"నీ ఉనికిని పూర్తిగా అర్థం చేసుకొనగలగటానికి ప్రజలకు ఇంకా సమయమాసన్నం కాలేదు, అయినప్పటికి నీవు నీ భౌతికరూపాన్ని త్యజించినప్పుడు మాత్రమే అది తప్పనిసరిగా వారి అనుభవానికి వస్తుంది"** అని చెప్పిన మాట.

०००

నాకు (బాబూజీ) ఒక హిందీ కవిత జ్ఞాపకం వస్తోంది, "ఓ ప్రియతమా! నిన్ను నా కనురెప్పల మాటున దాచిపెట్టనిమ్ము, దానితో నేను ఎవ్వరినైనా చూసే అవకాశంకాని, నీవు ఎవ్వరినైనా చూసే అవకాశం గానీ ఉండదు" అని అర్థం. నాకు ఈ స్థితిని పొందటానికి కనీసం 7 సంవత్సరాలు పట్టింది, దానిని పూర్తిగా పరిపక్వం చేసుకొనటానికి 22 సంవత్సరాలు పట్టింది. అయితే నా సహచరులకు ఇంతకాలం పట్టకూడదు అని కోరుకుంటాను.

०००

శ్రీకృష్ణ భగవానుడు మనపట్ల చాలా దయగలిగి ఉన్నారు. నా కోరిక ననుసరించి వారి శక్తి ఎల్లప్పుడూ పనిచేస్తూ ఉన్నదని నేను ఎప్పుడూ విశ్వసిస్తాను. ఈ సంస్థకు నామకరణం చేసింది వారే. నాకు కొన్ని బాధ్యతలను అప్పగించి 1945లో దక్షిణ భారత దేశానికి నన్ను పంపినదీ వారే. వారు నా పనికి బాగా సంతృప్తి చెంది, విశిష్టంగా బహూకరించారు.

०००

నిద్రలో చేయి కనుక ఛాతీమీదకు చేరినట్లయితే, ఆ వ్యక్తికి భయంకరమైన కలలు కలిగినట్లు భావించాలి. ఇది అనుభవ పూర్వకమైన విషయం. నేను ఈసారి తిరుపతిలో ఉన్నప్పుడు ఒక భయంకరమైన కలను చూసాను. నేను మేల్కొనేసరికి నా చేయి గుండె మీద ఉంది. సూఫీలు కూడా అప్పుడప్పుడు అభ్యాసులు అకారణంగానే భయం చెందుతారని చెబుతారు. దాని అర్థం ఏమిటంటే, దైవం వలన భయం అతనిలో వృద్ధి చెందిందని; అయితే దానివలన నష్టం ఏమీ ఉండదు. నేను ఒక రకంగా సూఫీలను సమర్థించను. సూఫీలలో ఒకరు, అభివృద్ధికి ఇది చరమదశ అంటారు. నా అనుభవ ప్రకారం, కొంత అభివృద్ధికి ప్రారంభంలో ఇది వస్తుందని, అలాగే ఇంకా కొంత ఉన్నత మండలానికి చేరాక అది వస్తుందని. దీనిని నేను రెండు సంవత్సరాల అభ్యాసం తరువాత గుర్తించగలిగాను. రెండు మూడు సంవత్సరాలు అభ్యాసం తరువాత నిశిత జ్ఞానం కలిగిన అభ్యాసులు దీని అనుభవం పొందుతారు.

ooo

ఈ ప్రస్తుత ప్రపంచంలో పుస్తకాలు విపరీతంగా చదవాల్సి ఉంటుందని అంటారు. నేను (బాబూజీ) ఎందుకు చేయడంలేదో అది నాకు తెలియదు. బహుశా అందుకు నా సోమరితనం కారణమై ఉండవచ్చు. ప్రయోగాత్మక జ్ఞానం గురించినైతే, నా మాస్టర్ (లాలాజీ) చెప్పినట్లుగా, వారు తమకు తెలిసినదంతా నాకు బదిలీచేశారు. అందుచేత ప్రయోగాత్మకతకు సంబంధించినంతవరకు, ఎటువంటి ప్రశ్నకైనా, వారి కృపతో నేను సమాధానం ఇవ్వగలనని నేను విశ్వసిస్తున్నాను. వారు ప్రతిదీ నాకు ప్రయోగ పూర్వకంగా చూపించారు. నేను 'రాజయోగ ప్రభావం'లో వ్రాసిన వాటి నన్నిటినీ నేను చూశాను. దానిలో ఉన్న శక్తి నెవ్వరూ విలువకట్టలేరు కాని ఈ దేహాన్ని మాత్రమే విలువకట్టారు.

ooo

నా అనుభవంలో ఒక ఉదాహరణ ఉంది. నా సహచరుల్లో ఒకరి కుమార్తె కుక్క కాటుకు గురైంది. నేను ఆమె తండ్రికి, కొంచెం ఆలస్యంగానే కావచ్చు, ఆమెను వెంటనే ఒక అనుభవజ్ఞుడైన వైద్యునికి చూపించాలని చెప్పాను. ఆ మధ్యలో నేను ఆ విషాన్ని వెలికితీశాను, అలా తీయటం కూడా జరిగింది. అయితే అక్కడ ఒక చిన్న చుక్క లాంటిది ఉండిపోయి, దానితో మళ్ళీ విషం ఎక్కింది. దీనినిబట్టి, ఎవ్వరు కూడా ఆఖరికి ప్రపంచంలోని అత్యున్నత సెయింట్ కూడా భగవంతుని సంకల్పంలో కలుగజేసుకొనలేరని అర్థమవుతుంది. మరి అలాగైతే ఈ అల్పునివలన ఏమవుతుంది.

ooo

కలకత్తాలో నేను దక్షిణేశ్వర్‌ను, బేలూరు మఠాన్ని సందర్శించాను. వారొక చక్కని ప్రదేశాన్ని బహూకరించారు. నేను కూడా స్వామి రామకృష్ణ సమాధి స్థలానికి వెళ్ళి అక్కడ 2 నిమిషాల సేపు ధ్యానం చేశాను. హృదయంమీద మంచి ప్రభావం కలిగినట్లు నేను గమనించాను. ఇది వారి హృదయ కేంద్రం అద్భుతంగా ఉన్నట్లు తెలియజేస్తుంది. ఇది వారి విషయంలో మాత్రమే కాదు. ఇంకా అనేక ఇతర సెయింట్ల విషయంలో కూడా అలాగే ఉండి, వారిలో ప్రముఖంగా ఉన్న చక్రం, దాని ప్రభావాన్ని గట్టిగా ప్రదర్శిస్తుంది. ఈ విషయంలో నా మాస్టర్ నేర్పరితనం చాలా విశిష్టమైనది, సాటిలేనిదిగా ఉండి, ఆఖరిదశలో మాస్టర్

సహాయం అన్ని చక్రాలను సమస్థాయిలో ఉంచుతుంది. అనగా దివ్య ప్రభావంతో ప్రతిదీ శక్తివంతం చేయబడి ఒకే స్థాయిలో నిలపబడతాయి.

బేలూరు మఠంలో, ఈ ప్రభావం చాలా ఆనందంగా ఉన్నట్లుగా నాకు తోచింది. స్వామి వివేకానంద నివసించిన ప్రదేశం ఇదే. వారి సమాధి ప్రక్కన మేము అయిదు నిమిషాలకుపైగా ధ్యానంలో కూర్చున్నాము. మా అందరిపైన కలిగిన ప్రభావం చాలా బాగుంది. మాలో ఆలోచనలు ఏమీలేకపోగా ఒక సమత్వస్థితి అంతటా నెలకొన్నది.

ooo

నేను (బాబూజీ) అహంకారపూరితంగా చెప్పటంకాదుగాని, 'వారు' (నా గురువు లాలాజీ సాహెబ్) లేకుండా నేను జీవించలేను, అలాగే నేను లేకుండా 'వారు' ప్రదర్శించలేరు. అలా ఎందుకంటే, అది వారి అభీష్టం. నేను ఎక్కడ ఉంటే వారు అక్కడ ఉంటారు. నేను ఒక మానవమాత్రుడినే అయి ఉన్నందున ప్రాణాహుతి యొక్క పరిమాణాన్ని, ప్రభావాన్ని క్రమబద్ధం చేయటానికి 'వారి' నిఘా ప్రతిక్షణమూ అవసరం ఉంటుంది. కొన్నిసార్లు అయితే, విశేషించి ఉన్నత మండాలాల్లో, ఎవ్వరైనా ప్రిసెప్టర్లు ట్రాన్స్‌మిషన్ ఇస్తూ ఉన్నట్లయితే 'వారు' హాజరవుతారు.

ooo

మా తల్లిదండ్రులకు మేమందరం కలిపి నలుగురు సంతానం– ఇద్దరు కుమారులం; ఇద్దరు కుమార్తెలు. అందరిలోని పెద్దవారు మా సోదరి, ఆమె పేరు రాధా పియారి, మెయిన్‌పూరిలో న్యాయవాదిగా ఉన్న శ్రీ రఘువీర్ సహాయ్ రాయ్‌జాదాతో ఆమెకు వివాహమైంది. నేను (బాబూజీ) రెండవ సంతానం. నాకు మథురలో వివాహం జరిగింది. నా భార్య 1949లో పరలోక ప్రాప్తి చెందింది. మూడవ సంతానం, కుటుంబ్ పియారీ అను ఆమె; లక్నోలో తాలూకేదార్ కుటుంబానికి చెందిన స్వర్గీయ శ్రీ లక్ష్మీ శంకర్ గారితో ఆమెకు వివాహమైంది. ఆమెకు సృజనాత్మకమైన మేధస్సు ఉంది. ఆమె హిందీలో చాలా నవలలు, నాటకాలు వ్రాశారు. దురదృష్టవ శాత్తు ఇటీవలే ఆమె తన భర్తను కోల్పోయారు. అందరిలో చిన్నవాడైన నా సోదరుడు, డాక్టర్ హరీశ్ చంద్ర, లక్నో యూనివర్శిటీ నుంచి యం.బి.బి.యస్. డిగ్రీ పొందాక 29.08.1935న ఉన్నత చదువు నిమిత్తం ఇంగ్లాండ్ వెళ్ళారు. అతడు లాంక్‌షైర్‌లో ఒక ఫిజీషియన్‌గా ప్రాక్టీసు చేస్తూ దాదాపు అక్కడే స్థిరపడిపోయారు.

ooo

ఒక్కొక్కసారి ట్రాన్స్‌మిషన్ ఎంత సహజంగా ఉంటుందంటే, కొన్నిసార్లు దాని అనుభూతి చెందటం కూడా కష్టమే అవుతుంది. అప్పుడు ప్రిసెప్టర్లు నేను (బాబూజీ) ట్రాన్స్‌మిషన్ చేయలేదు అని భావిస్తారు. అసలైన స్థితి అభ్యాసీ హృదయంలోకి లోతుగా వెళ్తుంది. కస్తూరి అందుబాటులో ఉన్నప్పుడు, నేను కొన్నిసార్లు నా ట్రాన్స్‌మిషన్ స్వభావం మరియు దాని ప్రభావం ఎలా ఉన్నాయని ఆమెను అడుగుతాను. దీనికి నేను ఒక ఉదాహరణ వివరిస్తాను. నేను న్యాయమూర్తుల కోర్టులో పని చేస్తున్నప్పుడు, నా మహమ్మదీయ స్నేహితుడు

ఒకరికి, ఆఫీసులోనే సిట్టింగ్ ఇచ్చాను. తర్వాత, ఇరవై సంవత్సరాల అనంతరం నాతోటిశిష్యునితో కలిసినప్పుడు, ఒక సూఫీ అతడిని కలిసి, నీకు ఎవ్వరోగాని బాగా ట్రాన్స్‌మిషన్ ఇచ్చారు, దాని ప్రభావం ఇప్పటికీ ఉంది అని ఆ సూఫీ చెప్పినట్లుగా తెలియ జేశాడట. షుమారు ఒక వారం రోజుల క్రిందట నా సహశిష్యుడు ఈ వృత్తాంతాన్ని నాకు చెప్పాడు.

ooo

**"రామచంద్రుని (బాబూజీ) పాద ధూళి, అంతిమసత్యం యొక్క ప్రత్యక్షతను / దర్శనాన్ని కల్పిస్తుంది" అని లాలాజీ చెప్పారు.**

ooo

**బాబూజీ మహరాజ్‌ను భూమ (అల్టిమేట్, అనంతం)గా గ్రహించినప్పుడు, లాలాజీ మరియు స్వామి వివేకానంద –"ఇక మీదట నీవు మా ఇద్దరినీ ఆదేశించు...." అని చెప్పారు. దానికి బాబూజీ సవినయంగా– "ఇక నుంచి మీరిద్దరూ నన్ను ఆదేశించాలని నేను మిమ్మల్ని ఆజ్ఞాపిస్తున్నాను" అన్నారు.**

ooo

అహంకారం అనేది అనేక రూపాల్లో వ్యక్తమవుతుంది అని అందరికీ తెలిసినదే. నేను చెప్పదలచినదానిని విపులీకరంచేందుకు నేనొక ఉదాహరణ చెప్తాను. ఒక రాజు కనుక తాను రాజునని తలుస్తూ ఎప్పుడూ తాను రాజునని చెప్పుకుంటూ ఉంటే, అతడు తన చుట్టూరా స్థూలత్వాన్ని పొరలు పొరలుగా చుట్టుకున్నట్లు కావటమేగాక, ప్రతిఒక్కరూ అతని గర్వానికి, మదానికి తిట్టుతూ ఉంటారు. అది హద్దుమీరినపుడు లేదా శృతిమించినపుడు, అతడు ఇంకొక రావణాసురుడుగా అనగా అతనికి ఉన్న పది తలల్లో ఒకటి గాడిద రూపంలో ఉండి అతని మూర్ఖత్వానికి చిహ్నంగా ఉంటుంది. ఇది కేవలం రాజుకు మాత్రమే చెందకుండా, అతడిని రాజుగా స్వీకరించేవారికి మాత్రమే చెందుతుంది. అతని వంతుగా, బలహీనులు, దీనులపట్ల దయాళువుగాను, మర్యాదగాను వ్యవహరించాల్సి ఉంటుంది. అప్పుడు మాత్రమే అతడు తన ప్రజలచేత పూర్తిగా గౌరవింపబడతాడు.

ooo

యక్షుని ప్రశ్నకు సమాధానంగా –"ప్రపంచంలో వింతైన విషయం ఏమిటంటే, జనం ఇతరుల మృత్యువు గురించి ఆలోచిస్తారు కాని, తాము కూడా దానిని త్వరలో చవిచూడవలసి వస్తుందని భావించరు" అని యుధిష్ఠరుడు (ధర్మరాజు) వివరించాడు. దానికి నా (బాబూజీ) సమాధానమైతే ఎలా ఉండేదంటే, జనం తమ అసౌకర్యాన్ని గ్రహించినప్పటికీ, వారు ఇంకా నిరాధారమైన దిండుమీదనే తలవాల్చి పండుకుంటారు– అని. ఇది నాకు చాలా వింతగా అనిపిస్తుంది. రాజు, మహర్షి అయిన భర్తృహరి, దైవ చింతనతో జాగృతమైనప్పుడు, తల ఆన్చుకోవటానికి ఒక దిండు ఉండగా, కొంతసేపటికి అది నిరుపయోగమని భావించి దానిని తొలగించివేశాడు. దిండు ఒక 'ఆధారం' (Support)నకు ప్రతీక. దైవం యొక్క చేయూత,

ఇంకొక మాటలో చెప్పాలంటే, దైవం మీద ఆధారపడి ఉండటం (ఉర్దూ పదం 'తకియా' అనగా 'తలగడ' లేదా 'దిండు' లేదా 'ఆధారం') అనగా తన సమస్త భారం దానిమీద మోపటం అన్నమాట.

ooo

ప్రతి ఒక్కరికీ ఎవ్వరికి తగిన ఆపదలు వారికి ఉంటాయి. నాకు కూడా అలాంటివే ఉన్నాయి, వాటిని గురించి నా మాస్టర్‌కు వ్రాయగా దానికి వారు ఇచ్చిన సమాధానం సువర్ణాక్షరాలతో లిఖించ దగ్గదిగా ఉంది:

"బాధలకు గురికావటం మంచి పరిణామమే. అణుకువ (నమ్రత)కు మరియు సహనానికి స్వగృహం ఒక శిక్షణ కేంద్రం వంటిది. నిత్యజీవితంలోని సంఘటనలతో ఓరిమి దాల్చటం అనేది ప్రాయశ్చిత్తానికి, త్యాగానికి అత్యున్నతమైన సాధనంగా ఉంటుంది. కనుక రోషకావేశాలకు బదులు, ఎవ్వరైనా గాని స్వయంగా వినమ్ర స్వభావాన్ని అలవర్చుకోవాలి. వినమ్రత అనగా, ఎవ్వరిచేతనైనా నిందించబడినపుడు, తాను స్వయంగా తప్పు చేసినట్లుగా తలచి నప్పుడు, తన తప్పిదానికి తలదించుకునే మానసిక స్వభావం వంటిది. ఇటువంటి సందర్భంలో ఇతరులకు సమాధానపడి సంతృప్తి చెందటం, సహనం మరియు జీవిత కార్యకలాపాల నుంచి సడలింపు కలిగించుకోవటం లాంటి వాటికి– ఒంటరితనం, విచారం మరియు ఇతరులతో సాంగత్యం లేకపోవటం వంటివి కొన్ని పరిష్కారాలుగా ఉండగా, మనకు మాత్రం కుటుంబం నుంచి, మిత్రుల నుంచి మరియు సమాజం నుంచి వ్యక్తమయ్యే ఎత్తిపొడుపులు, నిందలు వంటివి– ప్రాయశ్చిత్తానికి, త్యాగానికి ప్రతిరూపంగా ఉంటాయి."

మరొక సందర్భంలో లాలాజీ సాహెబ్ తమ సహచరులలో ఒకరికి ఈ విధంగా వ్రాశారు: "దుఃఖాలు, బాధలకు సంబంధించి నంతవరకు, అవి నాకు ఉన్నాయి, బహుశా అవి ఇతరులను నిశ్చేష్ట పరచవచ్చును కూడా. తరచుగా నాకు ఆహారానికి కూడా ఏమీ ఉండేది కాదు. నాకు చాలామంది పిల్లలు, ఇంకా నామీద ఆధారపడి యున్నవారు ఉన్నారు. దీనికితోడు, కొన్ని సందర్భాలలో నేను ఇతరులకు సహాయపడవలసి వచ్చేది కూడా; అది తప్పనిసరిగా కూడా ఉండేది. ఈ భారమంతా నామీదే ఉండేది. నేను వాటిని నిర్వహిస్తూ అన్ని అవసరాలు సమకూర్చవలసి వచ్చేది. ఇంకా చెప్పాలంటే, కుటుంబానికి అంతటికీ కప్పుకోవటానికి ఒక్క అతుకుల బొంత మాత్రమే ఉండేది. దానిని నేను ఒక దురదృష్టంగానే భావించాను, అయితే అది కాలాంతరాన తొలగిపోయింది. నాలో అంతటా ప్రాతినిధ్యం వహించుకున్న సత్యత్వానికి పోల్చినట్లయితే ఇవన్నీ నాకు ఏమాత్రం ప్రాధాన్యమైనవిగా అనిపించలేదు. నా మోక్షగతికి ఇదే కారణం అన్నట్లుగా నేను ఎప్పుడూ వాటిపట్ల సంతోషాన్ని కలిగి ఉన్నాను."

ooo

ఒకసారి ఒక అభ్యాసీ, బాబూజీతో "బాబూజీ, మేము మిమ్మల్ని ఎలా సంబోధించాలి?" అని అడిగాడు. దానికి సమాధానంగా, "ఆ దివ్య పురుషుని గురించి నాకేమీ తెలియదు. మీరు నన్ను దివ్య పురుషునిగా పిలిచినట్లయితే, ఒక విధమైన భేదం, ఎడమ, దూరం– అభ్యాసీకి నాకు మధ్య ఉంటాయి. దానివలన నేను

అభ్యాసీ మీద సరిగ్గా పని చేయలేను. కాని ఎప్పుడైతే అభ్యాసీ నన్ను ప్రేమగా 'బాబూజీ' అని సంబోధిస్తాడో, అప్పుడు నేను వారిలో కలిసి పోవటం, పని బాగా నిర్వహించటమూ జరుగుతుంది" అని చెప్పారు బాబూజీ.

ooo

పిల్లలకు ప్రసాదాన్ని పంచిపెడుతూ బాబూజీ చిరునవ్వుతో "పిల్లలకు ఇదే పూజ" అని అన్నారు. పెద్దవాళ్ళు పూజకు ఉపక్రమించినప్పుడు, పిల్లలు వారికి పంచబడే ప్రసాదం గురించి ఉవ్విళ్ళూరుతూ ఉంటారు. కనుక ప్రసాదాన్ని లాలాజీకి నివేదించిన తర్వాత, పిల్లల ప్రయోజనార్థం, దానిని వారికి పంచబడుతుంది.

ooo

ఒకసారి బాబూజీ ఇలా చెప్పారు: "అభ్యాసీ కనుక నన్ను నోటితో పిలిస్తే, మధ్య దూరం ఉంటుంది కనుక, నేను అతడి మాటలు వినలేను. ఒకవేళ అతడు నన్ను తన ఆలోచనల ద్వారా తలంచినా కూడా, నేను ఆలోచనా రహితుడను కనుక అవి నాచేత గ్రహించబడవు. అభ్యాసీ కనుక నన్ను హృదయం ద్వారా పిలిచినట్లయితే, అభ్యాసీ హృదయం నాదే కనుక నేను అతని పిలుపు వింటాను."

ooo

బాబూజీ ఇలా చెప్పారు: "నా మాస్టర్ మాటల్లో చెప్పాలంటే, మనం ఒక నీటిపక్షి జీవితాన్ని అవలంబించాల్సి ఉంటుంది. ఎందుకంటే, అది నీటిలోనే ఎంతసేపు ఉన్నప్పటికీ దాని రెక్కలు తడిసిపోవు. దీనిలాగానే పద్మం కూడా ఎప్పుడూ నీటిలోనే ఉన్నప్పటికీ అది పూర్తిగా పొడిగానే ఉంటుంది. ఆ విధంగా, ప్రాపంచికం అను నీటిలో నిరంతరం మునిగి ఉన్నా కూడా, మనం ఆ పద్మం మరియు నీటి పక్షిలాగా పొడిగా, ప్రభావితం కాకుండా ఉండాలి."

ooo

మనం ఏదో ఒక దానికోసం నియమించబడ్డాము. మనం ఎప్పుడైతే ఈ జీవ శరీరాన్ని పారమార్థిక జీవనంగా మార్చుతామో, అప్పుడే అది సాధ్యపడుతుంది. ఆ పారమార్థిక శక్తి, ఆ సర్వోన్నత శక్తికి లేదా దివ్య శక్తికి మనం సమర్పితమైనప్పుడు మాత్రమే పొంద బడుతుంది. ప్రత్యక్షంగా ఈ విధానం ఎటువంటిది అంటే, నేను (బాబూజీ) తరచుగా నా సహచరులకు– "మాస్టర్ ఖజానాలోనే నీవు ప్రతిదీ, దానితో నీకు ఇంక సంబంధం లేనట్లుగా జమకట్టు" అని చెప్తూ ఉంటాను. నేను పొంతనలేనివి, సాధించబడరాని మాటలు చెబుతున్నానని ఎవ్వరైనా విమర్శించవచ్చు. కాని ఎవ్వరైనా దీనిని ఆధ్యాత్మిక జీవితంలో అడుగిడిన తొలిరోజు నుంచే అన్వయించుకోవచ్చు. మన స్థితి మెరుగుపడినట్లుగా, మనం త్వరలోనే అనుభవం చెందుతాము. ఆ తర్వాత చివరకు, మనకు సంబంధించిన వాటినన్నింటి నుంచి విముక్తులమైనట్లుగా స్వయంగా గ్రహించగలుగుతాం. ఇందుకు ముఖ్య అవసరమైనది ఏమిటంటే, నీవు సాధ్యమైనంతవరకు నీలోనే మణిగి (Absorbed) ఉండాలి. దీనినే ఇంకొక విధంగా చెప్పాలంటే, మాస్టర్ యొక్క నిజస్వరూపాన్ని జ్ఞాపకం ఉంచుకోవటమే."

ooo

బాబూజీ చెప్పారు: “మతం అనేది భగవత్ సాక్షాత్కారానికి వాస్తవంగా ఒక మార్గ సూచియే. అయితే నీకు నీవుగా సరైన మార్గం ఎంచుకోవాలి. సమస్త మానవాళికి సమస్యలు ఎన్నో ఉంటాయి, కాని ఎవ్వరైతే వాటికే పరిమితమైపోయి ఉంటారో, వారికి అది ఒక అవరోధంగానే తయారవుతుంది. నిరుత్సాహాలు మనల్ని పిరికి పందలుగా చేస్తాయి. మనం కనుక 'నిరుత్సాహం' అను పదం నుంచి ఏదో విధంగా 'నిర్' అను శబ్దాన్ని కనుక తొలగించినట్లయితే 'ఉత్సాహం' అనేదే మిగులుతుంది. (ఇంగ్లీషులో 'Disappointment') అను పదంలో 'Dis'ను మినహాయిస్తే ఇంక 'Appointment' అనేది మిగులుతుంది) అనగా ఏదో పనికోసం మన నియామకం జరిగింది అనుకుంటే, మనం అది చేయలేము అని ఎప్పుడూ తలంచము. దాని అర్థం ఏమిటంటే, ఒక విధమైన శక్తి తరంగం అంతర్వాహినిగా ప్రశాంతంగా చలిస్తున్నది కనుక, నీవు దానితో ముందుకు నడుస్తున్నావు. అటువంటి సందర్భంలో ఇంక గతాన్ని గురించిగాని, భవిష్యత్తును గురించిగాని ఎటువంటి భావన ఉండదు. దైవ సామ్రాజ్యంలో ఒక బెబ్బులిలాగా వ్యవహరిస్తే, అభ్యున్నతి అనేది నీవంతు అవుతుంది.”

ooo

ఒక రోజున బాబూజీ చెప్పారు: “జనం నన్ను ఒక మహాత్మునిగా భావిస్తారు. అయితే నా సత్యత్వం (రియాలిటీ) ఎటు వంటిది అంటే, ఎవ్వరైనాగాని తన దృష్టిని ప్రప్రథమంగా నావైపు మరల్చినప్పుడు, అతడు ఉన్నతుడైనా, సామాన్యుడైనా, పెద్దవాడైనా, చిన్నవాడైనాగాని ఆంతరికంగాను, బాహ్యంగాను అతని పని అయిపోయినట్లే. ఇది నా ప్రత్యేకత.”

ooo

బాబూజీ చెప్పారు: “మానవుడు సామాన్యంగా, అతడు స్వయంగా తనకు ఏమీ తెలియకుండా తయారయ్యాడు కనుక, వాతావరణంతో చాలా సంతోషపడ్డాడు. అతడు దాని నుంచి ఇంకా ముందుకు దర్శించటానికి ఆలోచించడు. మరి దీనిని సాధ్యం చేయటం ఎలా? దానిని గురించి మేధోమధనం చేసినట్లయితే, మనం మనలో ఒక ఆలోచనా పరంపరను కల్పించుకున్నాం అని; దానిని ప్రేరణలతో పోషించి, మానసం అను నర్సరీలో పెంచుతూ, అన్ని వైపుల నుంచి అభిప్రాయాలను వాటిని వాటి చెవుల్లో ప్రతిధ్వనింపజేసి, కావలసినంత బలాన్ని సమకూర్చుతూ, ఆ వాతవారణం యొక్క ప్రభావాన్ని ఇంకా పెంచుతున్నాం అని గ్రహిస్తాం.”

ooo

మానవుని యొక్క ఈ నిస్సహాయతను అతని స్వీయ రక్షణగా భావించవచ్చు కాని నేనైతే ఏమంటాను అంటే, ఎప్పుడైతే ఇవి మన చెరుపుకు దారితీసేవని గ్రహిస్తామో, అప్పుడు మనలో కొంత మార్పు చోటుచేసుకున్నట్లుగా భావించవచ్చు– అని. దీనిని వైరాగ్యానికి మొదటిమెట్టుగా తీసుకుంటే, మన ఆలోచన ఇంతకు మించి మంచిది, శ్రేష్టమైన దానిమీద దృష్టి సారిస్తుంది. దానిని మనం గట్టిగా గుర్తించి, దానికి మరియు ఇతర ఆలోచన లేకుండా కట్టుబడి ఉండాలి. అప్పుడు, వైరాగ్యం తలవనితలంపుగా మన వ్యవస్థలో వృద్ధి చెందుతుంది.

ooo

బాబూజీ ఇంకా ఇలా చెప్పారు: బాధలు, వాటి అనుభవం అనేవి మన సంకల్పానికి, దైవ సంకల్పానికి వైరుధ్యం ఉన్నప్పుడు మాత్రమే అవి తలెత్తుతాయి అని చెప్పగలను. అటువంటి వైరుధ్యమే కనుక, అవగాహనకు వచ్చినట్లయితే, నిజమైన భక్తి ఉండాలని చెప్పటానికి తగిన ఋజువు."

ooo

బాబూజీ చెప్పారు: "స్వామి వివేకానంద, తమ ఉపన్యాసాలలో దేనిలోనోగాని, దైవ శక్తి ఉత్తేజం గావించబడింది. ఒక వ్యక్తిత్వం ఆసియాలో ఏ ప్రాంతంలోనోగాని ఆవిర్భవించి, ప్రపంచ సంక్షేమం కోసం పనిచేయటం జరిగింది అని నిశ్చయంగా చెప్పగలను అన్నారు. నేను కూడా ఆ విషయమై బాగా పరిశీలించి, దివ్య శక్తి ఒక మార్పుకోసం నిదానంగా దిగి వస్తున్నట్లుగా గుర్తించాను. ఆ దివ్యశక్తి దేనినో దృష్టిలో పెట్టుకుని వస్తోంది. ఎందు కంటే, నా అవగాహన ప్రకారం, అది పరిపూర్ణ స్థితికి వస్తే, ఆ ప్రత్యేక వ్యక్తిత్వ పురుషుని యొక్క పనికి ముగింపు కలిగి, అతడు వెంటనే ఈ లోకం విడిచిపెట్టి వెళ్ళిపోవటం జరుగుతుందని అనుకుంటున్నాను. పనినైతే అతడు పూర్తి చేశాడు కాని, ఏదో కారణాన్ని ఇంకా సరిచూడవలసి ఉన్నందున, అతడు ఏదో ఆధ్యాత్మిక కార్యం కూడా చేయదలపెట్టి, మానవాళి లాభం కొరకు రెండూ ఒకదాని సరసన మరొకటి నిర్వహించదలచాడేమో ఎవ్వరికి ఎరుక." ఆ ప్రత్యేక వ్యక్తి ఎవ్వరో మనకు తెలిసినవారే.

ooo

బాబూజీ చెప్పారు: "నేను నాకు చేతనైనంతవరకు అందరికీ సేవ చేస్తాను. కాని ప్రతి ఒక్కరూ తాను కల్పించుకున్న శక్తిమేరకు, తన వంతును పొందుతారు. తనలో దివ్యశక్తి ప్రవాహం కొరకు ఎంత ఖాళీ లేదా శూన్యతను కల్పించుకున్నాడో అంత మేరకు మాత్రమే అతడు పొందుతాడు. ఇంకొక రకంగా చెప్పాలంటే, ఎవ్వరైతే నా కృషికి ఎంతగా సహకరిస్తారో వారికి అంత ఎక్కువగా లబ్ధి చేకూరుతుంది."

ooo

ఒకసారి ఒక అభ్యాసీ బాబూజీకి ఏమని వ్రాసాడు అంటే, "బాబూజీ! నేను ఇప్పుడు తరచుగా మిమ్మల్ని జ్ఞాపకం చేసుకుంటున్నాను" అని. దానికి సమాధానం బాబూజీ నుంచి చాలా సులభమైన, సహజమైన మాటలతోను, "నా జ్ఞాపకం వస్తూ ఉంది అంటే అది పోతూ ఉండవచ్చును కూడా. అది (జ్ఞాపకం) రావటంగాని, పోవటంగాని ఉండకూడదు అని నేను కోరు కుంటున్నాను" అని వ్రాసారు. అభ్యాసులు తరచుగా "మిమ్మల్ని ఎంతగానో జ్ఞాపకం ఉంచుకుంటున్నామని వ్రాసేవారు" అని బాబూజీ చెప్తూ, ఇంకా ఏమన్నారంటే, "వారు (అభ్యాసులు) జ్ఞాపకం చేసుకుంటున్న దాని ప్రభావం నన్ను తాకనప్పుడు నాకు ఎలా తెలుస్తుంది? అది (జ్ఞాపకం) ఎలా జరుగుతుందో మీకు తెలుసా? ఎందుకంటే నేను జ్ఞాపకంతో బంధించబడేవాడను కాదు కనుక" అని అన్నారు.

ooo

"సత్యత్వానికి లేదా దివ్యత్వానికి నీవు తెరవబడి ఉండటమే ప్రేమ. ఎప్పుడైతే మనం ఒక రకంగా తెరచుకుంటామో అప్పుడు సృష్టియే ఒక భ్రమ. నేను ప్రతిదీ 'అతని'కి (దైవం) తెరచి ఉంచాను. నాకు

దైవానికి మధ్య ఇంక అడ్డు ఏమీలేదు. ఇది బాగుంది కాని మనం ఈ ప్రశ్న అడగాల్సి ఉంది –'ప్రేమించటం ఎలా?' అని. జ్ఞాపకం కలిగి ఉండటం ద్వారా అని దానికి జవాబు. నీవు ఎవరినైనా ప్రేమిస్తున్నావు అంటే, నీవు అతని జ్ఞాపకం ఉంచుకుంటావు. నీవు ఎప్పుడైతే 'అతడి'ని జ్ఞాపకం ఉంచుకోవటం ఆరంభిస్తావో, అప్పుడు 'అతడు' నిన్ను ప్రేమించ నారంభిస్తాడు. ఇక అంతే సంగతి. ధ్యానమే ప్రేమను ఉత్పన్నం చేస్తుంది."

ooo

ఒకసారి బాబూజీ ఇంటిలో భోజన సమయంలో, దూరం నుంచి వచ్చిన ఒక అభ్యాసీ భోజనానికి కూర్చుని, "నాకు పప్పులో నెయ్యి వడ్డించుకునే అలవాటు ఉంది" అని చెప్పాడు. ఇంట్లో నెయ్యి ఏమాత్రమూ లేదు. అదే సందర్భంలో బాబూజీ అక్కడికి వచ్చారు. అప్పుడు ఇంట్లోనివారు, ఇంట్లో నెయ్యి లేదని, కాని ఆ అభ్యాసీ అది కావాలని కోరుతున్నాడు అని చెప్పారు. అప్పుడు బాబూజీ వెంటనే, "నెయ్యి ఒక చిన్న పాత్రలో స్టోర్‌గదిలో ఉంచబడింది, దానిని అతనికి వడ్డించండి" అన్నారు. ఆ నెయ్యి పాత్ర వాస్తవంగా అక్కడ ఉండటంతో అతనికి వడ్డించబడింది. అసలు తామెవ్వరూ అక్కడ నెయ్యి దాచనందున అది అక్కడకి ఎట్లా వచ్చింది అని అందరూ ఆశ్చర్యపోయారు. 'వారి' కృప మూలంగా ఆ కుటుంబ మర్యాద ఎప్పుడూ కాపాడబడింది. (దీనినిబట్టి అతిధులుగాని, అభ్యాసులుగాని, ఆతిథ్యం ఇచ్చినవారిని ఇరుకున పెట్టకుండా, వారు నివేదించిన దానితో సరిపెట్టుకోవటం నేర్చుకోవటం మంచిదేమోనని అనిపిస్తుంది.)

ooo

బాబూజీ చెప్పారు : కర్మ సూత్రం అనేది హిందూ ధర్మ శాస్త్రంలో బాగా నిలదొక్కుకుంది. దానిని దాదాపు గతంలో మహా ఋషులందరూ సమర్థించారు. అయితే మనం ఒక స్పందనలేని ప్రేక్షకునిగా ఉండిపోయి మౌనంగా, యధాప్రకారం అనుభవించడం, ఆమోదించమని అర్థంకాదు. భగవంతుడు మనకు విచక్షణా జ్ఞానాన్ని, తెలివితేటలను, శక్తిని అనుగ్రహించాడు. మనం పరిస్థితులను అర్థంచేసుకొని, ఒక మంచి నిర్ణయానికి వచ్చి దానిని సాఫల్యం చేయటానికి మన ధైర్య సాహసాల్ని, శక్తినీ ఆ మంచికి అనుకూలంగా వినియోగించాలి. అది మన ఇష్టాయిష్టాల ప్రకారం కాకుండా, పాత నమ్మకాలకు లోబడకుండా ప్రయోజనాత్మకంగా చేయాలి.

మనం ఏదైనా విషయాలను వాటి శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని, ఏదైతే మంచిదో, తగినదై ఉన్నదో, దానికి కట్టుబడి ఉండాలి. అది మన స్వంత ఇష్టానికి అనుకూలంగా ఉన్నదో లేదో పట్టించుకోకూడదు. దీనిని సుసాధ్యం చేసుకున్నప్పుడు, మన ఆలోచనలు, క్రియలు అన్నీ కూడా కర్తవ్యంగానే ఆచరించబడి, దాని ఫలితంతో బాధ్యత వహించనివారిలాగా నిర్మలంగా, నిశ్చింతగా ఉంటాము. మనం తలపెట్టేవాటి జయాపజయాలతో నిమిత్తం లేకుండా మనమంతా ఆ విధంగా ప్రవర్తించాలి.

ooo

కష్టాలు, బాధలు (అవి మనం తలచుకుంటున్న రీతిలో) ఎప్పుడు కలుగుతాయి అంటే, మనం ఎప్పుడైతే వాటికి స్వయంగా కర్తలుగా భావిస్తామో అప్పుడు అనుభవానికి వస్తాయి. అయితే ఈ ఉద్దేశ్యం, నిజమైన భక్తికిగాని, ఆత్మ సమర్పణకుగాని చెందినది కాదు.

ooo

డాక్టర్ కె.సి. వరదాచారి గారు తను ప్రసంగించే సందర్భంలో ఎప్పుడూ గులాబి పుష్పం చేతిలో పట్టుకుని ఉండేవారు. ప్రసంగం కొనసాగుతూ ఉన్నప్పుడు, అప్పుడప్పుడు ఆ పుష్ప సౌరభాన్ని ఆస్వాదించటం, దాని కాడ పట్టుకొని వ్రేళ్ళ మధ్యలో గిరగిర త్రిప్పటం వంటివి చేస్తూ ఉండేవారు. ఒకరోజు బాబూజీ మహరాజ్ ఆ పుష్పాన్ని అందుబాటులో లేకుండా చేశారు. ఎందుకు అనేది దైవానికే తెలియాలి. వారు ప్రసంగించటానికి వెళ్ళబోయే ముందు పుష్పంకోసం వెదికారు కాని ఆది లభ్యం కాలేదు. వారంతా వేదికమీద ఆసీనులై ఉండగా, బాబూజీ మహరాజ్‌కు, వరదాచారిగారికి గులాబీ పుష్పమాలలు బహుకరించబడ్డాయి. అయితే పుష్పాలు అన్నీ రాలిపోకుండా పల్చటి కాగితపు పొరతో చుట్టబడి ఉన్నాయి. అప్పుడు బాబూజీ వారితో, "మీరు ప్రసంగించాల్సి ఉంది కనుక, ఈ మాల నుంచి ఒక పుష్పం తీసి ఇవ్వమంటారా?" అని అడిగారు. దానికి సమాధానంగా వారు, "అవసరంలేదు; అది లేకుండానే నేను ప్రసంగిస్తాను" అని అన్నారు. మళ్ళీ బాబూజీ, "మరైతే మీరు మాట్లాడేటప్పుడు ఎవ్వరివంక చూస్తారు?" అని అడిగారు. వరదాచారి గారు చమత్కారంగా, "మిమ్మల్ని చూస్తూనే" అని జవాబు ఇచ్చారు. ఆ సమాధానంతో బాబూజీ నవ్వసాగారు. అప్పుడు అందరూ అర్థం చేసుకున్నది ఏమిటంటే, ఆధ్యాత్మిక విషయాల గురించి ప్రసంగిచేటప్పుడు ఎటువంటి పుష్పాలమీద ఆధార పడవలసిన పనిలేదని, ఆ ఆధ్యాత్మికతను ప్రదానంచేసేవారే మన మధ్య కూర్చుని ఉండగా మరే అవుసరం ఉండదని గ్రహించారు.

బాబూజీ చెప్పారు: "ఒక ఆలోచనాపరుడు (మేధావి) లేదా తత్వవేత్త మనస్సుతో వ్యవహరిస్తాడు, సెయింట్ అయినట్లయితే హృదయానికి మాస్టర్‌గా ఉంటాడు. హృదయానికి మనస్సు ఒక క్రీడాక్షేత్రం వంటిది. ఆ క్రీడా క్షేత్రమైన మనస్సును మనం ఆలోచనారహితంగా చేసినట్లయితే, అప్పుడు ఆలోచనాపరుడు ఏం చేయగల్గుతాడు."

ooo

మంచితనం అంటే ఏమిటో మీకు తెలుసా?" అని ప్రశ్నిస్తూనే వెంటనే బాబూజీ మళ్ళీ ఇలా చెప్పారు: "ఎవరైతే లాలాజీ తేజస్సును (Noor) కలిగి ఉన్నారో వారు మంచివారుగా ఉంటారు. కనుక మంచితనం అంటె మన లాలాజీ సాహెబ్."

ooo

అభ్యాసులకు గౌరవం, ప్రాధాన్యతను ప్రదానం చేస్తూనే, 'వారు' కానరాకుండా ఉంటూనే, ఆధ్యాత్మికతను అడుగడుగునా అనుగ్రహిస్తూ ఉండటమే బాబూజీ యొక్క గొప్పతనం మరియు ప్రత్యేకత. అదే సమయంలో

వారు తమ అభ్యాసులకు ప్రేమాభి మానాలతో ధైర్య సాహసాలను కల్పిస్తారు. ఈ అమితమైన భక్తి లేకుండా, వారి పవిత్రపాదాలకు సమర్పితం కావటం అసంభవం.

౦౦౦

అప్పట్లో బసంత పంచమి ఉత్సవం బాబూజీ మహరాజ్ ఇంటిలో నిర్వహించబడుతూ ఉండేది. ఒకసారి ఆ ఉత్సవం జరుగుతున్న సమయంలో, అభ్యాసులు 'వారి' ఇంటి అరుగుమీద కూర్చుని పగటి భోజనం చేస్తున్నారు. అభ్యాసుల ఆఖరి బృందం భోజనానికి కూర్చునేసరికి వడ్డనచేసే పప్పు చాలావరకు అయి పోయింది. వారంతా ఏమి చేయాలా అని అలోచిస్తూ ఉన్నారు. అకస్మాత్తుగా వారు బాబూజీని గుమ్మంవద్ద నిలబడి ఉండటం చూసారు. బాబూజీ వారిని ఉద్దేశించి– "పప్పు అయిపోతే ఏమీ ఫర్వాలేదు. మిగిలిన పప్పులో కొంత నీరుపోసి వేడి చేయండి" అన్నారు. పప్పు అడుగున మిగిలి ఉన్న దానికితోడు సగం పాత్రలో నీరుపోసి వేడిచేసిన తర్వాత దానిని వారందరికీ వడ్డించారు. పప్పుకు బదులుగా పప్పునీళ్ళను వడ్డించారని అందరూ విమర్శిస్తారేమోనని అభ్యాసులు దిగులుపడ్డారు. భోజనాలు అయిన తర్వాత వాళ్ళు ఆ వేడిపప్పును గురించి ప్రశంసిస్తూ, అంతకుపూర్వం వారు ఎన్నడూ అనుభూతి చెందనంత రుచిగా ఉందని అందరూ వ్యాఖ్యానించారు. ఇలాగే మరికొన్ని సందర్భాలలో పప్పు అయిపోయినప్పుడు, నీళ్ళు పోసి వేడిచేసి వడ్డించినప్పుడు, అది రుచిలేనిదిగానే గుర్తించబడేది. ఈ విషయం బాబూజీకి తెలియపర్చగా వారు, "ప్రతిసారీ ప్రదర్శించ టానికి ఇది ఒక అద్భుత క్రియ కాదు. ఇది అవసరానికి తగ్గట్లుగా శ్రీ లాలాజీ సాహెబ్ సమకూర్చినది" అని చెప్పారు.

౦౦౦

బాబూజీ చెప్పారు: "ప్రతి ఒక్కరూ ఒకే విధంగా విపత్తులకు గురవుతారు. అయితే ఇందులో ఉన్న భేదం ఏమిటంటే, కొందరు వాటిని భగవంతుని బహుమానంగా సంతోషంతో స్వాగతిస్తారు; మరికొందరైతే వాటిని ద్వేషిస్తూ, వాటిని గురించి మధనపడుతూ, వాటిపట్ల ఆగ్రహం చెందుతూ ఉంటారు. ఇది మన భాదలకు ఇంకా తోడై, మనల్ని వ్యాకులపెట్టుంది. అందుచేత ఉత్కృష్టమైనది, ఒకే ఒక పరిష్కార మార్గం అయినదీ ఏమిటంటే, పరిస్థితులకు, వాతావరణానికీ అనుకూలంగా మనల్ని మనం తీర్చిదిద్దుకోవటమే. అప్పుడు ప్రతికూలత అనేది మనల్ని బాధపెట్టలేదు. ఇది మన 7వ నిబంధనకు సక్రమమైన అన్వయం అవుతుంది, దానిమీద మీరు ప్రత్యేకంగా దృష్టిసారించాలని చెబుతాను. భక్తికి, శరణాగతికి సెయింట్ మీరాబాయి ఒక ప్రబల నిదర్శనం. శ్రీకృష్ణ భగవానుడు ఆమె కోసం పంపించాడు అని చెప్పగానే విషాన్ని కూడా లెక్కచేయకుండా ఆమె దానిని సంతోషంగా స్వీకరించింది. ఏవో అనివార్య పరిస్థితుల్లోనో లేక స్వాధీనంతప్పి అవాంతరాలు అధికమైనప్పుడో తప్ప ఎవ్వరైనా గాని మానసిక ప్రశాంతతకోసం ప్రార్థనను ఆశ్రయించటమే ఉత్తమం."

౦౦౦

బాబూజీ మహరాజ్ 8 లేక 9 సంవత్సరాల వయస్సులో ఉన్నప్పుడు, వారొక రోగి పడుకున్న మంచం ప్రక్కన నిలబడితే, ఆ రోగి బాధ తలవని తలంపుగా తగ్గిపోయేది. ఒకసారి ఆ స్కూలు

ప్రధానోపాధ్యాయుని కడుపులో తీవ్రమైన బాధ కలిగి అతను బిగ్గరగా ఏడ్వసాగాడు. అప్పుడు బాబూజీ స్నేహితుల్లో ఒకరు, "అయ్యా! మీరు నాకు అనుమతినిస్తే నేను రామచంద్రవద్దకు వెళ్ళి తీసుకు వస్తాను, దానితో మీ బాధ తగ్గిపోతుంది" అని చెప్పాడు. వారు అందుకు అనుమతి ఇవ్వగానే అతడు వెళ్ళి రామచంద్రుని (బాబూజీని) వెంటబెట్టుకుని తీసుకు రాగానే ఆ ప్రధానోపాధ్యాయుని బాధ తగ్గిపోయింది. ఆ తర్వాత బాబూజీపట్ల వారి వైఖరి చాలా గౌరవప్రదంగా మారింది.

ooo

బాబూజీ చెప్పారు: "ప్రకృతిలో అనేక శక్తులు పని చేస్తున్నాయని అనటంలో సందేహంలేదు. వాటివలన మనకు సుఖదుఃఖాలు కలుగుతున్నాయి. వాటిని పూర్తిగా, శాశ్వతంగా తొలగించటమంటే మానవ శక్తికి అసాధ్యం. మానవుడు చేయగలిగింది ఏమిటంటే, వాటి ప్రభావం నుంచి బయటపడటానికి తనను తాను మార్పు చేసుకోవటమే. దేనికైనా గాని నీవు బాధ్యుడవు అనుకున్నంతవరకూ, దాని ప్రభావం నీపై పడకుండా ఉండదు. అలా కాకుండా ప్రతిదీ నీవు గురువర్యునికి అంకితం చేస్తే, నీవు బాధ్యస్తుడుగా ఉండటం తొలగిపోతుంది. ఆ తర్వాత నీవు ఏది చేసినా అది నీ కర్తవ్యంగానే భావించి చేయటం జరుగుతుంది. అప్పుడు ఆ దుష్టప్రభావం తగ్గిపోయి, మానసిక క్రుంగుబాటు, దుఃఖం మరియు భంగపాటు వంటివి ఇంక తలెత్తకుండా ఉంటాయి."

ooo

తమ గురువర్యుని (లాలాజీ సాహెబ్) పట్ల బాబూజీ భక్తి భావం సాటిలేనిది. మనకు ఆధ్యాత్మికరంగంలో అంచెలంచెలుగా పురోగతిని సమకూర్చుతూనే, తమ పవిత్ర ప్రాణాహుతి ద్వారా మన హృదయాలను నిర్మలీకరిస్తూ, వాటిలో వెలుగు నింపుతూ, 'వారు' ఎప్పుడూ ఈ విధేయపూర్వకమైన మాటలనే వల్లించేవారు –"ఇదంతా మన లాలాజీ సాహెబ్ కృప. ఎవరికి, ఎప్పుడు, ఏమి వారు ప్రసాదిస్తారు అనేది ఎవరు మాత్రం ఊహించి చెప్పగలరు?" అని.

ooo

బాబూజీ మన విధానాన్ని ప్రజలకు చాలా సరళమైన, సులభమైన పద్ధతిలో చెప్పేవారు. మన సిస్టమ్ చాలా సులభమైనది అని 'వారు' స్వయంగా చెప్పటమేగాక, అభ్యాసులకు కూడా అది తేలికైనది అనిపించేటట్లుగా చేసేవారు.

బాబూజీ ఏదైనా చెప్పేటప్పుడు ప్రతిసారి చివరలో ఈ మాట చెబుతూ ఉండేవారు –"అభ్యాసీ రోజంతా ధ్యానంలో మునిగి ఉండాలి. అప్పుడు అది అభ్యాసీ యొక్క పురోగతికి చాలా సహాయకారి అవుతుంది" అని. ఈ వాక్యం సాధన మొత్తానికి సారం వంటిది. బాబూజీ మాట్లాడే ప్రతి వాక్యం చాలా సున్నితంగా, అతిసహజమైన ధోరణిలో, దేనిమీద ఒత్తిడి లేకుండా వారి కంఠధ్వని ఉండేది.

ooo

**బాబూజీ చెప్పారు: "ఆ అంతిమం పొందటం కోసం, మంచి విశ్వాసంతో, మీరు నిజంగా ఆశిస్తున్నట్లయితే, మీరు చేయవలసిందల్లా- హృదయపూర్వకంగా, ఆ ఒకే ఒక్క అంతిమ సత్యంతో మిమ్మల్ని మీరు అనుసంధానపర్చుకుంటూ, దానివైపు మీ దృష్టిని కేంద్రీకరించాలి. సత్యమైన ప్రేమభావం మరియు భక్తిని మీ హృదయంలో రగుల్కొల్పినట్లయితే, ఆ దివ్య ప్రవాహం మీ శరీరంలోని అణువణువులోనూ వెంటనే ప్రవహించ నారంభిస్తుంది."**

ooo

దక్షిణ భారతదేశంలో, బాబూజీని స్వాగతించే సందర్భంలో, ఒక ఖరీదైన గులాబీ మాలను బహూకరించటం ఒక అలవాటుగా అయిపోయింది. 'వారు' తమ స్వాగత సమయంలో ఎక్కువ ధనం వ్యయం చేయవద్దని ప్రతిసారీ హెచ్చరించేవారు. 'వారు' ఇలా చెప్పే వారు- "భాయీ! డబ్బు అంటే డబ్బే, అది మీ జేబులోది కావచ్చు లేదా నా జేబులోది కావచ్చు, ఏదైనా ఒక్కటే. మీరు ఇప్పుడు ఇలా చేయండి: స్త్రీలు కనుక ఈ పువ్వులను ఉపయోగించుకుంటె వారికి రెండు రోజులు పూల ఖర్చు ఆదా అవుతుంది. ఒకవేళ ఈ పువ్వులను స్త్రీలు, నేను ఉపయోగించినవిగా అనుకుంటారేమో, అప్పుడు వారితో, ఇవి వాడబడినవి కానేకావని, అవి పల్చటి కాగితం పొరలతో చుట్టబడి ఉన్నాయి అని, నేను వాటిని వాసన చూడటంకాని, అవి నా శరీరాన్ని తాకటంగాని జరగలేదని వారికి నచ్చజెప్పండి" అనేవారు.

ooo

బాబూజీ ఏమీ చెప్పకుండానే, అభ్యాసులలో బాబూజీ సోదర భావం (సౌభ్రాతృత్వం) అనే బీజాలు నాటుతారు. ఈ సోదరభావం ఎటువంటి తారస్థాయికి చేరిందంటే, విదేశాల నుంచి వచ్చే అభ్యాసులు, వారిని 'విదేశీ అభ్యాసులు" అని అంటుంటే, దానికి వారు అభ్యంతరం చెప్పేవారు.

ooo

బాబూజీ చెప్పారు : "బలహీనతలు, లోపాలు అనేవి నిస్సందేహంగా ప్రతి ఒక్కరిలోను ఉంటాయి. అయితే వాటిని చెడు భావంతో నిరసించటానికి కారణం నాకు కనిపించదు. వాటితో మనం ఎప్పుడూ అధైర్యపడకూడదు. **నిరాశా నిస్పృహలు ఆధ్యాత్మిక జీవితానికి అత్యంత విషతుల్యాలు. సంకల్పం, విశ్వాసం, నమ్మకం -ఇవే ఆధ్యాత్మికతకు ముఖ్య భూమికలు.** మన మనస్సును **ఆవరించి ఉన్న ఈ నిరాశ నిస్పృహలు అనబడు ఈ కారుమేఘాల్ని అవి తరిమివేస్తాయి."**

ooo

బాబూజీ చెప్పారు: **"సాక్షాత్కారం మరియు తపన కొరకు ఆకలిగొని ఉండాలి. సరియైన సమయానికి మీకు ఆహారం అందక పోయినా లేదా దానికోసం ఒకటి రెండు గంటలు వేచి ఉండాల్సిన వచ్చినా, మీకు ఒక విధమైన అసహనం, ఆకలి మూలంగా కలుగుతుంది. ఆకలి మిమ్మల్ని ఆ విధంగా తపింపజేస్తుంది. అదే విధంగా దైవం కొరకు ఆకలి ఉండాలి."**

ooo

ప్రయాణానికి ముందుగా, ఇంటికి కావలసిన సరుకులు, పిల్లల స్కూలు ఫీజులువంటి వాటికి అన్ని ఏర్పాట్లు చేసేవారు. ఇటువంటి ఏర్పాట్లు మాస్టర్ ఈశ్వర్ సహాయ్‌గారి కుటుంబ విషయంలో కూడా పట్టించుకునేవారు. దక్షణాది నుంచి తిరిగివచ్చిన తర్వాత వారి పర్యటన, మద్రాసు, ధనుష్కోటి లేదా సాదమ్ ఏదైతే అది చెప్పేవారు. ఒకసారి బాబూజీ చెప్పారు: “నేను అలాగే మాస్టర్ సాహెబ్ (ఈశ్వర్ సహాయ్) ఇద్దరం బాగా ఎత్తుగా ఉంటాము. రైల్వేస్టేషన్ నుంచి ఏదైనా చౌకగా ఉండే హోటల్‌కోసం, చౌకగా ఉంటుంది కనుక ఒక గుర్రపు బండిని కుదుర్చుకొని వెళ్ళేవాళ్ళం. ఆ బండి వేగంగా ప్రయాణించేటప్పుడు, నా తలగాని, మాస్టర్ సాహెబ్ తలగాని ఆ బండి గూడుకు తగిలేది. అప్పుడు మా తలలు పట్టుకొని, తేలికగా రుద్దుకుంటూ, ఒకరినొకరు చూసుకుంటూ నవ్వుకునేవాళ్ళం. కొన్నిసార్లయితే డబ్బు ఆదా చేయటానికని మేము నడిచివెళ్ళాం.”

వారు ఢిల్లీ నుంచి దక్షిణ భారతదేశానికి మొదటిసారిగా స్లీపర్ కంపార్ట్‌మెంట్‌లో రిజర్వేషన్ పొంది ప్రయాణించినప్పుడు, పిల్లవాడు తాను కోరుకున్నది దొరికినప్పుడు సంతోషపడినట్లుగా, సంతోషపడ్డారు. ‘వారి’ ముఖం అమాయకంగా సంతోషంతో వెలిగి పోయింది. స్టేషన్‌లో రైలుపెట్టెలోకి ఎక్కి మళ్ళీ దిగివచ్చి, “మాస్టర్ సాహెబ్! నేను సీటు అంతా ఆక్రమించుకొని, ఒక్కడినే పండు కోవచ్చునా? మాస్టర్ సాహెబ్! నీకు ఎప్పుడు నిద్రవస్తే అప్పుడు నిద్రించు, నాకైతే మేల్కొని ఉండటమే అలవాటు” అన్నారు.

ooo

బాబూజీ చెప్పారు: “గుండె మానవ శరీరానికి ఒక మూలశక్తి (Nucleus) వంటిది. అది పనిచేస్తూ, రక్తాన్ని ప్రవహింపజేస్తుంది. మనం ధ్యానంలో ఉన్నప్పుడుగాని, దైవచింతనలో ఉన్నప్పుడుగాని, అది గుండెను ప్రభావితం చేస్తుంది. కనుక గుండె స్థితిని మెరుగు పర్చటానికి, నీ పని గడుపుకోవటానికి నిర్మలీకరణ అవసరంగా ఉంటుంది. రక్తం శరీరంలో ప్రవహిస్తుంది కనుక, అది పరిశుద్ధతను కల్పిస్తుంది. (మనల్ని వారు దివ్య కుటుంబంలో చేర్చటానికి, చేపట్టిన అనంతమైన త్యాగాలను మనం మరవకూడదు. ఆ మూల్యం చెల్లించటానికి మనం చేయవలసింది కనీసం వారు చెప్పిన వాటిని అనుసరించటమే.)

ooo

ఒకసారి బసంత్ పంచమి ఉత్సవాల సందర్భంలో రాత్రి 11 గంటల సమయంలో బాబూజీ ఎంతకీ ఇంటిలోపలకి రాకపోయేసరికి, వారు ఏమి చేస్తున్నారోనని సిస్టర్ కస్తూరిగారు బయటకు వెళ్ళి చూసారు. ‘వారు’ వాడి పడేసిన మట్టి ముంతలను, ప్లేట్లను ప్రోగుచేసి వాటిని పారవేయటం చూసారు. వెంటనే సిస్టర్ కస్తూరిగారు ఇంటిలోపలికి వెళ్ళి, వాళ్ళ తల్లిగారికి ఈ విషయం చెప్పారు. వారు బయటకు వచ్చి బాబూజీతో, “బాబూజీ! మీరు ఇటువంటి పనులను ఎందుకు చేస్తారు? వీటిని స్వీపర్ చేస్తారు కదా!” అని అన్నారు. దానికి వారు నవ్వుతూ, “అమ్మా! లాలాజీ సాహెబ్ నన్ను ఒక స్వీపర్‌గానే తయారుచేసారు కదా!” అని అన్నారు.

ooo

ఒక అభ్యాసీ సోదరుడు బాబూజీకి ఇలా ఒక ప్రశ్నను సంధించాడు– “మీరు మమ్మల్ని ఆధ్యాత్మిక మార్గంలో లక్ష్యం వద్దకు తీసుకుని వెళ్ళటానికి ఎంతో శ్రమ తీసుకుంటున్నారు కదా! అటువంటప్పుడు మమ్మల్ని ఒక్కసారిగా అక్కడకు ఎందుకు తీసుకుని వెళ్ళకూడదు?” అని. ఈ కోరికైతే చాలా సామన్యమైనదే కాని వారి జవాబు మాత్రం అనన్య సామాన్యం. బాబూజీ అప్పుడు చెప్పారు: “అవును; నీవు చెప్పింది నిజమే. దానివలన నా శ్రమ తగ్గుతుంది, అలాగే మీ సమయం కూడా. ఇక్కడ రెండు విషయాలు పరిశీలించాల్సి ఉంది. మొదటిది, అంతిమసత్యం యొక్క స్థితిని కనుక ఒక్క ఉదుటన కల్పించినట్లయితే, ఆ అంతిమసత్య స్థితి ఒక ఉప్పదనంలేని ఉప్పు అనగా రాయిలాగా ఉంటుంది. దాని ఫలితంగా జనం అది రుచించక, దాని జోలికి పోరు. ఇక రెండవది, అటువంటప్పుడు నా శక్తి ధాటిని తట్టుకోవటానికి మరియు జీర్ణించు కోవటానికి ఎవ్వరికీ సాధ్యపడకపోవచ్చు. ఎందుకంటే, లాలాజీ సాహెబ్ నన్ను ఎలా తయారు చేసారో నాకే తెలియదు. ఏ భౌతిక శరీరం కూడా ఈ స్థితి యొక్క శక్తిని తాళలేకపోవటం ఖాయం కాగా, ఆ శరీరం తప్పనిసరిగా జీవితం కోల్పోవటం కూడా ఖాయం.” (మనంతట మనం ఆధ్యాత్మిక స్థితులలో అత్యున్నతమైన దానిని పొందాము అని భావించుకోవచ్చునేమో కాని, వాస్తవంగా ఏమంటే, వారి శక్తిని, పని సామర్థ్యాన్ని పోల్చినట్లయితే, ఏ ఒక్కరు కూడా వారి దివ్య పాద ధూళికి కూడా సరితూగరు.)

ooo

ప్రాపంచిక జీవనంలో బాబూజీ ఎన్నడూ కఠినంగా వ్యవహరించకపోగా చాలా సౌమ్యంగాను, సహజంగాను వర్తిల్లేవారు. ఒకసారి వారు పిల్లలు నిర్వహించే బొమ్మల పెళ్ళికి హాజరయ్యారు. వారి తల్లిగారు ‘వారి’ని బొమ్మల నుదుట తిలకం దిద్దమని ఆదేశించారు. వారు ఆ పనిచేసి అభ్యాసులతో కలిసి కూర్చున్నారు. ఇది చూసిన ఒక అభ్యాసీ సోదరుడు –“బాబూజీ! మీరు కూడా ఇటువంటి ఇబ్బందులకు గురి అవుతారన్న మాట. మేమైతే ఎప్పుడైనా ఆలయాలకు తప్పనిసరిగా స్నేహితులతోనో, కుటుంబ సభ్యులతోనో వెళ్ళవలసి వస్తే గత్యంతరంలేక, మీరు ఆ విగ్రహాలలోనే ఉన్నట్లుగా భావించుకుని, పూజ చేస్తాము” అని అన్నాడు. దానికి బాబూజీ స్పందించి వెంటనే, “దయచేసి నన్ను విగ్రహంలో బంధించవద్దు. నా లాలాజీ సాహెబ్ నన్ను స్వేచ్ఛగా ఉండటానికి తీసుకువచ్చారు కనుక నన్ను స్వేచ్ఛగానే ఉండనివ్వండి. ఇంకొక విషయం ఏమిటంటే, మా పిల్లలకోసమని నేను అటువంటి పనినే చేయాల్సి వచ్చినప్పుడు నేనేమి చేశానో నా కళ్ళకు తెలియదు, ఎందుకంటే నా దృష్టి అంతా నా గురువర్యునిలో లీనమై ఉంది” అన్నారు.

ooo

కర్తవ్యం అని దేనిని అంటారో బాబూజీ ఇలా చెప్పారు : మన కుటుంబ పోషణ, మంచి పనులు చేయటం, ధర్మం ఆచరించటం – ఇటువంటివన్నీ కర్తవ్యాలే. అయితే మిగిలినవాటి కంటె దేనికైనా ప్రథమ ప్రాధాన్యత నివ్వాల్సివస్తే, విచక్షణ చేయాల్సి ఉంటుంది. ఉదాహరణకు, చేయూత నందించటం ప్రతి ఒక్కరి కర్తవ్యమే. ఒకవేళ నీ ఆదాయం కనుక స్వల్పమైనదిగా ఉండి, నీ కుటుంబ పోషణను దృష్టిలో పెట్టుకొని అది ఎప్పటికీ సాధ్యపడక పోయినట్లయితే, ఆ విధంగా ధర్మం చేయటం కర్తవ్యంగా భావించ బడదు. దానికి బదులుగా అది మూర్ఖత్వమవుతుంది.

ఒక కుటుంబీకునిగా, నీ కుటుంబాన్ని ఆదుకోవటం, వారి బాగోగులు చూడటం నీ ప్రథమ కర్తవ్యంగా ఉంటుంది. ఇంక మరేదైనాగాని దాని తర్వాత దశకే వస్తాయి. ఎందుకంటే, నీవు కుటుంబ జీవితంలో అడుగుపెట్టినప్పుడు, నీవు కొన్ని బాధ్యతలు నిర్వర్తించటానికి ప్రతినబూనావు. నీవు ఆచరించిన ధర్మం కనుక దాని నిర్వహణకు ఆటంకం కలిగించినట్లయితే, అది నీ కర్తవ్యం కాదు. ఒకవేళ అటువంటి ధర్మ కార్యక్రమానికి తమ ఇబ్బందులను భరించటానికి సిద్ధపడి కుటుంబం ఆనందంగా తోడ్పడినట్లయితే అది వేరొక రకంగా ఉంటుంది.

ఈ విధంగా కర్తవ్యానికి చెందిన భావానికి బాబూజీ అభిప్రాయం స్పష్టంగా ఉండటమేగాక అది సాంప్రదాయానికి విరుద్ధమని అనిపించవచ్చు.

ooo

ఒకసారి, ఒక అభ్యాసీ బాబూజీతో తను తేలికదనం అనుభవం చెందటంలేదని చెప్పాడు. బాబూజీ అయితే 'మంచిదే' అన్నారు. అదే సమయంలో మరొక అభ్యాసీ తాను తేలికదనం ఎక్కువగా అనుభవం చెందుతున్నానని చెప్పినప్పుడు కూడా, బాబూజీ 'మంచిదే' అన్నారు. ఆ సమయంలో విస్మయానికి లోనైన ఒక అభ్యాసీ బాబూజీతో "బాబూజీ! ఈ రెండూ మంచివే ఎలా అవుతాయి?" అని ప్రశ్నించాడు. దానికి సమాధానంగా బాబూజీ, "ఒక గాడిద ఉందనుకోండి. దాని వెన్నుమీద ఎంత బరువు వేసినా అది మోసుకెళ్తుంది. అలా బరువు మోయటం దానికి ఇష్టం. ఎప్పుడైతే ఆ బరువు దించబడుతుందో అప్పుడు అది తనకు అసౌకర్యం కలిగినట్లుగా బాధపడుతుంది. దీని అర్థం ఏమిటంటే, దాని వీపుమీద బరువు మోయటమే దానికి ఇష్టంగా ఉంటుంది. అదే విధంగా మన దృష్టిని తేలికదనం మీదనే నిలిపినట్లయితే, తేలికదనమే అక్కడ ఉన్నట్లు అనిపిస్తుంది. అందుచేత ఆత్మ సాక్షాత్కారం కోసం మన సాధన కొనసాగినట్లయితే మనకు ఆత్మ సాక్షాత్కారమే దక్కుతుంది."

ooo

ఒకసారి బాబూజీ సిస్టర్ కస్తూరీగారిని "నీవు ఏమి పొందావు?" అని ప్రశ్నించారు. సిస్టర్ కస్తూరీగారు దానికి బదులుగా– "నేను ఏమీ పొందలేదు, కాని నా 'అహం' (Self) ను కోల్పోయాను" అన్నారు. ఈ అహంను బాబూజీ మహరాజ్ పవిత్ర పాదాలకు సమర్పించాల్సి ఉంటుంది. మనం వారి పాదపద్మాలవద్దనే విశ్రాంతి పొందాలి. ఎవ్వరైనాగాని 'వారి'ని జ్ఞాపకం ఉంచుకోవాలి, సాధన చేయాలి, దివ్యానుభూతుల కొరకు తపించాలి. మన ఆత్మను పవిత్ర స్థితిలో ఉంచుకోవటానికి, మన ఇంటి పనుల్లోను, మాటల్లోను, ప్రవర్తనలోను, ఇతరులపట్ల సంబంధ బాంధవ్యాలలోను, మృదుసంభాషణను, పవిత్ర భావాలను అలవర్చుకోవాలి. ఇతరులను విమర్శించటం, వారిని అల్పంగా భావించటం తగదు. ఆధ్యాత్మిక ప్రగతికోసం మంచి సత్ప్రవర్తన అవసరం. బాబూజీ ఎప్పుడూ ఎవరిపట్లనూ కోపం ప్రదర్శించేవారు కాదు. 'వారు' పిల్లలను లాలించేవారు కాని వారిని ఎప్పుడూ కోపగించేవారు కాదు. వారి హృదయం చాలా సున్నితంగా ఉండేది. వారికి ఎప్పుడు ఏది అవసరమో తెలుసు. అతిచిన్న విషయాలలో కూడా 'వారు' శ్రద్ధ వహించేవారు. 'వారు' అభ్యాసులతో కాలం గడిపేటప్పుడు కూడా వంటింట్లో ఏమి అవసరమవుతాయోనని శ్రద్ధ వహించేవారు.

మనం కనుక వారికి అంకితమైపోతే అన్నీ వాటంతట అవే సమకూరతాయి. మన ప్రవర్తనను అందుకు అనుకూలంగా మార్చుకోవాలి. వారి 'దశ నియమా'లను మనం అనుసరించాలి. మనం ఎల్లప్పుడూ దైవం యొక్క నిరంతర స్మరణలో ఉండాలి. మర్యాదపూర్వకమైన ప్రవర్తన కలిగి ఉండి సాధన చేయాలి. అప్పుడు 'పది నియమాలు' తలవని తలంపుగానే మనలో అనుసరించబడతాయి. భగవంతుని స్మరించుకోవటానికి రేయింబవళ్ళుగాని, సూర్యోదయం, సూర్యాస్తమానాలుగాని పాటించబడవు.

ooo

బాబూజీ ఒకసారి, తను లాలాజీ శ్వాసక్రియతో జీవిస్తున్నాను అని చెప్పారు. బాబూజీ భౌతికంగా జీవనం చేస్తున్నప్పటికీ ఆ ధ్యాస వారికి ఉండదు; ఎందుకంటే వారు పూజ్య లాలాజీ మహరాజ్‌లో లయమై ఉన్నందువల్లనే. ఆ విధంగా ఎవ్వరైనా లయ-అవస్థలో ఉన్నప్పుడు, అతనికి శ్వాసక్రియ జరుగుతున్నదా లేదా అను జ్ఞానం ఉండదు. దీనినే "జీవన్ముక్తి" అంటారు. పేరుకు మాత్రమే దేహం ఉంటుంది. అభ్యాసీ కనుక అంతిమంలో లయమై ఉంటే, అతని శరీరం భూమిమీద నడయాడుతున్నప్పటికి అతనికి దాని స్పృహ ఉండదు. దీనిని బాబూజీ మనకు "జీవన్మృతుడు"గా ఉండటం అని చెప్పారు. అటువంటివారు తమ జీవనం యొక్క స్పృహ కలిగి ఉండరు. శరీరం మాత్రం యాంత్రికంగా పనిచేస్తుంది.

ooo

ఒక అభ్యాసీ బాబూజీతో ఒక ఫిర్యాదు చేశాడు. అది -"మీరు సిట్టింగ్ ఇస్తున్నప్పుడు నేను కూడా ధ్యానంలో కూర్చున్నాను. ఇద్దరు అభ్యాసులు మీ వెనుక కూర్చుని ఉండి, నన్ను గురించి -ఇతడు అనర్హుడైనప్పటికీ ధ్యానంలో పాలుపంచుకుంటున్నాడు అని చర్చించు కుంటున్నారు" అని. అప్పుడు బాబూజీ అతడ్ని ఇలా ప్రశ్నించారు: "నీవు ధ్యానంలో ఉండగా వారు చర్చించుకుంటున్నది నీకు ఎలా వినిపించింది? నీ దృష్టి హృదయంమీద కేంద్రీకరించబడాలి కదా! మరి వారివైపు ఎందుకు మళ్ళింది?"- అని. సాధన ప్రారంభంలో ఎవ్వరికైనాగాని దివ్య ప్రకాశంమీద దృష్టి నిలపటం కష్టమని అనిపించవచ్చు. అయితే ధ్యానం మీద అభిలాష పెరుగుతున్నకొద్దీ, ఈ చాంచల్యం తొలగిపోతుంది.

ooo

ఒకసారి బాబూజీ మహరాజ్ కొన్నిరోజులు అస్వస్థులుగా ఉన్నప్పుడు, వారికి సపర్యలు చేస్తున్నవారు, అభ్యాసులు వారిని సందర్శించవద్దని, అక్కడ ధ్యానం చేయవద్దని అభ్యంతరం పెట్టేవారు. బాబూజీ వారిని తిరస్కరించి, అలా ప్రవర్తించవద్దని హెచ్చరించారు. అస్వస్థత భౌతిక శరీరానికి చెందినది కాని హృదయానికి కాదు. లోపల ఉన్న దివ్యశక్తి పనిచేస్తూనే ఉంటుంది. దాని ప్రభావం నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది. అంతేగాక ఆంతరికం అనేది భౌతిక శరీరంతో నియంత్రించబడదు. అదే విధంగా, స్వస్థతగా లేకపోయినప్పటికీ మనం దివ్య ప్రాణాహుతిని పరిగ్రహిస్తాము.

ooo

సిస్టర్ కస్తూరీగారు తమ జ్ఞాపకాలనుంచి ఈ సంఘటలను స్మరించుకున్నారు– "ఒకసారి నా సోదరి జబ్బుపడినప్పుడు నేను బాబూజీకి ఉత్తరం వ్రాశాను. అప్పుడు వారు తమ కృపను వర్షింప జేశారు. ఆమెకు హృదయానికి సంబంధించిన వ్యాధి ఉందని మాకు తెలియనే తెలియదు. బాబూజీ ప్రాణాహుతి నిచ్చారు. అచేతనంగానే ఆమె తన చేతిని హృదయంమీద నిలుపుకున్నది. బాబూజీ ఇచ్చిన దివ్య ప్రాణాహుతితో ఆ ప్రాంతంలోని వ్యాధి నయమైపోయి ఆమె ఆరోగ్యవంతురాలైంది. ఆమె శారీరికంగా బలహీనంగా ఉండటం మూలంగా ఆ దివ్యశక్తిని భరించటానికి ఇబ్బంది పడింది. కనుక బాబూజీ సంకల్పాన్ని అనుసరించి, రక్షణ కొరకు ఆమె తన చేతిని ఛాతీపై నిలుపుకుంది."

ooo

ఒకసారి అభ్యాసీ ఒకరు, తనకు ఎందుకు వ్యక్తిగత సిట్టింగ్ ఇవ్వలేదు అని బాబూజీని అడిగినప్పుడు, బాబూజీ ఈ విధంగా సమాధానం ఇచ్చారు: "అసలు మన సాధన యొక్క సారాంశమే వ్యక్తిత్వాన్ని రూపుమాపటానికి ఉద్దేశించబడింది. ఇంకా నీవు వ్యక్తిగత సిట్టింగ్ కోసం ఎందుకు పట్టుబడుతున్నావు?"

ooo

ఎవ్వరైనా ఒంటరిగా ఇంటివద్దనే కూర్చున్నా, లేదా సత్సంగ్‌లో కాని, ప్రిసెప్టర్ వద్దగాని కూర్చున్నప్పటికి అది అభ్యాసీ యొక్క స్థితిమీద, అతని గ్రహణశక్తిమీద ఆధారపడి ఉంటుంది. దివ్య ప్రాణాహుతి బాబూజీ నుంచియే ఇవ్వబడుతుంది. ఒకవేళ ఎవ్వరైనా సత్సంగ్‌లకు హాజరు కాలేకపోయినట్లయితే, అపుడు ఆ సత్సంగ్ నిర్వహించే ప్రిసెప్టర్‌కు తెలియజేసి, అదే సమయంలో ఇంటివద్దనైనా కూర్చోవచ్చు. అప్పుడు ఆ సత్సంగ్ సత్ఫలితాన్ని అతడు కూడా ఆస్వాదిస్తాడు.

ooo

బాబూజీ చెప్పారు: "దివ్యత్వం కొరకైన మార్గంలో, ఎవ్వరైనా ఇతర విధానాలలో సాధనచేసి ఉన్నవారైతే, వారు సహజమార్గం అత్యుత్తమమైందని భావించి దీనిలో ప్రవేశించినప్పుడు, వారిని పాత విధానాలు విడిచిపెట్టమని వత్తిడి చేయకూడదు. ఎవ్వరైనాగాని ఎప్పుడైతే 'సహజమార్గం' సార్థకమైనదిగాను, ప్రభావితం చేయగలదిగాను విశ్వసించి, దీనిని అనుసరించటానికి నిర్ణయం తీసుకున్నప్పుడు, ఇతర గతవిధానాలను విడనాడటానికి భయపడనవసరం లేదు. దివ్య ప్రకాశం ఆంతరికంగా ఉన్నది కనుక, మీరు లోపలనే ఆరాధించండి. బాహ్యమైన ఆరాధనలు ఇంక అనవసరం."

ooo

ఒకసారి సోదరుడు రాయ్‌జాదా బాబూజీతో, "మీరు ఈ సమయానికి మాత్రమే సద్గురువు" అన్నారు. దానికి బదులుగా బాబూజీ, సోదరుడు రాయ్‌జాదాను ఇలా ప్రశ్నించి వివరణ నిచ్చారు: "నీవు సహజమార్గ సాహిత్యాన్ని చదవలేదా? కాలమే సద్గురువు. కాలమే మనకు ఎప్పుడు ఏమి చేయాలో నిర్దేశిస్తుంది. కనుక కాలమే సద్గురువు."

ooo

ఒకసారి అభ్యాసీ అయిన భీమ్‌సేన్‌రావు, వ్యాపారంలో బాగా నష్టపోయి బాబూజీవద్దకు వచ్చాడు. ఆ సంభాషణలో 'మిర్చి' అనే మాట వచ్చింది. తర్వాత భీమ్‌సేన్‌రావు 'మిర్చి' వ్యాపారంచేసి బాగా డబ్బు గడించాడు. అప్పుడు అతను బాబూజీవద్దకు వచ్చి "ఇదంతా తమ కృపయే" అని అన్నాడు. దానికి బాబూజీ స్పందించి –"నేను ఏం చేశాను? అదంతా భగవంతుని కృప" అన్నారు, ఇంక దానిని మీరే అర్థం చేసుకోవచ్చు.

ooo

ఒకసారి సోదరుడు రాయ్‌జాదాతో బాబూజీ –"సహజ మార్గం నిద్రించటానికి కాదు. ఎవ్వరైనా గాని నిద్రిస్తూ కూడా మెళకువగా ఉండాలి, ట్రాన్స్‌మిషన్ పొందటంతోనే సంతోష పడకుండా సావధానంగా ఉండి, కరిగిపోయి, 'అతని'లో లీనమై పోవాలి" అని అన్నారు.

ooo

"అహం ఎక్కడ నుండి వస్తుంది? ఎందుకు వస్తుంది?" వంటి ప్రశ్నలకు బాబూజీ సమాధానం ఇచ్చారు: "సత్యయుగంలో ప్రతి ఒక్కరు తమ కర్తవ్యాలు నిర్వర్తిస్తూ తమ హృదయంలో భగవంతుని ఉనికిని గ్రహించేవారు. ఆ విధంగా వారి బాహ్య కార్యాచరణలో ఎటువంటి అవాంతరం, అడ్డంకి ఉండేది కాదు. ఆ తర్వాత, కాలానుగతంగా, మనం పూర్తిగా భౌతిక విషయాలకే పరిమితమైపోయాము. వాస్తవంగా, మనం ఒక భౌతిక పదార్థంలాగా ఘనీభవించిపోయాం. పూర్తిగా ఈ పదార్ధ జీవితంలో గడపటం మూలంగా మనలో అహం చోటుచేసుకుంది. ఆంతరిక ఉనికి యొక్క విధానాన్ని ప్రవేశపెట్టటానికి కారణం ఇదే. ధ్యానంలో ఆంతరిక చైతన్యం ఉంటుంది. దానితో (సెల్ఫ్) అహం, దాని పొరలతోసహా కరిగిపోతుంది."

ooo

ఒకసారి గురువు ఒకరు తన శిష్యుడిని, ఆధ్యాత్మిక శిక్షణ అనగా బ్రహ్మ జ్ఞానం పొందటానికని, రాజా జనకునివద్దకు పంపాడు. ఆ శిష్యుడు రాజువద్దకు వెళ్ళి ఆ బ్రహ్మజ్ఞానం గురించి చర్చించాలని తాను కోరుతున్నట్లుగా వ్యక్తం చేశాడు. దానికి జనకుడు జవాబిస్తూ –"ప్రస్తుతం నేను వేరే పనిలో నిమగ్నమై ఉన్నాను. బ్రహ్మజ్ఞానం గురించి తర్వాత చర్చించుకుందాము. ఈలోగా నీవు మా అంతఃపుర సౌందర్యాన్ని వీక్షించటానికి వెళ్ళి రావచ్చును" అని చెప్పాడు. ఆ శిష్యుడు ఆశ్చర్యపడటంతోపాటు కొంత అవమానకరంగా కూడా భావించాడు. ఈ విధంగా తన పౌరుల విషయంలోనే తలమునకలై ఉన్న ఈ రాజు నుంచి బ్రహ్మజ్ఞానం గురించి తెలుసుకొనవలసింది ఏమి ఉంటుంది? అని అనుకున్నాడు. అయినాకాని తన గురువు ఆదేశాన్ని గౌరవించవలసిన బాధ్యత ఉన్నదనుకొని ఆ అంతఃపురాన్ని సందర్శించటానికి వెళ్ళాడు.

ఆ సందర్భంలో జనకుడు అతనికి ఒక ఆముదపు దీపాన్ని అందజేసి, దానిని అంతఃపురంలో పర్యటించినంతసేపు చేతిలో ఉంచుకొని, దానిని ఆరిపోకుండా కాపాడుకుంటూ తిరిగి రావాలని విన్నవించాడు. ఈ షరతుని పాటిస్తేనే అతనికి బ్రహ్మజ్ఞానం ప్రాప్తమవుతుందని చెప్పాడు. అది ఆ శిష్యునికి వింత ఆదేశంగా తోచినప్పటికీ, దానిని పాటించి విజయవంతంగా తిరిగి వచ్చాడు.

అప్పుడు జనకుడు– "అయ్యా! తమరు ఈ అంతఃపురశోభ నంతటినీ తిలకించి ఆనందించి ఉంటారు. మీరు ఏమి దర్శించారో చెప్పండి" అన్నాడు. ఆ శిష్యుడు కొంతసేపు ఆలోచించాడు, ఈ విషయంలో

ఏమి చెప్పాలో తెలియక సందిగ్ధంలో ఉన్నాడు. రాజు బలవంతంమీద ఇలా చెప్పాడు: "రాజా! మీ సలహా ప్రకారం నేను ఆ దీపం మీదే దృష్టిపెట్టి అంతఃపురమంతా జాగ్రత్తగా చుట్టివచ్చాను. ఆ సందర్భంలో దాని శోభను సందర్శించటంలో అశ్రద్ధ వహించాను. జ్యోతి ఆరకుండా చూసేందుకు శ్రద్ధపెట్టాను. కనుక క్షమించండి" అన్నాడు.

జనక మహారాజు నవ్వుతూ ఇలా చెప్పాడు: "మహాశయా! నేను నా హృదయంలో నా దైవంమీద దృష్టి నిలిపి, నేను రాచ వ్యవహారాలు, ఇతర సమస్యల గురించి ఆలోచిస్తాను. ఇవి ఏమీ కూడా, దైవం మీద నేను నిలిపిన దృష్టిని చెదరగొట్టలేవు. దీనినే నీవు గ్రహించాలి. ఇంక ఇంతే" అన్నాడు. కనుక మన దృష్టి అంతా ఆంతరికంలో ఉన్న దైవంమీదనే ఉండాలి. అపుడు మన నిత్యజీవన కార్యక్రమంలో ఎలాంటి ఆటంకం లేకుండా తలవని తలంపుగా జరిగిపోతాయి.

ooo

స్వాతంత్ర్య సంగ్రామంలో పోరాడిన ఝాన్సీ లక్ష్మీబాయి ముక్తి పొందింది అని బాబూజీ చెప్పినప్పుడు ఒక అభ్యాసీ, ఆమెతో కలిసి పోరాటం సలిపిన మిగిలినవారి సంగతి ఏమిటి? అని అడిగాడు. బాబూజీ అప్పుడు ఝాన్సీ లక్ష్మీబాయిని గురించి ఇలా చెప్పారు: "ఝాన్సీరాణి శ్రీకృష్ణ పరమాత్ముని స్మరణలో తన పని నిర్వర్తించింది. ఆ యుద్ధ సమయంలో ఆమె వారం రోజులపాటు ఏమీ తినటంగాని, త్రాగటంగాని చేయకుండానే పోరాటం సల్పింది. ఆమె దాసీలు ప్రశ్నించినప్పుడు– 'నేను శ్రీకృష్ణ పరమాత్ముని కృపతో తనివితీర తృప్తిచెంది ఉండగా ఇంక నాకు ఎలాంటి ఆహారం అవసరంలేదు' అని ఝాన్సీరాణి సమాధాన మిచ్చింది."

ooo

సిస్టర్ కస్తూరీగారు షాజహాన్‌పూర్ నుంచి తిరిగివెళ్ళిన తర్వాత బాబూజీ మహరాజ్‌కు– "ఈసారి నాకు మిమ్మల్ని చూసినట్లుగా అనిపించలేదు" అని వ్రాశారు. దానికి సమాధాన మిస్తూ బాబూజీ, "క్రితంసారి నీవు వచ్చావు కాని నన్ను చూడకుండా వెళ్ళిపోయావు. ఈసారి మాత్రం వాస్తవంగా నీవు నన్ను చూశావు" అని వ్రాశారు. దాని అర్థం ఏమిటి? ఇప్పటివరకు చూసినది కేవలం బాహ్య రూపాన్నే. ఇప్పుడు చూసింది 'వారి' ఆంతరిక సత్యరూపాన్ని.

ooo

ఒక అజ్ఞానికి తెలిసింది ఒకే ఒక మార్గం –అది దైవానికి దారితీసే మార్గం. అదే ఒక వివేకి (జ్ఞాని) విషయంలోనైతే, అతడు ఎన్ని మార్గాలు ఆలోచించగలిగితే అన్ని మార్గాలు కనిపిస్తాయి. ఒక బరువుమోపిన గాడిద, సూటిగా, వెనుక నుంచి ఎవ్వరూ దానికి దారిని నడపటానికి ప్రయత్నించనప్పటికీ, అది గమ్యానికి చేరుతుంది. అలాగాక తెలివిగలవి ఏవైనా అయితే ఎన్నో మార్గాలు అన్వేషించటం జరుగుతుంది.

ooo

భూమాను లాలాజీ మహరాజ్ ప్రార్థించటం మూలంగా బాబూజీ ఈ పృథ్వీమీద పాదం మోపారు. భూమా శక్తి అపరిమిత మైనది. బాబూజీ శరీరం దానిని భరించలేదు కనుక, బాబూజీ శరీర సంరక్షణార్థం, లాలాజీ బాబూజీ మహరాజ్‌లో అంతర్లీనమై పోయారు. లాలాజీ మహరాజ్, బాబూజీకి తమ శక్తు లన్నింటినీ ధారపోసినప్పటికీ, లాలాజీ అనుమతి లేకుండా బాబూజీ ఎన్నడూ ఆ శక్తులను ఉపయోగించలేదు. బాబూజీ ఒక క్షణమైనా కూడా లాలాజీని మరచి ఉండలేదు. తన గురువర్యునిపట్ల బాబూజీకి ఉన్న భక్తి, గౌరవం అటువంటివి. బాబూజీచేత పునరుద్ఘాటించబడిన విషయం ఇది: **"నన్ను జ్ఞాపకం ఉంచుకో. నేను అక్కడ ఉంటాను. ఆ స్మరణ / జ్ఞాపకం హృదయానికి చెందినదై ఉండాలి."**

ооо

"ఎవ్వరైనాగాని మీకు సంతృప్తి కలిగించటానికి ఎంతగా ప్రేమించాలి?" అని ఒక అభ్యాసీ బాబూజీని అడిగాడు. బాబూజీ దానికి సమాధానంగా, "నీవు నిన్ను ప్రేమించుకున్న దానికంటే ఎక్కువగా" అని చెప్పారు. 'నేను' అనే దానిని బాబూజీకి అనుసంధానం చేయాలి. "నిన్ను నీవు మర్చిపోతున్నావు అంటే నీవు నన్ను స్మరిస్తున్నావు అన్నమాట." జ్ఞాపకం చేసుకోవటం అను దానికి ప్రత్యామ్నాయంగా అర్థం ఏమిటంటే, మరచిపోవటం; అంటే నిన్ను నీవు మరచిపోయి, నిన్ను బాబూజీకి అనుసంధానం కల్పించు కోవటం.

ооо

మోడరేషన్ అనగా సమభావం, బ్యాలెన్స్‌డ్ స్టేట్ అనగా సమస్థితి. ఇవి ప్రయత్నపూర్వకంగానో లేక కృత్రిమంగానో సాధించ బడేవి కావు. సాధన ద్వారా మాత్రమే సంభవం. ఎవ్వరైనాగాని, ఇతరులను నిరసించరాదు. ప్రతి ఒక్కరినీ తనలాగే భావించాలి. అవసరమైన సందర్భంలో కోపానికి గురికావచ్చు కాని, మళ్ళీ యథా స్థితికి రావాలి. మాట కటువుగా ఉన్నప్పటికీ, హృదయం మాత్రం సౌమ్యంగా, సునిశితంగా ఉండాలి. షాజహాన్‌పూర్‌లో ఒకసారి బాబూజీ ఒకామెతో (పనికత్తె) బిగ్గరగా మాట్లాడారు. అప్పుడు అక్కడే ఉన్న డాక్టర్ వరదాచారిగారు– "బాబూజీ! మీకు కూడా కోపం వస్తోంది కదా!" అన్నారు. దానికి సమాధానంగా బాబూజీ, "నేను ఆమెతో అలాగే మాట్లాడతాను, అంతేకాని కోపం చెందటం కాదు. అలా జరిగినా కూడా నా ఆంతరిక స్థితిలో ఎటువంటి మార్పూ ఉండదు" అన్నారు.

ооо

**"అనుభూతియే భగవంతుని భాష"** అని బాబూజీ చెప్పారు. ఎవరో ఒకరు బాబూజీని "మీకు ఏ సెంటర్ బాగా నచ్చుతుంది?" అని అడిగినప్పుడు, "నేను వారిపై నా దృష్టి మరల్చకముందే, ఎవ్వరైతే నా దృష్టిని తమవైపు మరల్చుకుంటారో అటువంటి సెంటర్‌ను నేను అభిమానిస్తాను" అని బాబూజీ చెప్పారు. ఎవ్వరైతే బాబూజీపట్ల ప్రేమ, భక్తి కలిగి ఉంటారో వారు మాత్రమే వారిని పొందగల్గుతారు. "ఎవ్వరైతే నావద్దకు వచ్చి తిరిగి వెళ్తారో అటువంటివారు మళ్ళీ రావాలని తపన కలిగి ఉంటారు. నేను అటువంటి అభ్యాసులకొరకే ఎదురుచూస్తూ ఉంటాను." బాబూజీ యొక్క ప్రదేశం నుండి తిరిగివచ్చే అభ్యాసులు,

బాబూజీ నివాసం తమదేనని, అక్కడకు తిరిగి చేరాలనే ఆపేక్షతో ఉండాలి. అక్కడ ఉండటానికి, తినటానికి వసతులు ఉంటాయా లేదా అని ఆలోచించటం తగదు.

ం౦౦

ఒకసారి అభ్యాసీ ఒకరు బాబూజీ మహరాజ్‌ను "మానవ జీవితంలో అత్యంత కష్టమైన విషయం ఏమిటి?" అని అడిగాడు. దానికి సమాధానంగా బాబూజీ, "అతికష్టమైన విషయం ఏమిటంటే, మనకు సంబంధంలేని ప్రదేశంలో ఉండటమే" అన్నారు బాబూజీ. "దీని అర్థం ఏమిటంటే, మన అసలైన ఇంటిని వదిలిపెట్టి, ఏన్నో జన్మలు దాల్చి, ఇంద్రియాల వలలో చిక్కుకుని, ఈ విధమైన జీవనం కలిగి ఉండటమే చాలా కష్టమైనది" అని అన్నారు.

ం౦౦

మరొక సందర్భంలో ఒక అభ్యాసీ బాబూజీని ఈ విధంగా అడిగాడు: "జీవితంలో ముఖ్యమైనది ఏమిటి?" అని. దానికి బాబూజీ మహరాజ్ సమాధానంగా, "జీవితం ముఖ్యం కాదు, కాని నీవు ముఖ్యం" అని అన్నారు. వారి ఉద్దేశ్యం ఏమిటంటే, "జీవితంలో అతడిని (దైవాన్ని) తెలుసుకోవటంగా (అనగా నిన్ను నీవు మర్చి పోవటంగా) ఉండాలి" అని.

ం౦౦

ఈశ్వర్ సహాయ్‌జీ బాబూజీని "బాబూజీ! నా స్థితి ఏమిటి" అని అడిగారు. దానికి బాబూజీ మహరాజ్ ఏమి బదులిచ్చారంటే, "నీవు ఒక అసంపూర్ణ అభ్యాసీవే (Semi-abhyasi). నీవు పరిపూర్ణ అభ్యాసీవి (Complete abhyasi) కావాలని నేను కోరు కుంటున్నాను" అని. (Semi-abhyasi) అసంపూర్ణ అభ్యాసీ అంటే, ఎవ్వరైతే ధ్యాన సమయంలో సంతోషం, ఆనందానుభూతిని పొందుతూ ఉంటారో వారు. పరిపూర్ణ అభ్యాసీ లయితే, ఆనందాన్ని గురించి కూడా లెక్కచేయకుండా, లోతుగా ధ్యానం మరియు పురోగమనంలోకి దూసుకువెళ్ళుతూ ఉంటారు.

ం౦౦

బాబూజీ మహరాజ్ ఒకసారి, ఒక అభ్యాసీ సోదరి, తరుచుగా షాజహాన్‌పూర్ ఆశ్రమానికి వచ్చిపోతూ ఉండే ఆమె, విచారంగా ఉన్నట్లు గుర్తించారు. ఇతర అభ్యాసులు కూడా దానిని గుర్తించారు కాని, బాబూజీపట్ల ఆమెకుగల ప్రేమతో, విచారంగా ఉండి ఉంటుందని భావించారు. ఆమె విచారానికి కారణం ఏమిటి అని బాబూజీ అడిగారు. దానికి ఆమె, బాబూజీపట్ల తనకుగల అత్యంత ప్రేమయే కారణం అని చెప్పింది. అప్పుడు బాబూజీ, "అభ్యాసీ అనువారు ఆంతరికంగా దివ్య మాస్టర్‌తో సత్సంగం కలిగి ఉండాలిగాని బాహ్యంగా కాదు. ఆంతరికంగా దైవం కోసం తపన ఉండాలి" అని అన్నారు. కనుక మన ఆంతరికం, దైవంతో కలయిక కోసం తపన చెందాలి. బాబూజీ, దివ్యపురుషుడు (డివైన్ పర్సనాలిటీ) అను పదానికి బదులుగా దైవం / దివ్యత్వం అను పరిభాషయే ప్రయోగించేవారు. కనుక మనం, ఆంతరికంగా ఉన్న ఆ దివ్యత్వాన్ని ప్రేమించి, ఎప్పుడూ దానినే స్మరించుకోవాలి.

ం౦౦

ఒకసారి బాబూజీ మహరాజ్‌ను ఒక అభ్యాసీ, "భగవంతుడు మన లోపలనే ఉన్నాడు కాని బయట లేడా?" అని అడిగాడు. దానికి సమాధానంగా బాబూజీ, "మనం కనుక మన మనస్సు విప్పి చూసినట్లయితే మనం వాని ఉనికిని సర్వత్రా చూడగలం. 'అతడు' (దైవం) ఎల్లప్పుడూ మనతోనే ఉన్నాడు అని భావించి నట్లయితే 'అతడి'ని మనం సర్వత్రా చూడగలం" అని చెప్పారు.

ooo

తిరుపతి ఆలయ నిర్మాణం ఈ విధంగా జరిగింది: ఒక ఋషి అక్కడ ధ్యానం చేసుకుంటూ ఉండేవాడు. అతని తపస్సు ఫలితంగా అక్కడికి వెళ్ళినవారు అందరికీ శాంతి, ప్రశాంతత అనుభవమయ్యాయి. వారి మనస్సులో ఉన్న కోర్కెలు కూడా ఫలించ సాగాయి. క్రమంగా ప్రజల మనస్సుల్లో అక్కడ ఒక గుడి కట్టాలి అనే తలంపు కలిగింది. ఆ దేవాలయ నిర్మాణం ఎంత పెద్దదిగా జరిగింది అంటే అక్కడ ఉన్న శక్తి అంతా తరిగిపోయి ఆలయ కట్టడాలు మాత్రమే మిగిలాయి. ఈ సందర్భంలో బాబూజీ మహరాజ్ ఈ విధంగా పునరుద్ఘాటించారు: "నేను ప్రతిఅభ్యాసీ యొక్క ఇంటిని ఆశ్రమంగా ఉండాలని భావిస్తాను. ఆ కారణంగానే నేను వేరొక ఆశ్రమాన్ని నిర్మించ తలపెట్టటం లేదు. ఎప్పుడైతే ప్రతిగృహమూ ఒక ఆశ్రమం అవుతుందో అప్పుడు, అక్కడ శాంతి, మహదానందం వర్ధిల్లుతాయి."

ఒక ఋషి ఒక స్థానంలో ధ్యానం చేస్తున్నాడు అనుకుందాం. అతడు మన హృదయాలను ఆకర్షించి ఆక్రమిస్తాడు. మనం అతని వైపు దృష్టి నిలుపుతాం. మనం కూడా ధ్యానంచేయ నారంభిస్తాం. అతడే మనకు ఆరాధ్యుడిగా, ఆధారభూతుడుగా తలపించే రోజు వస్తుంది. అప్పుడు ప్రతి ఇల్లూ తప్పనిసరిగా అతని ఆశ్రమం అవుతుంది.

ooo

బాబూజీ మహరాజ్ చాలా స్వచ్ఛంగాను, స్పష్టంగాను చెప్పారు: "ఈ జీవితంలో అసలైన ఆనందం ఎప్పుడు కలుగుతుంది? ఈ ప్రపంచంలోని ప్రతిదానిపట్ల మనం ఆకర్షితులమయ్యాం. ఈ ప్రపంచం, దాని విశేషాలు కూడా మనల్ని ప్రభావితం చేస్తాయి. వీటన్నింటినీ అనగా సుఖదుఃఖాలు అన్నింటినీ పరిత్యజించితే అపుడు మిగిలేది ఆనందం, మహదానందం."

ooo

ఒక అభ్యాసీ బాబూజీతో, "బాబూజీ! మా గ్రామం ఇక్కడకు చాలా దూరంలో ఉంది. ఇక్కడకు మేము తరచుగా రాలేకపోతాము. మళ్ళీ మిమ్మల్ని ఎలా కలుసుకోగలం? మాపట్ల దయ చూపండి" అని కోరాడు. దానికి సమాధానంగా బాబూజీ, "భాయీ! నీవు ఎప్పుడు నన్ను తలచుకుంటే అప్పుడు నేను వస్తాను" అని అన్నారు. దాని అర్థం ఏమిటంటే, ఈ సృష్టిలో 'వారు' అంతటా ఉన్నారు (Omnipresent). కనుక మనం ఎప్పుడైతే 'వారి' వంక దృష్టి సారిస్తామో, అప్పుడు 'వారు' మన వంక చూస్తారు.

ooo

ఒక అభ్యాసీ ఒకసారి, “బాబూజీ! మేము కూడా మీతో పాటుగా ఆ ప్రదేశానికి రావచ్చునా?” అని బాబూజీని అడిగాడు. దానికి బాబూజీ మృదువుగా, “జనం నా వెంట తిరగాలని ఎందుకు అనుకుంటారు? నా కోరిక అయితే, నేను వారి వెంటపడే విధంగా వారు ప్రయత్నం చేయాలి” అని అన్నారు.

ooo

ఒక సందర్భంలో బాబూజీ ఒక అభ్యాసీతో, “ఈ విధంగా ధరలు పెరుగుతున్న దృష్ట్యా జనం నా జీతం కూడా పెంచాలి. నా జీతం ధనం కోరదు; వారు స్వయంగా నన్ను జ్ఞాపకం చేసుకోవటం మాత్రమే” అని అన్నారు.

ooo

ఒక రోజున సత్సంగ్ సందర్భంలో, ఒక అభ్యాసీ బాబూజీని ఈ విధంగా ప్రశ్నించాడు: “నేను నా ఆధ్యాత్మిక యాత్రలో పురోగమిస్తున్నానా లేదా అని ఎలా తెలుసుకోగలుగుతాను, నా అంతట నేను దానిని అంచనా వేసుకొనటానికి విధానాలు ఏమిటి?” అని. అందుకు పూజ్య శ్రీ బాబూజీ మహరాజ్ ఈ విధంగా జవాబిచ్చారు: “నీ వ్యక్తిగత అనుభవానికి సంబంధించి నీవు ఆ విధంగా ప్రశ్నించవచ్చు. ఉదాహరణకు – భౌతిక పరిమాణం (లేదా పెరుగుదల) గురించి ఆలోచించినట్లయితే – నీవు జన్మించినపుడు నీ పరిమాణం ఎంత, తర్వాత నీవు ఇప్పటివరకు ఎంత ఎదిగావు? కనుక నీవు చాలా మార్పు గమనించగలవు. కాని ఆ విషయంలో ఏదైనా గాని, ఏ రోజునైనా గాని లేదా ఏ సందర్భంలోనైనా గాని నీవు ఎలా పెరిగావు అనిగాని, ఎంతగా పెరిగావు అనిగాని అనుభూతి చెందావా? అనగా భౌతిక విషయాలకు, ద్రవ్యాలకు (వస్తువులకు) కొన్ని ప్రమాణాలు ఉంటాయి. నీవు నీ మానసిక ప్రవృత్తినిగాని, స్వభావాన్నిగాని, ఉదాహరణకు చపల చిత్తం, ప్రవర్తన, గుణం, వ్యక్తిత్వం యొక్క నైజం మొదలైన వాటిని పరిశీలించి నట్లయితేను, నీవు సాధన ప్రారంభించక పూర్వం ఎలా ఉన్నావు, ఇప్పుడు ఎలా ఉన్నావు అని పోల్చి చూసుకున్నట్లయితేను, మార్పులు ఎలా గోచరిస్తాయో అలాగే నీవు స్వయంగా అంచనా వేసుకోవచ్చు.

ooo

ఇది ఒక అభ్యాసీ ‘వి’ (పేరు ప్రస్తావించబడలేదు) నాకు వివరించారు. ‘వి’ అను నతడు భారతీయ సైన్యంలో పని చేసేవాడు. అతనిని అస్సాంలో ఒక అడవి దగ్గరలో నియమించారు. ఒకరోజు అతనిని మరియు ఇతర సైనిక సిబ్బందిని, ఒక తీవ్రవాద సమూహం కిడ్నాప్ (అపహరణ) చేసింది. మూడు నెలలు అతని ఆచూకీ గురించి వార్త తెలియలేదు. చాలామంది అతను మరియు ఇతరులు చంప బడ్డారని భావించారు. ‘వి’ యొక్క యవ్వనవతి అయిన అతని భార్య ఒక చిన్న ఇంట్లో ఒంటిరిగా నివసిస్తూ ఉంది. ఆమె తను ఏ మాత్రమూ విశ్వాసాన్ని కోల్పోలేదు. అకాస్మాత్తుగా, ఒకరోజు సైన్యం యొక్క వాహనం ఒకటి (జీప్) ఇంటికి వచ్చి ఆగింది. ఆమెకు ఆనందాశ్చర్యాలు కలుగజేస్తూ ఆమె భర్త, ‘వి’ దాని నుండి దిగి ఇంటిలోనికి వచ్చాడు. ఆమె ఆనందంతో కన్నీరు కార్చింది.

ఆరోజు రాత్రి, నిద్రపోయేముందు ఆమె హాల్‌వద్దకు వచ్చి బయటకు చూసింది. అప్పుడు ఆమె మళ్ళీ ఏడుస్తూ ఉంది. ‘వి’ ఆమెను, “ఎందుకు ఏడుస్తున్నావు? నేను సురక్షితంగా వచ్చాను కదా!” అని

అన్నాడు. అందుకు ఆమె ఇలా జవాబు ఇచ్చింది: "నేను నీ కొరకు ఏడ్వడంలేదు. నీవు మంచి ఆరోగ్యంతో ఉన్నావు. భగవంతునికి అనేక ధన్యవాదాలు" అని. "అలాంటప్పుడు నీవు ఎందుకు ఏడుస్తున్నావు?" అని 'వి' ఆమెను అడిగాడు. అతని భార్య తన కన్నీళ్ళను నియంత్రించుకోలేకపోయింది. అప్పుడు ఆమె ఇలా చెప్పింది: "ఈ మూడు నెలలు, ప్రతిరోజు రాత్రి సమయంలో మన ఇంటి ప్రవేశద్వారంవద్ద ఒక వృద్ధుడు నాకు రక్షణగా ఉండటాన్ని చూశాను. అతను మన ఇంటిని కాపాడుతూ ఉన్నాడు. నేడు అతడు కనపడటంలేదు" అని అన్నది. అప్పుడు 'వి' తన మాస్టర్, బాబూజీ మహరాజ్ యొక్క ఫోటోను తన పర్స్ నుంచి బయటకు తీసి చూపుతూ తన భార్యతో, "నీవు చూసినది ఈ వ్యక్తియేనా?" అని అడిగాడు. ఆమె సంతోషంతో నిండిన కన్నీరుతో, "అవును, ఈ వ్యక్తియే ప్రతిరోజు రాత్రి ఇంటి ప్రవేశద్వారంవద్ద కూర్చొని మన ఇంటిని సంరక్షిస్తూ ఉండేవాడు. ఇప్పుడు నీవు వచ్చావు కదా, అందువలన ఇప్పుడు అతనిని ఇంటిలోనికి ఆహ్వానిద్దామని నేను అనుకుంటున్నాను. అతని కొరకు చూశాను. కాని అతడు నేడు కనపడటం లేదు" అని బాధతో చెప్పింది. ఇప్పుడు 'వి' కళ్ళు కన్నీరుతో నిండిపోయాయి. అతడు బాబూజీ మహరాజ్‌కు అనంత కృతజ్ఞతలు తెలుపుకొన్నాడు. అతని భార్యకు ఇలా చెప్పాడు: "నీవు నిజంగా అదృష్టవంతురాలవు. వారు ఎవరో కాదు, వారు నా గురువర్యులు పూజ్య శ్రీ బాబూజీ మహరాజ్. ఇన్ని రోజులు 'వారు' దయతో మన ఇంటిని, నిన్ను కాపాడుతూ ఉన్నారు" అని తెలియ పర్చాడు. ఆ తర్వాత ఆమె కూడా అభ్యాసీగా మారింది, కానీ దురదృష్టవశాత్తూ ఆమె చిన్న వయస్సులోనే మరణించింది.

ooo

1955వ సంవత్సరంలో "Reality at Dawn (సత్యోదయం)" ప్రతిని సమీక్షించేందుకు చెన్నైలోని హిందు పత్రిక వారినుంచి డాక్టర్ కె.సి. వరదాచారిగారు స్వీకరించారు. ఆ సమీక్షను ప్రచురించగా, ముగ్గురు వ్యక్తులు ఆ పేపర్లను చదివారు. అందులో ఇద్దరు వ్యక్తులు బాబూజీకి లేఖ వ్రాసి, వారు ధ్యానం ఎలా ప్రారంభించాలి అని అడిగారు. వారిలో ఒకరు షాజహాన్‌పూర్ వెళ్ళి బాబూజీతో పరిచయం చేసుకున్నారు. బాబూజీ నుంచి మరొకరి లేఖకు సమాధానంగా, అతడు ఎప్పుడు ధ్యానంలో, ఏ సమయంలో కూర్చుండదలచాడో తెలియజేయమని అడిగిన కారణంగా అతడు షాజహాన్‌పూర్ వెళ్ళలేదు. దానినిబట్టి ఆ సమయంలో బాబూజీ ప్రాణాహుతి నిస్తానని చెప్పారు. "ఆ పుస్తకంలో వ్రాసిన దానినిబట్టి 'వారు' గొప్ప గురువే అయివుంటే, 'వారి'కి తేదీ, సమయమూ ఎందుకు తెలియజేయాలి" అని అతడు భావించాడు. అతడు పంచాంగం పరిశీలించి తనకు తోచిన తేదీన, తోచిన సమయానికి, ధ్యానానికి కూర్చోవటానికి నిర్ణయించుకున్నాడు. అతడు దక్షిణ భారతదేశానికి చెందిన ఒక నిష్ట కలిగిన బ్రాహ్మణుడు. ఆ విధంగా అతడు ప్రతిపాదించుకున్న తేదీన, ఆ సమయానికి ధ్యానంలో కూర్చున్నాడు. అతడు ధ్యానంలో కూర్చున్నపుడు, ద్రవరూపంలో ఉన్న ఉక్కును తన హృదయంలో పోసినట్లుగా అనుభూతి చెందానని అతడు స్వయంగా ఆ వృత్తాంతం నాకు చెప్పాడు. బాబూజీ నుంచి షుమారు 3,500 కిలో మీటర్ల దూరంలో ఉండి కూడా తాను కూర్చున్న సమయానికి, వారికి చెప్పకపోయినప్పటికీ ప్రాణాహుతిని ఎలా ఇవ్వగలిగారు అను మీమాంసతో అతను ఆశ్చర్యపోయాడు.

ఒకానొక సందర్భంలో బాబూజీని ఇది ఎలా చేసారని నేను ప్రశ్నించాను. అప్పుడు 'వారు' ఇలా అన్నారు: "ఇది ఒక పిల్లవాని చేష్ట. అతడు నిర్ణయించుకున్న రోజున, తలపెట్టిన సమయంలో అతనికి నా నుంచి ప్రాణాహుతి ప్రవహించాలి అని ఆలోచన మాత్రం చేశాను." దీనిని మీరు అర్థం చేసుకోవచ్చు.

ooo

బాబూజీ చెప్పారు : "ఒకరికి సోమరితనం మూలంగా స్థూలత్వానికి కారణమయ్యిందనే విషయాన్ని గురించి నీకు నేను వ్రాస్తున్నాను. 15 సంవత్సరాల తర్వాత నేను దానికిగల కారణాన్ని గ్రహించ గలిగాను. అతడు ఎవ్వరో నీకు తెలుసు. అతడు శ్రీ..... నేను అతడిని కలిసినప్పుడల్లా అతని స్థూలత్వాన్ని అతికష్టంమీద నా శక్తి మేరకు తొలగించాను. కాని అది మళ్ళీ ఏర్పడుతున్నది. నేను రాయచూర్‌లో జబ్బుపడిన తర్వాత హైదరాబాద్ వెళ్ళినప్పుడు దానికి గల కారణం తెలుసుకున్నాను. **అతనితో ఆ స్థూలత్వానికి కారణం అతని సోమరితనమే**నని చెప్పి, నడక మరియు ఇతర శారీరిక శ్రమను పురమాయించాను. అతని భార్య తన స్థానంలో వంట చేయటం తప్ప, మిగిలిన బజారు పనులు, ఇంటి పనులు అన్నీ ఆమెకు బదులు అతడే చేయాలని చెప్పాను. అతడు ఆ విధంగా పని చేయటం ప్రారంభించాక అతని స్థూలత్వం దానంతట అదే తొలగిపోయింది. ఉత్సవ సందర్భంలో శ్రీ మహేంద్రకర్ నన్ను కలిసినపుడు, అతని ద్వారా శ్రీ కుమారస్వామికి ఏమని కబురు పంపాను అంటే, అతడు నేను చెప్పినట్లుగా ఆచరించకపోయి నట్లయితే అతడు తప్పనిసరిగా కాన్సర్ వ్యాధికి గురవుతాడని చెప్పాను. దానికి తగిన అవకాశాలు అతనిలో ఏర్పడుతున్నట్లు నేను గ్రహించాను. **సోమరితనం అనేది తన అహంకు దాసోహం అని, నాకు వింత అనుభూతిగా నిలిచింది. ఇంకోరకంగా చెప్పాలంటే, మానవుడు తన అహంకు సమర్పితమైపోతే అది అతని ఆధ్యాత్మిక పురోగతికి ఆత్మహత్యగా అవుతుంది."**

ooo

అభ్యాసీకి ఎలాంటి ప్రేమ ఉండాలో బాబూజీ గురునానక్ కథ ఒకటి చెప్పారు. శ్రీ గురునానక్‌కు ఐదారేండ్ల వయస్సు ఉన్నప్పుడు తల్లిదండ్రులు మరణించారు. అతని అక్క, బావ అతడ్ని చేరదీసారు. కొన్నేళ్ళు పెంచిన తర్వాత ధాన్యం తూచే దుకాణంలో అతడిని ఉద్యోగానికి ఉంచారు. అక్కడ తూచి, లెక్కపెట్టవలసి వచ్చినప్పుడు ఒకటి, రెండు, మూడు............ఇలా పన్నెండు దాకా చెప్పి పదమూడు వచ్చేసరికి 'తేరా' 'తేరా' (తేరహ్) అంటూ ఆ తర్వాత ఎన్నిసార్లు అయినా ఆ పదమే పలికేవాడట. ఆ యజమాని ఇతనికి తరువాతి సంఖ్యలు రావేమోనని భావించి, అదే గురునానక్ బావ గారితో చెప్పాడు. అతడి ఇంటిలోని వారందరూ గురునానక్‌కు అన్ని సంఖ్యలు వచ్చు అనే చెప్పారు. లోపల నిద్రిస్తున్న గురునానక్‌ను లేపి అడగ్గా, గురునానక్ సమాధానంగా నాకు వచ్చు. 'తేరా' తర్వాత చాలా సంఖ్యలు ఉన్నాయి. కాని 'తేరా' (నీవాడిని) అని అనగానే 'వారి' అంటే ఆ భగవంతుని ధ్యాసలో పడిపోతున్నాను. 'వారి' వాడిని అయిపోతాను. ఇంక ఏమీ గుర్తు ఉండదు" అని చెప్పాడు. 'ప్రేమ అంటే ఇదే' అని శ్రీ బాబూజీ మహరాజ్ చెప్పారు. తేరా! అంటే నీవాడను అనే భావం. అంటే 'మనం బాబూజీ వారము. బాబూజీ మనవారు' అనుకోవాలి, ఇంక వేరయ్యే అవకాశమే లేదు. మనం 'వారి' శరణాగతి పొందినప్పుడు,

'వారి' చరణాలపై ఉన్నప్పుడు, మనం 'వారి' వారమైనప్పుడు, ఈ శరీరంమీద ఉన్న ఆలోచన బయటకు పోతుంది. ఈ విధంగా అందరూ 'వారి'కి అర్పణ చేసుకుంటే అంతా యోగ్యమవుతుంది. అందరం ఒకటైపోతాం.

ooo

భగవంతుడు మన నుంచి ఆశించిన కార్యనిర్వహణలో అనారోగ్యం, అవరోధం కలిగించలేదని తెలపటానికి ఇటీవల రెండు సంఘటనలను నేను (బాబూజీ) వివరిస్తున్నాను. ఈ మధ్యనే జరిపిన సేలం యాత్రలో నాకు కలిగిన అస్వస్థత గురించి మీకు తెలిసినదే. విపరీతమైన నడుంనొప్పి కారణంగా నేను మంచానికే పరిమితం కావలసి వచ్చింది. నేను దాని నుంచి ఉపశమనం పొందేంతవరకు కొద్ది రోజులు నా పర్యటనను వాయిదా వేసుకోవలసిందిగా శ్రీ రాజగోపాల్ మరియు ఈశ్వర్ సహాయ్‌జీ సలహా ఇచ్చారు. నా పర్యటనలో ఎటువంటి మార్పు జరగరాదను కృతనిశ్చయంతో నేను ఎలాగైనాసరే మద్రాసుకు వెళ్ళటానికే నిశ్చయించుకున్నాను. నేను (బాబూజీ) బయలుదేరాల్సిన సమయానికి సరిగ్గా రెండు గంటల ముందు నాకు బాధ కలిగిన శరీర భాగంలో అకస్మాత్తుగా ఒక్క కుదుపు ఏర్పడి నా శరీరాన్ని పూర్తిగా కుదిపివేసినట్లుగా నేను అనుభూతి చెందాను. ఆశ్చర్యం ఏమిటంటే, నా బాధ దాదాపు 90% శీఘ్రంగా నివారణ అయ్యింది. అలా జరిగి ఉండకపోతే నా ప్రయాణం సునాయసంగా జరిగి ఉండేది కాదు. నేను రైలులో ఉండగా అటువంటి కుదుపు మళ్ళీ ఒకసారి కలిగి నా బాధ పూర్తిగా తొలగిపోయింది.

రెండవ సంఘటన జనవరి 24వ తేదీన జరిగింది. ఆ రోజుకు ముందు, ఒకసారి సిట్టింగ్ ఇచ్చినట్లయితే దాని తర్వాత కొన్ని గంటలపాటు విశ్రాంతి తీసుకోకుండా సిట్టింగ్ ఇవ్వలేనంతగా నేను (బాబూజీ) బలహీనుడనై పోయాను. ఎటువంటి విరామం లేకుండా నేను 13 రోజులు నిరాఘాటంగా సిట్టింగ్ ఇవ్వటం ఎలా అను ఆలోచన నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. దాని మూలంగా ఆ పనిని (సిట్టింగ్ ఇవ్వటం) ప్రక్కనబెట్టటం నాకు ఇష్టంలేని పరిస్థితి. నా ప్రాణాన్ని పణంగాపెట్టి అయినాసరే నేను ఆ పని నిర్వహించాలను కున్నాను. సరిగ్గా 6 గంటల 25 నిమిషాలకు, నేను స్నానం ముగించుకుని బయటకు వచ్చేసరికి నేను ఎటువంటి వ్యాధికి గురి కాకుండా పూర్తిగా ఆరోగ్యవంతంగా ఉన్నట్లు అనుభూతి చెందటం నాకు ఆశ్చర్యం కలిగించింది. అంతేకాదు, ఒక ఆరోగ్యవంతుడైన యువకుని మాదిరిగా నేను శక్తివంతుడనయ్యాను. ఇప్పటికీ నేను అలాగే ఉన్నట్లుగా నాకు అనిపిస్తోంది. ప్రకృతి ధర్మాన్ని అనుసరించి మన ఆరోగ్యాన్ని సంరక్షించుకోవలసిన బాధ్యత మన మీద ఉందని తెలపటానికి ఇది మనకు గుణపాఠం అనిపిస్తోంది కదా! అంతే కాకుండా అటువంటి కారణాలపరంగా మన పనికి విఘాతం కలగదను విశ్వాసం కూడా కలిగి ఉండాలి.

ooo

దినేష్ (బాబూజీ కుమారుడు) విషయానికి వస్తే, అతడు ఆత్మహత్యకు పాల్పడేముందు, నా మాస్టర్‌పట్ల పూర్ణ విశ్వాసంతో చివరిసారిగా ప్రార్థన చేసి నన్ను స్మరించుకుంటూ పిస్తోలును ఎక్కుపెట్టుకున్నాడు. అతడు నాపట్ల (బాబూజీపట్ల), నా మాస్టర్‌పట్ల (లాలాజీపట్ల) ఎక్కువ విశ్వాసం కలిగి ఉన్నట్లుగా నాకు దానికి పూర్వం తెలియదు. అతని ఆంతరిక పరిస్థితిని గమనిస్తే, పవిత్ర హృదయం కలిగి దానిలో కాంతి కలిగి

ఉన్నట్లుగా అర్థమైంది. ఏ స్థానంలోనైతే సంస్కారాలు ఏర్పడటం నిలిచిపోతుందో ఆ స్థానాన్నుంచి పైకి ఎదిగే స్థితిలో అతడు ఉన్నాడు. అతని మరణానంతరం నేను అతని విషయం పరిశీలించగా, గతజన్మకు సంబంధించిన కొన్ని అల్పమైన సంస్కారాలు ఈ జన్మలో చాలా సులభంగా దహించబడునటువంటివి ఉన్నట్లుగా గమనించాను. ఆత్మహత్య చేసుకోవాలి అను సంకల్పాలు అతనిలో గుట్టలుగా పేరుకొని ఉండగా నేను వాటిని నిర్మూలించి భస్మీపటలం చేశాను. వెనువెంటనే, అతని ఆత్మ కనిపించి నా పాదాలమీద వాలిపోయి, జరిగిన దానికి బాధపడుతూ క్షమాపణ కోరుతూ, నేను కనుక అతడిని క్షమించక పోయినట్లయితే తనకు విముక్తి కలగబోదని వేడుకుంది. నేను అతడిని క్షమించేసరికి, అతడిప్పుడు బ్రైటర్‌వరల్డ్ (కాంతి మండలం) లో ఉన్నాడు.

ooo

నేను దక్షిణ భారతదేశ పర్యటన నిమిత్తం చాలా దృఢ నిశ్చయంతో ఉండగా, నా గురువర్యులు (లాలాజీ) అప్పుడు పని వత్తిడి చాలా ఎక్కువగా ఉంటుందని, దానికి నేను తట్టుకోవటం కష్టమనే ఉద్దేశ్యంతో నన్ను ఆ కార్యక్రమం విరమించుకోమని ఆదేశించారు. అందుచేత ఆ ప్రణాళికను నేను 1967 మార్చి లేదా ఏప్రియల్‌కు వాయిదా వేశాను. నేను మీకు తెలుపుతున్న సంతోషకరమైన విషయం ఏమిటంటే, నేను చాలా నీరసంగా ఉన్న కారణంగా దక్షిణాదిలో ఉన్న సత్సంగీయుల (అభ్యాసీల) పనిని నా గురువర్యులు, లాలాజీ సాహెబ్ స్వయంగా నిర్వహించారు. దానితో అభ్యాసీలు బాగా లాభించారు. నా సత్సంగీయులు ఎవరైనాగాని తమ స్థితిని గమనించగలిగినట్లయితే, వారిలో నిష్కల్మషమైన 'శాంతి' కలిగినట్లుగా అనుభూతి చెందుతారు. ఈ విషయం తెలియకపోయినప్పటికీ, విజయవాడలోని డాక్టర్ వి. పార్థసారిధిగారు, ఆ ప్రాంతంలోని అభ్యాసీలు 'శాంతి'ని బాగా అనుభూతి చెందుతున్నారని నాకు లేఖ వ్రాశారు.

ooo

నా గురువర్యులు, లాలాజీ సాహెబ్ ఎత్తి చూపిన విగ్రహా రాధన వంటిది మరొక దానిని మీకు చెప్తుతున్నాను. ఒక మనిషి కనుక అతని అలవాటుకు బానిసగా మారినట్లయితే, అతడు కూడా ఒక విగ్రహారాధకుడే అని 'వారు' చెప్పారు. అంతకుమించి ఇంకా నేను (బాబూజీ) ఏమి చెబుతున్నాను అంటే, బహిరంగంగా కనిపించక పోయినా, ఏదైనా తలంపు ఉన్నట్లయితే అది కూడా మూర్తిపూజ వంటిదేనని అంటాను. ఒక మనిషి తన కుటుంబాన్ని, పిల్లలు, వగైరాలను ప్రేమిస్తున్నట్లయితే, అతడు కూడా విగ్రహారాధకుడే అంటాను. అందుచేత భౌతికపరమైన వాటిపట్ల అనుబంధం కలిగి ఉంటే, అది కూడా విగ్రహారాధనయే. మరైతే దీనిని పూర్తిగా నిర్మూలించటం ఎలా? ఏదైనా ఆలోచన రూపుదిద్దుకోనప్పుడు, అది కలిగినప్పటికీ వెంటనే నిరాకరించబడుతుంది. అయితే ఇది దీర్ఘ ప్రణాళిక. ఏవైనా బలమైనవాటిని ఆరాధించటం మానివేయటం మూలంగా మనం దానిని మంచి వాటి కొరకు ప్రయోగిస్తాం. సాక్షాత్కారానికి సంబంధించి కొంత సమాచారం ఇచ్చినప్పటికీ, కొంతమంది మనుష్యులు మొండిగా విగ్రహారాధనను విడిచిపెట్టలేరు. నా (బాబూజీ) అనుభవంలో కొంతమంది ఉన్నారు. వారికి తాత్కాలికంగా నేను సాక్షాత్కార స్థితిని కల్పించి నప్పటికీ వారు దానిని అనుభూతి చెంది బాగా హర్షించారే కాని, విగ్రహారాధనకు బాగా అలవాటుపడిపోయిన

కారణంగా దానిని వదలిపెట్టలేకపోయారు. వారి జ్ఞానం అంతటితో అజ్ఞానం అయిపోయింది. వారిలో విశ్లేషణాత్మక శక్తి పూర్తిగా లోపించిపోయి, వారి పతనానికి నాంది పలికింది. ఎప్పుడైతే విశ్లేషణాశక్తి తరిగిపోతుందో అప్పుడు భయం నెలకొంటుంది. వారి పూర్వీకులందరూ అలాగే వర్తించారు కనుక, వీరు కూడా దానిని వదిలిపెట్టరు. ఇదంతా ఒక విషయమైతే, మరొకటి ఏమిటంటే, ఒకవేళ వారు దానిని విస్మరించినట్లయితే, ఏదైనా కీడు వాటిల్లుతుందని భావిస్తారు. ఇది మనం విచారించాల్సిన విషయం.

ooo

దైవాన్వేషణ గురించి బాబూజీ ఈ విధంగా చెప్పారు: "నీవు దేనికొరకైనా అన్వేషిస్తే అది కనిపించకుండా ఉంటుంది. నీవు వేటికోసమైతే అన్వేషిస్తూ ఉంటావో అవి ఇంకా దూర దూరంగా జరగుతూ ఉంటాయి. అక్కడ భగవంతుడు ఉన్నాడని నాకు తెలిసి నప్పుడు ఇంకా వెదకటం ఎందుకు? వాస్తవం ఏమిటంటే, దైవాన్ని వెదకటమంటే, నిన్ను నీవే వెదుక్కోవటన్నమాట. అందుచేత అన్వేషణ అను ఆలోచన తొలగిపోయింది. వెదకులాటలోనే జీవితాంతం వృధా చేయటంలో ప్రయోజనం ఏముంటుంది? కనుక మనం అన్వేషించకుండానే ఉండాలి. నీ కుమారుడు ఇంటిలోనే ఉన్నాడని తెలిసి ఉండి కూడా నీవు అతని కోసం బజారులో వెదుకుతున్నావు కదా! నేను నీకు చెప్పదలుచుకున్న ఒక్క విషయం ఏమిటంటే, ఒక మూడు మాసాలపాటు అన్నింటినీ వదిలిపెట్టి 'నేను అన్ని విషయాలను విస్మరించాను, దయచేసి నాకు ఒక సిసలైన గురువును, సక్రమమైన మార్గాన్ని అనుగ్రహించు' అని దైవాన్ని ప్రార్థించు. ఇదే భావాన్ని నిరంతరం మనస్సులో నిలుపుకోవాలి. 'అతడి' కోసం అన్వేషించట మనేది దైవ దూషణగానే నేను భావిస్తాను. నీ ఇంటిలో (హృదయంలో) 'అతని' కోసం అన్వేషించినట్లయితే 'అతడు' నీకు దర్శనమిస్తాడు."

ooo

బాబూజీ చెప్పారు: "స్వామి రామతీర్థ కొన్ని పరిశోధనలు చేసి, టిబెట్ మరియు రష్యాలో క్రీస్తు ఉన్నట్లుగా శిలాఫలకాలు ఉన్నాయని చెప్పారు. (కొంతసేపు దృష్టిపెట్టిన తర్వాత) నేను ఏమనుకుంటున్నానో మీకు చెబుతాను. క్రీస్తు ఏమంటున్నాడు అంటే, "అవును, నేను శిలువ వేయబడ్డాను. నా చివరి రోజులు అంత మంచివి కావు. నేను పొందినదంతా పోగొట్టుకున్నాను. అది ఒక విధంగా నాకు శిక్ష వంటిదే. విశ్వాసం సడలిపోసాగింది. విధి వక్రీకరించటమే దానికి కారణం. అయినప్పటికి నాలో వ్రేళ్ళూనుకుపోయిన ఉద్దేశం (సంకల్పం) నన్ను (తేజో మండలం) బ్రైటర్‌వరల్డ్‌కు చేర్చింది. ఆధునిక సిద్ధాంతాలన్నీ తప్పుడువే. అయితే నేను పూర్తిగా విశ్వాసం కోల్పోయినవాడనుకాదు కాని కొంతమేరకు నేను భంగపాటు చెందాను. అందుకు కారణం మేరీ."

నేను (బాబూజీ) అతని (క్రీస్తు) మాటలు మీకు చెప్పాను. మేరీ అతని తల్లి అయి ఉండగా, కారణం 'మేరీ' ఎలా అయి ఉంటుందో నేను ఊహించలేకపోతున్నాను."

"క్రీస్తు మతం యొక్క భవిష్యత్తు ఏమిటి?" అను ప్రశ్నకు సమాధానంగా బాబూజీ ఈ విధంగా చెప్పారు: "సరే, నేనొక విషయం చెబుతాను, దానిని మీరు విశ్వసించలేకపోవచ్చు. అది చాలా రహస్యమైనది.

దానిని నేను మొదటిసారిగా ఈరోజు వివరిస్తున్నాను. క్రీస్తు తన క్రీస్తు మతాన్ని నాకు అప్పగించారు. కనుక నేను క్రీస్తు మతస్థులకు నా పని ప్రారంభించాను."

ooo

బాబూజీ చెప్పారు: "ప్రాణాహుతి (ట్రాన్స్‌మిషన్) అనేక స్థాయిల నుంచి వస్తుంది. సాధారణంగా నా పనిలో భాగంగా నేను ప్రాణాహుతిని సూక్ష్మంగా, యుక్తితో ఇస్తాను. అభ్యాసీ పురోగతి చెందుతున్నప్పుడు ఆ ప్రాణాహుతి కూడా సూక్ష్మత్వం చెందుతుంది. అందుచేత నేను ఆచరించే పనిలో ప్రాణాహుతి ఎక్కువగా కేంద్ర మండలం నుంచి వస్తుంది. ఇప్పుడు నేనొక విషయం చెబుతాను. మనం 'లాలాజీ' అని పిలుచుకునే నా గురుమహరాజ్ కాలంలో, వారు ఈ విషయాలు తెలిపేవారు. ఒకసారి నేను ఒక ప్రయోగం చేయతలపెట్టాను. ఒక అభ్యాసీ వచ్చినప్పుడు అతనిపై నేను ఆ ప్రయోగాన్ని ఎందుకు జరపకూడదు అని భావించాను. ఇప్పుడు గమనించండి – ఒక ప్రత్యేక కేంద్రానికి కనుక (ట్రాన్స్‌మిషన్) ప్రాణాహుతి నిచ్చినట్లయితే, ఒక విధమైన త్రాగుబోతు మగత వంటిది కలుగుతుంది. నేను అతనికి ఆ బిందువు (స్థానం) మీద ప్రాణాహుతి నిచ్చాను. ఇంక చూడండి –సిట్టింగ్ అయిపోయిన తర్వాత, అతను లేవలేక పోయాడు. అతడు గట్టి ప్రయత్నంతో నిలబడాలని ప్రయత్నించినప్పటికీ లేచి నడవలేకపోయాడు, ఎందుకుంటే అతనిది ఒక త్రాగుబోతు స్థితిలాగా అయిపోయింది. తర్వాత లాలాజీ నాకు బుద్ధివచ్చునట్లు చేశారు. ట్రాన్స్‌మిషన్ (ప్రాణాహుతి) వివిధ స్థాయిల నుంచి వస్తుంది అని తెలియజెప్పటానికి మీకు నేను ఈ విషయం చెబుతున్నాను."

ooo

బాబూజీ చెప్పారు: "**నా గురుమహరాజ్ అయిన లాలాజీ సాహెబ్, మానవులు ఒక్క నిమిషమైనా కూడా సోమరిగా ఉండకూడదని చెప్పేవారు.** నీవు ఏదో ఒక పనిలో నిమగ్నమై ఉన్నట్లయితే, అప్పుడు నీలో భావాలు ఏమీ తలెత్తవు. అప్పుడు నీ పని కూడా సాధించబడుతుంది. లాలాజీ మహరాజ్ ఎప్పుడూ నియమపాలన చేస్తుండేవారు. ప్రతి పనికీ ఒక సమయం నిర్దేశించుకుని దానిని క్రమం తప్పకుండా నిర్వహించేవారు. వారు అనేక గ్రంథాలు చదివేవారు. ముఖ్యంగా జేమ్స్ అల్లెన్ వ్రాసిన గ్రంథాలు వారికి అభిమానంగా ఉండేవి" అని చెబుతూ 'బాబూజీ' ఇంకా ఇలా చెప్పారు: "ఇటువంటి సుగుణమే మాస్టర్ ఈశ్వర్ సహాయ్‌గారిలో ఉండేది. ఒక్క నిమిషం కూడా ఆయన తీరికగా కూర్చునేవారు కాదు. ఆయన ఎప్పుడూ ఏదో ఒక పని చేస్తూనే ఉండేవారు. ఒకవేళ ప్రత్యేకించి ఏమీ చేయాల్సినది లేకపోయి నట్లయితే, సూది–దారం తీసుకుని ఏదో ఒక్కటి కుట్టుతూ ఉండేవారు."

ooo

21 జూన్ 1966వ తేదీన బస్సులో బాబూజీ సీతాపూర్ ప్రయాణించే సందర్భంలో జరిగిన ప్రమాదం గురించి 'వారు' ఏమి వివరించారో చూడండి: "నేను ఈ ప్రదేశాన్ని వదిలి బయలు దేరినప్పుడు ఈరోజు ఏదో ఒక బస్సు ప్రమాదం జరుగుతుంది అని భావించాను. అయితే నేను ఆ సంగతి పూర్తిగా మర్చిపోయాను. ఇప్పుడు నేను చెప్పబోయేది ఏమిటంటే, ఆ బస్సు బయలుదేరే సమయంలో నేను ఒక్కసారిగా సీటులో

నుంచి లేచి నిలబడ్డాను. నేను ఆ విధంగా ఎందుకు లేచి నిలబడ్డానో నాకయితే తెలియదు కాని, నేను నిలబడి ఉండకపోయినట్లయితే, నా కళ్ళుపోయి ఉండేవి. ఆ సందర్భంలో నాకు స్వల్ప గాయం అయ్యింది.

నేను మీకు ఇంకొక విషయం చెబుతున్నాను. ఒకసారి మాస్టర్ సాహెబ్ (ఈశ్వర్ సహాయ్) మరియు నేను బహుశా పాట్నా అయి ఉండవచ్చు, అక్కడి నుండి తిరిగి వచ్చేటప్పుడు, మేమిద్దరం రైల్వేస్టేషన్ సమీపిస్తూ ఉండగా, నేను అడుగు ముందుకు వేయలేక పోయాను. అలా ఎందుకు జరుగుతున్నదో తెలియదు కాని, నా పాదాలు మాత్రం ముందుకు నడవటానికి సహకరించటం లేదు. నేను అక్కడే నిలబడి కొంచెంసేపు ధ్యానం చేసేసరికి, మేము ప్రయాణించవలసిన రైలు ప్రమాదానికి గురి కాబోతున్నదని గ్రహించాను. ఏదో విధంగా మా ప్రయాణం ఆగిపోయింది. దుష్ట శక్తుల పని తీరు ఎలా ఉంటుందో నాకు అర్థం కాలేదు. ఇంతకీ విషయం ఏమిటంటే, నేను గాయపడకుండా ఉండవలసినట్లయితే, నేను ఆ రైలులో ప్రయాణించి ఉన్నా కూడా ప్రమాదం నుంచి తప్పించుకొనబడేవాడిని కదా! నేను ఎందుకు ప్రయాణించలేదు? నేను డాక్టర్ కె.సి. వరదాచారిగారిని ఈ విషయమై అడగాలి" అన్నారు.

నేను కూడా కె.సి. వరదాచారికి ఈ ప్రశ్నను సంధించి నప్పుడు, వారు –"మీరు చూశారా, ఇది చాలా స్వల్ప విషయం. ఒకవేళ బాబూజీ కనుక రైలు ప్రయణానికి అనుమతించబడి నట్లయితే, 'వారి'కి ఉన్న ప్రత్యేకత కారణంగా ప్రమాదాన్ని ఎదుర్కొని దానిని భరించగలిగి ఉండేవారు. దాని మూలంగా ఇతర ప్రయాణీకుల కర్మ ఫలితంతో ప్రమేయం కల్పించినట్లుగా అయ్యేది. అందుచేత వారి ప్రయాణం అనుమతించ బడలేదు.

'వారి' బస్సు ప్రయాణం గురించి చుద్దాం. వారితోపాటు ఇంకా ఇతర సత్సంగీయులు ఉండి ఉంటారు. ఆ బస్సు మరొక బస్సుతో ఢీ కొట్టినప్పటికీ 'వారు' మాత్రమే గాయాలతో బయట పడ్డారు. ఇదీ సంగతి!

ooo

ఒక అభ్యాసీలో ఉన్న కొన్ని ఆటంకాలను పరిశీలించాల్సి వచ్చినట్లయితే, ఆ సాధకుని (అభ్యాసీ) యొక్క గతజన్మలోకి కాని, జన్మలులోకిగాని చొరబడిగలిగినవారు మంచి ప్రిసెప్టర్ (ప్రశిక్షకుడు)గా ఉంటారు అని బాబూజీ వివరించారు. హైదరాబాద్‌కు చెందిన ఒకామెను ఉదహరణగా చెప్పారు. బాగా భక్తి కలిగి మరియు సక్రమమైన సాధన చేస్తూ ఉండి కూడా ఆమె పురోగతి లేకుండా నిలిచిపోయిందని బాబూజీ చెప్పారు. ఆ సందర్భంగా బాబూజీ ఆమె గతజీవితాన్ని పరిశీలించారు. తన పిల్లలను విడిచిపెట్టి, ఆమె ఒక సన్యాసినిగా అడవిలో ఉన్నట్లుగా గుర్తించాను. ఆ పిల్లల రోదనం భరించరానిదై ఉన్న మూలంగా, ఆమె మనస్సులో గట్టిగా సంస్కారం ఏర్పడి, ఈ జన్మలో ఆమె పురోగతికి అవరోధం కల్పిస్తోంది. 'వారు' ఆ గతజన్మల తాలూకు సంస్కారాన్ని తొలగించిన తర్వాత వెంటనే ఆమె పురోగతి చెందగా, 'వారు' ఆమెను ప్రిసెప్టర్‌గా తయారుచేసినట్లు బాబూజీ చెప్పారు.

ooo

1969వ సంవత్సరం మే నెల 18వ తేదీ సాయంత్రం బాబూజీ విజయవాడ మీదగా రైలు ప్రయాణం చేస్తూ ఉండగా ఒంగోలుకు షుమారు 20 మైళ్ళ దూరంలో చిలకలూరుపేట ప్రాంతంలో రైలు మార్గానికి గండ్లుపడిన కారణంగా రైలు ఆగిపోయింది. అప్పుడు దానిని ప్రక్కన ఉన్న రైల్వేస్టేషన్‌కు తరలిస్తుండగా, అక్కడ ఆ రైలు బండిని వెనుక నుంచి మరొక రైలు ఢీ కొట్టింది. అప్పుడు బాబూజీ కూర్చుని ఉన్న సీటు పైభాగంలో ఉన్న బెర్తు నుంచి ఒక బరువైన పరుపు చుట్ట వారి మీద పడింది. అప్పుడు బాబూజీ, "లాలాజీ సాహెబ్ మమ్మల్ని ఎలా కాపాడారో చూడండి. నేను నిటారుగా కనుక కూర్చుని ఉన్నట్లయితే అది నా శిరస్సు మీద పడి ఉండేది. నేను అప్పుడు దాదాపుగా నా తల భాగం నా మోకాళ్ళ మధ్యకు వంగి ఉన్నట్లుగా కూర్చుని ఉన్నాను. వెనుక నుంచి రైలు ఢీకొన్న కారణంగా కలిగిన కుదుపుతో ఆ లగేజీ నా మీద పడినప్పుడు తలవని తలంపుగా నా శిరస్సు నిటారుగా నిలిచింది. నేను తలవంచి కూర్చున్న కారణంగా నేను ప్రమాదం నుంచి రక్షించబడ్డాను. ఇది నా మాస్టర్, లాలాజీ సాహెబ్ కృప వల్లనే" అన్నారు.

ఆ తర్వాత బాబూజీ నాకు చెప్పిన విషయం ఏమిటంటే, వారికి రైలు ప్రమాదం ఎటువంటిదో చూడాలను ఒక రహస్యమైన కోరిక ఉండేదని, అది ఈ విధంగా నెరవేరింది అని అన్నారు. అప్పుడు లాలాజీ, "ఇప్పుడు అది ఎలా ఉంటుందో చూశావు కదా" అని బాబూజీ చెప్తూ ఇంకా ఇలా అన్నారు: "ఈ సందర్భాన్ని ఎందుకు ప్రసావిస్తున్నాను అంటే, **ఎవ్వరైనాగాని ఎటువంటి కోరికలు కలిగి ఉండకూడదని, ఆ కోరికలే కనుక తీవ్రమైనవిగా ఉన్నట్లయితే వాటిని ఏదో ఒక విధంగా ఎప్పుడో ఒకప్పుడు అనుభవించి చూడాల్సి ఉంటుందని చెప్పడానికి"** అని.

---

**"ఆధ్యాత్మికత చాలా సులభమైనది, దానిని పొందటానికి ఎక్కువ సమయం పట్టదు. ఎవ్వరైనాగాని విశ్వాసం మరియు భక్తిని వృద్ధి చేసుకోవటమే చేయాలి. ఆ భక్తి, నిరంతరణ స్మరణ ద్వారా జనిస్తుంది.**

-----

**ప్రార్థనను హృదయపూర్వకమైన ప్రేమ, భక్తితో ఎందుకు నివేదించాలి అంటే దానికి కారణం, దివ్య కృప అతనివైపు తరలించబడటానికిగాను అతడు లేదా ఆ వ్యక్తి స్వయంగా తన ఆంతరికంలో ఒక ఖాళీని (శూన్యత్వాన్ని) సృష్టించుకోవాల్సి ఉంటుంది."**

**– బాబూజీ**

# PRAYER

O, Master!
Thou art the real goal of human life,
We are yet but slaves of wishes,
Putting bar to our advancement,
Thou art the only God and Power,
To bring us upto that stage.

# ప్రార్థన

ఓ. ప్రభూ ! నీవే మానవ జీవనమునకు లక్ష్యము.
మా కోరికలు ఆత్మోన్నతికి ప్రతి బంధకములై యున్నవి
నీవే మా ఏకైక స్వామివి - ఇష్టదైవమవు
నీ సహాయము లేనిదే నిన్ను పొందుట అసంభవము.